ఈనాడు

విజయవాడ 13-12-2025 శనివారం సిటీ సంపుటి 52 . సంచిక 123

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-50 పేజీలు 24

www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

ఈనాడు

THE GREAT YEAR-END SALE SOUTH INDIA shopping mall

విజయవాడ 13-12-2025 శనివారం సిటీ సంపుటి 52 . సంచిక 123

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-50 పేజీలు 24

www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru





ఈనాడు



విజయవాడ 13-12-2025 శనివారం సిటీ సంపుటి 52 . సంచిక 123

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-50 పేజీలు 24 www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

ఒకే గొడుగు కిందకు ఉన్నత విద్య

వికసిత భారత్ శిక్షా అధిక్షణ్ బిల్లుకు కేంద్ర మంత్రి మండలి ఆమోదం

జన గణనకు రూ.11,718 కోట్ల కేటాయింపు

ఉపాధి హామీ పథకం పేరు మార్పు

కొబ్బరి మద్దతు ధర పెంపు

దిల్లీ: నూతన జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ)లో భాగంగా ఉన్నత విద్యను ఒకే సంస్థ నియంత్రణలోకి తీసుకొచ్చే చర్యలను కేంద్ర ప్రభుత్వం ముమ్మరం చేసింది. దీనిలో భాగంగా రూపొందించిన 'వికసిత భారత్ శిక్షా అధీక్షణ్ బిల్లు'కు శుక్రవారం కేంద్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది. ప్రతిపాదిత బిల్లును తొలుత 'భారత ఉన్నత విద్యా కమిషన్'(హెచ్ఈసీఐ)గా పేర్కొన్నారు. అయితే, తాజాగా దాని పేరును మార్చారు. (మిగతా 7లో)

70 ఏళ్ల సేవలకు ఇక సెలవు!

తుంగభద్రలో మొత్తం 33 గేట్ల స్థానంలో కొత్తవి 5లో

పాత తలుపులు తొలగించే ప్రక్రియ ప్రారంభం



కాగ్నిజెంట్ క్యాంపస్ భవన నిర్మాణ భూమిపూజలో పాల్గొన్న సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్. చిత్రంలో కాగ్నిజెంట్ అమెరికాస్ ప్రెసిడెంట్ సూర్యకుమార్, ఇండియా సీఎండీ రాజేశ్ వరియర్, కాగ్నిజెంట్ సీఈఓ రవికుమార్, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, ఎంపీ శ్రీభరత్

పర్యాటక రంగానికే కాకుండా, టెక్నాలజీకీ విశాఖ కేంద్రంగా మారుతుంది. స్టార్టప్ కంపెనీలను భారీగా ప్రోత్సహిస్తాం. రాష్ట్రానికి డేటాసెంటర్లు రావడానికి గ్రీన్ ఎనర్జీ కారణం. ఏఐ, డేటా హబ్‌గా విశాఖ, శాటిలైట్ సిటీగా శ్రీహరికోట, డ్రోన్‌సిటీగా ఓర్వకల్లు, ఏరోస్పేస్ సిటీగా అనంతపురం, ఎలక్ట్రానిక్ సిటీగా తిరుపతి, మెడ్‌టెక్ జోన్ పార్కుగా విశాఖ, తొలి క్వాంటమ్ కంప్యూటర్ కేంద్రంగా అమరావతి ఎదుగుతున్నాయి.

- ముఖ్యమంత్రి చంద్రబాబు

నాలెడ్జ్ ఎకానమీ, ఏఐ హబ్‌గా విశాఖ

135 బిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా వీఈఆర్

సీఎం చంద్రబాబు వెల్లడి

విశాఖలో కాగ్నిజెంట్ క్యాంపస్ నిర్మాణానికి భూమిపూజ

25 వేల ఉద్యోగాలు కల్పిస్తామంటూ సీఎం సమక్షంలో కాగ్నిజెంట్ సీఈఓ హామీ

ఈనాడు-విశాఖపట్నం, వన్‌టౌన్, మధురవాడ-న్యూస్‌టుడే: 'విశాఖలో ఐటీ ఎకోసిస్టమ్ ఏర్పడుతోంది. ఇంటర్నెట్ విప్లవంతో పాటు, ఐటీ ఫస్ట్ మూవర్ ఎడ్వాంటేజ్ తీసుకున్నాం. అందుకే ఐటీకి వెన్నెముకగా భారతీయులు నిలిచే పరిస్థితి వచ్చింది. ఇప్పుడు ఏఐ విషయంలోనూ ఫస్ట్ మూవర్ ఎడ్వాంటేజ్ తీసుకోవాలని భావిస్తున్నాం. ఆ దిశగానే ఏఐ, డేటాసెంటర్లతో ఐటీ డెస్టినేషన్‌గా, నాలెడ్జి ఎకానమీ కేంద్రంగా విశాఖ తయారవుతోంది' అని ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. విశాఖపట్నంలోని కాపులుప్పాడలో కాగ్నిజెంట్ టెక్నాలజీ సొల్యూషన్స్ కొత్త క్యాంపస్ నిర్మాణానికి ఆయన శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 'గ్రీన్ ఎనర్జీ, భూములు, నీరు ఇచ్చి.. రియల్‌టైమ్ గవర్నెన్స్ వసతులతో స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌కు శ్రీకారం చుట్టాం' అని తెలిపారు.

'99 పైసలకు ఎకరా భూమి ఇస్తే గేమ్ ఛేంజర్ అవుతుందని మంత్రి లోకేశ్ చెబితే సాధ్యమవుతుందా? అని అడిగాను. నరేంద్ర మోదీ హయాంలో గుజరాత్‌లో నానో కార్ల తయారీ సంస్థకు (మిగతా 7లో)

ఘాట్ రోడ్డులో ఘోరం

చింతూరు సమీపంలో యాత్రికుల బస్సు బోల్తా

తొమ్మిది మంది దుర్మరణం.. 10 మందికి తీవ్రగాయాలు

స్వల్పంగా గాయపడిన 18 మంది


అరకు నుంచి భద్రాచలం వెళ్తుండగా దుర్ఘటన

బాధితులంతా చిత్తూరు పరిసర ప్రాంతాలకు చెందినవారే



ప్రమాద స్థలంలో చెల్లాచెదురుగా మృతదేహాలు, యాత్రికుల సామగ్రి

ఈనాడు, రాజమహేంద్రవరం, చిత్తూరు - న్యూస్‌టుడే, చింతూరు, చిత్తూరు: వారం కిందట వారంతా చిత్తూరు నుంచి తీర్థయాత్రలకు బస్సులో బయలుదేరారు. వివిధ ఆలయాలను దర్శించారు. అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులోయలో గురువారం సాయంత్రం ఆనందంగా గడిపారు. అక్కడి నుంచి భద్రాచలం సీతారామస్వామి దర్శనానికి వెళ్తుండగా చింతూరు - మారేడుమిల్లి ఘాట్ రోడ్డులో (మిగతా 7లో)





అంధ క్రికెటర్ కరుణకుమారికి చెక్కు అందజేస్తున్న పవన్ కల్యాణ్

అంధ క్రికెటర్లకు అండగా నిలవాలి

లోపలి పేజీలో

ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్

మహిళల అంధ క్రికెట్ జట్టు సభ్యులకు రూ.84 లక్షల సొంత సొమ్ము బహూకరణ

మద్యం కంపెనీలతో శ్రీధర్‌రెడ్డి సంప్రదింపులు




ముడుపుల వసూళ్లలో కీలకపాత్ర పోషించారు

ఆయన బెయిల్ పిటిషన్‌ను కొట్టేయండి • హైకోర్టులో సీఐడీ వాదనలు

ఈనాడు, అమరావతి: తాను చెప్పిన కంపెనీలకే మద్యం ఆర్డర్లు ఇవ్వాలని సజ్జల శ్రీధర్‌రెడ్డి గత ప్రభుత్వ హయాంలో అధికారులను ఆదేశించారని సీఐడీ తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ అగర్వాల్ శుక్రవారం హైకోర్టులో వాదనలు వినిపించారు. మద్యం విధానం రూపకల్పన కోసం ప్రైవేటు వ్యక్తులు, అధికారులతో నిర్వహించిన సమావేశాల్లో ఆయన పాల్గొన్నారని తెలిపారు. విధాన రూపకల్పన, మద్యం ఉత్పత్తి చేసే కంపెనీలతో సంప్రదింపులు జరిపి, ముడుపులు వసూళ్లు చేయడంలో శ్రీధర్‌రెడ్డిది కీలకపాత్ర అని పేర్కొన్నారు. ఈ మేరకు నిందితులు, సాక్షులు వాంగ్మూలాలు ఇచ్చారన్నారు. ముడుపులు ఇచ్చేందుకు ముందుకు రాని ప్రముఖ మద్యం బ్రాండ్ల కంపెనీలకు ఆర్డర్లు ఇవ్వకుండా పక్కన పెట్టారని వెల్లడించారు. మద్యం విధానం వల్ల శ్రీధర్‌రెడ్డికి ఆసక్తి ఉన్న ఎస్పీవై ఆగ్రోస్ సంస్థ రూ.1,569 కోట్ల మేర లబ్ధి పొందిందన్నారు. ఈ కేసులో ఇంకా సాక్ష్యాలు సేకరించాల్సి ఉందని, ఈ దశలో ఆయనకు బెయిలిస్తే దర్యాప్తునకు ఆటంకమని వాదించారు. ఆయన బెయిలు పిటిషన్‌ను కొట్టేయాలని కోరారు. మద్యం కుంభకోణం కేసులో బెయిలు కోరుతూ శ్రీధర్‌రెడ్డి హైకోర్టులో దాఖలు చేసిన వ్యాజ్యంపై శుక్రవారం జరిగిన విచారణలో ఇరువైపు వాదనలు ముగియడంతో తీర్పును రిజర్వు చేస్తున్నట్లు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రకటించారు.

■ అంతకుముందు శ్రీధర్‌రెడ్డి తరఫు న్యాయవాదులు (మిగతా 7లో)



కాంగ్రెస్ దిగ్గజ నేత శివరాజ్ పాటిల్ కన్నుమూత

• సుదీర్ఘ రాజకీయ జీవితంలో పలు కీలక బాధ్యతల నిర్వహణ 8లో

ఇప్పటివరకూ ఒక్క అధికారిపైనా కోప్పడలేదు

రోజూ నిద్రపోయేది మూడున్నర గంటలే

ఎన్డీయే ఎంపీలకు ఇచ్చిన విందులో ప్రధాని మోదీ 8లో



ప్రపంచంతో విశాఖ పోటీ

కాగ్నిజెంట్ రాక.. టెక్ యుగానికి నాంది 9లో

'ఏపీ ఎకనామిక్ పవర్‌హౌస్'గా విశాఖను తీర్చిదిద్దుతాం: మంత్రి లోకేశ్

టెక్ తమ్మిన, నాన్‌రెల్ టెక్నాలజీస్, ఏసీఎన్ ఇన్ఫోటెక్ హెల్త్‌కేర్ సంస్థల భవనాలకు భూమి పూజ చేస్తున్న మంత్రి లోకేశ్

ఏసీసీ సిమెంట్స్‌కు తాఖీదు

జారీచేసిన ప్రభుత్వం

- వారంలో భారతి సిమెంట్, రామ్‌కో సిమెంట్స్ లీజులకు సైతం నోటీసులు
- కేంద్ర నిబంధనలకు విరుద్ధంగా.. జగన్ హయాంలో సున్నపురాయి లీజుల మంజూరు
- వీటిపై ఇప్పుడు చర్యలు మొదలు
- నాలుగు లీజులు రద్దు చేసేందుకు రంగం సిద్ధం

ఈనాడు, అమరావతి: వేలం ద్వారానే లీజులు కేటాయించాలని 2015, 2021లలో కేంద్ర గనులశాఖ చట్టసవరణ చేసినా సరే.. దీనికి విరుద్ధంగా వైకాపా ప్రభుత్వం 2023, 2024లలో నాలుగు సున్నపురాయి లీజులను దరఖాస్తు విధానంలో మంజూరుచేయగా, వాటిపై ఇప్పుడు చర్యలు మొదలయ్యాయి. ఆ లీజుల రద్దు దిశగా ప్రభుత్వం తొలి అడుగు వేసింది. అసోసియేటెడ్ సిమెంట్ కంపెనీస్- ఏసీసీ (ప్రస్తుతం అదానీ సిమెంట్స్) దక్కించుకున్న సిమెంట్ గ్రేడ్ సున్నపురాయి లీజు రద్దుకు ప్రభుత్వం నోటీసు జారీచేసింది. మీరు లీజు పొందిన విధానం నిబంధనలకు విరుద్ధమని, ఆ లీజును ఎందుకు రద్దు చేయకూడదో వివరణ ఇవ్వాలంటూ నోటీసులో పేర్కొంది. రెండు వారాల్లో వివరణ ఇచ్చాక ఆ లీజు రద్దుపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోనుంది. వైకాపా అధ్యక్షుడు జగన్ సతీమణి భారతి డైరెక్టర్‌గా ఉన్న భారతి సిమెంట్ కార్పొరేషన్‌కు చెందిన రెండు లీజులు, రామ్‌కో సిమెంట్స్‌కు చెందిన ఓ లీజుకూ ఈ వారంలో తాఖీదులు ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధమైంది.

తొలుత ఏసీసీకి లీజులు

■ వైఎస్సార్ కడప జిల్లా మైలవరం మండలంలోని ఆరు గ్రామాల పరిధిలో 997.08 హెక్టార్ల (2,463.83 ఎకరాలు)లో సున్నపురాయి లీజుకు ఏసీసీ దరఖాస్తు చేసుకోగా, దానికి 2010లో లెటర్ ఆఫ్ ఇంటెంట్ (ఎల్ఓఐ) ఇచ్చారు.

■ 6 నెలల్లో అన్ని అనుమతులూ తెచ్చుకొని పూర్తిస్థాయి లీజు పొందాలని, మూడేళ్లలో సిమెంట్ పరిశ్రమ ఏర్పాటు చేయాలని నిబంధన విధించారు. (మిగతా 9లో)



ఈనాడు

బాల్యాన్ని కాటేస్తున్న భుజంగాలు

తల్లిదండ్రుల సంరక్షణలో సురక్షితంగా ఉంటూ, ఉపాధ్యాయుల పర్యవేక్షణలో చక్కగా చదువుకుంటూ, తోటివారితో ఆడుతూపాడుతూ బాల్యాన్ని దాటేవారు జీవితం పట్ల ఓ సానుకూల దృక్పథాన్ని ఏర్పరచుకుంటారు. ఎంచుకున్న రంగంలో ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్తారు. చిన్ననాటి తీపి జ్ఞాపకాలను ఎప్పటికప్పుడు సరికొత్త అనుభూతులను జతచేసుకుంటూ జీవనానందాన్ని ఆస్వాదిస్తుంటారు. ఇంతటి అదృష్టం అందరికీ వరిస్తోందా అంటే, లేనేలేదు! ప్రపంచవ్యాప్తంగా పదిహేనేళ్లకు పైబడిన వారిలో వంద కోట్ల మందికి పైగా చిన్నప్పుడు లైంగిక హింసకు బాధితులయ్యారనే విషాద విషయమొకటి తాజా అధ్యయనంలో బయటపడింది. పసివయసులోనే వికృత వేధింపుల బారినపడినవారిలో అత్యధికులు ఆఫ్రికా, దక్షిణాసియా దేశాల వాసులేనని 'లాన్సెట్'లో ప్రచురితమైన ఆ పరిశోధనాపత్రం వెల్లడించింది. పిల్లలను దేవుడి ప్రతిరూపాలుగా భావించే భారతావనిలో 30శాతం మంది బాలికలు, 13శాతం మంది బాలురు లైంగిక అకృత్యాలకు గురవుతున్నారనే దారుణ వాస్తవమూ ఇటీవలే వెలుగుచూసింది. మానవ రూపంలోని రక్కసుల చేతుల్లో నరకబాధలు అనుభవించిన బాలబాలికలను ఆ పీడకలలు జీవితాంతం వెంటాడతాయి. బంగారు బాల్యాన్ని భద్రంగా చూసుకోవడంలో పెద్దల అసమర్థతను, వ్యవస్థల వైఫల్యాన్ని అవి వేలెత్తి చూపిస్తుంటాయి!

లైంగిక దాష్టీకాలకు బలయ్యే అసహాయ చిన్నారులు కోలుకుని సాధారణ జీవితం గడపడం కష్టసాధ్యమవుతుంది. తీవ్ర ఆందోళన, కుంగుబాటు వారిని నిరంతరం వెన్నాడుతుంటాయి. లోగడ ఎదురైన భయంకర అనుభవాలు వారిలో మనుషుల పట్ల నమ్మకాన్ని చంపేస్తాయి. దాంతో ఎవరికీ దగ్గర కాలేక చాలామంది ఒంటరితనంలో మగ్గిపోతుంటారు. చదువుల్లో మరుగ్గా ఉండలేక జీవితంలో ముందడుగు వేయలేక లోలోన కుమిలిపోతుంటారు. తలచుకుంటేనే వెన్నులో వణుకుపుట్టించే ఘోరానుభవాల గుర్తులను మనసులోంచి చెరిపేయలేక కొందరు ఆత్మహత్యలకూ ఒడిగడుతుంటారు. లైంగిక దాడులకు గురయ్యే మానసికంగా నలిగిపోయే పిల్లలు ఆపై శారీరకంగానూ తీవ్రస్థాయి అనారోగ్య సమస్యలతో సతమతమవుతుంటారని నిపుణులు చెబుతున్నారు. చిన్నతనంలోనే జుగుప్సాకరమైన హింసను చవిచూసిన వారిలో కొందరు పెద్దయ్యాక సమాజంపై ద్వేషంతో అవాంఛనీయ పనులకూ తెగబడుతుంటారు. లైంగిక నేరాల బాధితులకు భవిష్యత్తుపై భరోసా కల్పించి, వారి అభ్యున్నతికి పాటుపడటమెంత ప్రధానమో- పిల్లల పట్ల పాశవికంగా ప్రవర్తించే ప్రబుద్ధులను సత్వరం కఠినంగా శిక్షించడం అంతే అవసరం!

లైంగిక నేరాల బారినుంచి బాలభారతాన్ని రక్షించుకోవడానికి తెచ్చిన పోక్సో చట్టం కింద దేశీయంగా గడచిన ఆరేళ్లలో 5.28 లక్షలకు పైగా కేసులు నమోదయ్యాయి. ప్రత్యేక న్యాయస్థానాలు విచారించిన పోక్సో కేసుల్లో జాతీయస్థాయిలో సగటున 18.5శాతం వాటిలోనే శిక్షలుపడ్డాయి. ఏపీలో ఇంకా తక్కువగా 5.1శాతం కేసుల్లో నిందితులకు దండనలు విధిస్తే- తెలంగాణలో అది ఏడుశాతంగా లెక్కతేలుతోంది. పోక్సో కేసుల పెండింగ్‌ను తగ్గించడానికి ప్రత్యేక కోర్టుల సంఖ్యను పెంచాలన్న సుప్రీంకోర్టు జడ్జీల సూచనను ప్రభుత్వాలు ఆచరణలోకి తీసుకురావాలి. నైతిక విద్యాబోధనకు ప్రాధాన్యమిస్తూ, ఇంటర్నెట్‌లో అశ్లీల దృశ్యాల వరదకు అడ్డుకట్ట వేయాలి. బాలబాలికలను కాటేస్తున్న కర్కోటకుల్లో అత్యధికులు బంధుమిత్రులు, ఇతరత్రా తెలిసినవారే. గుడ్-బ్యాడ్ టచ్‌లపై పిల్లలకు అవగాహన కల్పిస్తూ తల్లిదండ్రులు వారిని నిత్యం గమనిస్తుండాలి. భద్రమైన ఆరోగ్యకరమైన వాతావరణంలో పిల్లలు ఎదిగేందుకు అవసరమైన అన్ని చర్యలనూ ప్రభుత్వాలు తప్పక తీసుకోవాలి!



సమాజంలోని వైవిధ్యాన్ని గౌరవిస్తూ తమవైన మౌలిక విలువలను పోగొట్టుకోకుండా ఉన్నప్పుడే ఏ సంస్కృతి అయినా సుసంపన్నంగా ఉంటుంది. సాంస్కృతిక, నైతిక విలువల పతనంతో వచ్చేది ప్రగతి కాదు.

– కాకా కాలేల్కర్, సంఘసంస్కర్త

జాగరూకత

రేపటి తరం క్షేమం, సంక్షేమం కోసం నిద్రాహారాలను సైతం మరచి తల్లిదండ్రులు పడే తపన భవిత పట్ల వారి జాగరూకతకు ప్రత్యక్ష ఉదాహరణ. వ్యక్తి తనకు ఇష్టమైనచోట, అయినవారితో క్షేమంగా బతకాలన్న ఆపేక్షతో, నిరంతరం జాగరూకుడై ఉండటం సహజం. జాగరూకత ప్రతి జీవి ప్రాథమిక అవసరమే కాదు, స్వీయ రక్షణా బాధ్యత.

ప్రాపంచిక విషయాల పట్ల వ్యక్తి చూపే దృక్పథమే ఆ వ్యక్తికి ఆయా అంశాలపై ఒక వైఖరిని ఏర్పాటు చేస్తుంది. బాల్య, యవ్వన, ప్రౌఢ, వృద్ధావస్థల్లో ఆయా విషయాల పట్ల ఆ వైఖరి స్థిరంగా ఉండకుండా మారుతూ ఉంటుంది. జీవిత ప్రయాణంలో ఎదురైన అనుభవాలు, కలిగిన ఆనందాలు, విషాదాలే దృక్పథంలో మార్పునకు ప్రధాన కారణం కావచ్చు. ఊహించని విధంగా జీవితంలో ఎప్పుడైనా అత్యంత ఇష్టమైన మనుషులు లేదా వస్తువుల పట్ల కూడా సదరు వ్యక్తి విరక్త స్థితిలోకి అడుగు పెట్టవచ్చు. అలా జరిగినప్పుడు అదే దశలో తనలో చోటుచేసుకునే మార్పు పట్ల ఆసక్తి పెరుగుతుంది. తను ఏయే పరిస్థితుల్లో ఎలా ప్రవర్తిస్తున్నానన్న ఆత్మావలోకనం మొదలవుతుంది. ఈ మార్పు అరిషడ్వర్గాల పట్ల జాగరూకతను పెంచుతుంది. అది జ్ఞానం పెంచుకునేందుకు మార్గాన్ని అన్వేషిస్తుంది. అవిద్య నుంచి విద్యకు తోవ చూపుతుంది. 'తస్మాత్ జాగ్రత జాగ్రత!' అంటూ బోధించిన శంకరుల అద్వైతామృత లహరిలో మనసును ఓలలాడిస్తుంది. వ్యర్థ ప్రేలాపనలతో మట్టికొట్టుకుని, మలినమైపోయిన గుండె గదిని శుద్ధి చేస్తుంది. తత్త్వం అన్న ఉపనిషత్ వాక్యం ప్రకారం ఏదైతే దైవమున్నదో అదే నేనుగా ఆ దైవికశక్తిని మనోమందిరంలో ప్రతిష్ఠిస్తుంది. ఆ మూర్తిపై త్రికరణ శుద్ధిగా చిత్తం నిమగ్నమవడానికి కారణమవుతుంది. ఆ చిదానందాన్ని ఆస్వాదించడానికి ప్రేరణనిస్తుంది.



అంతర్యామి

విహారార్థం భార్యలతో కలిసి సరోవరానికి వెళ్లిన గజేంద్రుడు మొసలి బారిన పడ్డాడు. తీవ్ర పోరాటం జరిపిన తదుపరి ఓటమి దశలో తనలోని అంతర్యామిని కాపాడమని వేడుకున్నాడు. మదిలో దాగిన దైవం పట్ల గజేంద్రుడు ప్రదర్శించిన జాగరూకత తనకు తక్షణం సాయాన్ని అందించింది. ప్రహ్లాదుడు తల్లి కడుపులో ఉన్నప్పటినుంచే హరి నామ స్మరణతో పునీతుడైనవాడు. 'వైకుంఠు బొగడని వక్త్రంబు వక్త్రమే ఢమ ఢమ ధ్వని తోడి ఢక్కగాక' అంటూ చదువులలో సారమంతా ఆ పరంధాముడి పట్ల ఎరుక మాత్రమేనని నిర్వచించి నిరూపించిన భక్తుడు ప్రహ్లాదుడు.

అవసరానికో, ఆత్మబుద్ధికో మనకు సాయం అందించేందుకు దేవుడు ఉన్నాడన్న తలంపు ఒకింత మంచిదే కదా! అందుకే తల్లి చిన్న పొట్టలో ఊపిరి పోసుకున్న జీవి సంరక్షణకు పూనుకున్నది ఎవరో? రేపటికల్లా ఇన్ని పనులు అంటూ చాంతాడంత జాబితా రాసుకున్న మనిషి కదలక మెదలక కంటినిండా నిదురపోతే కాపాడేవారెవరో? జనన మరణ చక్రంలో పరిభ్రమిస్తున్న జీవిని భవబంధాల నుంచి విముక్తుణ్ని చేసి తనలో లీనం చేసుకునేవారు ఎవరో? ఆ దైవం పట్ల మనిషిగా నిరంతర జాగరూకతతో మెలగటమే ధన్యమార్గం, ధర్మమార్గం.


– పొర్ణంది అపర్ణ



విత్తన బిల్లుపై లోతుగా చర్చించాల్సిందే!

ముసాయిదా విత్తనాల బిల్లు-2025ను పార్లమెంటుకు సమర్పించేందుకు కేంద్రం రంగం సిద్ధం చేస్తోంది. దీంతో దేశంలో వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న సవాళ్లు, కొత్తగా వస్తున్న మార్పులు, వాటి ప్రభావాలపై చర్చ ఊపందుకుంది. 1966నాటి విత్తన చట్ట నిబంధనలనూ, 1983నాటి విత్తన నియంత్రణ ఆదేశాలనూ కలిపి ఈ బిల్లుకు రూపకల్పన చేశారు. మార్కెట్లో నకిలీ విత్తనాలను కట్టడిచేసి, అన్నదాతలందరికీ నాణ్యమైన విత్తనాలను అందించాలన్నదే ఈ బిల్లు ప్రధానోద్దేశమని తెలుస్తోంది.

నేడు దేశీయ విత్తన వ్యాపారంలో ప్రైవేటు సంస్థల పాత్ర బాగా పెరిగిపోయింది. బయోటెక్నాలజీ పరిశోధనలు, విదేశీ విత్తనాల దిగుమతులు, ఆన్‌లైన్‌లో విక్రయాల మధ్య పాత చట్టాన్ని అమలు చేయడం కష్టతరంగా మారింది. 1970 దశకం తరవాత వ్యవసాయ, వాణిజ్య, సాంకేతిక రంగాల్లో అనేక మార్పులు వచ్చినా, ఈ నిబంధనలు పెద్దగా మారలేదు. ఇటువంటి తరుణంలో తీసుకొస్తున్న కొత్త విత్తన బిల్లు 2025- దేశీయంగా విత్తన సరఫరా ప్రక్రియలను నవీకరించడంతో పాటు పారదర్శకత, నాణ్యత, బాధ్యతలను కచ్చితంగా నిర్దేశించే అవకాశముంది. ముఖ్యంగా విత్తన తయారీదారులు, విక్రేతలతో పాటు నర్సరీలు, పరీక్షలు చేపట్టే ప్రయోగశాలలు వంటి సంస్థలను అధికారికంగా రిజిస్టర్ చేయాలని ఈ బిల్లు నిర్దేశిస్తోంది. విత్తన సంచులపై బ్యాచ్ నంబర్లు, ఎక్కడ తయారైంది, లాట్ వివరాలు, క్యూఆర్ కోడ్ వంటి ట్రేసబిలిటీ ఫీచర్లన్నీ తప్పనిసరిగా ఉంచాలన్న నిబంధనలను ఇందులో పొందుపరిచారు. విత్తనాల నాణ్యత పరీక్షల విషయంలో ఎలాంటి నిబంధనలను అనుసరించాలి? నమూనాల పరిమాణం ఎంత ఉండాలి? ప్రైవేట్ టెస్టింగ్ ల్యాబ్‌లకు గుర్తింపు ఎలా ఇవ్వాలి?... వంటి ప్రమాణాలన్నీ కొత్త బిల్లులో ఉన్నాయి. విత్తనాల నాణ్యతపై రైతుల్లో విశ్వాసాన్ని పెంచడంతో పాటు, నకిలీ విత్తనాల కారణంగా వాటిల్లుతున్న నష్టాలను గణనీయంగా తగ్గించాలన్నది వీటి ఉద్దేశం.



వైవిధ్యాన్ని కాపాడేలా...

విదేశీ విత్తనాల ఎగుమతి, దిగుమతుల విషయంలో కాస్త సడలింపు ఇచ్చినప్పటికీ- క్వారంటైన్, వ్యాధికారక సూక్ష్మజీవుల పరిశీలన వంటి భద్రతాంశాలను బలోపేతం చేసుకోవడం ద్వారా జీవవైవిధ్యాన్ని పరిరక్షించాలని కేంద్రం యోచిస్తోంది. నాణ్యతలేని విత్తనాల వల్ల రైతుకు వాటిల్లే నష్టాన్ని మదింపు చేయడంతో పాటు, దానికి సరఫరాదారుడు ఎలా బాధ్యత వహిస్తాడనే విషయాన్నీ బిల్లు వివరిస్తోంది. కేసులూ, ఫిర్యాదుల పరిష్కార మార్గాలు; నష్టపరిహార చెల్లింపులన్నీ చట్టపరంగా ఉండాలని ప్రభుత్వం భావిస్తోంది. కానీ, తాజా బిల్లుపై రైతులూ చిన్న విత్తన విక్రేతలూ కొందరు నిపుణులూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దేశీయంగా రైతులు తరతరాలుగా తమ విత్తనాలను తామే సమకూర్చుకుని, వాటిని పొరుగువారితో పంచుకుంటున్నారు. విత్తన మార్కెట్లో ఇలాంటి వారు పెద్దసంఖ్యలో లేకపోవచ్చు. కానీ ఎంతో విలువైన, ప్రత్యేకమైన వంగడాలను వారు సహజసిద్ధంగా వినియోగిస్తూ సంరక్షిస్తూ వస్తున్నారన్న విషయాన్ని మరవకూడదు. కొత్త బిల్లు వల్ల విత్తనాలకు సంబంధించిన ప్రతి వ్యవహారం రిజిస్ట్రేషన్, లైసెన్సింగ్, లేబులింగ్, ట్రేసబిలిటీ రూపంలో సంక్లిష్టంగా మారితే- సంప్రదాయంగా వస్తున్న విత్తన సంరక్షణ దెబ్బతింటుందనే ఆందోళన వ్యక్తమవుతోంది. పైగా చిన్న విత్తన తయారీదారులు, కో-ఆపరేటివ్‌లు, గ్రామస్థాయి విత్తన విక్రేతలు ఈ కొత్త నియమాలను అనుసరించడానికి ఆర్థికంగా, సాంకేతికపరంగా సంసిద్ధం కాలేరు. దాంతో బడా విత్తన కంపెనీల ఆధిపత్యం పెరిగి- స్థానిక విత్తన వైవిధ్యం, వాటికి ప్రాధాన్యం తగ్గిపోయి, రైతుల స్వతంత్ర విత్తన వ్యవస్థలు చతికిలపడిపోతాయన్న భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి.

నకిలీ విత్తనాల కట్టడికి కఠిన చర్యలు అవసరమే. కానీ అన్నింటినీ ఒకే గాటన కట్టేయడం సమంజసం కాదన్నది కొందరు రైతులు, నిపుణుల భావన. ఎందుకంటే- ప్రకృతి విపత్తులు, వాతావరణ పరిస్థితులు, నిల్వ సమస్యలు వంటివెన్నో విత్తనాల్లో లోపాలకు కారణం కావచ్చు. స్వార్థంతో తాలు విత్తనాలను అంటగట్టే వారిని శిక్షించాల్సిందే. అలాగని ప్రతి విత్తన వైఫల్యాన్నీ మోసంగా పరిగణించి రైతుల్నీ, చిన్న వ్యాపారులనూ శిక్షిస్తే, కొత్త చిక్కులు వచ్చిపడతాయి. కాబట్టి తగిన శోధన, క్షేత్రస్థాయి వాస్తవాల ఆధారంగానే చర్యలకు ఉపక్రమించాలి. కొత్త విత్తన బిల్లు సమర్థంగా అమలు కావాలంటే- రాష్ట్రస్థాయి టెస్టింగ్ ల్యాబ్‌లు, ట్రేసబిలిటీ పరిశోధనశాలలు, ఫిర్యాదుల పరిష్కార యంత్రాంగాలు, పూర్తిస్థాయి సిబ్బంది అత్యావశ్యకం. కానీ, చాలా రాష్ట్రాల్లో ఇలాంటి మౌలిక వసతులు లేవు. కాబట్టి బిల్లు చట్టంగా రూపుదాల్చినా, ఆశించిన ఫలితాలు అందిరావడం అనుమానమేనన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

సమగ్ర చట్టం కోసం...

విత్తన పరిశ్రమకు చెందిన కొందరు మాత్రం నూతన బిల్లును స్వాగతిస్తున్నారు. విత్తనాల లైసెన్సింగ్, నకిలీ విత్తనాల నియంత్రణకు కఠిన నిబంధనలు తీసుకొచ్చి అన్నదాతలకు నాణ్యమైన వంగడాలను అందిస్తే మేలేనంటున్నారు. రైతుల అభిప్రాయాలతో పాటు వివిధ రాష్ట్రాల్లోని పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని బిల్లును మెరుగుపరచాలనే డిమాండ్లు ఊపందుకున్నాయి. బిల్లులో రైతు విత్తన హక్కులను విస్పష్టం చేయడంతో పాటు చట్టాన్ని దశల వారీగా అమలు చేయడం, చిన్న విక్రేతలకు తోడ్పాటు, స్వల్ప వడ్డీకి రుణాలు అందివ్వడం, స్థానిక విత్తన భాండాగారాల ఏర్పాటు వంటి అంశాలను కూడా చేర్చాలంటున్నారు. బిల్లుపై ప్రస్తుతం ప్రజాభిప్రాయ సేకరణ జరుగుతోంది కాబట్టి... రైతులు, విత్తన విక్రేతలు, వ్యాపారులు, పరిశోధకులు తమ అభిప్రాయాలను వెల్లడించాల్సిన అవసరముంది. దీనిపై సాధారణ ప్రజానీకంలోనూ చట్టసభల్లోనూ సమగ్రంగా చర్చించాలి. ఎందుకంటే, విత్తనాలే రైతుల జీవికకు ఆయువుపట్టు. ఈ విషయంలో చట్టపరంగా ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా... రైతులు స్వతంత్రతను కోల్పోవడంతో పాటు విత్తన వైవిధ్యం దెబ్బతినిపోయే ప్రమాదం ఉంటుంది. అందుకని నూతన బిల్లు కఠిన నియమాలకే పరిమితం కాకుండా- సహకార, మద్దతు వ్యవస్థల ద్వారా అమలు చేయదగినదిగా ఉండాలి. ఆ దిశగా బిల్లుపై పార్లమెంటులోని పక్షాలన్నీ సమగ్రంగా చర్చించి, ఎలాంటి భయాందోళనలకూ తావివ్వని, రైతులందరికీ ఆమోదయోగ్యమైన నూతన విత్తన చట్టాన్ని తీసుకొస్తాయని ఆశిద్దాం.



ఆచార్య అప్పారావు పొదిలె
హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయ పూర్వ ఉపకులపతి

మా కాలనీ జిల్లా కేంద్రానికి శివారు ప్రాంతమైనా పాలనాపరంగా పక్కనున్న గ్రామపంచాయతీలోకి వస్తుంది. ఒకసారి ఊరంతా సామూహికంగా చేసుకునే ఒక పండుగ వచ్చింది. సర్పంచిని మర్యాదపూర్వకంగా పిలవాలని నిర్ణయం తీసుకున్నారు నిర్వాహక కమిటీ వారు. సర్పంచికి శాలువ కప్పే బాధ్యత నాకప్పగించారు. సర్పంచి వచ్చాడు. కూర్చుని కబుర్లు చెప్పుకొన్నాం. గ్రామ రాజకీయాలు, మా కాలనీ అభివృద్ధి గురించి మాట్లాడుకున్నాం. కాలనీవాసులతో సమావేశ ప్రాంగణం నిండిపోయింది. కార్యక్రమం మొదలైంది. సర్పంచికి శాలువ కప్పి పుష్పగుచ్ఛాన్ని అందజేశాను. అందరూ చప్పట్లు కొట్టారు. హారతి పళ్లెం వచ్చింది. కళ్లకద్దుకున్నాడు. కాసేపయ్యాక పనులున్నాయని అందరికి నమస్కరించి సర్పంచి వెళ్లిపోయాడు.



గెలిచేదొకరు... ఏలేదొకరా..?

'మంచివాడిలాగే ఉన్నాడు మన సర్పంచి' అని పక్కనే కూర్చున్న వ్యక్తితో అన్నాను. ఆయన నవ్వుతూ, అసలు సర్పంచి మహిళ. ఈయన ఆమె భర్త అన్న నిజాన్ని మెల్లగా చెప్పాడు. నా మొహం పాలిపోయింది. ఈ విషయం మొదటే ఎందుకు చెప్పలేదయ్యా అని పరిచయం చేసిన వ్యక్తిని అడిగాను. అదేం కొత్త విషయం కాదు, ఇక్కడ అలాగే ఉంటుంది. అది కూడా తెలియదా అన్నట్టుగా చూశాడు. పెద్ద తప్పు చేశాను కదా అని బాధపడ్డాను. కాలక్రమంలో ఇంకో రెండు చోట్ల ఇలాగే జరిగింది. ఆ అనుభవంతో ఇప్పుడు ముందే జాగ్రత్త పడుతున్నాను. సర్పంచి అతడేనా, లేక సర్పంచి భర్తా అన్నది ముందుగానే ఖరారు చేసుకుంటున్నాను.

పరిపాలనలో మహిళలను భాగస్వాములను చేయాలనే ఉద్దేశంతోనే రిజర్వేషన్లు పెట్టి మరీ వారికి కొన్ని స్థానాలు కేటాయిస్తున్నారు. కాబట్టి ప్రతిచోటా సర్పంచి ఎవరో తెలుసుకుని వారికే ప్రాధాన్యమివ్వాలి. భర్తలు బినామీలుగా వ్యవహరించకూడదు. సర్పంచిగా ఉన్న మహిళలే అన్ని పనుల్లోనూ అధికారికంగా పాల్గొనేటట్టు చూడాలి. మహిళలు తమ హక్కునీ అధికారాన్నీ ఉపయోగించుకునేలా ప్రోత్సహించాలి. కానీ వాస్తవంలో ఇందుకు విరుద్ధంగా జరుగుతుండటమే దురదృష్టకరం.

ఆకాశంలో సగం స్త్రీలేనంటూ ఉపన్యాసాలు ఇస్తాం కానీ భూమి మీద వారికి కేటాయించిన పదవిలో వారిని కూర్చోనివ్వం. న్యాయబద్ధంగా గెలిచిన మహిళా సర్పంచులను గౌరవించలేని సామాజిక రుగ్మతకి అందరమూ అలవాటు పడిపోయాం. దీన్ని నిర్మూలించడానికి అక్కడక్కడ స్వచ్ఛంద సేవా సంస్థలు రకరకాల శిక్షణలనిస్తూ మహిళా సర్పంచులను, వార్డు సభ్యులను చైతన్యవంతులుగా తీర్చిదిద్దుతున్నాయి. ఈ ప్రయోగాలు దేశమంతా విస్తరించాలి. ప్రభుత్వాలూ అందుకు చొరవ చూపాలి. ఆయా స్థానాలను స్త్రీలకు కేటాయించడంతో పనైపోయిందనుకోకుండా ఆచరణలో ఏం జరుగుతోందో ఒక కన్నేసి ఉంచాలి. చురుగ్గా తమ బాధ్యతలను నిర్వహించే మహిళా సర్పంచులకు ప్రోత్సాహకాలివ్వాలి. గ్రామాల్లో యువతీయువకులు తమ ఊరికి మహిళా సర్పంచి ఉంటే వారికి సహకరిస్తూ గ్రామాభివృద్ధిలో తామూ పాలు పంచుకోవాలి. ఇలా అన్ని కోణాలనుంచి తగిన చర్యలు తీసుకున్నప్పుడే జెండర్ అంతరాలను సమూలంగా రూపుమాపి సమసమాజం వైపు అడుగేయగలుగుతాం.

– డాక్టర్ టి.సంపత్ కుమార్



2019	2020	2021	2022	2023	2024
57	58	62	63	55	57

(ఆధారం: గ్లోబల్ వైల్డ్‌ఫైర్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్-2025)

చూడటానికి చిన్నవే.. కానీ ప్రమాదమెంతో!

ప్లాస్టిక్‌తో మానవాళికీ, పర్యావరణానికీ తీవ్ర హాని కలుగుతోంది. ఒకసారి వాడి పారేయాల్సిన ప్లాస్టిక్ సంచులూ స్ట్రాలూ వంటి ఉత్పత్తుల్ని నిషేధించాలన్న డిమాండ్లను తరచూ వింటున్నాం. మనం నిత్యం వాడే టీ, కాఫీ, మసాలా పొడులూ... పాలు, పెరుగు, చిప్స్ వంటివాటినీ కవర్లలో ప్యాక్ చేసి అమ్ముతున్నారు. ఇలాంటి ప్లాస్టిక్ పొట్లాల వినియోగాన్ని తగ్గించడం అత్యావశ్యకం.

నిత్య జీవితంలో ప్లాస్టిక్ ప్యాకెట్ల వాడకం అంతకంతకు పెరిగిపోతోంది. చాలా సంస్థలు కొన్ని నిత్యావసర ఉత్పత్తులను చిన్నచిన్న ప్యాకెట్ల(సాషే)లో పెట్టి అమ్ముతున్నాయి. రూపాయి షాంపూ దగ్గర నుంచి ఆహార పదార్థాలదాకా అన్నీ ప్లాస్టిక్ ప్యాకెట్లలోనే దొరుకుతున్నాయి. తక్కువ ధరకు లభిస్తుండటంతో జనాలూ వాటినే అధికంగా కొంటున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఏటా 85,500 కోట్లకుపైగా ఇలాంటి ప్యాకెట్లు ఉత్పత్తవుతున్నాయన్నది పర్యావరణ సంస్థల అంచనా. తీరా ఉపయోగించిన తరవాత వాటిని ఎక్కడపడితే అక్కడే పడేస్తున్నారు. ఇప్పటివరకు ఉత్పత్తయిన సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌లో పది శాతం కంటే తక్కువే పునర్వినియోగానికి నోచుకుందని అంచనా.

హార్మోన్ల సమతుల్యతకు హాని

చెరువులు, కుంటలు, నదులతో పాటు సముద్ర జలాల్లోనూ ప్లాస్టిక్ వ్యర్థాలు కుప్పలుతెప్పలుగా పేరుకుపోతున్నాయి. జలచరాలు చిన్న పరిమాణంలోని ప్లాస్టిక్ రేణువులను ఆహారమనుకుని తినేస్తున్నాయి. దాంతో అవి మృత్యువాత పడుతున్నాయి. సముద్రపు ఉప్పులో ప్లాస్టిక్ అవశేషాలు భారీగా ఉంటున్నాయని పలు అధ్యయనాలు ఇప్పటికే హెచ్చరించాయి. ప్లాస్టిక్‌లో ఉండే బిస్‌ఫినాల్-ఏ(బీపీఏ), థాలెట్స్ వంటి విష రసాయనాలు నీరు, ఆహారం ద్వారా మానవ శరీరంలోకి ప్రవేశిస్తున్నాయి. ఆ తరవాత అవి క్రమంగా హార్మోన్ల సమతుల్యతను దెబ్బతీస్తున్నాయి. దాంతో సంతాన సాఫల్య సమస్యలు, గర్భస్థ శిశువుల్లో ఎదుగుదల లోపాలు, పెద్దవారిలో చర్మ సమస్యలు, క్యాన్సర్లు వంటివి ముమ్మరిస్తున్నాయి. మరోవైపు చిన్న చిన్న ప్యాకెట్లు, ప్లాస్టిక్ బాటిళ్లు వంటివి పేరుకుపోయి నాలాల్లో పూడికలు ఏర్పడుతున్నాయి. దాంతో భారీ వర్షాలు కురిసినప్పుడు వరద నీరు రోడ్లపైనా, ఇళ్ల మధ్య నిలిచిపోతోంది. ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. ఐక్యరాజ్య సమితి వాతావరణ కార్యక్రమం(యూఎన్‌ఈపీ) ఆధ్వర్యాన ఇంటర్ గవర్నమెంట్ నెగోషియేటింగ్ కమిటీ మొన్న ఆగస్టులో జెనీవాలో సముద్ర పర్యావరణ పరిరక్షణ, ప్లాస్టిక్ కాలుష్య కట్టడికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చలు నిర్వహించింది. దీనికి 183 దేశాల ప్రతినిధులు హాజరైనా చర్చల్లో ఎలాంటి ఏకాభిప్రాయం సాధించలేదు.



భారత్, ఫిలిప్పీన్స్, ఇండోనేసియా, బంగ్లాదేశ్ వంటి వర్ధమాన దేశాల్లో ప్లాస్టిక్ ప్యాకెట్ల సమస్య తీవ్రంగా ఉంది. 'స్వచ్ఛ భారత్' వల్ల మన దేశంలో వ్యర్థాల సేకరణ కొంత మెరుగుపడినా, పూర్తిస్థాయిలో మార్పు రావాల్సి ఉంది. ఇప్పటికీ చాలామంది మురుగు కాల్వల్లోనూ, ఖాళీ స్థలాల్లోనూ చెత్తను పారబోస్తున్నారు. హైదరాబాద్‌లో రోజూ పోగవుతున్న చెత్తలో ప్లాస్టిక్ వ్యర్థాలే దాదాపు వెయ్యి టన్నుల వరకు ఉంటున్నాయి. ప్రస్తుతం 'ఎఫ్ఎంసీజీ' తయారీ సంస్థలు ఉపయోగిస్తున్న ప్యాకేజింగ్ కవర్లలో పునర్వినియోగానికి అర్హమైనవి కేవలం 0.2 శాతమేనని ఎలెన్ మెక్ ఆర్థర్ ఫౌండేషన్ అధ్యయన నివేదిక చెబుతోంది. ప్లాస్టిక్ వ్యర్థాలను తగ్గించేందుకు భారత్ వంటి దేశాల్లోని కొన్ని సిమెంట్ పరిశ్రమల్లో కలప, బొగ్గుకు బదులు పాత టైర్లు, ప్లాస్టిక్ వ్యర్థాలను వాడుతున్నారు. అయితే, వాటి నుంచి వెలువడే విషవాయువులు శ్వాసకోశ, నాడీ, కాలేయ సమస్యలతో పాటు హైపోథైరాయిడ్, క్యాన్సర్ వంటి వ్యాధులకూ కారణమవుతున్నాయి.

ముప్పును ఎలా తప్పించుకోగలం?

ప్లాస్టిక్ వ్యర్థాల బెడదను నివారించాలంటే, అందుకు సంబంధించిన నిషేధాజ్ఞలను ప్రభుత్వాలు కట్టుదిట్టంగా అమలు చేయాలి. చిన్నచిన్న ప్లాస్టిక్ ప్యాకెట్లకు బదులు పర్యావరణానికి హాని కలిగించని ప్యాకింగ్ పద్ధతులను ప్రవేశపెట్టాలి. క్రమంగా వస్తూత్పత్తులను ప్లాస్టిక్ ప్యాకెట్లు, కవర్లలో పెట్టి విక్రయించే విధానానికి స్వస్తి పలకాలి. ప్లాస్టిక్ వ్యర్థాల వల్ల వాటిల్లే అనర్థాలపై విద్యార్థులు, గృహిణులు, సాధారణ ప్రజానీకానికి అవగాహన పెంచడం అన్నింటికంటే ముఖ్యం. ఇటీవల కొన్ని కంపెనీలు టెట్రాప్యాక్ శీతల పానీయాలతో పేపర్ స్ట్రాలు ఇస్తున్నాయి. ఇలాంటి పర్యావరణహితకర ఆవిష్కరణలకు వ్యాపార సంస్థలూ, ప్రభుత్వాలూ పెద్దపీట వేసి, సత్వరమే వాటిని మార్కెట్లోకి తీసుకురావాలి. ఇటువంటి బహుముఖ చర్యలతోనే ప్లాస్టిక్ కారక కష్టనష్టాల నుంచి పర్యావరణాన్నీ ప్రజారోగ్యాన్నీ కొంతవరకైనా రక్షించుకోగలుగుతాం.

– తిరుపతి పెద్ది

అమ్మో.. పులి!

హస్తినాపురం రాజ్యానికి రాజు దేవేంద్రుడు. కోటకు కాపలా ఒక వ్యక్తిని నియమించాలనుకున్నాడు. అతడు సాహసవంతుడు, ధైర్యవంతుడు, తెలివిగలవాడు అయ్యుండాలని మంత్రితో చెప్పి, దండోరా వేయించాడు రాజు. పోటీలో పాల్గొనడానికి చాలామంది యువకులు వచ్చారు. అప్పుడు మంత్రి.. 'గదిలో పులితో పాటు ఎవరైతే గంటసేపు ఉంటారో వాళ్లే ఈ కొలువులో చేరతారు, ఇదే పరీక్ష' అన్నాడు. 'పోటీ' అంటే వస్తాదుతో తలపడటం అనుకున్నాం. అమ్మో ఇదేం పోటీ!' అంటూ చాలామంది వెనుదిరిగారు. చివరకు గరటయ్య, సుబ్బయ్య మిగిలారు. వాళ్లిద్దరినీ రెండు చీకటి గదుల దగ్గరికి తీసుకెళ్లాడు మంత్రి. 'ఈ రెండు గదుల్లో రెండు పులులు ఉన్నాయి. మీరు లోపలికి వెళ్తే తలుపు గడియ పెట్టేస్తాను' అంటూ వాటి తాళాలు



తీశాడు. అప్పటికే వాటి గాండ్రింపు భయంకరంగా వినిపిస్తోంది. దాంతో గరటయ్య ఒక్కసారిగా భయపడిపోయాడు. 'పులి చీకట్లో ఉన్నా.. దాని చుట్టుపక్కల ఉన్నవాళ్లను పసిగట్టగలదు. ఎందుకు సాహసం చేయడం' అనుకుని తను కూడా పోటీ నుంచి తప్పుకొన్నాడు. కానీ సుబ్బయ్య ఏమాత్రం భయం లేకుండా చీకటి గదిలోకి వెళ్లాడు. సమయం పూర్తయ్యాక క్షేమంగా బయటికి తిరిగొచ్చాడు. అప్పుడు దేవేంద్రుడు వచ్చి.. 'సుబ్బయ్యే విజయం సాధించాడు కదా!' అన్నాడు. 'అవును మహారాజా! అతనే గెలిచాడు. గరటయ్య, సుబ్బయ్యలకు పెట్టిన మొదటి పరీక్ష. పులితో కలిసి ఒక గదిలో ఉండాలని. దానికి సిద్ధపడి ఇద్దరూ సాహసవంతులని నిరూపించుకున్నారు. రెండో పరీక్షలో పులి నుంచి వచ్చే శబ్దాలు స్థిరంగా ఒకే చోటు నుంచి వస్తున్నాయి. అంటే పులి గదిలోనే ఉన్నా బోనులో ఉందని గమనించి లోపలికి వెళ్లి తన తెలివితేటల్ని చాటుకున్నాడు సుబ్బయ్య. చివరికి విజేతగా నిలిచాడు' అని చెప్పాడు మంత్రి. తరవాత సుబ్బయ్యని అభినందించి కొలువులో చేర్చుకున్నాడు మహారాజు.

– బి.వి.పట్నాయక్

నేనెవర్ని?

1. నేనో నాలుగు అక్షరాల పదాన్ని. 'సగం'లో ఉంటాను కానీ 'వేగం'లో లేను. 'హల్లు'లో ఉంటాను కానీ 'ఇల్లు'లో లేను. 'కాలు'లో ఉంటాను కానీ 'వేలు'లో లేను. రంపం'లో ఉంటాను కానీ 'పాపం'లో లేను. నేనెవర్ని?
2. మూడక్షరాల పదాన్ని నేను. 'నిప్పు'లో ఉంటాను కానీ 'ఉప్పు'లో లేను. 'వారం'లో ఉంటాను కానీ 'దూరం'లో లేను. 'సంత'లో ఉంటాను కానీ 'చెంత'లో లేను. ఇంతకీ నేనెవర్ని?

జవాబు: 1.సహకారం 2.నివాసం

గ్రహం అనుగ్రహం

13-12-2025 శనివారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; దక్షిణాయనం; హేమంత రుతువు, మార్గశిర మాసం, బహుళపక్షం
నవమి: రా. 7-27 తదుపరి దశమి
ఉత్తర: ఉ. 9-32 తదుపరి హస్త
వర్జ్యం: సా. 6-26 నుంచి 8-08 వరకు
అమృత ఘడియలు: తె.4-37 నుంచి 6-19 వరకు
దుర్ముహూర్తం: ఉ. 6-25 నుంచి 7-52 వరకు
రాహుకాలం: ఉ. 9-00 నుంచి 10-30 వరకు
సూర్యోదయం: ఉ.6.25; సూర్యాస్తమయం: సా.5.24

చలి - పులి

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
ఆదిలాబాద్	7.2	29.3
మెదక్	7.2	29.7
హైదరాబాద్	10.8	30.1
కర్నూలు	14.9	31.5
అనంతపురం	15.4	31.0
కడప	16.0	28.0
విజయనగరం	16.0	28.0
విశాఖపట్నం	16.0	29.2
రాజమహేంద్రవరం	16.0	34.0
శ్రీకాకుళం	17.0	28.0
విజయవాడ	17.5	29.4
నరసాపురం	17.5	31.2
గుంటూరు	18.0	29.0
తిరుపతి	19.1	29.2
ఒంగోలు	19.6	30.5
నెల్లూరు	20.8	30.6
తాడేపల్లిగూడెం	24.0	31.0

ఇదీ సంగతి!



ఎవరి మాటా కాదనలేక పీకలమీదికి తెచ్చుకున్నాడు డాక్టర్!!

70 ఏళ్ల సేవలకు ఇక సెలవు!

- తుంగభద్రలో మొత్తం 33 గేట్ల స్థానంలో కొత్తవి
- పాత తలుపులు తొలగించే ప్రక్రియ ప్రారంభం

ఈనాడు, అమరావతి: తుంగభద్ర ప్రాజెక్టులో 70 ఏళ్లపాటు సేవలందించిన గేట్లకు ఇక విరామం. ఈ ప్రాజెక్టులోని 33 గేట్లను మార్చి కొత్తవి అమర్చనున్నారు. దీనిలో భాగంగా పాత గేట్లు ఒక్కొక్కటీ తొలగిస్తున్నారు. కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌ల్లో 12.10 లక్షల ఎకరాలకు సాగునీరు, లక్షల మంది ప్రజలకు తాగునీరు అందిస్తున్న తుంగభద్ర ప్రాజెక్టును 1953లో నిర్మించారు. అప్పటి నుంచి 70 ఏళ్లకు పైగా ఈ ప్రాజెక్టు గేట్లు పనిచేస్తూనే ఉన్నాయి. సాధారణంగా ఒక ప్రాజెక్టులో గేట్ల జీవితకాలం 45 ఏళ్లు మాత్రమే, తుంగభద్రలో గేట్లు 70 ఏళ్లపాటు సేవలందించడం గొప్ప విషయమని రాష్ట్ర ప్రభుత్వ మెకానికల్ సలహాదారు కన్నయ్యనాయుడు చెప్పారు. అయితే నిరుడు ఆగస్టులో ఒక గేటు కొట్టుకుపోవడంతో సమస్య ప్రారంభమయింది. తర్వాత అనేక పరీక్షలు చేసిన నిపుణులు మొత్తం గేట్లు మార్చి కొత్తవి అమర్చాలని సిఫార్సు చేశారు. తుంగభద్ర బోర్డు అధికారులు రూ.52 కోట్లతో టెండర్లు పిలిచారు. ఈ నిధులను రెండు రాష్ట్ర ప్రభుత్వాలు సమకూరుస్తాయి.




తుంగభద్రలో తొలగిస్తున్న పాత గేట్లు ★ సిద్ధమవుతున్న కొత్త గేట్లు

అప్పట్లో చైన్ విధానమే

కొత్తగా నిర్మిస్తున్న ప్రాజెక్టుల్లో రేడియల్ గేట్లు ఏర్పాటు చేస్తున్నారు. అప్పట్లో చైన్ విధానంలోనే గేట్ల నిర్వహణ ఉండేది. సైకిల్ చైన్ లాంటి పెద్ద పెద్ద చైన్లను ఇక్కడ తలుపులు ఎత్తేందుకు దించేందుకు ఉపయోగిస్తారు. ఏడు దశాబ్దాల కిందట నిర్మించిన తుంగభద్ర ప్రాజెక్టులో గేట్లకు ఏర్పాటు చేసిన చైన్లు మార్చాలని గతంలోనే ఒక అధ్యయనం తేల్చినా అది కార్యరూపం దాల్చలేదు. ఇప్పుడు కూడా చైన్ల సాయంతోనే నిర్వహించేలా 33 కొత్త గేట్లు ఏర్పాటు చేస్తున్నారు.

తాజాగా రూ.20 కోట్లు మంజూరు

తుంగభద్రలో గేట్ల సామర్థ్యం 70 శాతం వరకు దెబ్బతిందని ఏప్రిల్‌లో అధ్యయన నివేదిక తేల్చింది. దీంతో ఖరీఫ్ వరకు తక్కువ నీటి నిల్వతో నడిపించారు. ప్రస్తుత రబీలో ఆయకట్టుకు నీళ్లివ్వకుండా గేట్ల పనులు చేస్తున్నారు. గేట్లు మార్చేందుకు రూ.37.67 కోట్లు, ఇతర పనులకు రూ.37.79 కోట్లు మొత్తం రూ.75.46 కోట్ల నిధులు అవసరమని ఏపీ ప్రభుత్వాన్ని తుంగభద్ర బోర్డు కోరింది. ప్రాజెక్టుల భద్రతను ప్రాధాన్యాంశంగా తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వం గత నెలాఖరులో రూ.20 కోట్లు బడ్జెట్ విడుదల ఉత్తర్వులు ఇచ్చింది. దీంతో గుత్తేదారుల బకాయిలు చెల్లించడంతో పాత గేట్ల తొలగింపు పనులు ప్రారంభమయ్యాయి. తుంగభద్రలో ప్రస్తుతం 1,619.47 అడుగుల నీరు నిల్వ ఉంది. ఇప్పటి వరకు నాలుగు గేట్లు పాక్షికంగా తొలగించారు. ప్రాజెక్టు క్రస్ట్ స్థాయి (1613 అడుగుల) వరకు నీళ్లు ఖాళీ చేసిన తర్వాత గేట్లు పూర్తి స్థాయిలో తొలగించి, కొత్తవి అమర్చడం సాధ్యమవుతుంది. 14 కొత్త గేట్ల ఫ్యాబ్రికేషన్ పూర్తయింది. మిగిలిన గేట్ల తయారీకి మెటీరియల్‌ను ప్రాజెక్టు వద్దకు చేరుస్తున్నారు.

ముంచంగిపుట్టులో 3.1 డిగ్రీల ఉష్ణోగ్రత



మంచు ముసుగులో చింతపల్లి ఆర్టీసీ కాంప్లెక్స్

చింతపల్లి, న్యూస్‌టుడే: అల్లూరి సీతారామరాజు జిల్లాలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు కొనసాగుతున్నాయి. గురువారం రాత్రి రాష్ట్రంలోనే అత్యల్పంగా ముంచంగిపుట్టులో 3.1 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. ఈ సీజన్‌లో నమోదైన అతి తక్కువ ఉష్ణోగ్రత ఇదే. డుంబ్రిగుడలో 3.6 డిగ్రీలు, పెదబయలు 4.4, హుకుంపేట 5.1, చింతపల్లి 5.2, పాడేరు 5.3, జి.మాడుగులలో 6.5 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనాస్థానం వాతావరణ విభాగం నోడల్ అధికారి డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి తెలిపారు.

జూన్ నాటికి వెలిగొండ జలాలిస్తాం

- మంత్రి నిమ్మల రామానాయుడు

పెద్దదోర్నాల, న్యూస్‌టుడే: వచ్చే ఏడాది జూన్ నెలాఖరుకు వెలిగొండ జలాలను ప్రజలకు అందిస్తామని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. ప్రకాశం జిల్లా దోర్నాల మండలం కొత్తూరు సమీపంలోని వెలిగొండ ప్రాజెక్టుకు చెందిన రెండో సొరంగంలో లైనింగ్ పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మొంథా తుపానుతో వరద నీరు ముంచెత్తడంతో పనులు నిలిచిపోయాయన్నారు. ఆ నీటిని బయటకు పంపి గత నెల 21న పునఃప్రారంభించామని తెలిపారు. 3.9 కి.మీల లైనింగ్‌తో పాటు ఇతర పనులను జూన్ నాటికి పూర్తి చేయాలని మంత్రి నిమ్మల ఇంజినీరింగ్ అధికారులు, గుత్తేదారు సిబ్బందిని ఆదేశించారు. ఆయనతో పాటు మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, యర్రగొండపాలెం నియోజకవర్గ తెదేపా ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు సొరంగం పనులు పరిశీలించారు. సీఈ శ్యాంప్రసాద్, మార్కాపురం సబ్ కలెక్టర్ శివరామిరెడ్డి వారి వెంట ఉన్నారు.



వెలిగొండ రెండో సొరంగంలోకి వెళుతున్న మంత్రి రామానాయుడు, ఎమ్మెల్యే నారాయణరెడ్డి తదితరులు

రవీంద్రభారతి ప్రాంగణంలో 15న ఎస్పీ బాలు విగ్రహావిష్కరణ

హైదరాబాద్, న్యూస్‌టుడే: హైదరాబాద్ రవీంద్రభారతి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన.. విఖ్యాత గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం విగ్రహావిష్కరణ ఈ నెల 15న ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు ది మ్యూజిక్ గ్రూప్ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్.అచ్యుతరామరాజు, కార్యదర్శి బి.ఎస్.కృష్ణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. "ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు ముఖ్య అతిథులుగా పాల్గొని బాలు విగ్రహాన్ని ఆవిష్కరిస్తారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, రాష్ట్ర మంత్రులు పాల్గొంటారు. సాయంత్రం 4 గంటలకు బాలుకు నివాళిగా.. 'పాడుతా తీయగా' సినీ సంగీత స్వర నీరాజనం ప్రారంభమవుతుంది. సినీ సంగీత దర్శకులు కీరవాణి, తమన్, నేపథ్య గాయకులు, బాలు కుటుంబ సభ్యులు పాల్గొంటారు" అని పేర్కొన్నారు. గానగంధర్వుడి విగ్రహాన్ని రవీంద్రభారతి ప్రాంగణంలో ఏర్పాటు చేసేందుకు అనుమతినిచ్చిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, మంత్రులకు కృతజ్ఞతలు తెలిపారు. వేడుకకు హాజరు కావాలనుకునేవారికి ఎంట్రీ పాసుల కోసం ఈ నెల 14న సాయంత్రం 3 గంటల నుంచి రవీంద్రభారతిలో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

24న మంత్రివర్గ సమావేశం

ఈనాడు, అమరావతి: సీఎం చంద్రబాబు అధ్యక్షతన సచివాలయంలో ఈ నెల 24న మంత్రివర్గ సమావేశం జరగనుంది. ఈ మేరకు శాఖల వారీ ప్రతిపాదనల్ని రూపొందించి 22వ తేదీ సాయంత్రం 4 గంటల లోపు సాధారణ పరిపాలన శాఖలో అందజేయాలని అన్ని శాఖలకు సీఎస్ కె.విజయానంద్ ఉత్తర్వులు జారీ చేశారు.

18, 19 తేదీల్లో దిల్లీకి చంద్రబాబు

ఈనాడు, అమరావతి: సీఎం చంద్రబాబు ఈ నెల 18, 19 తేదీల్లో దిల్లీలో పర్యటించనున్నారు. 18న రాత్రి ఆయన దిల్లీ చేరుకుంటారు. అనంతరం అక్కడ పలువురు కేంద్ర మంత్రుల్ని చంద్రబాబు కలుస్తారు. రాష్ట్రంలో పెండింగ్ ప్రాజెక్టుల గురించి వారితో చర్చిస్తారు. 19న సాయంత్రం 6:40 గంటలకు దిల్లీ నుంచి తిరుగు ప్రయాణమవుతారు.


ఈడబ్ల్యూఎస్ క్రెడిట్ కో ఆపరేటివ్ సొసైటీలు ఏర్పాటు చేస్తాం: మంత్రి సవిత

ఈనాడు, అమరావతి: బ్రాహ్మణ క్రెడిట్ కో ఆపరేటివ్ సొసైటీ తరహాలో ఈడబ్ల్యూఎస్, కాపు కార్పొరేషన్లలో కూడా ప్రత్యేకంగా క్రెడిట్ కో ఆపరేటివ్ సొసైటీలను ఏర్పాటు చేయనున్నట్లు ఈడబ్ల్యూఎస్ శాఖ మంత్రి సవిత తెలిపారు. ఈడబ్ల్యూఎస్, కాపు వర్గాలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ఈ సొసైటీలను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ప్రభుత్వం ప్రతి నియోజకవర్గంలో ఏర్పాటు చేయబోయే ఎంఎస్ఎంఈ పార్కుల్లోనూ వీరికి ప్రాధాన్యం కల్పిస్తామని తెలిపారు. త్వరలో నూతన విధానంలో విదేశీ విద్యా పథకాన్ని పునరుద్ధరిస్తామన్నారు. సచివాలయంలో శుక్రవారం ఈడబ్ల్యూఎస్, కాపు కార్పొరేషన్ల ఛైర్మన్లు, డైరెక్టర్లు, ఆయా కుల సంఘాల ప్రతినిధులతో మంత్రి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 'ఆర్థికంగా వెనుకబడిన కులాల అభివృద్ధికిగాను 2014-19 మధ్య అమలు చేసిన పథకాలను తిరిగి ప్రారంభిస్తాం. 50 శాతం పనులతో అసంపూర్తిగా ఉన్న తిరుపతి, కర్నూలులోని కాపు భవనాలను, 70 శాతం పూర్తయిన 39 కాపు కమ్యూనిటీ హాళ్లను త్వరలో పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొస్తాం. కాపులకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేరుస్తాం. కోమటి, గుప్తా, శెట్టి వంటి పేర్లకు బదులుగా వారందరినీ ఆర్యవైశ్యులుగా సంబోధించేలా త్వరలో నిర్ణయం తీసుకుంటాం' అని తెలిపారు.

ఆరోగ్య రంగంలో ఏఐ వినియోగంపై 15న సదస్సు

ఈనాడు, అమరావతి: ఆరోగ్య రంగంలో కృత్రిమ మేధ(ఏఐ) వినియోగంపై ఈ నెల 15న విజయవాడలో సదస్సు నిర్వహించనున్నట్లు వైద్యారోగ్యశాఖ కార్యదర్శి సౌరభ్‌గౌర్ వెల్లడించారు. ఈ సదస్సుకు మన రాష్ట్రంతో పాటు ఒడిశా, ఛత్తీస్‌గఢ్, కర్ణాటక, తెలంగాణ, తమిళనాడు, కేరళ, అండమాన్ నికోబార్, లక్షద్వీప్, పుదుచ్చేరి వైద్యారోగ్య, ఐటీ శాఖల కార్యదర్శులు, జాతీయ ఆరోగ్య మిషన్ డైరెక్టర్లు హాజరవుతారని తెలిపారు. ఈ సదస్సు నిర్వహణ కోసం రాష్ట్ర ప్రభుత్వం పది ప్రత్యేక కమిటీల్ని ఏర్పాటు చేసిందని శుక్రవారం ఓ ప్రకటనలో వివరించారు.

కంటి శస్త్రచికిత్సకు వెళ్లి.. 'నేత్రదాత' అయ్యారు!


అప్పారావు

చీపురుపల్లి, న్యూస్‌టుడే: ఆ దంపతులు తమ కళ్లకు శస్త్రచికిత్సలు చేయించుకోవాలని ఆసుపత్రికి వెళ్లారు. తీరా అక్కడ భర్త గుండెపోటుకు గురై చనిపోయారు. ఆ దుఃఖంలోనూ చనిపోయిన తండ్రి నేత్రాలను కుమారులు దానం చేసి ఔదార్యం చాటుకున్నారు. విజయనగరం జిల్లా చీపురుపల్లికి చెందిన పంచాయతీరాజ్ విశ్రాంత ఉద్యోగి కర్రోతు అప్పారావు (73), భార్య నారాయణమ్మ కళ్లకు శస్త్రచికిత్సలు చేయించుకోవడానికి కుమారుడు ప్రసాద్‌తో కలిసి శుక్రవారం విజయనగరం వెళ్లారు. అప్పారావుకు గుండెలో ఇబ్బందులు ఉండడంతో విషయాన్ని కంటి వైద్యుడికి తెలిపారు.. ఇప్పుడు శస్త్రచికిత్స వద్దని చెప్పారు. ఆయన్ను మరో ఆసుపత్రికి తీసుకెళ్లగా గుండెపోటుతో మృతి చెందారు. ఈ విషయం తెలియడంతో మరో ఇద్దరు కొడుకులు సైతం అక్కడకు చేరుకున్నారు. భార్యకు ఇదంతా తెలియపోవడంతో కంటి ఆపరేషన్ జరిగింది. తండ్రి మృతదేహాన్ని చీపురుపల్లిలోని స్వగృహానికి తీసుకెళ్లారు. పుట్టెడు దుఃఖంలోనూ ఆయన నేత్రాలు మరొకరికి చూపు ప్రసాదిస్తాయని ఆలోచించి, ఆ విషయాన్ని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ వారికి తెలియజేశారు. విజయనగరం నుంచి వైద్య సిబ్బంది చేరుకుని కార్నియాలు సేకరించారు.



విజేతగా నిలవడానికి రూట్‌మ్యాప్ ఇదే..

1. స్పష్టమైన లక్ష్యాలను విధించుకోండి.
2. వాటిని సాధించడానికి అడ్డంకులేంటో గుర్తించండి.
3. ఆ అడ్డంకులకు దారితీస్తున్న పరిస్థితులేంటో తెలుసుకోండి.
4. పరిష్కార మార్గాలను కనిపెట్టండి.
5. వాటిని అమలు చేయడం ద్వారా కోరుకున్న ఫలితాన్ని సాధించేందుకు శాయశక్తులా ప్రయత్నించండి.

- రే డాలియో, హెడ్జ్ ఫండ్ మేనేజర్

అంధ క్రికెటర్లకు అండగా నిలవాలి

- వైకల్యాన్ని అధిగమించి వారు సాధించిన ప్రపంచకప్ ఎందరికో స్ఫూర్తి
- ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ప్రశంసలు

ఈనాడు, అమరావతి: 'మన దేశానికి చెందిన అంధ మహిళా క్రికెట్ జట్టు ప్రపంచకప్ గెలిచిందని తెలిసి ఆశ్చర్యపోయాను. వైకల్యాన్ని అధిగమించి వారు సాధించిన విజయంతో ప్రతి భారతీయుడి గుండె ఉప్పొంగింది' అని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ కొనియాడారు. 'మీ విజయంతో ఎందరికో ఒక మార్గం చూపారు. ఈ గెలుపు తాలూకు గుర్తింపు మీకు దక్కాలి. మీ జీవన ప్రమాణాలు మెరుగయ్యేందుకు అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు సహకరించాలి. అన్ని విధాలా అండగా నిలవాలని అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులకు స్వయంగా విజ్ఞప్తి చేస్తా. మన రాష్ట్ర క్రికెటర్ల అంశాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లి చేయగలిగినంత చేస్తా. అవసరమైతే ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ద్వారా కార్పొరేట్ల సాయం కూడా తీసుకుంటాం' అని వారికి హామీ ఇచ్చారు. ప్రపంచకప్ గెలిచిన భారత అంధ క్రికెట్ జట్టును మంగళగిరిలోని తన క్యాంపు కార్యాలయంలో పవన్ కల్యాణ్ శుక్రవారం సత్కరించారు. ఒక్కో క్రికెటర్‌కు ప్రోత్సాహకంగా రూ.5 లక్షల చొప్పున, సహాయక సిబ్బందికి రూ.2 లక్షల చొప్పున బహూకరించారు. మొత్తం రూ.84 లక్షల సొంత సొమ్మును ఆయన వారికి అందించారు. చెక్కులతో పాటు వారికి పట్టుచీరలు, ఆంధ్రప్రదేశ్ హస్తకళల జ్ఞాపిక, కొండపల్లి బొమ్మలు, అరకు కాఫీ డబ్బాలను బహూకరించారు.


ప్రపంచకప్ విజేతగా నిలిచిన భారత మహిళల అంధుల క్రికెట్ జట్టుతో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

దీపిక ఊరికి రోడ్డు..

'జట్టుకు సారథ్యం వహించిన తెలుగమ్మాయి దీపిక టీమ్‌లోని ప్రతి ఒక్కరి కష్టాన్ని వివరించారు. శ్రీ సత్యసాయి జిల్లాకు చెందిన దీపిక తన ఊరికి రోడ్డు లేదని, రోడ్డు వేయించాలని కోరారు. ఆ ఊరికి రోడ్డు మంజూరు చేస్తున్నాం. అల్లూరి జిల్లాకు చెందిన క్రికెటర్ కరుణకుమారికి ఇల్లు కూడా లేదని చెప్పడం నన్ను కదిలించింది. ఆమెకు ఇల్లు మంజూరు చేసి, కట్టించి ఇవ్వాలని అధికారులను ఆదేశిస్తున్నా' అని పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు.

మ్యాచ్ ఫీజుతో అమ్మానాన్నల కడుపు నింపేవాళ్లం: దీపిక, జట్టు కెప్టెన్

ప్రపంచకప్ గెలిచిన జట్టులోని 16 మంది అమ్మాయిలం చాలా కష్టాలు పడి ఇక్కడి వరకు వచ్చాం. మాలో చాలా మంది క్రికెట్ ఆడితే మ్యాచ్ ఫీజు వస్తుందని, దాంతో అమ్మానాన్నల కడుపు నింపవచ్చనే ఆడుతున్నాం. ప్రభుత్వం నుంచి సరైన సాయం అందితే అమ్మానాన్నలను బాగా చూసుకుంటాం. మాది సత్యసాయి జిల్లా హేమవతి పంచాయతీ పరిధిలోని తంబాలహట్టి తండా. మా తండాకు సరైన రోడ్డు లేదు. రోడ్డు సౌకర్యం కల్పించాలి.

సరైన గౌరవం దక్కలేదు

క్రికెట్లోకి రాక ముందు మాకు పూట గడవడానికీ కష్టంగా ఉండేది. ఇంత విజయం సాధించిన తర్వాత కూడా సరైన గౌరవం దక్కడం లేదు. ప్రతి రాష్ట్రంలో ప్రత్యేక కోచ్, సౌకర్యాలు, ఆర్థిక భరోసా ఉంటే మరిన్ని విజయాలు సాధిస్తాం.

- అనూకుమారి, ఢిల్లీ క్రికెటర్

పవన్ కల్యాణ్ నిలబడితే భరోసా వస్తుంది

సరైన సదుపాయాలు కల్పిస్తే ఏం చేయగలమో మహిళల అంధ క్రికెట్ జట్టు మరోసారి నిరూపించింది. ఈ రోజు దేశం మొత్తం జట్టుకు సెల్యూట్ చేస్తుంటే సంతోషంగా ఉంది.

- అజయ్‌కుమార్‌రెడ్డి, అంధ సీనియర్ క్రికెటర్, అర్జున అవార్డు గ్రహీత

ఉదయం విజ్ఞప్తి.. సాయంత్రానికి రోడ్డు మంజూరు

ఈనాడు, అమరావతి: అంధ మహిళల క్రికెట్ జట్టు కెప్టెన్ దీపిక తమ గ్రామానికి మట్టిరోడ్డే దిక్కని, రహదారి సౌకర్యం కల్పించాలని పవన్ కల్యాణ్‌ను శుక్రవారం ఉదయం కోరగా... సాయంత్రానికి రోడ్డు నిర్మాణానికి అనుమతులిచ్చేలా ఆయన చర్యలు చేపట్టారు. ఉప ముఖ్యమంత్రి ఆదేశాలతో సత్యసాయి జిల్లా అధికారులు దీపిక స్వగ్రామమైన మడకశిర నియోజకవర్గంలోని అమరాపురం మండలం హేమవతి పంచాయతీ పరిధిలోని తంబాలహట్టి రోడ్డును పరిశీలించారు. హేమావతి నుంచి తంబాలహట్టి వరకు రోడ్డు నిర్మాణానికి రూ.3.20 కోట్లు, గున్నేహళ్లి నుంచి తంబాలహట్టి వరకు 5 కి.మీ. రోడ్డు నిర్మాణానికి రూ.3 కోట్లు అవసరమని అంచనా వేశారు. వీటికి సత్యసాయి జిల్లా కలెక్టర్ శుక్రవారం సాయంత్రం పరిపాలన అనుమతులు జారీ చేశారు.


తంబాలహట్టికి వెళ్లే మట్టిరోడ్డు

కేజీ కల్తీ నెయ్యికి రూ.25 కమీషన్ డిమాండ్ చేశారు

- ఎవరి ప్రోద్బలంతో కమీషన్ వసూలు చేశారో దర్యాప్తులో తేలాలి
- హవాలా మార్గంలో చిన్న అప్పన్నకు సొమ్ము
- బెయిలు పిటిషన్ను కొట్టేయండి
- హైకోర్టులో సిట్ తరఫున సీబీఐ వాదనలు

ఈనాడు, అమరావతి: తిరుమల శ్రీవారి లడ్డూ తయారీకి కల్తీ నెయ్యి సరఫరా చేసిన భోలేబాబా డెయిరీ నుంచి చిన్న అప్పన్న కేజీకి రూ.25 చొప్పున కమీషన్ డిమాండ్ చేసినట్లు తమ దర్యాప్తులో తేలిందని సిట్ తరఫున సీబీఐ స్టాండింగ్ కౌన్సెల్ పీఎస్‌పీ సురేష్‌కుమార్ హైకోర్టులో వాదనలు వినిపించారు. చిన్న అప్పన్నకు కమీషన్ ఇచ్చినట్లు నెయ్యి సరఫరా చేసిన కంపెనీ యజమానులు వాంగ్మూలాలు ఇచ్చారన్నారు. ఎవరి ప్రోద్బలంతో కమీషన్ వసూలు చేశారో దర్యాప్తులో తేలాల్సి ఉందన్నారు. హవాలా మార్గంలో చిన్న అప్పన్నకు సొమ్ము చేరిందన్నారు. రూ.కోట్లలో బ్యాంక్ లావాదేవీలు జరిగినట్లు దర్యాప్తులో తేలిందన్నారు. విశాఖపట్నంలో ఆయనకు 14 ప్లాట్లు ఉన్నట్లు గుర్తించామన్నారు. తితిదే అప్పటి ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డికి చిన్న అప్పన్న పీఏగా వ్యవహరించారని కోర్టు దృష్టికి తెచ్చారు. ఆ సమయంలో వినియోగించిన ఫోన్లను ఇప్పటివరకు అప్పన్న నిరాకరిస్తున్నారని తెలిపారు. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకొని బెయిలు పిటిషన్ను కొట్టేయాలని కోరారు.

★ శుక్రవారం జరిగిన విచారణలో ఇరుపక్షాల వాదనలు ముగిశాయి. దీంతో సోమవారం నిర్ణయాన్ని ప్రకటిస్తామని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డాక్టర్ వై.లక్ష్మణరావు ప్రకటించారు. ★ కల్తీ నెయ్యి సరఫరా కేసులో బెయిలు కోసం అప్పటి తితిదే ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి పీఏ చిన్న అప్పన్న హైకోర్టులో పిటిషన్ వేశారు. ఆయన తరఫున సీనియర్ న్యాయవాది నాగేశ్వరరావు వాదనలు వినిపిస్తూ.. 'వివరాలు వెల్లడించడం లేదని, దర్యాప్తుకు సహకరించడం లేదని పిటిషనర్‌ను అరెస్టు చేశారు. కల్తీనెయ్యి సరఫరా కేసులో పిటిషనర్‌కు సంబంధంలేదు. తితిదే పాలక వ్యవహారాల్లో తలదూర్చలేదని పిటిషనర్‌పై ప్రధాన ఆరోపణ. నకిలీ నెయ్యి సరఫరా చేసిన కంపెనీ యజమానులను ఇప్పటికే బెయిలు పొందారు. కోర్టు విధించే ఏ షరతులకైనా పిటిషనర్ కట్టుబడి ఉంటారు. బెయిలు మంజూరు చేయండి' అని కోరారు.

కల్తీనెయ్యి కేసులో వారంలో మలి ఛార్జిషీట్

- నిందితులుగా 36 మంది నమోదు
- తితిదే మాజీ జీఎం, వ్యాపారి కస్టడీ పూర్తి

ఈనాడు-తిరుపతి; న్యూస్‌టుడే-తిరుపతి (నేర విభాగం): శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీకి కల్తీనెయ్యి సరఫరా చేసినట్లు నమోదైన కేసులో మలి ఛార్జిషీట్ మరో వారం రోజుల్లో వేయనున్నట్లు సమాచారం. ఈ ఏడాది మే మొదటి వారంలో మొదటి ఛార్జిషీట్ దాఖలుచేయగా.. గత నెలలో సిట్ అధికారులు నెల్లూరు ఏసీబీ కోర్టులో మెమో దాఖలుచేశారు. ఇప్పటివరకు 36 మందిని నిందితులుగా పేర్కొన్నారు. కల్తీనెయ్యి వ్యవహారంలో కీలక పాత్ర పోషించిన కొనుగోలు విభాగం మాజీ జీఎం సుబ్రహ్మణ్యం, రసాయనాలు సరఫరా చేసిన ముఖ్యవ్యాపారి అజయ్‌కుమార్ సుగంధ్‌ని తాజాగా అరెస్టుచేసి 4 రోజులు ప్రశ్నించారు.

హవాలా లావాదేవీలపై ముమ్మరంగా: మళ్లీ బృందం ఢిల్లీ కేంద్రంగా హవాలా లావాదేవీలపై ఆరాతీస్తోంది. తితిదే అధికారులకు లంచాలిచ్చిన వ్యక్తుల వివరాలు సేకరిస్తోంది. రసాయనాల సరఫరాలో ముఖ్యభూమిక పోషించిన వారి బ్యాంకుఖాతాలు తనిఖీ చేస్తున్నారు. ఇది కొలిక్కి వచ్చిన తర్వాత ఎవరెవరికి.. ఎంతెంత లంచాలు ముట్టాయో నిర్ధారణకు రానున్నారు. వీటన్నింటినీ మలి ఛార్జిషీట్‌లో ప్రస్తావించే అవకాశం ఉంది.

భోలేబాబాకు ఎందుకంతలా సహకరించారు: 'శ్రీవారి లడ్డూ తయారీకి అవసరమైన నాణ్యమైన నెయ్యి సరఫరా చేసే సామర్థ్యం భోలేబాబా డెయిరీకి లేదని తెలిసినా ఎందుకు అంతలా సహకరించారు? పరిశీలనకు వెళ్లి రూ.3.50 లక్షల నగదు, సెల్‌ఫోన్, వెండిప్లేటు తీసుకున్నట్లు మా దర్యాప్తులో తేలింది. భోలేబాబా డైరెక్టర్లు విపిన్ జైన్, పోమిల్ జైన్ వద్ద ఇంతెంత లంచాలు తీసుకున్నారు' అని సిట్ అధికారులు తితిదే మాజీ జీఎం సుబ్రహ్మణ్యం(ఎ29)ను ప్రశ్నించారు. దీనిపై సుబ్రహ్మణ్యం.. తాను నిబంధనల మేరకే నడుచుకున్నానని చెప్పినట్లు సమాచారం. ఆయనతోపాటు తితిదే ఉద్యోగులు మరెవరైనా లంచాలు తీసుకున్నారా? అనే కోణంలోనూ ఆరాతీశారు. భోలేబాబా డెయిరీ ఎంతకాలంగా.. ఏ మేరకు రసాయనాలు సరఫరా చేశారని వ్యాపారి అజయ్‌కుమార్ సుగంధ్(ఎ16)ను సిట్ ప్రశ్నించగా ఆయన మౌనందాల్చినట్లు తెలిసింది. మధ్యాహ్నం రుయా ఆసుపత్రిలో ఇద్దరికీ వైద్యపరీక్షలు చేయించారు. అనంతరం నెల్లూరు ఏసీబీ కోర్టులో ప్రవేశపెట్టి అక్కడి కేంద్ర కారాగారానికి తరలించారు.

షర్మిల చర్యలతో ఒప్పందాల అమలు వద్దనుకున్నా

- ఆమెకు చట్టబద్ధ హక్కులు లేవు
- అప్పీలు వేసే అర్హత సరస్వతి పవర్ కంపెనీకి లేదు
- ఎన్‌సీఎల్‌ఏటీలో జగన్ కౌంటరు

ఈనాడు, హైదరాబాద్: సరస్వతి పవర్ లిమిటెడ్ తోపాటు కొన్ని ఆస్తులను ప్రేమతో చెల్లి షర్మిలకు ఇవ్వాలని నిర్ణయించి 2019 ఆగస్టు 31న అవగాహన ఒప్పందం, వాటాల బదిలీల ఒప్పందం కుదుర్చుకున్నామని, అయితే షర్మిల రాజకీయంగా, వ్యక్తిగతంగానూ తన ప్రతిష్ఠను దెబ్బతీయడంతో ఈ ఒప్పందాలను అమలు చేయకూడదని నిర్ణయించుకున్నట్లు ఏపీ మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ చెన్నైలోని జాతీయ కంపెనీ అప్పిలేట్ ట్రైబ్యునల్ (ఎన్‌సీఎల్‌ఏటీ)కి నివేదించారు. సరస్వతి పవర్ లిమిటెడ్ ఆస్తుల జప్తునకు సంబంధించి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ తెలంగాణ హైకోర్టులో అప్పీలు దాఖలు చేసిందని, ఈ కేసులన్నీ పూర్తయ్యాక ఆస్తులు, వాటాల బదలాయింపు అమలు చేయాలని గతంలో నిర్ణయించుకున్నట్లు తెలిపారు. చెల్లిపై ప్రేమతో భవిష్యత్తులో ఆస్తులను బదలాయించడానికే గతంలో ఒప్పందం కుదిరిందన్నారు. ఈ ఆస్తులన్నీ తన స్వార్జితమని, షర్మిలకు ఎలాంటి చట్టబద్ధమైన హక్కులూ లేవన్నారు. ఎలాంటి చట్టబద్ధమైన పత్రాలు లేకుండా విజయమ్మ, చాగరి జనార్దన్‌రెడ్డిల లేఖల ఆధారంగా తమ పేర్లతో ఉన్న వాటాలను బదలాయిస్తూ సరస్వతి కంపెనీ బోర్డు ఏకపక్షంగా తీర్మానం చేసిందని, ఈ తీర్మానాన్ని సవాలు చేస్తూ తాను హైదరాబాద్ జాతీయ కంపెనీ లా ట్రైబ్యునల్‌లో పిటిషన్ వేసినట్లు తెలిపారు. దీనిపై విచారించిన ఎన్‌సీఎల్‌టీ సరస్వతి కంపెనీ బోర్డు తీర్మానాన్ని రద్దు చేసి వాటాలను పునరుద్ధరించాలని ఆదేశించిందన్నారు. ఈ ఆదేశాల అనంతరం తన వాటా 29.88, భారతిరెడ్డి 16.30, క్లాసిక్ రియాలిటీ వాటా 4.83, విజయమ్మ వాటా 48.99 శాతం చొప్పున పునరుద్ధరించాల్సి ఉందన్నారు. దీనికి విరుద్ధంగా ఎన్‌సీఎల్‌టీ ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ సరస్వతి పవర్ లిమిటెడ్ ఇక్కడ అప్పీలు దాఖలు చేసిందన్నారు. ఇలా అప్పీలు దాఖలు చేసే అర్హత సరస్వతి పవర్ లిమిటెడ్‌కు లేదని తెలిపారు. ఎన్‌సీఎల్‌టీ ఉత్తర్వుల వల్ల కంపెనీకి ఎలాంటి నష్టం వాటిల్లలేదన్నారు. తటస్థంగా ఉండాల్సిన సరస్వతి పవర్ కంపెనీ వై.ఎస్.విజయమ్మ, చాగరి జనార్దన్‌రెడ్డిల తరఫున వకాల్తా పుచ్చుకునేందుకు వీల్లేదన్నారు. బోర్డు ఆఫ్ డైరెక్టర్స్ చట్టవిరుద్ధంగా వ్యవహరించినప్పుడు వారిని సమర్థిస్తూ కంపెనీ అప్పీలు చేయడానికి వీల్లేదన్నారు. తల్లి విజయమ్మ ట్రస్టీగా చెల్లికి వాటాలతో సహా కొన్ని ఆస్తులు ఇవ్వడానికి అవగాహన ఒప్పందం కుదిరిందన్నారు. కోర్టు కేసులు తేలిన తరవాత బదలాయింపు నిమిత్తం వాటాల సర్టిఫికెట్లు కూడా ఇవ్వలేదన్నారు. వాటాల బదలాయింపును సమర్థించుకునేందుకు సరస్వతి కంపెనీ ప్రయత్నిస్తోందన్నారు. తనతో పాటు భారతిరెడ్డి, క్లాసిక్ రియాలిటీలు విజయమ్మకు గిఫ్ట్‌డీడ్‌లు ఇచ్చామని, ఇందులో సరస్వతి కంపెనీ ప్రమేయం లేకపోయినా వారి తరపున వాదనలు వినిపించిందన్నారు. వాటాల బదలాయింపు ఒప్పందం జరిగిన మూడేళ్లు మౌనంగా ఉండి తరవాత బదలాయించడాన్ని సమర్థించుకోవడానికి సరైన కారణం లేదన్నారు. ఎన్‌సీఎల్‌టీ తీర్పుపై ఇచ్చిన స్టే ఉత్తర్వులను తొలగించాలని అభ్యర్థించారు.

దివ్యాంగ విద్యార్థుల సమస్యకు శాశ్వత పరిష్కారం

ఇంటర్మీడియట్‌లో మినహాయింపు పొందిన సబ్జెక్టుకు మార్కులు

ఈనాడు, అమరావతి: ఐఐటీ, ఎన్ఐటీ ప్రవేశాల కౌన్సెలింగ్‌లో దివ్యాంగ విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా శాశ్వత పరిష్కారం చూపుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర ఇంటర్మీడియట్ బోర్డులో దివ్యాంగ విద్యార్థులకు ఒక భాష సబ్జెక్టు మినహాయింపు ఉంది. మిగతా నాలుగు సబ్జెక్టులూ ఉత్తీర్ణులైతే సరిపోతుంది. కానీ, ఐఐటీ, ఎన్ఐటీలకు నిర్వహించే కౌన్సెలింగ్‌లో ఐదు సబ్జెక్టులూ ఉత్తీర్ణులై ఉండాలనే నిబంధన ఉంది. దీంతో నాలుగు సబ్జెక్టులు చదివిన దివ్యాంగ విద్యార్థులు.. ఐఐటీ, ఎన్ఐటీలకు వెళ్లడానికి సమస్యలు తలెత్తుతున్నాయి. దీని కోసం రెండేళ్లుగా ప్రభుత్వం ప్రత్యేకంగా ఉత్తర్వులు జారీ చేస్తూ వస్తోంది. ఈ సమస్యకు ముగింపు పలికేందుకు ప్రత్యేక జీఓ జారీ చేసింది. దివ్యాంగ విద్యార్థులు ఒక భాష సబ్జెక్టు మినహాయింపు తీసుకుంటే.. మిగతా ఐదు సబ్జెక్టుల్లో వచ్చిన సరాసరి మార్కులను ఈ మినహాయింపు సబ్జెక్టుకు కేటాయిస్తారు. దీంతో ఐదు సబ్జెక్టులు ఉత్తీర్ణులైనట్లు మెమో జారీ చేస్తారు. దీంతో భవిష్యత్తులో ఐఐటీ, ఎన్ఐటీల కౌన్సెలింగ్‌లో సమస్యలు ఉండవు.

'సరస్వతి'లో వాటాల బదలాయింపుపై.. మధ్యంతర ఉత్తర్వుల పొడిగింపు

- ఫిబ్రవరి 9కి వాయిదా వేసిన ఎన్‌సీఎల్‌ఏటీ

ఈనాడు, హైదరాబాద్: ఏపీ మాజీ సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి, భారతిరెడ్డి, క్లాసిక్ రియాల్టీలకు చెందిన వాటాలను వై.ఎస్.విజయమ్మ, చాగరి జనార్దన్‌రెడ్డిల పేరుతో బదలాయింపుపై యథాతథ స్థితిని కొనసాగించాలంటూ అక్టోబరు 14న జారీచేసిన మధ్యంతర ఉత్తర్వులను చెన్నైలోని జాతీయ కంపెనీ లా అప్పిలేట్ ట్రైబ్యునల్ (ఎన్‌సీఎల్‌ఏటీ) శుక్రవారం మరోసారి పొడిగించింది. తదుపరి విచారణను ఫిబ్రవరి 9వ తేదీకి వాయిదా వేసింది. తాజా ఉత్తర్వుల ప్రకారం జగన్, భారతిరెడ్డి, క్లాసిక్ రియాల్టీల వాటాల బదలాయింపు తరువాత వై.ఎస్.విజయమ్మకు చెందిన 99.75 శాతం వాటాలు యథాతథంగా కొనసాగనున్నాయి. విజయమ్మ, జనార్దన్‌రెడ్డిల పేరుతో వాటాలను బదలాయిస్తూ చేసిన సరస్వతి పవర్ బోర్డు తీర్మానాన్ని, దీని ప్రకారం రిజిస్టర్‌లో సభ్యుల పేర్లను మార్చడాన్ని సవాలు చేస్తూ జగన్, భారతిరెడ్డి, క్లాసిక్ రియాల్టీలు హైదరాబాద్ ఎన్‌సీఎల్‌టీలో పిటిషన్ దాఖలు చేయగా, వాటాల బదలాయింపును రద్దు చేస్తూ జగన్, భారతి, క్లాసిక్ రియాల్టీల పేర్లను పునరుద్ధరించాలంటూ జులై 29న తీర్పు వెలువరించిన విషయం విదితమే. హైదరాబాద్ ఎన్‌సీఎల్‌టీ ఇచ్చిన తీర్పు చట్టవిరుద్ధమని, దాని అమలును నిలిపివేస్తూ ఉత్తర్వులు జారీ చేయాలని కోరుతూ చెన్నై ఎన్‌సీఎల్‌ఏటీలో సరస్వతి పవర్ లిమిటెడ్, వై.ఎస్.విజయమ్మ వేర్వేరుగా అప్పీళ్లు దాఖలు చేశారు. ఈ పిటిషన్‌లు మరోసారి ఎన్‌సీఎల్‌ఏటీ ముందుకు శుక్రవారం విచారణకు రాగా ఇందులో ఎన్‌సీఎల్‌టీ ఇచ్చిన ఉత్తర్వులపై స్టేను ఎత్తివేయాలంటూ కౌంటరు దాఖలు చేసినట్లు ప్రతివాదులైన జగన్, భారతిరెడ్డి, క్లాసిక్ రియాల్టీల తరఫు న్యాయవాది తెలిపారు. దీనికి సంబంధించి అదనపు డాక్యుమెంట్‌లు సమర్పించినట్లు చెప్పారు. విజయమ్మ తరఫున న్యాయవాది మహర్షి విశ్వరాజ్ హాజరయ్యారు.

దశలవారీగా ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారం

- స్త్రీ శక్తి పథకం విజయంలో కార్మికుల పాత్ర మరవలేం
- ఎన్ఎంయూఏ రాష్ట్రమహాసభలో ఏపీఎస్ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల


కార్మికుల మహాసభల్లో మాట్లాడుతున్న కొనకళ్ల నారాయణ

గిరిపురం (సీతారాంపురం), న్యూస్‌టుడే: ఆర్టీసీ కార్మికుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని, దశలవారీగా వారి సమస్యలు పరిష్కరిస్తామని ఏపీఎస్ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు పేర్కొన్నారు. విజయవాడలో శుక్రవారం నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ (ఎన్ఎంయూఏ) రాష్ట్ర ద్వితీయ మహాసభలో ఛైర్మన్ కొనకళ్ల, ఎండీ ద్వారకా తిరుమలరావు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. కొనకళ్ల నారాయణ మాట్లాడుతూ స్త్రీశక్తి పథకం విజయవంతం కావడంలో ఆర్టీసీ కార్మికుల పాత్ర కీలకమని పేర్కొన్నారు. ఎండీ ద్వారకా తిరుమలరావు మాట్లాడుతూ డ్రైవర్లు, కండక్టర్లు, గ్యారేజ్ సిబ్బంది కృషిపై సీఎం సంతృప్తిగా ఉన్నారని తెలిపారు. ఏపీ ఎన్జీవో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎ.విద్యాసాగర్ మాట్లాడుతూ ఏపీపీటీడీ (ఆర్టీసీ) ఉద్యోగుల పెండింగ్ డీఏలు, టెర్మినల్ లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, గ్రాట్యుటీ చెల్లింపులు, పీఆర్‌సీ అమలు, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, మహిళలకు శిశు సంరక్షణ సెలవుల వంటివి సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు జేఏసీ కృషి చేస్తోందని తెలిపారు. ఎన్ఎంయూఏ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పీవీ రమణారెడ్డి, వై.శ్రీనివాసరావులు మాట్లాడుతూ ప్రభుత్వంతో పోరాడి ఒక్కో సమస్యనూ పరిష్కరించగలుగుతున్నామని చెప్పారు. విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, మాజీ ఎమ్మెల్సీ పి.అశోక్‌బాబు, ఆర్టీసీ జోనల్ ఛైర్మన్లు రెడ్డి అప్పలనాయుడు, ఎస్.సురేష్‌రెడ్డి, పూల నాగరాజు, డి.దొర తదితరులు పాల్గొన్నారు.

● పెండింగ్‌లో ఉన్న డీఏలు చెల్లించాలి, అన్ని కేటగిరీల్లో పనిష్మెంట్లు మినహాయించి పదోన్నతులు ఇవ్వాలి, ఆర్ఈఎంఎస్ ద్వారా వైద్య పరిమితిని రూ.8 లక్షలకు పెంచాలి.. వంటి 27 తీర్మానాలు చేశారు. ● ఇప్పటివరకు సంఘం ప్రధాన కార్యదర్శిగా ఉన్న వై.శ్రీనివాసరావును అధ్యక్షునిగాను, ఇంతకాలం అధ్యక్షునిగా కొనసాగిన పీవీ రమణారెడ్డిని ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకున్నారు.

పంటకాలవలోకి వాహనం దూసుకెళ్లి ముగ్గురి మృతి

కొల్లూరు, న్యూస్‌టుడే: బాపట్ల జిల్లా కొల్లూరు మండలం దోనేపూడి, కోటిపల్లి మధ్య కొబ్బరికాయల లోడుతో వెళుతున్న మినీ వాహనం శుక్రవారం అదుపుతప్పి నీరు లేని పంటకాలువలోకి దూసుకెళ్లింది. వాహనంలో ప్రయాణిస్తున్న ముగ్గురు అక్కడికక్కడే మరణించారు. డ్రైవరుతో పాటు అదే వాహనంలో ప్రయాణిస్తున్న అతడి తండ్రికి తీవ్రగాయాలయ్యాయి. మరో ఇద్దరు సురక్షితంగా బయటపడ్డారు. క్షతగాత్రులను 108 వాహనంలో తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతులను భట్టిప్రోలు మండలం చింతమోటుకు చెందిన చాట్రగడ్డ కాంతారావు (50), పెసర్లంకకు చెందిన శ్రీనివాసరావు (55), వెల్లటూరుకు చెందిన షేక్ ఇస్మాయిల్‌గా గుర్తించారు. మృతులు వాహనం కింద పడి, బురదలో కూరుకుపోవడంతో పోలీసులు శ్రమించి మృతదేహాలు వెలికితీశారు. ఎస్పీ ఉమామహేశ్వర్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఘటనపై కేసు నమోదుచేసి విచారణ చేస్తున్నట్లు సీఐ వీరాంజనేయులు తెలిపారు.


కాంతారావు


శ్రీనివాసరావు


షేక్ ఇస్మాయిల్



ఘాట్ రోడ్డులో లోయలోకి జారిపోయిన బస్సు ★ ఒక మహిళకు సీపీఆర్ చేసి ప్రాణాలు కాపాడే ప్రయత్నం చేస్తున్న అంబులెన్స్ సిబ్బంది

మృతులు వీరే..

1. కృష్ణకుమారి (42) (చిత్తూరు జిల్లా పెనుమూరు)
2. ఎస్సీ నాగేశ్వరరావు (68) (చిత్తూరు నగరం)
3. శ్రీకళాదేవి (64) (చిత్తూరు నగరం)
4. శ్యామల (67) (చిత్తూరు నగరం)
5. కావేరి కృష్ణ (70) (చిత్తూరు నగరం)
6. శివశంకర్‌రెడ్డి (53) (పలమనేరు)
7. సునంద (45) (పలమనేరు)
8. దొరబాబు (37) (తవణంపల్లె)
9. శైలజారాణి (64) (తిరుచానూరు)

ఘాట్ రోడ్డులో ఘోరం

(మొదటి పేజీ తరువాయి)

శుక్రవారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో ప్రమాదానికి గురయ్యారు. ఈ ఘటనలో తొమ్మిది మంది దుర్మరణం చెందారు. 28 మంది క్షతగాత్రుల్లో 10 మందికి తీవ్ర గాయాలయ్యాయి. వీరందర్నీ చింతూరు సామాజిక ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. బస్సు ప్రమాదంపై రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు తదితరులు దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. మృతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిహారాన్ని ప్రకటించాయి.

మరో రోజులో యాత్ర ముగియనుండగా...

చిత్తూరు జిల్లాకు చెందిన వీరంతా గత నెల 23న బయలుదేరాల్సి ఉంది. తుపాను కారణంగా యాత్రను వాయిదా వేసుకున్నారు. ఒక ప్రైవేటు ట్రావెల్స్ బస్సులో (ఏపీ 39 యూఎం 6543) మొత్తం 32 మంది ఈ నెల 6వ తేదీ రాత్రి చిత్తూరులో బయలుదేరారు. ఇద్దరు డ్రైవర్లు, ఇద్దరు వంటవాళ్లు కాగా, మరొకరు యాత్ర నిర్వాహకుడు వజ్రమణి బస్సులో ఉన్నారు. కోటప్పకొండ, విజయవాడ కనకదుర్గ ఆలయం, పంచారామాలు, అన్నవరం దర్శనాల అనంతరం గురువారం ఉదయం సింహాచలం అప్పన్నను దర్శించుకున్నారు. అక్కడి నుంచి అరకులోయ వెళ్లారు. పాడేరు మీదుగా సాయంత్రం 6 గంటలకు బయలుదేరి శుక్రవారం భద్రాచలం చేరుకోవాల్సి ఉంది. అక్కడి నుంచి శ్రీశైలం, మహానంది, ఒంటిమిట్ట, అహోబిలం దర్శనం చేసుకుని శనివారం రాత్రికి యాత్ర ముగించాలని భావించగా.. ఇంతలోనే ఘోర ప్రమాదం జరిగిందని బాధితులంతా విలపిస్తున్నారు.


క్షతగాత్రులను పరామర్శిస్తున్న హోం మంత్రి అనిత

కొండను ఢీకొట్టి.. లోయలోకి పల్టీ

బస్సు గురువారం సాయంత్రం పాడేరులో బయలుదేరింది. వారంతా రాత్రి నర్సీపట్నంలో అల్పాహారం చేశారు. అర్ధరాత్రి దాటాక 2 గంటల సమయంలో జగ్గంపేట వద్ద అప్పటివరకు బస్సు నడిపిన డ్రైవర్ ప్రసాద్ నిద్రకు ఉపక్రమిస్తూ జూనియర్ డ్రైవర్ మధుకు బస్సును అప్పగించారు. ప్రమాదానికి 15 నిమిషాల ముందు కాలకృత్యాలు తీర్చుకునేందుకు ఘాట్ రోడ్‌లో బస్సును ఆపారు. అనంతరం బస్సు బయలుదేరింది. అందరూ నిద్రలోకి జారుకుంటున్న సమయంలో అదుపుతప్పి కొండ అంచులో ఎత్తుగా ఉన్న ప్రాంతాన్ని ఢీకొట్టి రోడ్డు పక్కనున్న లోయ వైపు దూసుకువెళ్లింది. బస్సు రెండు పల్టీలు కొట్టి చెట్ల మధ్యలో నుంచి జారడంతో ప్రమాద తీవ్ర తగ్గింది.

అర్ధగంటకు పైగా ఆర్తనాదాలు..

అప్పటివరకు సాఫీగా సాగిన ప్రయాణంలో ఒక్కసారిగా కుదుపు చోటుచేసుకోవడంతో ఏమైందో తెలిసేలోగా యాత్రికులంతా బస్సులో చెల్లాచెదురుగా ఒకరిపై ఒకరు పడ్డారు. వారిపై లగేజీలు పడ్డాయి. దీంతో చాలామంది గాయపడ్డారు. యాత్రికుల్లో కొందరు విగతజీవులై కనిపించడంతో బాధితుల ఆర్తనాదాలు మిన్నంటాయి. దాదాపు 45 నిమిషాలపాటు ఎవరూ సహాయం చేయలేదని, కొందరు వాహనాలను ఆపినా ముందుకువెళ్లి ఎవరికైనా చెబుతామని వెళ్లిపోయారని బాధితులు పేర్కొన్నారు. అటుగా వెళ్తున్న గోకవరం డిపో ఆర్టీసీ బస్సు, మరో వాహనం ఆపి లైట్లు వేయడంతోపాటు వాటిలోంచి కొందరు ప్రయాణికులు దిగి వచ్చి బాధితులను బయటకు తీశారు. ఇంతలో పోలీసులు, అంబులెన్సులు రావడంతో హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు.

సిగ్నల్స్ లేకపోవడంతో సమాచారం ఆలస్యం

ప్రమాదం వేకువజామున జరిగిందని, అంతా చీకటి కావడం ఎవరికైనా ఫోన్ చేద్దామన్నా సెల్‌ఫోన్ సిగ్నల్స్ లేకపోవడంతో ఇబ్బందులు పడ్డామని బాధితులు వాపోయారు. సుమారు 4.30 - 5.00 గంటలకు పోలీసులు, వైద్య సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకున్నారు. హోం మంత్రి వంగలపూడి అనిత, గిరిజన సంక్షేమ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, కలెక్టర్ దినేశ్‌కుమార్, ఎస్పీ అమిత్‌బర్దార్‌లు చింతూరు ఆసుపత్రికి వెళ్లి బాధితులను పరామర్శించారు.

మృతులకు రూ.7 లక్షలు, తీవ్రంగా గాయపడిన వారికి రూ.2.5 లక్షలు

ప్రమాదంలో మృతి చెందిన వారికి రాష్ట్ర ప్రభుత్వం రూ.5 లక్షలు, కేంద్ర ప్రభుత్వం రూ.2 లక్షలు చొప్పున, తీవ్రంగా గాయపడిన వారికి రాష్ట్రప్రభుత్వం రూ.2 లక్షలు, కేంద్రం రూ.50 వేల చొప్పున పరిహారం ప్రకటించాయి.


ఆసుపత్రిలో మృతదేహాలను పరిశీలిస్తున్న అల్లూరి జిల్లా కలెక్టర్ దినేశ్‌కుమార్

అల్లూరి ఘాట్‌రోడ్లలో రాత్రి వేళల్లో రాకపోకలపై నిషేధం

పాడేరు, న్యూస్‌టుడే: అల్లూరి సీతారామరాజు జిల్లాలోని ఘాట్ రోడ్లలో రాత్రి వేళల్లో బస్సులు, ఇతర భారీ వాహనాల రాకపోకలను నిషేధిస్తున్నట్లు హోం మంత్రి అనిత, ఎస్పీ అమిత్ బర్దార్ తెలిపారు. ప్రయాణికుల భద్రత దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. ప్రతి రోజూ రాత్రి 10 గంటల నుంచి తెల్లవారుజామున ఐదు గంటల వరకు జిల్లాలోని అన్ని ఘాట్ రోడ్లలో భారీ వాహనాలను అనుమతించబోమని స్పష్టం చేశారు. ఈ నిబంధనలు వెంటనే అమల్లోకి వస్తాయని, ఎవరైనా ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చిన్న వాహనాల డ్రైవర్లు కూడా జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంపై ముఖ్యమంత్రి ఆరా

ఈనాడు, అమరావతి: అల్లూరి సీతారామరాజు జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంపై గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్, సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి లోకేశ్, వైకాపా అధినేత జగన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అక్కడి పరిస్థితిపై గవర్నర్ జిల్లా యంత్రాంగం నుంచి వివరాలు తెలుసుకున్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. 'ఘటనపై అధికారులతో మాట్లాడాను. క్షతగాత్రులకు మెరుగైన వైద్య సాయం అందేలా అన్ని చర్యలు తీసుకోవాలని సూచించాను. మృతుల కుటుంబాల్ని ప్రభుత్వం తప్పకుండా ఆదుకుంటుంది' అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. 'బస్సు ప్రమాదం దిగ్భ్రాంతి కలిగించింది. బాధిత కుటుంబాలను ప్రభుత్వం తగిన విధంగా ఆదుకుంటుంది' అని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ అన్నారు. 'ప్రమాద ఘటనపై అధికారులతో మాట్లాడాను. సహాయక కార్యక్రమాలు వేగంగా జరిగేలా చూడాలని కోరాను' అని మంత్రి లోకేశ్ తెలిపారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యమందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వైకాపా అధినేత జగన్ కోరారు.

లారీ బోల్తా.. ఏడుగురికి తీవ్ర గాయాలు

భయంతో రైలు కిందపడి డ్రైవర్ ఆత్మహత్య


బోల్తాపడిన లారీ


లారీ డ్రైవర్ లక్ష్మన్న

ఆదోని నేరవార్తలు, న్యూస్‌టుడే: కర్నూలు జిల్లా ఆదోని మండలం బైచిగేరి సమీపంలో లారీ బోల్తాపడి ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటనతో ఆందోళనకు గురైన లారీడ్రైవర్ రైలు కింద పడి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన శుక్రవారం ఆదోనిలో జరిగింది. పోలీసులు, మృతుడి బంధువులు తెలిపిన వివరాల మేరకు.. ఆదోని మేదరగేరికి చెందిన లారీ డ్రైవర్ లక్ష్మన్న (65), హమాలీలు రంగన్న, దేవీనగర్‌కు చెందిన సుంకన్న, సూరి, దూలయ్య, సూరి, భీమరాజు, అమరావతినగర్‌కు చెందిన హనుమంతు లారీలో నందవరం మండలం నాగలదిన్నెలో వేరుసెనగ పొట్టు లోడు నింపుకొచ్చేందుకు బయల్దేరారు. బైచిగేరి సమీపంలో ఎదురుగా వస్తున్న పత్తిలోడు వాహనాన్ని తప్పించబోయి లారీ బోల్తాపడింది. ప్రమాదంలో లారీలో ఇరుక్కుపోయిన హమాలీలు, డ్రైవర్ అతి కష్టం మీద బయటకు వచ్చారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆదోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. వీరిలో సుంకన్న, హనుమంతు పరిస్థితి విషమంగా ఉండడంతో ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. గాయపడినవారికి ఏమైనా జరిగితే తన పరిస్థితి ఏంటోనని లారీ డ్రైవర్ లక్ష్మన్న భయపడి.. ఆదోని రైల్వేస్టేషన్ సమీపంలో రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డారు. మృతుడికి భార్య తాయమ్మ, ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. లక్ష్మన్న మృతితో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

ఒకే గొడుగు కిందకు ఉన్నత విద్య

(మొదటి పేజీ తరువాయి)

ప్రస్తుతం విడివిడిగా ఉన్న యూజీసీ, ఏఐసీటీఈ, జాతీయ ఉపాధ్యాయ విద్యా మండలి (ఎన్‌సీటీఈ) నూతన సంస్థ నియంత్రణలోకి వస్తాయి. న్యాయ, వైద్య కళాశాలలను దీని పరిధి నుంచి మినహాయించారు. ప్రధాని అధ్యక్షతన శుక్రవారం దిల్లీలో సమావేశమైన కేంద్ర కేబినెట్ మరికొన్ని నిర్ణయాలు తీసుకుంది.

✦ దేశవ్యాప్తంగా చేపట్టనున్న జన గణనకు రూ.11,718.24 కోట్లు మంజూరు చేసింది. 2026 ఏప్రిల్ నుంచి సెప్టెంబరు వరకు ఇళ్ల జాబితా రూపకల్పన జరుగుతుంది. 2027 ఫిబ్రవరి నుంచి దేశవ్యాప్తంగా జనగణనతో పాటు కుల గణనా నిర్వహిస్తారు. వ్యక్తిగత సమాచార గోప్యత చట్టాలు ఈ కసరత్తుకు వర్తిస్తాయని కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. 30 లక్షల మంది గణకులను నియమిస్తారు. డిజిటల్ పద్ధతిలో జనాభా లెక్కల సేకరణ జరుగుతుంది.

✦ మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్‌ఆర్ ఇజీఏ) పేరు మారింది. 'పూజ్య బాపు గ్రామీణ్ రోజ్‌గార్ యోజన'గా నామకరణం చేస్తూ కేంద్రం కేబినెట్ నిర్ణయం తీసుకుంది. ఈ పథకం కింద పని దినాల సంఖ్యను 100 నుంచి 125కి పెంచింది. రోజువారీ కనీస వేతనాన్ని రూ.240కి సవరించింది. (రాష్ట్రాల వారీగా వేతనాల్లో మార్పులు ఉంటాయి).

✦ పౌర అణు విద్యుత్ రంగంలో ప్రైవేటు భాగస్వామ్యానికి ఉద్దేశించిన బిల్లుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. సస్టెయినబుల్ హార్నెసింగ్ అండ్ అడ్వాన్స్‌మెంట్ ఆఫ్ న్యూక్లియర్ ఎనర్జీ ఫర్ ట్రాన్స్‌ఫార్మింగ్ ఇండియా (ఎస్‌హెచ్‌ఏఎన్‌టీఐ-శాంతి) బిల్లుగా దీనిని వ్యవహరిస్తున్నారు. 2047నాటికి 100 గిగావాట్ల అణు విద్యుత్ ఉత్పత్తి లక్ష్యాన్ని ప్రభుత్వం నిర్దేశించుకుంది.

✦ కాలం తీరిన 71 చట్టాల ఉపసంహరణకు నిర్ణయం. వీటిలో 65 సవరణలకు గురైన చట్టాలు కాగా మిగిలిన ఆరు యథాతథంగా ఉన్నవి. 2014 నుంచి ఇప్పటి వరకూ 1,562 వినియోగంలో లేని చట్టాలను మోదీ ప్రభుత్వం రద్దు చేసింది. తాజాగా రద్దు చేయనున్న వాటితో కలిపి వాటి సంఖ్య 1,633కు చేరనుంది. ✦ కొబ్బరి కనీస మద్దతు ధరను కేంద్రం సవరించింది. క్వింటా కొబ్బరి పొడికి రూ.450, కురిడి కొబ్బరికి రూ.400ల చొప్పున పెంచింది. తాజా నిర్ణయంతో క్వింటా.. కొబ్బరి పొడికి రూ.12,027, కురిడి కొబ్బరికి రూ.12,500 కనీస మద్దతు ధరగా ఉంటుంది.

విశాఖలో గూగుల్ 15 బిలియన్ డాలర్ల పెట్టుబడి

కేంద్ర వాణిజ్యశాఖ సహాయమంత్రి జితిన్‌ప్రసాద

ఈనాడు, దిల్లీ: గూగుల్ సంస్థ విశాఖపట్నంలో 15 బిలియన్ డాలర్ల భారీ పెట్టుబడి పెడుతోందని కేంద్ర వాణిజ్యశాఖ సహాయమంత్రి జితిన్‌ప్రసాద తెలిపారు. 2029-30 నాటికి దేశంలోకి ఎన్ని ఎఫ్‌డీఐలు వచ్చే అవకాశం ఉందని రాజ్యసభలో కొందరు సభ్యులు అడిగిన ప్రశ్నకు ఆయన ఈ మేరకు సమాధానం ఇచ్చారు. ఎఫ్‌డీఐల రాక అన్నది విభిన్న అంశాలపై ఆధారపడి ఉంటుందని చెప్పారు. సహజవనరుల లభ్యత, మార్కెట్ సైజ్, మౌలికవసతులు, రాజకీయ, సాధారణ పెట్టుబడి అనుకూల వాతావరణం, ఆర్థికవ్యవస్థ సుస్థిరత, విదేశీ పెట్టుబడిదారుల నిర్ణయాలపై ఇది ఆధారపడి ఉంటుందని పేర్కొన్నారు. ఇప్పటివరకు కేంద్రం తీసుకున్న నిర్ణయాలు, చేపట్టిన సంస్కరణల కారణంగా ప్రపంచ స్థాయి సాంకేతిక దిగ్గజ కంపెనీలు దేశంలో ఏఐ, డేటా సెంటర్లలో పెట్టుబడులు పెడుతున్నట్లు చెప్పారు. ఇందులోభాగంగా 15 బిలియన్ డాలర్లతో గూగుల్ విశాఖపట్నంలో, 8.3 బిలియన్ డాలర్లతో అమెజాన్ వెబ్‌సర్వీసెస్ మహారాష్ట్రలో డేటా సెంటర్లు ఏర్పాటుచేస్తున్నట్లు వివరించారు.

మలుపుల్లో మృత్యు ఘంటికలు

ఈనాడు డిజిటల్- పాడేరు: పచ్చని చెట్లు, ఎత్తయిన కొండలు, ఆహ్లాదకర వాతావరణం అల్లూరి సీతారామరాజు జిల్లా సందర్శనకు వచ్చే పర్యాటకులకు స్వాగతం పలుకుతాయి. ఈ అందాల వెనుక అడుగడుగునా ప్రమాదాలు పొంచి ఉన్నాయి. అరకులోయ, చింతపల్లి, సీలేరు, పాడేరు, చింతూరు వెళ్లే మార్గాల్లో చాలావరకు ఘాట్ రోడ్లే. ఆయా ప్రాంతాలు పర్యాటకంగా అభివృద్ధి చెందినా.. ఘాట్ రోడ్ల అభివృద్ధిని పట్టించుకోకపోవడంతో ప్రమాదాలు నిత్యకృత్యమవుతున్నాయి. ఎదురుగా భారీ వాహనం వస్తే తప్పుకోవడం కష్టమవుతోంది.

✦ అరకులోయ, పాడేరు, చింతపల్లి, మారేడుమిల్లి ప్రాంతాలు పర్యాటకంగా ప్రాచుర్యం పొందాయి. శీతాకాలం కావడంతో మంచు ముసుగులో మన్యం అందాలను చూడడానికి వివిధ రాష్ట్రాల నుంచి పర్యాటకులు తరలివస్తున్నారు.

✦ సాధారణ రోడ్డు ప్రయాణంతో పోలిస్తే.. ఘాట్ రోడ్డులో ప్రయాణం భిన్నంగా ఉంటుంది. కొత్తగా వచ్చే వారు ఘాట్‌రోడ్డు, మలుపులపై అవగాహన లేకపోవడం, అధిక వేగం కారణంగా ప్రమాదాల బారిన పడుతున్నారు. దట్టంగా అలుముకుంటున్న పొగమంచు కూడా ఓ కారణమవుతోంది.

✦ దశాబ్దాల కిందట వేసిన రోడ్లపైనే ఇప్పటికీ రాకపోకలు జరుగుతున్నాయి. ఇరుకుగా ఉండటంతో ప్రమాదాలకు ఆస్కారం అధికంగా ఉంది. తరచూ ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమవుతోంది. ఘాట్ రోడ్ల విస్తరణకు ప్రతిపాదనలున్నా.. కాగితాలకే పరిమితమవుతున్నాయి. ఫలితంగా ఇరుకు దారుల్లోనే రాకపోకలు సాగించాల్సి వస్తోంది.


విశాఖ-అరకు ఘాట్‌రోడ్డులో ప్రమాదకర మలుపు

ప్రమాదాలకు కారణాలివీ..

✦ ఘాట్ రోడ్లలో రక్షణ గోడలు దెబ్బతినడంతో ప్రమాదాలు జరిగితే వాహనాలు నేరుగా లోయలో పడడం.
✦ పర్యాటక ప్రాంతాలకు కొత్తగా వాహనాల్లో వచ్చే వారు మలుపులను అంచనా వేయలేకపోవడం, అతి వేగం.
✦ హెచ్చరిక బోర్డులు, సూచీలు సరిగా లేకపోవడం.. రోడ్డు మార్జిన్లు కనిపించేందుకు వీలుగా రేడియం లైన్లు ఏర్పాటు చేయకపోవడం.
✦ ఘాట్ రోడ్డులో ఎంత వేగంతో వెళ్లాలో సూచించే బోర్డుల్లేకపోవడం..

ఇటీవల జరిగిన ప్రమాదాలు

✦ 2019లో పాడేరు ఘాట్‌లోని వంట్లమామిడి వద్ద ట్రావెల్ బస్సు బోల్తాపడింది. ముగ్గురు మృతి చెందగా. . 20 మందికి పైగా గాయపడ్డారు.
✦ 2022లో బెంగళూరుకు చెందిన మినీ బస్సు 28 మంది యాత్రికులతో భద్రాచలం నుంచి అన్నవరం వెళ్తుండగా మారేడుమిల్లి సమీపంలో బోల్తాపడింది. ఆరుగురు మృతి చెందగా.. 12 మందికి పైగా గాయపడ్డారు.
✦ 2023 ఆగస్టులో పాడేరు ఘాట్ రోడ్డులో ఆర్టీసీ బస్సు అదుపు తప్పి లోయలోకి దూసుకెళ్లింది. ఇద్దరు దుర్మరణం చెందగా.. 30 మంది గాయపడ్డారు.
✦ గతేడాది పెదబయలులో జాతర ముగించుకుని సౌండ్ బాక్సులతో వెళ్తున్న లారీ బ్రేక్‌లు ఫెయిలయ్యి పాడేరు ఘాట్‌లోని వంట్లమామిడి సమీపంలో బోల్తా పడింది. లారీపై కుర్చున్న వారు లోయలో పడిపోయారు. వారిపై సౌండ్ బాక్సులు, ఇనుప సామగ్రి పడటంతో ముగ్గురు మృతి చెందగా, 12 మంది గాయపడ్డారు.





చర్చించుకుంటున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, కాగ్నిజెంట్ సీఈఓ రవికుమార్ ★ సమావేశానికి వివిధ క్యాంపస్‌ల నుంచి వచ్చిన కాగ్నిజెంట్ ఉద్యోగులు, ప్రతినిధులు ★ కాగ్నిజెంట్ శిలాఫలకం ఆవిష్కరించిన సీఎం చంద్రబాబు

నాలెడ్జ్ ఎకానమీ, ఏఐ హబ్‌గా విశాఖ

(మొదటి పేజీ తరువాయి)

ఇదే ధరకు ఇచ్చిన విషయం చెప్పారు. అందుకే ఒక్క ఏడాదిలో వేగంగా కంపెనీలు వచ్చాయి. భాగస్వామ్య సదస్సులో రూ.13.50లక్షల కోట్ల పెట్టుబడులకు ముందుకొచ్చారు. ఎస్ఐపీబీల ద్వారా రూ.8.50 లక్షల కోట్ల పెట్టుబడులకు ఆమోదం తెలిపాం. మొత్తం రూ.20లక్షల కోట్ల పెట్టుబడులు వస్తే 23 లక్షల మందికి ఉద్యోగాలొస్తాయి. భవిష్యత్ నాలెడ్జ్ ఎకానమీ, టెక్నాలజీకి విశాఖ... క్వాంటమ్ వ్యాలీకి చిరునామాగా ఆంధ్రప్రదేశ్ ఉంటాయి' అని సీఎం చంద్రబాబు చెప్పారు.

కాగ్నిజెంట్ ప్రధాన కార్యాలయం విశాఖలో పెట్టండి

'ఇన్‌హౌస్ కంపెనీగా ఉన్న కాగ్నిజెంట్ ఇప్పుడు 34 బిలియన్ డాలర్ల పెట్టుబడులతో ప్రపంచవ్యాప్తంగా పని చేస్తోంది. చెన్నై, హైదరాబాద్, బెంగళూరు, కోల్‌కతా, పుణెలో బ్రాంచ్‌లున్నాయి. 2.50 లక్షల మంది ఉద్యోగులుంటే అందులో 80% భారతీయులే. సంస్థ సీఈఓ రవికుమార్ భారతీయుడే. ఆయన తల్లి, అమ్మమ్మలది శ్రీకాకుళం. విశాఖకు రావాలని కాగ్నిజెంట్‌ను ఆహ్వానిస్తే 11 నెలల్లో కార్యకలాపాలు ప్రారంభమయ్యాయి. ఇక్కడ కంపెనీ, ప్రభుత్వం సంయుక్తంగా పర్యవేక్షణ చేసి పది నెలల్లో కాగ్నిజెంట్ శాశ్వత భవనాలు పూర్తి చేయాలి. హైదరాబాద్ క్యాంపస్‌లో 80వేల మంది ఉద్యోగులున్నారు. భవిష్యత్‌లో విశాఖ క్యాంపస్‌లో లక్ష మంది ఉద్యోగులు ఉండాలని ఆకాంక్షిస్తున్నాను. కాగ్నిజెంట్ ప్రధాన కార్యాలయం విశాఖకు తేవాలని కోరుతున్నా' అని చంద్రబాబు కోరారు.

సీఎం కోరినట్లే ఉద్యోగాలిస్తాం

వాస్తవానికి రూ.1,583 కోట్ల పెట్టుబడితో మూడు దశల్లో 8వేల మందికి ఉద్యోగాలు కల్పిస్తామని ప్రభుత్వంతో కాగ్నిజెంట్ ఒప్పందం చేసుకుంది. కాగ్నిజెంట్ క్యాంపస్ శాశ్వత భవనాల శంకుస్థాపన కార్యక్రమం అనంతరం కాసేపు ఆ సంస్థ సీఈఓ రవికుమార్‌తో చంద్రబాబు చర్చించారు. ఆ సందర్భంగా 25వేల ఉద్యోగాలు కల్పించాలని చంద్రబాబు కోరారు. సభా ప్రాంగణంలో వేదికపైకి చంద్రబాబు రాగానే సీఈఓ రవికుమార్‌ను ఆలింగనం చేసుకుని భుజం తట్టి నవ్వుతూ కనిపించారు. అదెందుకో తర్వాత అందరికీ అర్థమైంది. సీఈఓ రవికుమార్ తన ప్రసంగంలో చంద్రబాబు కోరినట్లే 25వేల మందికి ఉద్యోగాలు కల్పిస్తామంటూ వేదికపై ప్రకటించారు. మొదటి బ్యాచ్ కాగ్నిజెంట్ ఉద్యోగులంటూ సభాప్రాంగణంలో ఉన్నవారిని సీఎంకు రవికుమార్ చూపించడంతో చంద్రబాబు అభివాదం చేశారు. విశాఖకు రవికుమార్ అంబాసిడర్‌గా ఉంటారని చంద్రబాబు పేర్కొన్నారు.

రూ.3,740 కోట్ల పెట్టుబడులు... 41,700 ఉద్యోగాలు

కాగ్నిజెంట్‌తో పాటు మరో 8 ఐటీ సంస్థలకు శుక్రవారం శంకుస్థాపనలు జరిగాయి. త్వరలో విశాఖలో కార్యకలాపాలు ప్రారంభించనున్నట్లు ఆయా సంస్థల ప్రతినిధులు ముఖ్యమంత్రిని కలిసి వివరించారు. ఈ సంస్థల ద్వారా రూ.3,740 కోట్ల పెట్టుబడితో 41,700 మందికి ఉద్యోగ అవకాశాలు దక్కనున్నాయి.

టెక్ సిటీగా విశాఖ

'విశాఖ నగరానికి బెస్ట్ కనెక్టివిటీతో పాటు, జీవన వ్యయం 20% తక్కువగా ఉండటంతో మోస్ట్ లివబుల్ సిటీగా ఉంది. భోగాపురం విమానాశ్రయం, మెట్రో లాంటి అంతర్జాతీయ స్థాయి సదుపాయాలతో మోస్ట్ హ్యాపెనింగ్ సిటీగా విశాఖ రూపుదిద్దుకుంటుంది. నౌకాదళ కేంద్రం నుంచి పర్యాటక కేంద్రంగా, ఇప్పుడు టెక్‌సిటీగా విశాఖ ఎదిగింది. ఇప్పటికే విశాఖలో 150 టెక్ కంపెనీలు పనిచేస్తున్నాయి. 2032 నాటికి 135 బిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా విశాఖ ఎకనమిక్ రీజియన్(వీఈఆర్) తయారవుతుంది. నెట్ జీరో విధానంతో సుందర నగరంగా, కాలుష్యరహితంగా చేస్తాం' అని సీఎం తెలిపారు.


త్వరలో అందుబాటులోకి ఏఐ డాక్టర్

'సంజీవని ప్రాజెక్టుపై బిల్‌గేట్స్ ఫౌండేషన్‌తో కలిసి పనిచేస్తున్నాం. డిజిటల్ హెల్త్ రికార్డులతో పాటు త్వరలో ఏఐ డాక్టర్లను అందుబాటులోకి తెస్తాం' అని సీఎం పేర్కొన్నారు. కార్యక్రమంలో ఐటీ మంత్రి నారా లోకేశ్, విశాఖ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి డీఎస్‌బీవీ స్వామి, ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, కాగ్నిజెంట్ సీఈఓ రవికుమార్, సూర్యకుమార్ తదితరులున్నారు.

ఉత్తరాంధ్ర ప్రాజెక్టుల పురోగతిపై సీఎం ఏరియల్ సర్వే


ఐటీ, టూరిజం హబ్, భోగాపురం విమానాశ్రయ పనుల పరిశీలన

ఈనాడు-విశాఖపట్నం: ఉత్తరాంధ్రలో వివిధ ప్రాజెక్టుల పురోగతి తెలుసుకునేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు శుక్రవారం హెలికాప్టర్ ద్వారా ఏరియల్ సర్వే నిర్వహించారు. ఐటీ సెజ్ విస్తరించిన కాపులుప్పాడ వద్ద ఐటీ హబ్, జీసీసీ ప్రాజెక్టు నిర్మాణాలను పరిశీలించారు. సాగర తీరాన్ని ఆనుకుని భీమిలి వద్ద ఏర్పాటవుతున్న టూరిజం హబ్ ప్రాంతాన్ని తిలకించారు. భోగాపురం విమానాశ్రయ పనుల పురోగతిపై ఆరా తీశారు. విమానాశ్రయానికి రహదారులు, అనుసంధానంగా టౌన్‌షిప్ అభివృద్ధి తదితర పనులకు సంబంధించి అధికారులకు సూచనలు చేశారు. భోగాపురం వద్ద ఏవియేషన్ యూనివర్సిటీ ఏర్పాటుకు సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. విశాఖ జిల్లా ఆనందపురం వద్ద గూగుల్ డేటా సెంటర్, ఇతర ప్రాజెక్టులకు కేటాయించిన భూములను పరిశీలించారు. విశాఖ ఎకనామిక్ రీజియన్‌లో భాగంగా సబ్బవరం, పెందుర్తి మండలాల్లో ఏర్పాటు చేయబోయే పరిశ్రమలు, ఇండస్ట్రియల్ పార్కుల ఏర్పాటుకు భూముల లభ్యత గురించి ఆరా తీశారు. ఐటీ, ఫార్మా, ఎయిర్ పోర్టులు, పోర్టులు, ఇండస్ట్రియల్ క్లస్టర్లు, రైలు కనెక్టివిటీతోపాటు లాజిస్టిక్‌కు సంబంధించి అధికారులకు పలు సూచనలు చేశారు. విశాఖ ఎకనామిక్ రీజియన్ అభివృద్ధి ప్రణాళికలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు.


భోగాపురం విమానాశ్రయ నిర్మాణ ప్రాంతాన్ని హెలికాప్టర్‌లో నుంచి పరిశీలిస్తున్న సీఎం చంద్రబాబు

విశాఖలో యూనివర్సిటీ ఆఫ్ వెస్టర్న్ ఆస్ట్రేలియా కేంద్రం

మెడ్‌టెక్ జోన్‌తో ఒప్పందం



యూడబ్ల్యూఏ వీసీ ఆచార్య అమిత్ చక్మాతో మెడ్‌టెక్ జోన్ సీఈవో జితేంద్ర శర్మ, తదితరులు

ఈనాడు, విశాఖపట్నం: ప్రపంచంలోని ప్రముఖ విశ్వవిద్యాలయాల్లో ఒకటైన యూనివర్సిటీ ఆఫ్ వెస్టర్న్ ఆస్ట్రేలియా (యూడబ్ల్యూఏ).. రాష్ట్ర ప్రభుత్వం, ఆంధ్ర విశ్వవిద్యాలయంతో కలిసి విశాఖలోని మెడ్‌టెక్ జోన్‌లో కేంద్రాన్ని ఏర్పాటు చేయనుంది. ఈ మేరకు మెడ్‌టెక్ జోన్‌తో శుక్రవారం అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. యూడబ్ల్యూఏ వీసీ ఆచార్య అమిత్ చక్మా మాట్లాడుతూ విశాఖలో ఏర్పాటు చేసే కేంద్రం భారత్, ఆస్ట్రేలియాలకు వైద్య ఆవిష్కరణలు, ప్రపంచస్థాయి నైపుణ్యాల అభివృద్ధి, ఇతర ప్రధాన రంగాల్లో దీర్ఘకాలిక సహకారం అందిస్తుందని తెలిపారు. ఏడాది పొడవునా మెడ్‌టెక్, సముద్ర సాంకేతికత, రక్షణ వ్యవస్థలు, వ్యవసాయం, సుస్థిరాభివృద్ధి, అధునాతన కంప్యూటింగ్ రంగాల్లో ఉద్యోగావకాశాలు పొందేందుకు విద్యార్థులు, వృత్తి నిపుణులను సిద్ధం చేసేలా ప్రత్యేక కార్యక్రమాలు అందిస్తుందని చెప్పారు. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో వైద్య సాంకేతికతలో ఆవిష్కరణలు, గ్లోబల్ రీసెర్చ్ ఎక్స్ఛేంజ్, అండర్‌వాటర్ డొమైన్ ఎవేర్‌నెస్, ఫ్యూచర్ రెడీ వర్క్‌ఫోర్స్ డెవలప్‌మెంట్‌కు ప్రధాన కేంద్రంగా విశాఖను అభివృద్ధి చేయనున్నారు. తద్వారా మెడ్‌టెక్ ఆవిష్కరణలు వేగవంతం చేయడం, క్లినికల్ సామర్థ్యాన్ని పెంపొందించడం, పరిశ్రమల్లో పనిచేసేందుకు వీలుగా శిక్షణ అందించనున్నారు. కార్యక్రమంలో మెడ్‌టెక్ జోన్ సీఈవో డాక్టర్ జితేంద్ర శర్మ తదితరులు పాల్గొన్నారు.

మద్యం కంపెనీలతో శ్రీధర్‌రెడ్డి సంప్రదింపులు

(మొదటి పేజీ తరువాయి)

వాదనలు వినిపిస్తూ.. 'ఏడు నెలలుగా జైల్లో ఉన్నారు. శ్రీధర్‌రెడ్డి ద్వారా ఎస్పీవై ఆగ్రోస్ సంస్థ లబ్ధి పొందిందని సీఐడీ ఆరోపిస్తోంది. ఆ కంపెనీని ఈ కేసులో నిందితుడిగా చేర్చకుండా పిటిషనర్‌ను బాధ్యుడ్ని చేయడానికి వీల్లేదు. పిటిషనర్‌పై ఇప్పటికే అభియోగపత్రం వేశారు. వందల మంది సాక్షులను విచారించి వాంగ్మూలాలు నమోదు చేశారు. ఈ కేసులో దర్యాప్తు ఎప్పటికి ముగుస్తుందో తెలియదు. కోర్టు విధించే షరతులకు కట్టుబడి ఉంటారు. బెయిలు మంజూరు చేయండి' అని కోరారు.

300 వీధికుక్కలకు నిత్యం రొట్టెలు, పాలు




బోధి వృక్షం కింద ధ్యానం చేస్తే జ్ఞానోదయం కలుగుతుందని ఎక్కడెక్కడి నుంచో జనం బిహార్‌లోని బుద్ధ గయాకు వస్తుండగా.. ఆకలితో అలమటించే మూగజీవాల సేవలో బౌద్ధ సన్యాసిని అని జ్ఞాన్ లామో (55) ఆ అనుభూతిని పొందుతున్నారు. ఆమె అడుగుల చప్పుడు చాలు.. వీధి కుక్కలన్నీ పరుగున వచ్చి చుట్టూ చేరుతాయి. కాలచక్ర మైదాన్ నుంచి మొదలు పెట్టి మహాబోధి ఆలయ వీధి సందుల వరకు నిత్యం ఇదే దృశ్యం. కుక్కల కోసం ప్రతిరోజూ 62 కిలోల పిండితో ఆమె సహాయకులు రొట్టెలు చేస్తారు. 35 లీటర్ల పాలు కొంటారు. గత అయిదేళ్లుగా దాదాపు 300 వీధికుక్కలను పోషిస్తున్న అని లామో ఇందుకోసం టిబెట్‌లో తనకున్న ఆస్తులన్నీ అమ్మేసి ఇక్కడే స్థిరపడ్డారు. అవసరాన్ని బట్టి కుక్కలను ఆసుపత్రులకు తీసుకువెళుతుంటారు. తల్లిదండ్రులు చనిపోగా ఒంటరిగా జీవిస్తున్న అని "నాకూ ఓ కుటుంబం ఉంది. ఈ కుక్కలే నా పిల్లలు. ప్రార్థన కంటే సేవ ముఖ్యమని దలైలామా కూడా చెబుతారు" అంటారు. నెలకు దాదాపు రూ. 2 లక్షల ఖర్చు ఉంటుందని, కొంతమంది దాతలు, పర్యాటకులు కూడా సహాయం చేస్తున్నట్లు ఆమె తెలిపారు.

ఈటీవీ భారత్

ఉజ్జయిని యువరైతు రక్తదాన ఉద్యమం

మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయిని జిల్లా కేవని గ్రామ యువరైతు బ్రిజ్‌మోహన్ (38) తన మిత్రబృందంతో కలిసి గత 20 ఏళ్లుగా రక్తదాన సేవను ఓ ఉద్యమంలా కొనసాగిస్తున్నారు. పదహారేళ్ల వయసులో 8 మంది స్కూలు మిత్రులతో కలిసి బ్రిజ్‌మోహన్ 'యువ ఉజ్జయిని' పేరుతో ఓ బృందంగా ఏర్పడి రక్తదాన సేవకు శ్రీకారం చుట్టారు. నేడు ఈ సంఘంలో వెయ్యిమంది నిబద్ధతతో పనిచేసే కార్యకర్తలు ఉన్నారు. మరో 2,000 మందితో రక్త వాహిని పేరిట రక్తదాతల అనుసంధానంతో ప్రత్యేక నెట్‌వర్క్ ఏర్పాటు చేశారు. వీరంతా రాత్రి పగలు తేడా లేకుండా ఎవరికి ఎప్పుడు రక్తం అవసరమైనా ఇట్టే వాలిపోతారు. రక్త సేకరణకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించి సామాజిక మాధ్యమాల ద్వారా విస్తృతంగా ప్రచారం చేస్తారు. ప్రతినెలా సుమారు 500 యూనిట్ల రక్తాన్ని దాతల నుంచి ఈ బృందం సేకరిస్తుంది. ఉజ్జయినిలోని చరక్ భవన్‌లో చికిత్స పొందుతున్న దాదాపు 200 మంది తలసీమియా బాధిత పిల్లలకు వీరు రక్తం సరఫరా చేస్తున్నారు. ఈ సేవా కార్యక్రమాలకు బ్రిజ్‌మోహన్ బృందం నిత్యం రెండు గంటల సమయం కేటాయిస్తుంది.



చైనా నిపుణులకు త్వరితగతిన వీసాలు

నిబంధనలు సడలించిన భారత్

దిల్లీ: చైనా విషయంలో భారత్ కీలక నిర్ణయం తీసుకుంది. ఆ దేశం నుంచి స్వల్ప కాలిక పర్యటనకు వచ్చే వృత్తి నిపుణులకు త్వరితగతిన వీసాలు మంజూరు చేసేలా నిబంధనల్లో సవరణలు చేసింది. దరఖాస్తుదారులు అందజేసిన సమాచారాన్ని సమగ్రంగా పరిశీలించే నిబంధనల్లో మాత్రం ఎలాంటి మార్పులూ ఉండబోవని అధికార వర్గాలు శుక్రవారం తెలిపాయి. గతంలో భారత సందర్శనకు వచ్చే చైనా దేశీయులైన వృత్తి నిపుణులకు ఆరు నెలల కాలపరిమితి కలిగిన 'ఈ' వీసాలు జారీ చేసేవారు. అలాంటి వారికి ఇప్పుడు స్వల్పకాలిక బిజినెస్ వీసాలు జారీ చేయాలని నిర్ణయించారు. ఈ తరహా బిజినెస్ వీసాల కోసం వచ్చే దరఖాస్తులన్నిటినీ మూడు నుంచి నాలుగు వారాల్లోగా పరిశీలించి పరిష్కరిస్తారు. భారత్ తీసుకున్న ఈ నిర్ణయంపై చైనా హర్షం వ్యక్తం చేసింది.



మీ తల్లిదండ్రులను ఇంటర్వ్యూ చేయండి

ఓ ఆదివారం రోజున మీ అమ్మానాన్నలను కూర్చోబెట్టి ఇంటర్వ్యూ చేయండి. వారి జీవిత ప్రస్థానం గురించి వినండి. వారు ఎదుర్కొన్న కష్టాలు, తగిలిన ఎదురుదెబ్బలు, మీకు మెరుగైన భవిష్యత్తును అందించడానికి వారు పడిన శ్రమ అన్నీ అడిగి తెలుసుకోండి. వారు సాధించిన చిన్న చిన్న విజయాలు, ఆనందపడిన క్షణాలను పంచుకోమని అడగండి. దీనివల్ల వారి అనుభవాల నుంచి మీరు స్ఫూర్తి పొందడమే కాదు, వారితో మీ అనుబంధం మరింత బలపడుతుంది.

– కెవిన్ కెల్లీ, రచయిత

ఇప్పటి వరకూ ఒక్క అధికారిపైనా కోప్పడలేదు

- రోజూ నిద్రపోయేది మూడున్నర గంటలే
- ఎన్డీయే ఎంపీలకు ఇచ్చిన విందులో ప్రధాని మోదీ



దేవెగౌడ, ప్రఫుల్‌పటేల్, లావు శ్రీకృష్ణదేవరాయలుతో సంభాషిస్తున్న ప్రధాని మోదీ

ఈనాడు, దిల్లీ: తాను ఇన్నేళ్ల వృత్తి జీవితంలో ఒక్క అధికారిపైనా కోప్పడిన సందర్భం లేదని, అందుకు కారణం తాను అనుసరించే విధానమేనని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. తాను రోజుకి నిద్రపోయేది మూడున్నర గంటలేనని, బయటివారికి ఇది తక్కువగా కనిపించినా గాఢనిద్రలోకి వెళ్తాను కాబట్టి తనకు పూర్తిగా సరిపోతుందని ఎన్డీయే ఎంపీలతో అన్నారు. గురువారం రాత్రి ఎన్డీయే కూటమి ఎంపీల గౌరవార్థం తన నివాసంలో మోదీ విందు ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా మాజీ ప్రధాని దేవెగౌడ, తెదేపా పార్లమెంటరీ పార్టీ నాయకుడు లావు శ్రీకృష్ణదేవరాయలు, శివసేన ఎంపీ శ్రీకాంత్ శిందే, ఎన్సీపీ నేత ప్రఫుల్ పటేల్, భాజపా సీనియర్ ఎంపీలు జగదంబికాపాల్, రవిశంకర్ ప్రసాద్ తదితరులు ఉన్న టేబుల్ దగ్గర ప్రధాని కూర్చొని సుమారు గంటన్నరకుపైగా తన జీవిత అనుభవాలను పంచుకున్నారు.

వద్దన్నా వెళ్లాను..

ఒకసారి గుజరాత్‌లో బాంబుపేలుడు సంభవించినప్పుడు తాను క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించడానికి సిద్ధమైతే ప్రతి ఒక్కరూ వద్దని వారించారని, భద్రతా కారణాల రీత్యా జనంలోకి వెళ్లడం మంచిదికాదని హితవు పలికారని, తాను మాత్రం బాధితులను పరామర్శించడంతో పాటు జనంతో నేరుగా మాట్లాడినట్లు మోదీ చెప్పారు. అధికారంలో ఉండి కష్టకాలంలో బాధితులతో మాట్లాడకుండా భద్రతా కారణాలతో కార్యాలయాలకే పరిమితం కావడం భావ్యంకాదని పేర్కొన్నారు. ఆరోగ్యంగా, ఉత్సాహంగా ఉండటానికి ప్రధాన కారణం క్రమశిక్షణ, మంచిగా నిద్రపోవడమేనని పేర్కొన్నారు. తాను రోజుకు కేవలం మూడున్నర గంటలే నిద్రపోయినా గాఢనిద్రలోకి వెళ్తానని చెప్పారు. మనం ఎన్ని గంటలు నిద్రపోయామన్నది కాకుండా ఎంత నాణ్యమైన నిద్ర చాలా అవసరం అని అభిప్రాయపడ్డారు.

కోపాన్ని చించిపడేస్తా..


కోపాన్ని నిగ్రహించుకోవడానికి తాను పాటించే విధానాన్ని కూడా ప్రధాని మోదీ ఎంపీలతో పంచుకున్నారు. తాను ఇంతవరకూ అధికార విధుల్లో ఏ అధికారి లేదా సిబ్బందిపై కోపగించుకున్న సందర్భం లేదని చెప్పారు. తనకు ఎప్పుడు కోపం వచ్చినా, ఆ సంఘటన, అందులో ప్రమేయం ఉన్న వ్యక్తులు, ఆగ్రహానికి దారితీసిన కారణాల గురించి రాసుకొని, దాన్ని పదేపదే చదివి తర్వాత చింపి పడేస్తానని వివరించారు. అది ఆ సమయంలో తన భావావేశాన్ని నియంత్రించుకోవడానికి వీలుపడుతుందని పేర్కొన్నారు. రాజకీయాల గురించి మాట్లాడుతూ... రాజకీయాల్లో ఉన్న వారికి ఓపిక ముఖ్యమని ఉపదేశించారు. ప్రజలతో నేరుగా మాట్లాడటానికి ప్రత్యామ్నాయం లేదని, అందువల్ల సాధ్యమైనంతవరకు నియోజకవర్గ ఓటర్లతో మాట్లాడటానికి ప్రయత్నించాలన్నారు. గుజరాతీ మాతృభాష అయిన మీరు హిందీలో ప్రావీణ్యం ఎలా సంపాదించారని ఒక ఎంపీ అడిగిన ప్రశ్నకు మోదీ స్పందిస్తూ తాను గుజరాత్‌లోని మెహసానా రైల్వేస్టేషన్‌లో పనిచేస్తున్నప్పుడు ఉత్తరాదినుంచి వచ్చే ప్రయాణికులతో మాట్లాడటంవల్ల హిందీ నేర్చుకోవడం సులభమైందని చెప్పారు. కొందరు ఎంపీలు కొన్ని పుస్తకాలను సూచించమని అడగ్గా ఆయన బెంజమిన్ ఫ్రాంక్లిన్ జీవిత కథ గురించి చెప్పారు.



విమానం తోకకు పారాచూట్ చిక్కి 15వేల అడుగుల ఎత్తున వేలాడి..

మెల్‌బోర్న్: ఆస్ట్రేలియాలోని క్వీన్స్‌లాండ్ రాష్ట్రం టల్లీ విమానాశ్రయ పరిధిలో అనూహ్య ఘటన చోటుచేసుకుంది. ఆకాశంలో 15,000 అడుగుల ఎత్తు నుంచి దూకేందుకు ఓ స్కైడైవరు సిద్ధపడగా.. అతడి పారాచూట్ విమానం వెనుక తోక భాగంలో చిక్కుకుపోయింది. దీంతో అంతెత్తున చాలాసేపు గాల్లోనే వేలాడాల్సి వచ్చింది. రెండు నెలల కిందట జరిగిన ఈ ఘటన దృశ్యాలు ఆస్ట్రేలియా అధికారులు గురువారం విడుదల చేయగా వైరల్ అవుతున్నాయి. ఆకాశంలో విమానం నిర్ణీత ఎత్తుకు చేరుకున్నాక 16 మంది స్కైడైవర్లు అందరూ కలిసి 16 - వే ఫార్మేషన్ జంపు చేయాలని భావించారు. 17వ వ్యక్తి విమానం ఓపెన్ డోరు వద్ద నిలబడి ఆ దృశ్యాలను రికార్డు చేసేలా ప్లాన్ చేసుకున్నారు. మిగతావారంతా అనుకున్న విధంగా కిందికి దూకారు. ఆడ్రియన్ ఫెర్గూసన్ పారాచూట్ మాత్రం విమానం తోకకు చిక్కుకుపోయింది. చాలాసేపు గాలిలో వేలాడాక తన దగ్గరున్న వంపు కత్తితో చిరిగిన రిజర్వ్ పారాచూట్‌ను కత్తిరించుకొని, ప్రధాన పారాచూట్ సాయంతో ఫెర్గూసన్ కిందికి దూకాడు. కాళ్లకు స్వల్ప గాయాలతో అతడు బయటపడ్డాడు. విమాన పైలట్‌తోపాటు మిగతా 16 మంది పారాచూటర్లు కూడా క్షేమంగా కిందికి చేరుకున్నారు. ప్రమాద సమయంలో 'మేడే కాల్' చేసిన పైలట్ అవసరమైతే ఎమర్జెన్సీ పారాచూట్ ధరించేందుకు సిద్ధపడ్డారు. విమానంపై నియంత్రణ ఉన్నందున ఆ అవసరం లేదని బ్రిస్బేన్ ఎయిర్ ట్రాఫిక్ అధికారులు చెప్పడంతో టల్లీలో విమానాన్ని సురక్షితంగా కిందికి దించారు. ఒళ్లు గగుర్పాటు కలిగించే ఈ వీడియోతోపాటు ఘటనకు సంబంధించిన దర్యాప్తు నివేదికను ఆస్ట్రేలియన్ ట్రాన్స్‌పోర్ట్ సేఫ్టీ బ్యూరో విడుదల చేసింది.

కాంగ్రెస్ దిగ్గజ నేత శివరాజ్ పాటిల్ కన్నుమూత



లాతూర్, దిల్లీ: కాంగ్రెస్ దిగ్గజ నేత, కేంద్ర మాజీ హోం మంత్రి శివరాజ్ పాటిల్ (90) కన్నుమూశారు. మహారాష్ట్రలోని లాతూర్‌లో అనారోగ్య సమస్యలతో శుక్రవారం ఉదయం ఆయన తుదిశ్వాస విడిచారు. నెహ్రూ-గాంధీ కుటుంబానికి విధేయుడిగా పాటిల్‌కు పేరుంది. ఐదు దశాబ్దాలకు పైగా రాజకీయ జీవితంలో ఆయన ఎన్నో కీలక పదవులను అధిష్ఠించారు. లోక్‌సభ స్పీకర్‌గానూ పనిచేశారు. 2008లో ముంబయిలో 26/11 దాడులు జరిగినప్పుడు కేంద్ర హోం మంత్రిగా ఉన్నారు. పాటిల్‌కు కుమారుడు శైలేష్ పాటిల్, కోడలు అర్చన, ఇద్దరు మనవరాళ్లు ఉన్నారు. ఆయన మృతిపట్ల రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాని మోదీ, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ, తదితర నేతలు సంతాపం వ్యక్తం చేశారు. పాటిల్ అంత్యక్రియలు శనివారం జరగనున్నాయి.

ఏడుసార్లు లోక్‌సభ ఎంపీగా..

శివరాజ్ పాటిల్ 1935 అక్టోబర్ 12న లాతూర్ జిల్లాలోని చకూర్ గ్రామంలో జన్మించారు. 1966-70 మధ్య లాతూర్ మున్సిపాలిటీ ప్రెసిడెంట్‌గా పనిచేశారు. తర్వాత రెండుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 1977-79 మధ్య మహారాష్ట్ర అసెంబ్లీలో డిప్యూటీ స్పీకర్‌గా, స్పీకర్‌గా పనిచేశారు. అనంతరం లాతూర్ నుంచి ఏడుసార్లు లోక్‌సభకు ఎన్నికయ్యారు. 1991-96 మధ్య దిగువ సభ పదో స్పీకర్‌గా పనిచేశారు. 2004 సార్వత్రిక ఎన్నికల్లో పరాజయం పాలయ్యారు. అయినప్పటికీ కేంద్రంలో అత్యంత కీలకమైన హోం మంత్రి పదవి ఆయనకు దక్కింది. 2004 జులైలో పాటిల్ రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికయ్యారు. సార్వత్రిక ఎన్నికల్లో ఓడిపోకపోయి ఉంటే.. ఆయనే ప్రధానమంత్రి అయ్యేవారని అప్పట్లో విశ్లేషణలు వెలువడ్డాయి. కేంద్రంలో రక్షణ, వాణిజ్య, శాస్త్ర సాంకేతికత శాఖల మంత్రిగానూ పాటిల్ విధులు నిర్వర్తించారు. పంజాబ్ గవర్నర్‌గా, చండీగఢ్ అడ్మినిస్ట్రేటర్‌గా కూడా పనిచేశారు.

● శివరాజ్ పాటిల్‌కు లోక్‌సభ, రాజ్యసభలు శుక్రవారం నివాళులర్పించాయి.

26/11 దాడుల తర్వాత రాజీనామా

26/11 ఉగ్రదాడులు జరిగిన రోజు రాత్రి పాటిల్ మూడు వేర్వేరు సెట్ల దుస్తుల్లో కనిపించారు. ముంబయిలో మారణహోమం చోటుచేసుకుంటున్న సమయంలో కేంద్ర హోం మంత్రి దుస్తులు మార్చుకుంటూ ఉండటమేంటని అప్పట్లో తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. దాడులను నివారించడంలో విఫలమయ్యారన్న విమర్శలూ వచ్చాయి. దీంతో 2008 నవంబరు 30న హోం మంత్రి పదవికి పాటిల్ రాజీనామా చేశారు. ఈ ఏడాది మార్చిలో తన కుటుంబంతో సహా పాటిల్ దిల్లీలో ప్రధాని మోదీని కలిశారు. ఆయన కోడలు అర్చన నిరుడు మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో లాతూర్ సిటీ నుంచి భాజపా తరఫున పోటీ చేసి ఓడిపోయారు.

కారుణ్య నియామకం హక్కు కాదు: సుప్రీంకోర్టు

దిల్లీ: ప్రభుత్వోద్యోగి మరణిస్తే అర్హత కలిగిన అతని వారసుడు హక్కుగా మృతుని ఉద్యోగం పొందే వీలు లేదని సుప్రీంకోర్టు స్పష్టంచేసింది. అసాధారణ పరిస్థితుల్లో జరిగే కారుణ్య నియామకాన్ని ఆధారం చేసుకొని ఉద్యోగం పొందినవారు సీనియారిటీ కలిగివున్నామంటూ పదోన్నతి కోరే వీలు లేదని కూడా జస్టిస్ రాజేశ్ బిందల్, జస్టిస్ మన్‌మోహన్‌లతో కూడిన ధర్మాసనం స్పష్టంచేసింది. మానవత్వ ప్రాతిపదికన జరిగే కారుణ్య నియామకాన్ని ఒక మినహాయింపుగానే పరిగణించాలని, అలాంటి నియామకాన్ని నిబంధనగా భావించరాదని తెలిపింది. కారుణ్య ప్రాతిపదికన ఉద్యోగం పొందిన ఇద్దరు స్వీపర్లకు జూనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పించాలన్న మద్రాసు హైకోర్టు ఆదేశాల్ని సవాలుచేస్తూ దాఖలైన వ్యాజ్యంపై కోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది.

ఒక్క సిగరెట్ వల్ల ఏమీ అయిపోదు...

చర్యలను సమర్థించుకున్న టీఎంసీ ఎంపీ సౌగతా రాయ్



దిల్లీ: పార్లమెంటు పరిసరాల్లో సిగరెట్ తాగడాన్ని తృణమూల్ కాంగ్రెస్(టీఎంసీ) ఎంపీ సౌగతా రాయ్ సమర్థించుకున్నారు. తన గురించి కాకుండా దిల్లీలో నెలకొన్న వాయు కాలుష్యంపై కేంద్రం దృష్టి సారించాలన్నారు. శుక్రవారం ఆయన పార్లమెంటు వెలుపల మీడియాతో మాట్లాడుతూ..."దిల్లీ కాలుష్య సమస్య నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికి మోదీ ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. సభ లోపల సిగరెట్లు తాగడంపై నిషేధం ఉంది. కానీ, సభ వెలుపల బహిరంగ ప్రదేశాల్లో సిగరెట్లు తాగడానికి ఎలాంటి అభ్యంతరం లేదు. భాజపా ప్రభుత్వ హయాంలో దిల్లీలో కాలుష్యం అత్యధిక స్థాయిలో ఉంది. ఇలాంటి ఆరోపణలు చేయడం మానేసి, వాయు కాలుష్య నివారణపై వారు దృష్టి పెట్టాలి. ఒక్క సిగరెట్ తాగడం వల్ల కాలుష్యమేమీ పెరిగిపోదు" అని వ్యాఖ్యానించారు. గురువారం పార్లమెంటు ముందు ఆయన సిగరెట్ తాగుతున్న వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి.

లోక్‌సభలో అనురాగ్ ఠాకుర్ ఫిర్యాదు

తృణమూల్ ఎంపీ ఒకరు ఈ-సిగరెట్ తాగారన్న ఆరోపణలపై భాజపా ఎంపీ అనురాగ్ ఠాకుర్ శుక్రవారం లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు లిఖితపూర్వక ఫిర్యాదును సమర్పించారు. అంతకుముందు రోజే ఈ విషయాన్ని అనురాగ్ సభలో ప్రస్తావించగా... లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేస్తేనే ఏమైన చర్యలు తీసుకుంటామని ఓం బిర్లా బదులిచ్చారు. లోక్‌సభలో కూర్చొని ఓ తృణమూల్ ఎంపీ అందరికీ కనిపించేలా ఈ-సిగరెట్ తాగారని, దీనిపై కఠినమైన చర్యలు తీసుకోవాలని అనురాగ్ ఫిర్యాదులో కోరారు. కానీ ఆ ఎంపీ పేరును బయటకు చెప్పడానికి ఇష్టపడలేదు. ఈ విషయాన్ని చట్ట ఉల్లంఘనగా గుర్తించి, దర్యాప్తునకు ఆదేశించాలన్నారు.

విషవాయు దుప్పట్లో దేశ నగరాలు

లోక్‌సభలో చర్చకు రాహుల్‌గాంధీ డిమాండ్



దిల్లీ: దేశంలోని ప్రధాన నగరాలను విషవాయువులు దుప్పటిలా కప్పేశాయని లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ పేర్కొన్నారు. వాతావరణ కాలుష్యంపై సభలో చర్చించాలని డిమాండ్ చేశారు. పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో భాగంగా ఆయన శుక్రవారం జీరో అవర్‌లో ఈ అంశాన్ని లేవనెత్తారు. ఇది భావజాలానికి సంబంధించిన విషయం కాదని.. ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకోడానికి బదులు ప్రతిపక్షం, ప్రభుత్వం కలిసికట్టుగా ఈ సమస్యకు పరిష్కారం కనుగొనేలా చర్చ జరగాలని రాహుల్ అన్నారు. "ఈ విషయంపై సవివరంగా చర్చ జరగాలి, ప్రధానమంత్రి ప్రతి నగరానికీ ఒక శాస్త్రీయమైన, క్రమబద్ధమైన ప్రణాళికను రూపొందించాలి. ఆ ప్రణాళిక రానున్న 5 నుంచి 10 సంవత్సరాల కాలంలో మన ప్రజల జీవనాన్ని మెరుగుపరిచేలా ఉండాలి" అని కాంగ్రెస్ అగ్ర నేత పేర్కొన్నారు. ప్రభుత్వం ఈ అంశంపై చర్చకు సిద్ధంగా ఉందని, లోక్‌సభ బిజినెస్ అడ్వైజరీ కమిటీ ఈ విషయంపై సమయాన్ని కేటాయించవచ్చని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజుజు అన్నారు. నగరాల్లో కాలుష్యాన్ని నియంత్రించే ప్రణాళికను సిద్ధం చేయడంలో ప్రభుత్వానికి సంతోషంగా సహకారం అందిస్తామని రాహుల్ తెలిపారు.

కేబినెట్ హోదా మంత్రులెవరూ లేక..

సభలో కేబినెట్ హోదా కేంద్ర మంత్రి ఒక్కరూ లేని కారణంగా శుక్రవారం రాజ్యసభ పది నిమిషాల పాటు వాయిదా పడింది. 2001లో డిసెంబరు 13న పార్లమెంటుపై జరిగిన దాడిలో ఉగ్రవాదులతో వీరోచితంగా పోరాడి అసువులు బాసిన వారికి సభ శ్రద్ధాంజలి ఘటించింది. అనంతరం సభలో కేబినెట్ స్థాయి కేంద్ర మంత్రి ఒక్కరూ లేకపోవడాన్ని ప్రతిపక్ష సభ్యులు ఎత్తిచూపారు. దీనిపై స్పందించిన రాజ్యసభ ఛైర్మన్ సి.పి.రాధాకృష్ణన్ సభలో ఉన్న ఒక జూనియర్ మంత్రిని ఉద్దేశించి మాట్లాడుతూ.. ఒక కేబినెట్ స్థాయి మంత్రి ఉండేలా చూడాల్సిందిగా ప్రభుత్వాన్ని కోరాలన్నారు. 'ఇది సభను అవమానించడమే. కేబినెట్ స్థాయి మంత్రి వచ్చేదాకా సభను వాయిదా వేయండి" అని కాంగ్రెస్ సభ్యుడు జైరాం రమేశ్ పేర్కొన్నారు. దీంతో ఐదు నిమిషాలు వేచి చూసిన అనంతరం ఛైర్మన్ సభను 10 నిమిషాలు వాయిదా వేశారు. సభ తిరిగి సమావేశమయ్యాక పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజుజు, ఇతర మంత్రులు నిర్మలా సీతారామన్, జేపీ నడ్డాలు సభకు వచ్చారు.

థాయ్ పార్లమెంటు రద్దు

వచ్చే ఏడాది ఎన్నికలు

బ్యాంకాక్: కంబోడియాతో సరిహద్దుల్లో ఘర్షణలు తీవ్రతరమవుతున్న వేళ, థాయ్‌లాండ్‌లో కీలక రాజకీయ పరిణామం చోటు చేసుకుంది. ఆ దేశ పార్లమెంటును మూడు నెలల క్రితం ప్రతిపక్ష పీపుల్స్ పార్టీ మద్దతుతో ప్రధాని పదవిని చేపట్టిన అనుతిన్ చేవిరకున్ శుక్రవారం రద్దు చేశారు. దీంతో వచ్చే ఏడాది ఆరంభంలో థాయ్‌లాండ్‌లో ఎన్నికలు జరగనున్నాయి. ఎన్నికలయ్యేవరకు అనుతిన్ తాత్కాలిక ప్రభుత్వానికి సారథిగా వ్యవహరించనున్నారు. ప్రధాని పదవి చేపట్టిన సమయంలో నాలుగు నెలల్లో పార్లమెంటును రద్దు చేయాలని, రాజ్యాంగ సవరణలు చేయాలని అనుతిన్‌కు పీపుల్స్ పార్టీ షరతులు పెట్టింది. రాజ్యాంగమార్పు విషయంలో విభేదాలు తలెత్తాయి. దీంతో అవిశ్వాసతీర్మానం పెడతామని పీపుల్స్ పార్టీ హెచ్చరికతోనే అనుతిన్ పార్లమెంటును రద్దు చేసినట్లు తెలుస్తోంది.

మమత నియోజకవర్గంలో 44,787 ఓట్ల తొలగింపు

కోల్‌కతా: పశ్చిమబెంగాల్‌లో ముఖ్యమంత్రి మమతా బెనర్జీకి కంచుకోటలాంటి భవానీపుర్ అసెంబ్లీ నియోజకవర్గంలో ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియతో 44 వేలకుపైగా ఓట్లను తొలగించారు. ఈ ఏడాది జనవరి నాటికి అక్కడ మొత్తం 2,06,295 మంది ఓటర్లు ఉన్నారని ఎన్నికల సంఘం (ఈసీ) శుక్రవారం విడుదల చేసిన డేటాలో తెలిపింది. మరణాలు, వేరే ప్రాంతాల్లో స్థిరపడటం, చిరునామా దొరక్కపోవడం, ఒకటి కంటే ఎక్కువ ఓట్లు ఉండటం తదితర కారణాలతో మొత్తం 44,787 ఓట్లను తాజాగా తొలగించినట్లు పేర్కొంది. విపక్ష భాజపా నేత సువేందు అధికారికి చెందిన నందిగ్రామ్ స్థానంలో మొత్తం 2,78,212కుగాను 10,599 మంది ఓటర్లను తొలగించినట్లు వెల్లడించింది. బెంగాల్‌లో 294 అసెంబ్లీ సీట్లు ఉన్నాయి. వాటిలో అత్యధికంగా కోల్‌కతాలోని చౌరింగీ స్థానంలో 74,553 ఓట్లను తొలగించారు.

ఏటా 171 నుంచి 64కు తగ్గిన రైలు ప్రమాదాలు

ఈనాడు, దిల్లీ: దేశంలో రైలు ప్రమాదాలు 2004-14 నుంచి 2024-25 మధ్యకాలంలో ఏటా 171 నుంచి 64కు తగ్గిపోయాయని రైల్వేమంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. ఆయన శుక్రవారం రాజ్యసభలో సభ్యులు అడిగిన ప్రశ్నకు ఈ మేరకు సమాధానం ఇచ్చారు. 2004-14 మధ్య పదేళ్ల కాలంలో మొత్తం 1,711 ప్రమాదాలు జరగ్గా, 2014-25 మధ్యకాలంలో 709 జరిగాయని చెప్పారు. 2025-26లో ఈ నవంబరు వరకు కేవలం 11 ప్రమాదాలే చోటు చేసుకున్నాయని కేంద్రమంత్రి తెలిపారు.

కాంగ్రెస్ సభ్యుల పనితీరు భేష్

పార్లమెంటు చర్చపై రాహుల్

దిల్లీ: పార్లమెంటు ఉభయసభల్లో వందేమాతరం, ఎన్నికల సంస్కరణలపై జరిగిన చర్చలో అద్భుత పనితీరు చూపినందుకు కాంగ్రెస్ ఎంపీలను లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ అభినందించారు. వందేమాతరం, ఎన్నికల సంస్కరణల విషయంలో కాంగ్రెస్ సభ్యుల మాటలు ప్రభుత్వాన్ని ఒత్తిడికి గురిచేశాయనడం సుస్పష్టం అని రాహుల్ అన్నారు.

● రాహుల్‌ని అధికార భాజపా "ఝూఠ్‌కీ దుకాన్" (అబద్ధాల అంగడి)గా అభివర్ణించింది. ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్‌షాల నేతృత్వంలో వందేమాతరం, ఎన్నికల సంస్కరణలపై పార్లమెంటులో జరిగిన చర్చల్లో అధికార పక్షం విపక్ష కాంగ్రెస్ నిజస్వరూపాన్ని బట్టబయలు చేసినప్పుడు ప్రతిపక్షాలు తలెత్తుకోలేకపోయాయని ఆ పార్టీ పేర్కొంది.

రష్యా-ఉక్రెయిన్ పోరు ముదిరితే ప్రపంచ యుద్ధమే: ట్రంప్

ఇంటర్నెట్ డెస్క్: రష్యా-ఉక్రెయిన్ యుద్ధంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా కీలక వ్యాఖ్యలు చేశారు. ఇది మూడో ప్రపంచ యుద్ధానికి దారితీసే ముప్పుందని హెచ్చరించారు. శ్వేతసౌధంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. గత నెల రోజుల్లో యుద్ధంలో దాదాపు 25 వేల మంది ప్రాణాలు కోల్పోయినట్లు తెలిపారు. "రక్తపాతం ఆగిపోవాలని నేను కోరుకుంటున్నా. రష్యా-ఉక్రెయిన్ యుద్ధంలో గత నెలలో 25 వేల మంది ప్రాణాలు కోల్పోయారు. అందులో అత్యధికులు సైనికులే. బాంబు పేలుళ్ల వల్ల మరికొందరు చనిపోయారు. ఇది వెంటనే ఆగిపోవాలి. అందుకు మేము చాలా కష్టపడి పనిచేస్తున్నాం. ఇలాంటి పోరు మూడో ప్రపంచ యుద్ధానికి దారితీస్తుంది. ఇది చాలా ప్రమాదకరం. అలా జరగాలని కోరుకోవడం లేదు" అని ట్రంప్ అన్నారు.

రష్యా నిధులు స్తంభింపజేసిన ఈయూ

బ్రసెల్స్: తమ బ్యాంకుల్లో మూలుగుతున్న రష్యా నిధులను యూరోపియన్ యూనియన్(ఈయూ) నిరవధికంగా స్తంభింపజేసింది. ఉక్రెయిన్‌పై నాలుగేళ్ల నుంచి చేస్తున్న యుద్ధాన్ని ఆపి, ఆ యుద్ధం వల్ల జరిగిన భారీ నష్టానికి పరిహారం చెల్లించేలా రష్యాపై ఒత్తిడి తెచ్చేందుకే ఈ చర్య చేపట్టినట్లు తెలిసింది. ఈయూ బ్యాంకులలో రష్యా కేంద్ర బ్యాంకుకు చెందిన 21,000 కోట్ల యూరోల నిధులు ఉన్నాయి. వాటిలో 19,300 కోట్ల యూరోలు బెల్జియం బ్యాంకులోనే ఉన్నాయి. రష్యన్ నిధులను బిగపట్టి, వాటి ఆధారంగా ఉక్రెయిన్ పునర్నిర్మాణానికీ, ఆయుధాల కొనుగోలుకు భారీ రుణం ఇవ్వాలని ఈయూ భావిస్తోంది. ఈ ప్రతిపాదన చట్టవిరుద్ధమని ఈయు సభ్యులైన హంగరీ, స్లొవేకియాలు పేర్కొంటున్నాయి. ఈయూ తీసుకునే నిర్ణయాలన్నీ ఏకాభిప్రాయం ద్వారా జరగాలి కాబట్టి ఈ రెండు దేశాల వ్యతిరేకత ఆటంకాలు సృష్టించే అవకాశం ఉంది. ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధం వల్ల ఐరోపా దేశాల్లో ఆర్థిక ప్రగతి కుంటుపడింది. ఈ దేశాలు ఇంతవరకు ఆయుధ రూపంలో, ఇతరత్రా ఉక్రెయిన్‌కు 20,000 కోట్ల యూరోల ఆర్థిక సహాయం ఇప్పటికే అందించాయి. తన నిధులను స్తంభింపజేయాలని ఈయూ నిర్ణయించడం చట్టవిరుద్ధమనీ, దీనిపై జాతీయ, అంతర్జాతీయ న్యాయస్థానాలు, ట్రైబ్యునళ్లలో దావాలు వేస్తామని బ్యాంక్ ఆఫ్ రష్యా శుక్రవారం హెచ్చరించింది.



ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోవడంతో ఉత్తరాఖండ్‌లోని చమోలీ జిల్లా బద్రీనాథ్ నాగాని గ్రామంలో గడ్డకట్టిన జలపాతం

కశ్మీర్ గజగజ

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లో చలి తీవ్రత మరింత పెరిగింది. పలు ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు గడ్డకట్టే స్థాయికి పడిపోయాయి. శ్రీనగర్‌లో గురువారం రాత్రి కనిష్ఠ ఉష్ణోగ్రత మైనస్ 3.6 డిగ్రీలు, పుల్వామాలో మైనస్ 5.5 డిగ్రీలు నమోదు కాగా, పహల్గాం, కుప్వాడా ప్రాంతాల్లో కూడా చలి వణికిస్తోందని అధికారులు తెలిపారు. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు తగు జాగ్రత్తలు తీసుకొని ఇళ్లలోనే ఉండాలని వైద్యులు సూచించారు. డిసెంబరు 13 నుంచి 17 వరకు ఉత్తర, మధ్య కశ్మీర్‌లో తేలికపాటి మంచు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం పేర్కొంది.

85వ పడిలోకి శరద్ పవార్


- శుభాకాంక్షలు తెలిపిన ప్రధాని మోదీ



శరద్‌పవార్‌ను సన్మానిస్తున్న పార్టీ శ్రేణులు

దిల్లీ: నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ-ఎస్పీ) అధినేత, కేంద్ర మాజీమంత్రి శరద్ పవార్ శుక్రవారం 85వ పడిలో అడుగుపెట్టారు. ఆయనకు ప్రధాని నరేంద్ర మోదీ, మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్, ఉపముఖ్యమంత్రి ఏక్‌నాథ్ శిందే, శివసేన (యూబీటీ) నేత ఆదిత్య ఠాక్రే సహా పలువురు నేతలు శుభాకాంక్షలు తెలిపారు. "రాజ్యసభ సభ్యుడు శరద్ పవార్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు. ఆయన ఆయురారోగ్యాలతో దీర్ఘకాలం జీవించాలని కోరుకుంటున్నాను" అని ప్రధాని మోదీ 'ఎక్స్'లో పోస్టు పెట్టారు. ముందురోజు పవార్ నివాసంలో జరిగిన పుట్టినరోజు వేడుకల్లో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ, జమ్మూకశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా, వ్యాపారవేత్త గౌతం అదానీ సహా పలువురు హాజరయ్యారు. తనకు శుభాకాంక్షలు తెలుపడానికి వచ్చిన పార్టీ కార్యకర్తలు, నేతలను వైబీ చవాన్ సెంటర్‌లో శరద్ పవార్ కలిశారు.

ఏట్లో కొట్టుకుపోయిన ఇంటికి రూ.3 లక్షల విద్యుత్తు బిల్లు!



ఈటీవీ భారత్: పశ్చిమబెంగాల్‌లోని పశ్చిమ్ మేదినీపుర్ జిల్లా ధాయ్‌ఖండ్ గ్రామానికి చెందిన ఈయన పేరు గోలమ్ నబీఖాన్. దినకూలీగా పనిచేస్తున్న నబీ ఇల్లు గతంలో శీలావతి నది వరదల్లో కొట్టుకుపోగా, కుమార్తె ఇంటి పక్కన చిన్న వాటాలో ఉంటున్నారు. బీపీఎల్ కింద పొందిన పాత ఇంటి విద్యుత్తు మీటరును ఆ వాటాకు అమర్చగా, దానికి రూ. 2.83 లక్షల బిల్లు రావడంతో నబీకి నోట మాట రావడం లేదు. పలుమార్లు విద్యుత్తు అధికారులను కలిసి ఒక బల్బు, ఒక ఫ్యాను మాత్రమే ఉన్న తన ఇంటికి ఇంత బిల్లు రావడమేంటని అడిగినా.. ముందు ఆ మొత్తం కట్టి తర్వాత మాట్లాడమని అంటున్నారు. కాగా, 2010 నుంచి నబీ ఎటువంటి విద్యుత్తు బిల్లులు కట్టలేదని, పలుమార్లు కనెక్షను తొలగించినా మళ్లీ వైర్లు పెట్టుకొన్నట్లు పేరు వెల్లడించడానికి ఇష్టపడని మేదినీపుర్ విద్యుత్తు అధికారి ఒకరు తెలిపారు.

ప్రాంతీయ ప్రణాళిక బోర్డులకు తొలి అడుగు

- విశాఖ ఎకనమిక్ రీజియన్‌కు బోర్డు
- సీఎం ఛైర్మన్‌గా స్టీరింగ్ కమిటీ

ఈనాడు, అమరావతి: ప్రాంతీయ ప్రణాళిక బోర్డుల ఏర్పాటులో తొలి అడుగు పడింది. విశాఖపట్నం ఎకనమిక్ రీజియన్ (వీఈఆర్)కు ముఖ్యమంత్రి ఛైర్‌పర్సన్‌గా స్టీరింగ్‌కమిటీ ఏర్పాటుచేస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులిచ్చింది. సీఎస్ కన్వీనర్‌గా వ్యవహరించే కమిటీలో ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి లోకేశ్, ఆర్థిక, వ్యవసాయ, హోం, పురపాలక, పరిశ్రమల మంత్రులు సభ్యులుగా ఉంటారు.

■ స్వర్ణాంధ్ర 2047 విజన్ ప్రణాళికల అమల్లో భాగంగా.. విశాఖపట్నం, తిరుపతి, అమరావతి కేంద్రాలుగా ప్రాంతీయ ప్రణాళిక బోర్డుల ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయించింది. దీనిలోభాగంగా వీఈఆర్ అభివృద్ధి ప్రణాళికను నవంబరు 13న సీఎం విడుదల చేశారు. మిగిలిన రెండు ప్రాంతాల ప్రణాళికల్ని నీతిఆయోగ్, ఇతర సంస్థల భాగస్వామ్యంతో తయారుచేస్తున్నారు.

■ వీఈఆర్‌లో విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం, విజయనగరం, శ్రీకాకుళం, కాకినాడ, తూర్పుగోదావరి, అంబేడ్కర్ కోనసీమ జిల్లాలు ఉంటాయి. 2032 నాటికి 125-135 బిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా చేయడమే లక్ష్యం.

■ వీఈఆర్ కార్యనిర్వాహక కమిటీకి ఛైర్మన్‌గా సీఎస్, కన్వీనర్‌గా వీఈఆర్ సీఈఓ వ్యవహరిస్తారు. సభ్యులుగా కార్యదర్శులతోపాటు జాతీయ రహదారులు, రైల్వే, పోర్టులు, విశాఖ సెజ్, నీతి ఆయోగ్ నుంచి 19 మంది ఉంటారు.

■ ఇంప్లిమెంటేషన్ కమిటీ ఛైర్మన్‌గా వీఈఆర్ సీఈఓ, కన్వీనర్‌గా వీఎంఆర్‌డీఏ కమిషనర్ ఉంటారు. వీఈఆర్ పరిధిలోని 9 జిల్లాల కలెక్టర్లు, ప్రాంతీయ అభివృద్ధి కమిషనర్లు, ప్రణాళిక శాఖ డైరెక్టర్, ఆహ్వానితుల్ని నియమిస్తారు.



వయసును సాకుగా చెప్పొద్దు

మీరు నాలుగు పదుల్లోనూ బరువులు ఎత్తొచ్చు. ఏ వయసులో అయినా వ్యాపారం ప్రారంభించొచ్చు. ఏ వయసువారైనా పర్వతారోహణ చేయొచ్చు. జీవిత మలిసంధ్యలోనూ మిమ్మల్ని మీరు కొత్తగా ఆవిష్కరించుకోవచ్చు. కాబట్టి వయసును సాకుగా చెబుతూ కొత్త ప్రయత్నాలు చేయడం మానకండి.

– లారెన్ జోసెఫ్, అడ్వర్టైజింగ్ ప్రొఫెషనల్

కేరళను మించి పర్యాటకాభివృద్ధి!

- ఏపీలో మౌలిక వసతులు కల్పిస్తే సాధ్యమే
- పర్యాటకానికి పారిశ్రామిక హోదా చక్కని నిర్ణయం
- పెట్టుబడులు పెట్టడానికి సిద్ధంగా ఉన్నాం
- ప్రముఖ పర్యాటక సంస్థల ప్రతినిధుల వెల్లడి

ఏపీ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ 'బిజినెస్ ఎక్స్‌పో'లో పర్యాటక రంగంపై సదస్సు

ఈనాడు, అమరావతి: తగిన మౌలిక సదుపాయాలు కల్పిస్తే పర్యాటకంగా ఆంధ్రప్రదేశ్ కేరళను మించి అభివృద్ధి చెందుతుందని ప్రముఖ పర్యాటక, ఆతిథ్య సేవల సంస్థల ప్రతినిధులు అభిప్రాయపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా కల్పించడంతో పాటు ప్రోత్సాహకరమైన పాలసీ తీసుకొచ్చిందని పేర్కొన్నారు. ఏపీ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో విజయవాడలో శుక్రవారం ప్రారంభమైన 'బిజినెస్ ఎక్స్‌పో'లో పర్యాటక రంగ అభివృద్ధిపై సదస్సు నిర్వహించారు. వివిధ రాష్ట్రాలకు చెందిన పలు సంస్థల ప్రతినిధులు హాజరై ఇక్కడ పెట్టుబడులు పెట్టేందుకు సుముఖత వ్యక్తం చేశారు. ఏపీలో 20 శాతం అటవీ ప్రాంతం ఉందని, ఎకో-టూరిజం అభివృద్ధికి ముందుకొచ్చే సంస్థలను స్వాగతిస్తున్నామని రాష్ట్ర అటవీశాఖ సలహాదారు మల్లికార్జునరావు చెప్పారు. పర్యాటకానికి పారిశ్రామిక హోదా కల్పించాక అనేక సంస్థలు పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొస్తున్నాయని, వారికి అన్ని విధాలా సహకరిస్తున్నామని రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ ఈడీ పద్మావతి చెప్పారు.



పర్యాటకంపై సదస్సులో పాల్గొన్న వివిధ రాష్ట్రాలు, సంస్థల ప్రతినిధులు

10 రిసార్ట్‌ల ఏర్పాటుకు సిద్ధం

– విక్రం లాల్వానీ, స్టెర్లింగ్ హాలిడే రిసార్ట్స్ గ్రూప్ ఎండీ, చెన్నై

ఏపీలో తీర ప్రాంతం పర్యాటక రంగ అభివృద్ధికి ఎంతో దోహదం చేయనుంది. పెట్టుబడిదారులకు ప్రభుత్వం నుంచి కూడా మంచి ప్రోత్సాహం లభిస్తోంది. తీర ప్రాంతంలో పది రిసార్ట్‌ల ఏర్పాటుకు సిద్ధంగా ఉన్నాం.

హెలీ హబ్‌గా విజయవాడ

– కెప్టెన్ కేఆర్ శశికుమార్, డైరెక్టర్, కైరాలీ ఏవియేషన్, బెంగళూరు

విజయవాడను హెలీ హబ్‌గా అభివృద్ధి చేయనున్నాం. త్వరలో ఇక్కడి నుంచి శ్రీశైలానికి హెలికాప్టర్ నడుపుతాం. రాబోయే మూడేళ్లలో విజయవాడలో రెండు హెలికాప్టర్లు సిద్ధం చేస్తాం. విశాఖపట్నం, కాకినాడ, రాజమహేంద్రవరంలలోనూ హెలీ టూరిజం ప్రవేశపెట్టాలని, విజయవాడ నుంచి 'సీ ప్లేన్' ప్రారంభించాలని యోచిస్తున్నాం.

జెట్టీలు నిర్మిస్తే బోట్లు నడిపేందుకు సంస్థలు సిద్ధం

– హేమమాలిని, డైరెక్టర్, ఆక్వామెరైన్ బోట్స్, యాచ్ ఛార్టర్, దుబాయి

ప్రభుత్వ ఆధ్వర్యంలో జెట్టీలు ఏర్పాటు చేస్తే ఏపీలోని తీర ప్రాంతంలో, కృష్ణా, గోదావరి నదుల్లో తగిన సౌకర్యాలతో ప్రయాణికుల బోట్లు నడిపేందుకు అనేక సంస్థలు సిద్ధంగా ఉన్నాయి. తగిన జాగ్రత్తలు తీసుకుంటే ప్రమాదాలకు ఆస్కారం ఉండదు.

ఆయుర్వేద, వెల్‌నెస్ పర్యాటకానికి అవకాశాలు

– బెన్నీ థామస్, డైరెక్టర్, ఆయుర్వేద, హెల్త్ టూరిజం, కేరళ

ఏపీలో ఆయుర్వేద, వెల్‌నెస్ పర్యాటకం అభివృద్ధికి తగిన అవకాశాలున్నాయి. దీని ద్వారా విదేశీ పర్యాటకుల సంఖ్య భారీగా పెరుగుతుంది. కేరళ, ఏపీకి పర్యాటకపరంగా సారూప్యత ఉంది. కేరళ స్థాయిలో ఏపీని కూడా పర్యాటకంగా అభివృద్ధి చేయొచ్చు.

పర్యాటక పాలసీ అద్భుతం

– వాల్మీకి హరికిషన్, మేనేజింగ్ పార్టనర్, వాల్మీకి ట్రావెల్, టూరిజం సొల్యూషన్స్, హైదరాబాద్

పర్యాటకంగా అభివృద్ధి చెందుతున్న ఏపీలోనూ పర్యాటకుల భద్రత, అందమైన ప్రాంతాలు, విలువైన కట్టడాల సంరక్షణకు 'టూరిజం పోలీస్' అవసరం. తెలంగాణలో ఇటీవలే ప్రవేశపెట్టారు. పర్యాటక రంగ అభివృద్ధికి ప్రభుత్వం అద్భుతమైన పాలసీ తీసుకొచ్చింది. వాలంటరీ టూరిజం అభివృద్ధికి సహకారం అందించేందుకు సిద్ధంగా ఉన్నాం.

ఈ క్రికెటర్.. 70 ఏళ్ల రైతు!



ఉదయగిరి కాశియప్పన్

చెన్నై (ట్రిప్లికేన్), న్యూస్‌టుడే: తమిళనాడుకు చెందిన 70 ఏళ్ల రైతు విదేశీ గడ్డపై క్రికెట్ ఆడబోతున్నారు. తన చిన్ననాటి కలను నిజం చేసుకోబోతున్నారు. ఉదయగిరి కాశియప్పన్‌ది.. కోయంబత్తూరు జిల్లా పొళ్లాచ్చి వద్దనున్న కాళియప్ప కౌండన్‌పుదూర్. పాఠశాల రోజుల్లో క్రికెట్ బాగా ఆడేవారు. కళాశాల విద్య అయ్యాక వ్యవసాయంలోకి అడుగుపెట్టారు. అయినా క్రికెట్‌ను వదల్లేదు. ఆ ఆసక్తే ఇప్పుడు ఆయన్ను న్యూజిలాండ్‌లో జరగనున్న సీనియర్ క్రికెట్ వరల్డ్ కప్ పోటీలకు భారత జట్టు తరఫున ఆడేలా చేసింది. సెలెక్టర్లు తమిళనాడు నుంచి కాశియప్పన్‌ను ఎంపిక చేశారు. ప్రస్తుతం పోటీల కోసం శిక్షణ తీసుకుంటున్నారు. ఓ ప్రైవేటు క్రికెట్ సంస్థ నిర్వహిస్తున్న ఈ పోటీల్లో భారత్, ఇంగ్లండ్, న్యూజిలాండ్, కెనడా, శ్రీలంక సహా 8 దేశాల జట్లు పాల్గొంటున్నాయి. 'దేశం తరఫున క్రికెట్ ఆడాలన్న కల నిజమవుతున్నందుకు ఆనందంగా ఉంది. మ్యాచ్‌లో గెలుపు, ఓటములు ముఖ్యం కాదు. ఎలా ఆడామన్నదే ప్రధానం. ఆటలకు వయసు అడ్డంకి కాదు. రంజీ ట్రోఫీ ఆటగాళ్లు ఈ టోర్నీలో పాల్గొంటారు. యువతరం వ్యాయామం, క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి' అని కాశియప్పన్ చెప్పారు.

ఏసీసీ సిమెంట్స్‌కు తాఖీదు

(మొదటి పేజీ తరువాయి)

▼ తర్వాత ఆసంస్థ లీజు పొందలేకపోయింది.

▼ మేజర్ మినరల్స్‌కు వేలం ద్వారానే లీజులు కేటాయించాలని 2015 జనవరి 12న కేంద్రం సవరణ నిబంధన తెచ్చింది. అప్పటికే ఎల్‌వోఐ పొందినవాళ్లు.. రెండేళ్లలో లీజు దక్కించుకోవాలని, లేకపోతే ఎల్‌వోఐలు రద్దవుతాయని పేర్కొంది. ఏసీసీ లీజు పొందలేకపోవడంతో హైకోర్టును ఆశ్రయించి స్టే పొందింది. తర్వాత 2021లో కేంద్రం మరో సవరణ తీసుకొచ్చింది. దీనిప్రకారం వేలం ద్వారానే లీజులన్నీ కేటాయించాలని స్పష్టం చేసింది. అనంతరం 2022లో ఏసీసీని అదానీ సిమెంట్స్ కొనుగోలు చేసి, చక్రం తిప్పింది. దీంతో ఏసీసీకి 997.08 హెక్టార్లలో లీజు కేటాయిస్తూ 2023 నవంబర్ 15న ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది.

ఎన్నికలకు ముందు భారతి సిమెంట్ లీజులు

- ఏసీసీకి కేటాయించిన లీజు విధానాన్ని చూపించి, భారతి సిమెంట్ కూడా ఎన్నికలకు ముందు రెండు లీజులు దక్కించుకుంది.
- మొదట్లో వైఎస్సార్ కడప జిల్లా కమలాపురం మండలంలోని 509.18 ఎకరాలు, ఎర్రగుంట్ల మండలంలోని 235.56 ఎకరాల్లో రెండు సున్నపురాయి లీజుల కోసం రఘురామ్ సిమెంట్స్ లిమిటెడ్ దరఖాస్తు చేసుకోగా, దానికి 2008లో నాటి ప్రభుత్వం ఎల్‌వోఐ జారీచేసింది. తర్వాత వాటిని భారతి సిమెంట్ కార్పొరేషన్ కొనుగోలుచేసింది. అది అన్ని అనుమతులూ పొందలేకపోయింది.
- 2015, 2021లలో కేంద్రం తీసుకొచ్చిన సవరణ నిబంధనలు భారతి సిమెంట్ లీజులకు వర్తిస్తాయి. అయితే ఏసీసీకి 2023లో లీజు కేటాయించినట్లే 2024 ఫిబ్రవరి 2న భారతి సిమెంట్‌కు రెండు సున్నపురాయి లీజులు కేటాయిస్తూ జగన్ ప్రభుత్వం ఉత్తర్వు జారీచేసింది.
- 2024 మార్చిలో ఎన్నికల షెడ్యూల్ వెలువడగా, దానికి నెల ముందు భారతి సిమెంట్‌కు లీజులు మంజూరయ్యాయి.
- రామ్‌కో సిమెంట్స్‌కూ 2024 మార్చి 15న ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలం జయంతిపురంలోని 267.30 ఎకరాల్లో సున్నపురాయిని లీజుని వైకాపా ప్రభుత్వం మంజూరుచేసింది.

ఆ లీజులెలా.. ప్రశ్నించిన కేంద్రం

2015, 2021లో తెచ్చిన సవరణ నిబంధనలకు విరుద్ధంగా ఏపీలో నాలుగు సున్నపురాయి లీజులు మంజూరైనట్లు గుర్తించిన కేంద్ర గనులశాఖ.. దీనిపై రాష్ట్రప్రభుత్వాన్ని వివరణ అడిగి, చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. దీంతో ఏపీ ప్రభుత్వం న్యాయసలహా తీసుకుంది. ఆ లీజులు రద్దుచేయాలని తేల్చారు. దీంతో ఇప్పుడు తొలుత ఏసీసీకి నోటీసు ఇచ్చారు. రెండువారాల్లో ఆ సంస్థ వివరణ ఇచ్చాక, కేంద్ర నిబంధన ప్రకారం ఆ లీజును రద్దుచేస్తారు. భారతి సిమెంట్‌కు చెందిన రెండు లీజులు, రామ్‌కో సిమెంట్‌కు చెందిన ఓ లీజుకూ ఇదే నిర్ణయం అమలవుతుంది.

■ ఈ నాలుగూ రద్దయ్యాక.. ఆ వివరాలను కేంద్ర గనులశాఖకు తెలియజేయనున్నారు. తర్వాత ఆ లీజులకు ఈ- వేలం నిర్వహిస్తారు.

లేబుళ్ల తయారీలో ఆ ముగ్గురూ కీలకం

- రమేష్, అల్లాబక్ష్, సతీష్‌ల పాత్రపై రెండో ఛార్జిషీట్‌లో సిట్

ఈనాడు, అమరావతి: నకిలీ మద్యం కేసులో సిట్ విజయవాడలోని ఎక్సైజ్ కోర్టులో శుక్రవారం రెండో ఛార్జిషీట్ దాఖలుచేసింది. ఇందులో తాండ్ర రమేష్ (ఏ15), షేక్ అల్లాబక్ష్ (ఏ16), చెక్కా సతీష్ (ఏ17)ల పాత్ర, నకిలీ మద్యం వ్యవహారంలో వీరి ప్రమేయం గురించి పేర్కొంది. లేబుళ్ల డిజైన్, ముద్రణలో వీరిది కీలకపాత్ర.

ఛార్జిషీట్‌లో ఏముందంటే..

నకిలీ మద్యం కేసులో కీలక నిందితుడైన జనార్దనరావు తరఫున తిరుమలశెట్టి శ్రీనివాసరావు (ఏ13) హైదరాబాద్‌లో మద్యం సీసాలపై అతికించే లోగోలు, లేబుళ్ల తయారీ వ్యవహారాలన్నీ పర్యవేక్షించాడు. తాండ్ర రమేష్‌బాబు ఫొటోగ్రాఫర్. ఒంగోలు నుంచి వచ్చి హైదరాబాద్‌లో స్థిరపడ్డాడు. అక్కడ పరిచయమైన శ్రీనివాసరావు రమేష్‌ను లోగోతో లేబుళ్లు తయారుచేసేవారు ఎవరైనా తెలుసా అని అడిగాడు. షేక్ అల్లాబక్ష్‌ను రమేష్ పరిచయం చేశాడు. శ్రీనివాసరావు పంపించిన కొన్ని లిక్కర్ లేబుల్స్‌ను అల్లాబక్ష్‌కు అందజేయగా వీటి తయారీకి అనుమతి అవసరమని చెప్పాడు. అనుమతి ఉన్నట్లు రమేష్ నకిలీ లేఖ తెచ్చి ఇచ్చాడు. లేబుల్స్ తయారీకి అడ్వాన్సుగా శ్రీనివాసరావు రూ.20వేలు రమేష్‌కు పంపాడు. అతను తన కమీషన్ తీసుకుని, మిగిలిన సొమ్ము అల్లాబక్ష్‌కు పంపించాడు.

- కొన్నాళ్లకు శ్రీనివాసరావు అల్లాబక్ష్‌తోనే మాట్లాడుకుని లేబుల్స్ తీసుకునేవాడు. అల్లాబక్ష్‌తో లేబుళ్లను తిరిగి డిజైన్ చేయించి, బ్యాచ్ నంబర్లు మార్చి ముద్రించారు.
- యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి మండలం వంకమామిడికి చెందిన సతీష్ కుమార్‌కు హైదరాబాద్‌లో ఆర్జే డిజైన్స్ అండ్ ప్రింటింగ్ ప్రెస్ ఉంది. 2022లో శ్రీనివాసరావు ఎక్కువ డబ్బు ఆశ చూపించి నకిలీ లేబుల్స్ డిజైన్ చేసి, ముద్రించేందుకు ఒప్పించాడు.





టెక్ తమ్మిన, 'మదర్సన్' సంస్థల శిలాఫలకాలను ఆవిష్కరిస్తున్న మంత్రి లోకేశ్. చిత్రాల్లో ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, మంత్రి డీబీవీ స్వామి, ఎమ్మెల్యే కొండ్రు మురళి, విశాఖ మేయర్ పీలా శ్రీనివాసరావు, సంస్థల ప్రతినిధులు

ప్రపంచంతో విశాఖ పోటీ

కాగ్నిజెంట్ రాక.. టెక్ యుగానికి నాంది

- 'ఏపీ ఎకనమిక్ పవర్‌హౌస్'గా విశాఖను తీర్చిదిద్దుతాం
- ఐటీ సంస్థల శంకుస్థాపన కార్యక్రమంలో మంత్రి నారా లోకేశ్



టెక్ తమ్మిన, నాన్‌రెల్ టెక్నాలజీస్, ఏసీఎన్ ఇన్ఫోటెక్ హెల్త్‌కేర్ సంస్థలకు భూమి పూజ చేస్తున్న మంత్రి లోకేశ్. చిత్రంలో శ్రీభరత్, గంటా శ్రీనివాసరావు, డీబీవీ స్వామి, సంస్థల ప్రతినిధులు

ఈనాడు-విశాఖపట్నం, మధురవాడ-న్యూస్‌టుడే: 'ఆంధ్రప్రదేశ్ ఎకనమిక్ పవర్ హౌస్‌గా విశాఖను తీర్చిదిద్దుతాం. విశాఖకు కాగ్నిజెంట్ రాక ఒక కీలక మైలురాయిగా నిలుస్తోంది. ఇది టెక్ యుగానికి నాంది అవుతుంది. కూటమి ప్రభుత్వంపై నమ్మకంతో ఐటీ సంస్థలు ముందుకొస్తున్నాయి. ఏపీ ఐటీ, జీసీసీ హబ్‌గా విశాఖ మారుతుంది. దేశంలోని ఇతర నగరాలతో కాదు. . ప్రపంచంతో విశాఖ పోటీ పడుతుంది. 'వై నాట్ వైజాగ్' అనే ప్రశ్నతో ఐటీ కంపెనీలు, పరిశ్రమలను ఈ ప్రాంతానికి ఆహ్వానిస్తున్నాం' అని ఐటీ, విద్యాశాఖామంత్రి నారా లోకేశ్ అన్నారు. విశాఖలోని మధురవాడ, ఐటీహిల్స్ ప్రాంతాల్లో శుక్రవారం పలు ఐటీ సంస్థలకు ఆయన భూమి పూజలు చేసి శిలాఫలకాలను ఆవిష్కరించారు. ముందుగా హిల్-2లోని మహతి భవనంలో కాగ్నిజెంట్ తాత్కాలిక కార్యకలాపాలను ప్రారంభించారు. అనంతరం ఐటీ ప్రధాన కూడలిలో హిల్-2 దిగువన టెక్ తమ్మిన సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్, ఇమేజిన్నోవేట్ కంపెనీ, ఏసీఎన్ హెల్త్‌కేర్ ఆర్‌సీఎం సర్వీస్, నాన్‌రెల్ టెక్నాలజీస్, రుషికొండ పెబుల్ బీచ్ సముదాయాల వద్ద సత్వా గ్రూప్ కంపెనీ, హరిత భవన సముదాయాల నుంచి కాపులుప్పాడకు వెళ్లే రోడ్డులో ఫ్లూయెంట్ గ్రిడ్ లిమిటెడ్, మదర్సన్ టెక్నాలజీ, క్వార్క్స్ టెక్నోసాఫ్ట్ సంస్థల నిర్మాణ పనుల శిలాఫలకాలు ఆవిష్కరించారు. అనంతరం హరిత భవన సముదాయాల పక్కన ముఖ్యమంత్రి నారా చంద్రబాబుతో కలిసి 'కాగ్నిజెంట్' శాశ్వత భవన నిర్మాణ భూమి పూజలో పాల్గొన్నారు. కాగ్నిజెంట్‌లో పనిచేసే ఉద్యోగులంతా విశాఖ బ్రాండ్ అంబాసిడర్లుగా మారాలని లోకేశ్ పిలుపునిచ్చారు.

నా పుట్టినరోజున...దావోస్‌లో చర్చ

'కాగ్నిజెంట్ సంస్థ ఇక్కడ ఏర్పాటు చేయడం వెనుక ఓ కథ నడిచింది. ఈ ఏడాది జనవరి 23న నా పుట్టిన రోజున దావోస్‌లో కాగ్నిజెంట్ సీఈవో రవికుమార్, కాగ్నిజెంట్ అమెరికాస్ ప్రెసిడెంట్ గుమ్మడి సూర్యని కలిసి విశాఖలో క్యాంపస్ ఏర్పాటు చేయాలని కోరాను. వారు చాలా ప్రశ్నలు లేవనెత్తారు. అన్నింటికీ సమాధానమిచ్చాను. సీఎం అనుమతితో ఎకరం భూమిని 99 పైసలకు కేటాయిస్తామని చెప్పడంతో ఆశ్చర్యానికి గురయ్యారు. అవకాశం ఇస్తే విశాఖలో చరిత్ర సృష్టిస్తామని సీఎంతో చెప్పాను. పదకొండు నెలల్లో కాగ్నిజెంట్ విశాఖకు వచ్చింది. ఇది కేవలం భూమిపై పెట్టుబడి కాదు. అవకాశాల్లో పెట్టుబడి. మన యువత భవిష్యత్తుకు తయారవుతున్న ఒక అవకాశం' అని లోకేశ్ పేర్కొన్నారు.

చంద్రబాబు నేతృత్వంలో పనిచేయడం మా అదృష్టం

'చంద్రబాబు మంత్రివర్గంలో స్వేచ్ఛగా రాష్ట్రాభివృద్ధికి అనుకూలంగా మంత్రులంతా నిర్ణయాలు తీసుకుంటున్నాం. కూటమి ప్రభుత్వం తీసుకునే ఏ నిర్ణయమైనా వేగంగా పనులు పూర్తి చేసేలా ఉంటుంది. చంద్రబాబు నాయకత్వంలో పనిచేయడం మా అదృష్టం. నాయకత్వమనేది కేవలం ప్రకటనలకే పరిమితం కాదు. ఫలితాలు సాధించే వరకు శక్తివంచన లేకుండా కృషి చేస్తాం. దానికి ఈ రోజు ప్రత్యక్ష సాక్ష్యం కాగ్నిజెంట్. సీఎం పెద్ద పెద్ద కలలు కంటారు. ఏపీ దానిని ఇంకా పెద్దగా సాధిస్తుంది' అని లోకేశ్ తెలిపారు.



సత్వ వింటేజ్ సంస్థ నిర్మాణ పనుల శిలాఫలకం ఆవిష్కరణలో మంత్రి లోకేశ్, నేతలు

సీఎం జీపీఎస్ లాంటివారు...

'చంద్రబాబు జీపీఎస్ లాంటి వారు. నిరంతరం అందరినీ అభివృద్ధి వెంట పరుగులు పెట్టిస్తారు. దాదాపు 5 లక్షల ఐటీ ఉద్యోగాలు ఈ ప్రాంతానికి వచ్చేలా అడుగులు వేస్తున్నాం. ప్రధాని మోదీ దేశాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తుంటే, చంద్రబాబు రాష్ట్ర పురోగతి కోసం అహర్నిశలూ శ్రమిస్తున్నారు. ఇద్దరూ 25 ఏళ్ల యువకుల్లా పరుగులు పెడుతున్నారు' అని లోకేశ్ పేర్కొన్నారు.

నిష్కళంక రాజకీయాలకు ప్రతిరూపం వాజ్‌పేయీ

- మంత్రులు పయ్యావుల, సత్యకుమార్ యాదవ్

అనంత గ్రామీణం (తపోవనం), న్యూస్‌టుడే: దేశం సమైక్యత, సమగ్రత, సార్వభౌమాధికారాలతో విరాజిల్లాలని తపించిన గొప్ప నాయకుడు మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయీ అని ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ కొనియాడారు. సుదీర్ఘకాలం రాజ్యసభ, లోక్‌సభల్లో సభ్యుడిగా సేవలందించిన ఏకైక నాయకుడిగా చరిత్ర సృష్టించారని గుర్తుచేశారు. అనంతపురంలోని గుత్తిరోడ్డులో శుక్రవారం వాజ్‌పేయీ విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. ఆయనతో పాటు మంత్రి సత్యకుమార్ యాదవ్, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్‌లు పాల్గొన్నారు. మంత్రి పయ్యావుల మాట్లాడుతూ.. శత్రుదేశాలతో పోరాడాలంటే అణుశక్తి అవసరమని గుర్తించి, పోఖ్రాన్ అణుపరీక్షలు నిర్వహించిన ఘనత వాజ్‌పేయీకే దక్కుతుందన్నారు. మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ.. వాజ్‌పేయీ ప్రధాని అయిన తర్వాత దేశంలో విప్లవాత్మక మార్పులు వచ్చాయన్నారు. పీవీఎన్ మాధవ్ మాట్లాడుతూ.. వాజ్‌పేయీ తుది శ్వాస వరకు క్రమశిక్షణతోనే జీవించారని, నేటితరం నాయకులు ఆయన్ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ పట్టాభిరామ్, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యేలు కాలవ శ్రీనివాసులు, అమిలినేని సురేంద్రబాబు, దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, అహుడా ఛైర్మన్ టీసీ వరుణ్ తదితరులు పాల్గొన్నారు.



వాజ్‌పేయీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రులు కేశవ్, సత్యకుమార్ యాదవ్, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ తదితరులు

అధికారుల మాటలకు.. క్షేత్రస్థాయి పరిస్థితికి పొంతనే లేదు!

- యూరియా విషయంలో రైతులకు ఇబ్బందులు
- యాప్ అందుబాటులోకి తేవడానికి అభ్యంతరమేంటి?
- సీఎం పదేపదే చెబుతున్నా వ్యవసాయశాఖ మౌనమే

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో అన్ని చోట్లా ఎరువులు ఉన్నాయని వ్యవసాయ అధికారులు లెక్కలు చెబుతున్నారు. కానీ.. క్షేత్రస్థాయిలో దుకాణాలు, రైతు సేవా కేంద్రాలు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో రైతులు అడిగితే యూరియా నిల్వల్లేవనే సమాధానం వస్తోంది. అధికారులు చెప్పే వివరాలు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచితే దుకాణదారులు ఎవరూ నిల్వలు లేవని చెప్పేందుకు సాహసించరు. ఒకవేళ లేవని వారు అబద్ధం చెప్పినా.. ఇదిగో మీ వద్ద ఎంత ఎరువు ఉందో యాప్‌లో కన్పిస్తోందని రైతులు నిలదీస్తారు. యాప్‌లోనే ఫిర్యాదు చేసేందుకు అవకాశమిస్తే మండల అధికారులు వెంటనే స్పందిస్తారు. కానీ, వ్యవసాయశాఖ మాత్రం యాప్‌ను అన్నదాతలకు అందుబాటులో తేవడం లేదు. వివరాలన్నీ ఆన్‌లైన్‌లో ఉండాలని, ఆధునిక సాంకేతికతను కర్షకులకు చేరువ చేయాలని ఓ వైపు సీఎం చెబుతున్నా.. ఎరువుల నిల్వల విషయంలో వ్యవసాయశాఖ మౌనమే వహిస్తోంది. యాప్‌ను కర్షకులకు అందుబాటులోకి తేవకపోవడంలో అభ్యంతరం ఏమిటో అర్థం కావడం లేదని వ్యవసాయశాఖలోని అధికారులే పేర్కొంటున్నారు.

1.93 లక్షల టన్నులు ఉందని చెబుతున్నా..

రాబోయే 21 రోజుల అవసరాలకు 1.16 లక్షల యూరియా అవసరం కాగా, 1.93 లక్షల టన్నులు అందుబాటులో ఉందని వ్యవసాయ శాఖ చెబుతోంది. అయినా రాష్ట్రంలోని కొన్ని చోట్ల యూరియా కొరత వేధిస్తోంది. ఇటీవల ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో రైతులు పెద్ద ఎత్తున బారులు తీరి నిలబడాల్సిన పరిస్థితి వచ్చింది. రబీ వినియోగం ఇప్పుడిప్పుడే పెరుగుతోంది. ఈ నేపథ్యంలో రైతులకు యాప్ అందుబాటులోకి తెస్తే వాస్తవం ఏంటో రైతులకు తెలుస్తుంది.

మెస్సీ మేనియా

నేడు ఉప్పల్‌లో ఫుట్‌బాల్ స్టార్ సందడి ● ప్రత్యేక ఆకర్షణగా రేవంత్ X లియోనెల్ పోటీ

భారత ఫుట్‌బాల్ అభిమానులంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్న సమయం ఆసన్నమైంది. ఫుట్‌బాల్ స్టార్..కోట్ల హృదయాలను కొల్లగొట్టిన మాంత్రికుడు లియోనెల్ మెస్సి భారత పర్యటనకు వచ్చేస్తున్నాడు. శుక్రవారం అర్ధరాత్రి దాటాక అతడు కోల్‌కతాలో అడుగుపెడతాడు. శనివారం మెస్సికి ఆతిథ్యమివ్వడానికి హైదరాబాద్ ఉప్పల్ స్టేడియం సిద్ధమైంది.

ఈనాడు, హైదరాబాద్: దిగ్గజ ఫుట్‌బాలర్.. అర్జెంటీనా కెప్టెన్ మెస్సి రానుండటంతో హైదరాబాద్‌కు ఫుట్‌బాల్ జ్వరం పట్టుకుంది. తమ అభిమాన ఆటగాడు మెస్సిని ఎప్పుడెప్పుడు చూద్దామా అంటూ ఆసక్తిగా ఎదురుచూస్తోంది. బాలీవుడ్, టాలీవుడ్ సెలబ్రిటీలతో పాటు ఫుట్‌బాల్ అభిమానులంతా శనివారం ఉప్పల్ స్టేడియానికి వరుస కట్టనున్నారు.

సాయంత్రం 4 గంటలకు రాక

- 'ద గోట్ టూర్'లో భాగంగా భారత పర్యటనకు వస్తున్న మెస్సి శనివారం ఉప్పల్ స్టేడియంలో సందడి చేయనున్నాడు. కోల్‌కతా పర్యటన ముగించుకుని సాయంత్రం 4 గంటలకు మెస్సి ప్రత్యేక విమానంలో హైదరాబాద్ చేరుకుంటాడు. అక్కడినుంచి తాజ్ ఫలక్‌నుమా హోటల్‌కు వెళ్తాడు. అక్కడ 'మీట్ అండ్ గ్రీట్' తర్వాత రాత్రి 7 గంటలకు మెస్సి, లూయిస్ సువారెజ్ (ఉరుగ్వే), రోడ్రిగో డి పాల్ (అర్జెంటీనా) ఉప్పల్ స్టేడియానికి వస్తారు.



- ముందుగా 20 నిమిషాల పాటు ఎగ్జిబిషన్ మ్యాచ్ ఉంటుంది. ఏడుగురు చొప్పున సింగరేణి ఆర్ఆర్-9, అపర్ణ మెస్సి ఆల్‌స్టార్స్ జట్ల తరఫున చిన్నారులు ఫుట్‌బాల్ మ్యాచ్ ఆడతారు. చివరి అయిదు నిమిషాల ఆటలో రేవంత్‌రెడ్డి, మెస్సి పాల్గొంటారు. పెనాల్టీ షూటౌట్ విజేతలకు మెస్సి బహుమతులు అందజేస్తాడు. చివర్లో మెస్సిని రేవంత్ సన్మానిస్తారు. మెస్సి ఆదివారం తెల్లవారుజామున ముంబయికి వెళ్తాడు. తెలంగాణ సీఎం రేవంత్ స్వతహాగా ఫుట్‌బాల్ ఆటగాడు కావడం, ఆయన ప్రత్యేకశ్రద్ధ తీసుకోవడంతో యంత్రాంగమంతా అప్రమత్తమైంది.

నేటి మధ్యాహ్నం రాహుల్ రాక

లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ మెస్సిని చూసేందుకు వస్తున్నారు. నేటి మధ్యాహ్నం శంషాబాద్ విమానాశ్రయానికి రానున్న ఆయనను సీఎం రేవంత్‌రెడ్డి, ఇతర కాంగ్రెస్ నేతలు కలవనున్నారు. అక్కడినుంచి తాజ్ ఫలక్‌నుమా హోటల్‌కు వెళ్తారు. అనంతరం ఉప్పల్ స్టేడియానికి వచ్చి మ్యాచ్ వీక్షించి... రాత్రికి దిల్లీ వెళ్తారు.

‘లక్ష్య’ అథ్లెట్ లోకేశ్‌కు రజతం


లోకేశ్

పలాస క్రీడలు, న్యూస్‌టుడే: ‘ఈనాడు’ సీఎస్ఆర్ కార్యక్రమం ‘లక్ష్య’ పారా క్రీడాకారుడు మంత్రా లోకేశ్ అంతర్జాతీయ వేదికపై సత్తా చాటాడు. దుబాయ్‌లో జరుగుతున్న ఆసియా యూత్ పారా గేమ్స్ హైజంప్ టీ42 విభాగంలో అతడు రజత పతకం గెలుచుకున్నాడు. లోకేశ్ 1.6 మీటర్లు ఎగిరి రెండో స్థానంలో నిలిచాడు. పలాస మండలం రెంటికోటకు చెందిన లోకేశ్.. 2024 డిసెంబరులో థాయ్‌లాండ్‌లో జరిగిన ప్రపంచ ఎబిలిటీ స్పోర్ట్స్ యూత్ గేమ్స్‌లో హైజంప్‌లో 1.57 మీటర్లతో స్వర్ణం, లాంగ్‌జంప్‌లో 3.75 మీటర్లు దూకి రజతం సాధించాడు.

వినేశ్ మళ్లీ రెజ్లింగ్‌లోకి..


వినేశ్

దిల్లీ: స్టార్ రెజ్లర్ వినేశ్ ఫొగాట్ రెజ్లింగ్‌లోకి పునరాగమనం చేయనుంది. 2028 ఒలింపిక్స్‌లో పోటీపడడం కోసం తాను రిటైర్మెంట్‌ను వీడుతున్నట్లు ఆమె శుక్రవారం ప్రకటించింది. 31 ఏళ్ల వినేశ్ (50కేజీ) నిరుడు పారిస్ ఒలింపిక్స్‌లో ఫైనల్ చేరినా.. 100 గ్రాముల బరువు ఎక్కువున్న కారణంగా అనర్హతకు గురైన సంగతి తెలిసిందే. ఒలింపిక్ పతక కల చెదరడంతో తీవ్ర వేదనకు గురైన ఆమె.. ఆటకు గుడ్‌బై చెప్పి, రాజకీయాల్లో చేరింది. హరియాణా నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికైంది. ఇప్పుడు తిరిగి రెజ్లింగ్‌లోకి రావాలని నిర్ణయించుకుంది. “పారిస్ ఒలింపిక్సే నీకు ఆఖరా అని జనం అడుగుతూనే ఉన్నారు. కానీ ఇంతకాలం నా దగ్గర సమాధానం. ఒత్తిడి, అంచనాల భారం వల్ల నేను మ్యాట్‌కు దూరం కావాల్సివచ్చింది. కాస్త విశ్రాంతి లభించింది. బాగా ఆలోచించాక నేను ఇంకా ఆటను ప్రేమిస్తున్నానని అర్థమైంది. నేనింకా పోటీ పడాలనుకుంటున్నా” అని వినేశ్ చెప్పింది. రెట్టించిన ఉత్సాహంతో 2028 లాస్‌ఏంజెలెస్ ఒలింపిక్స్ దిశగా ప్రయాణం ప్రారంభిస్తానని తెలిపింది. “లాస్‌ఏంజెలెస్ ఒలింపిక్స్‌కు సన్నద్ధమవుతా. ఈసారి నా కుమారుడు నా జట్టులో ఉంటాడు. వాడే నాకు అతి పెద్ద ప్రేరణ” అని వినేశ్ చెప్పింది. ఆమె జులైలో మగబిడ్డకు జన్మనిచ్చింది.

స్క్వాష్ ప్రపంచకప్ సెమీస్‌లో భారత్

చెన్నై: స్క్వాష్ ప్రపంచకప్‌లో భారత్ సెమీఫైనల్‌కు దూసుకెళ్లింది. శుక్రవారం క్వార్టర్స్‌లో 3-0తో దక్షిణాఫ్రికాను ఓడించింది. మొదట మహిళల సింగిల్స్‌లో జోష్న చిన్నప్ప 7-4, 7-4, 7-2తో టీజెన్ రసెల్‌ను ఓడించింది. పురుషుల సింగిల్స్‌లో అభయ్ సింగ్ 7-1, 7-6, 7-4తో డెవాల్డ్‌పై నెగ్గి ఆధిక్యాన్ని రెట్టింపు చేశాడు. తర్వాత మహిళల సింగిల్స్‌లో అనహత్ 7-3, 7-3, 7-4తో హేలీ వార్డ్‌పై గెలిచి భారత్‌కు విజయాన్ని అందించింది. పూల్ మ్యాచ్‌ల్లో స్విట్జర్లాండ్, బ్రెజిల్‌ను ఓడించి భారత్ క్వార్టర్స్ చేరింది. 2023 ప్రపంచకప్‌లో కాంస్యం గెలవడమే ఇప్పటిదాకా భారత్‌కు ఉత్తమ ప్రదర్శన.

భారత్‌కు పదో స్థానం

శాంటియాగో: ఎఫ్ఐహెచ్ జూనియర్ మహిళల హాకీ ప్రపంచకప్‌ను భారత్ పదో స్థానంతో ముగించింది. శుక్రవారం 9-10 స్థానాల వర్గీకరణ మ్యాచ్‌లో 1-2తో స్పెయిన్ చేతిలో ఓడింది. స్పెయిన్ తరఫున నటాలియా (16వ), కానాల్స్ (36వ) గోల్స్ కొట్టారు. భారత్ జట్టులో కనిక సివాచ్ (41వ) సఫలమైంది. డిఫెన్స్‌లో విఫలమైన భారత్.. ఆరంభంలోనే స్పెయిన్‌కు అవకాశం ఇచ్చి ఓటమిని కొనితెచ్చుకుంది.

పురుషుల జట్టు విజయంతో..

స్టెలెన్‌బోష్ (దక్షిణాఫ్రికా): దక్షిణాఫ్రికా పర్యటనను భారత్ హాకీ జట్టు విజయంతో ముగించింది. తొలి టెస్టులో 5-2తో గెలిచిన భారత్.. రెండో టెస్టును 2-2తో డ్రా చేసుకుంది. మొదటి టెస్టులో శైలానంద్ లక్రా, ఆదిత్య అర్జున్, అమిత్ రోహిదాస్.. రెండో టెస్టులో హర్మన్‌ప్రీత్ సింగ్ సత్తా చాటారు. ఆఖరిదైన స్నేహపూర్వక మ్యాచ్‌లో భారత్ 4-1తో దక్షిణాఫ్రికాను ఓడించింది. సుఖ్‌జీత్, అమిత్, హార్దిక్, మన్‌దీప్ సింగ్ గోల్స్ సాధించారు.

కివీస్‌దే రెండో టెస్టు

వెల్లింగ్టన్: వెస్టిండీస్‌తో మూడు టెస్టుల సిరీస్‌లో ఆతిథ్య న్యూజిలాండ్ 1-0 ఆధిక్యంలోకి వెళ్లింది. రెండో టెస్టులో కివీస్ 9 వికెట్ల తేడాతో విండీస్‌ను చిత్తు చేసింది. మూడో రోజు, శుక్రవారం ఓవర్‌నైట్ స్కోరు 32/2తో రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన విండీస్ 128 పరుగులకే ఆలౌటైంది. హోడ్జ్ (35), గ్రీవ్స్ (25), కింగ్ (22) మాత్రమే చెప్పుకోదగ్గ స్కోర్లు చేశారు. జాకబ్ డఫీ (5/38), మైకేల్ రే (3/45) విండీస్ పతనాన్ని శాసించారు. 56 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని కివీస్ ఒక వికెటే కోల్పోయి ఛేదించింది. కాన్వే (28 నాటౌట్) రాణించాడు. తొలి ఇన్నింగ్స్‌లో విండీస్ 205 పరుగులకు ఆలౌట్ కాగా.. కివీస్ 278/9 వద్ద డిక్లేర్ చేసింది. సిరీస్‌లో తొలి టెస్టు డ్రా అయింది. మౌంట్ మాంగనుయ్‌లో ఈనెల 18న మూడో టెస్టు ఆరంభం కానుంది.

భారత్.. ఆరో స్థానానికి

దుబాయ్: ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ర్యాంకింగ్స్‌లో భారత్ ఆరో స్థానానికి పడిపోయింది. తాజాగా వెస్టిండీస్‌తో రెండో టెస్టులో న్యూజిలాండ్ 9 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించడంతో ర్యాంకుల్లో మార్పులొచ్చాయి. తాజా విజయంతో కివీస్ (66.67 శాతం).. శ్రీలంకతో కలిసి ఉమ్మడిగా మూడో స్థానంలో నిలిచింది. భారత్ (48.15) ఒక ర్యాంకు కోల్పోయి ఆరో స్థానానికి చేరుకుంది. పాకిస్థాన్ (50) అయిదో స్థానంలో కొనసాగుతోంది. ఆస్ట్రేలియా (100), దక్షిణాఫ్రికా (75) తొలి రెండు స్థానాల్లో కొనసాగుతున్నాయి.

ఛాంపియన్


మెస్సి

నేడు కోల్‌కతా, హైదరాబాద్‌లో పర్యటించనున్న ఫుట్‌బాల్ స్టార్

భారత్ మెస్సి మాయలో

కోల్‌కతా

భారత ఫుట్‌బాల్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తోన్న ఆ రోజు వచ్చేసింది. అర్జెంటీనా ఫుట్‌బాల్ దిగ్గజం లియోనెల్ మెస్సి శనివారం భారత్‌లో అడుగుపెట్టనున్నాడు. ‘గోట్ టూర్ ఆఫ్ ఇండియా’ అన్న పేరుతో సాగనున్న ఈ పర్యటనలో భాగంగా శనివారం తెల్లవారుజామున అతడు కోల్‌కతా చేరుకుంటాడు. కోల్‌కతా అంతా ఇప్పుడు మెస్సి జపమే చేస్తోంది. 2011 తర్వాత ఈ స్టార్ ఆటగాడు ఇక్కడికి రావడం ఇదే తొలిసారి. కానీ అప్పటిలా ఈసారి ఫుట్‌బాల్ మ్యాజిక్ ఉండదు. మెస్సి 2011లో 85 వేల మందితో కిక్కిరిసిన స్టేడియంలో ఫుట్‌బాల్ మ్యాచ్ ఆడాడు. వెనెజులాతో జరిగిన ఆ ఫిఫా స్నేహపూర్వక మ్యాచ్‌లో అర్జెంటీనా 1-0తో విజయం సాధించింది. అయితే ఈసారి టూర్ షెడ్యూలులో భాగంగా మెస్సి సీరియస్ మ్యాచ్ ఆడబోవట్లేదు. ఈసారి అంతా ప్రమోషనల్ కార్యక్రమమే. ఇందులో వాణిజ్య కోణమే ఎక్కువ. శనివారం మొదలయ్యే గోట్ పర్యటన సోమవారం ముగుస్తుంది. అయితే మెస్సి సీరియస్ ఫుట్‌బాల్ మ్యాచ్ ఆడకున్నా.. ఫుట్‌బాల్‌ను ఎంతగానో ప్రేమించే కోల్‌కతా నగరానికి అతడి రాక ఎంతో ఉత్తేజాన్నిస్తుందనడంలో సందేహం లేదు. శనివారం అతడు సాల్ట్‌లేక్ స్టేడియంలో 45 నిమిషాల కార్యక్రమంలో పాల్గొంటాడు. ఇందుకోసం 78 వేల సీట్లను అందుబాటులో ఉంటారు. మొత్తం 72 గంటల కంటే తక్కువే భారత్‌లో గడిపే మెస్సి.. కోల్‌కతాతో పాటు హైదరాబాద్, ముంబయి, దిల్లీల్లో పర్యటిస్తాడు. మెస్సితో పాటు అతడి ఇంటర్ మియామీ జట్టు సహచరులు రోడ్రిగో డిపాల్, లూయిస్ సువారెజ్ వస్తున్నారు. ఈ పర్యటనలో మెస్సి.. ముఖ్యమంత్రులు, కార్పొరేట్ దిగ్గజాలు, బాలీవుడ్ సెలెబ్రిటీలు, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని కలుస్తాడు.


కోల్‌కతాలో ఓ అభిమాని ఇలా..

గోట్ టూర్ ఇలా..

నేడు కోల్‌కతా, హైదరాబాద్‌లో..

మెస్సి బృందం కోల్‌కతాలో ఫైవ్‌స్టార్ హోటల్‌లో బస చేస్తుంది. లేక్‌టౌన్‌లో తన 70 అడుగుల విగ్రహాన్ని మెస్సి వర్చువల్‌గా ఆవిష్కరిస్తాడు. భద్రత కారణాల రీత్యా మెస్సి అక్కడికి వెళ్లట్లేదు. మెస్సి ఆ తర్వాత సాల్ట్‌లేక్ స్టేడియంలో జరిగే కార్యక్రమంలో పాల్గొంటాడు. ఉదయం పది గంటలకు అరంభమయ్యే ఈవెంట్లో మెస్సి.. టీమ్‌ఇండియా మాజీ కెప్టెన్ గంగూలీ, బాలీవుడ్ స్టార్ షారుఖ్ ఖాన్, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమత బెనర్జీలను కలుస్తాడు. శనివారం కోల్‌కతాలో కార్యక్రమం ముగియగానే మెస్సి హైదరాబాద్ బయలుదేరతాడు. ఫలక్‌నుమా ప్యాలెస్‌లో జరిగే కార్యక్రమంలో పాల్గొంటాడు. ఆ తర్వాత గోట్ కప్ పేరుతో ఉప్పల్ స్టేడియంలో నిర్వహించే ఎగ్జిబిషన్ ఫుట్‌బాల్ మ్యాచ్‌లో ఆడతాడు. ఉప్పల్ స్టేడియంలో రాత్రి 7 గంటలకు మొదలయ్యే ఈ మ్యాచ్‌లో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా ఆడతారు.

14న ముంబయిలో..

మెస్సి ఆదివారం ముంబయిలో పలు కార్యక్రమాల్లో పాల్గొంటాడు. అక్కడ ధార్మిక కార్యక్రమం కోసం నిర్వహించే ఫ్యాషన్ షోలో మెస్సిని చూడొచ్చు. అతడు క్రికెట్ క్లబ్ ఆఫ్ ఇండియాలో క్రికెట్ స్టార్లతో పికిల్‌బాల్ ఆడతాడు. ఇందులో సచిన్ కూడా ఉంటాడని సమాచారం. మెస్సి ఆ తర్వాత వాంఖడే స్టేడియంలో జరిగే ఈవెంట్లో పాల్గొంటాడు. అక్కడ 60 మంది పిల్లలు పాల్గొనే కోచింగ్ క్లినిక్‌లో అతడు పాలుపంచుకుంటాడు.

15న దిల్లీలో..

తన పర్యటన ఆఖరి అంచెలో మెస్సి దిల్లీలో అరుణ్ జైట్లీ స్టేడియంలో జరిగే ఈవెంట్‌కు హాజరవుతాడు. అక్కడ కూడా చిన్నారులకు ఓ కోచింగ్ క్లినిక్‌ను నిర్వహించనున్నారు. మెస్సి.. ఆ తర్వాత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని కలవడంతో గోట్ పర్యటన ముగుస్తుంది.

మెస్సి భారత్‌కు వస్తున్నాడు.. ఈ వార్త వినగానే మన అభిమానుల్లో ఎక్కడా లేని ఉత్సాహం.. ఆ ఉత్సాహం స్థాయి ఎంత అంటే.. భారీ విగ్రహం పెట్టేంత. ఒక ఫొటోకు రూ.10 లక్షలు ఇచ్చేంత. ఎలాగైనా టికెట్ సాధించేంత, మన ఆటగాడు కాదు.. కనీసం భారత సంతతి ప్లేయర్ అయినా కాదు! మరి మెస్సికి ఎందుకింత క్రేజ్. అతడి పర్యటనపై ఎందుకింత ఆసక్తి!

వాళ్లంటే ఎందుకీ ప్రేమ!

క్రికెట్‌ను విపరీతంగా ఆరాధించే భారత్‌లో ఫుట్‌బాల్ ఆట కూడా ఉంది. కానీ ఆరాధించే స్థాయిలో లేదు. భారత ఫుట్‌బాల్ జట్టులో ఎవరున్నారో కూడా తెలియకపోవచ్చు. అలాంటిది విదేశీ ఆటగాడు మన గడ్డపై అడుగుపెడుతుంటే ఈ స్థాయిలో హడావుడి ఆశ్చర్యం కలిగించేదే. కానీ భారత్‌కు ఇదేం కొత్త కాదు. గతంలో డీగో మారడోనా (అర్జెంటీనా), పీలే (బ్రెజిల్) లాంటి దిగ్గజాలకు మన అభిమానులు బ్రహ్మరథం పట్టారు. మనవాళ్లలాగే భావించి వారిని చూసేందుకు, వారితో ఫొటోలు దిగేందుకు పోటీపడ్డారు. ఇప్పుడా వంతు లియోనెల్ మెస్సిది. మన దేశంలో పర్యటించడం మెస్సికి కూడా ఇది రెండోసారి. 2011లో వెనిజువెలాతో స్నేహపూర్వక మ్యాచ్ ఆడేందుకు కోల్‌కతా వచ్చాడు. ఈసారి అతడి పర్యటన నాలుగు నగరాలకు విస్తరించింది. అభిమానులతో అతడు మరింత మమేకం కానున్నాడు.

ఇంగ్లిష్ ఫుట్‌బాల్ లీగ్, లా లిగా, బండెస్ లిగా లాంటి టోర్నీలకు భారత్‌కు ఎలాంటి సంబంధం లేదు. కానీ భారత్‌లో ఆ లీగ్‌లను అనుసరించే వారి సంఖ్య గణనీయంగా ఉంటుంది. వాళ్లు ప్రతి మ్యాచ్‌ను ఫాలో అవుతారు. ఏ ఆటగాడు ఆ క్లబ్‌లో ఏ ఆటగాడు ఆడతాడో తెలుసుకుంటారు. భారత్‌లో ఎక్కువగా ఆడేది క్రికెటే అయినా అభిమానుల్లో అంతర్లీనంగా ఫుట్‌బాల్‌పై ప్రేమ ఉండడమే ఇందుకు కారణం. ఒకప్పుడు ఈ ఆటలో మన జట్టూ సత్తా చాటడం మరో కారణం. కేరళ, బెంగాల్, గోవాల్లో సాకర్‌ను గొప్పగా ఆరాధిస్తారు. బెంగళూరు, చెన్నై, ముంబయిలో చాలా నైట్ క్లబ్‌లు ప్రపంచ వ్యాప్తంగా జరిగే లీగ్ మ్యాచ్‌లను చూసేందుకు అభిమానులకు ఆహ్వానం పలుకుతాయి. ముఖ్యంగా అర్జెంటీనా జట్టు అంటే అభిమానుల్లో ఏదో తెలియని ప్రేమ. ఈ దేశానికి ప్రపంచకప్‌ను అందించిన తర్వాత మెస్సికి అభిమానుల్లో క్రేజ్ మరింత పెరిగింది. మెస్సిని మన ఆటగాడే అన్నంతగా ఫాలో అవుతూ ఉంటారు ఇక్కడి ఫ్యాన్స్. మారడోనా, పీలే, మెస్సిలను కేవలం వారి ఆట చూసి మాత్రమే అభిమానించట్లేదు. వారి వ్యక్తిత్వం, నేపథ్యానికి ఆకర్షితులై ఇష్టపడుతున్నారు. ఎదుగుదలకు అవసరమైన హార్మోన్ల లోపంతో బాధపడినా.. గ్లోబల్ స్టార్‌గా ఎదిగిన మెస్సి అభిమానులకో మార్గదర్శి.. పేదరికం నుంచి పైకొచ్చిన మారడోనా.. కాళ్లకు బూట్లు వేసుకోకుండా ఆడే స్థితి నుంచి ప్రపంచ స్థాయి ప్లేయర్ అయిన పీలే జీవితాలు అభిమానులను బాగా ప్రభావితం చేశాయి.


మారడోనాతో గంగూలీ


పీలే

తన అద్భుతమైన ఆటతో అభిమానులను మైమరిపించిన మేటి ఆటగాడు డీగో మారడోనా. 1986లో అర్జెంటీనా ప్రపంచకప్ గెలవడంలో కీలకమయ్యాడు. అతడి వారసత్వాన్ని ఇప్పుడు మెస్సిలో చూస్తున్నారు భారత అభిమానులు. మారడోనా మాదిరే మెస్సి కూడా అర్జెంటీనాకు ప్రపంచకప్‌ను అందించాడు. ఈ నేపథ్యంలో అతడు భారత్‌కు రావడం అభిమానులకు ఓ జీవిత కాల అనుభవం. అందుకే మెస్సిని ఒకసారి నేరుగా చూడాలని.. ఎంత ఖర్చైనా ఒక ఫొటో దిగాలని ఉత్సాహంగా ఎదురు చూస్తున్నారు. ఫుట్‌బాల్‌ను ఎంతగానో ప్రేమించే కోల్‌కతాలో మెస్సి రాక సందర్భంగా 70 అడుగుల విగ్రహం ఆవిష్కరించనుండడం మరో విశేషం. క్రికెట్లో కపిల్ దేవ్, సునీల్ గావస్కర్, సచిన్ తెందుల్కర్, మహేంద్ర సింగ్ ధోని, విరాట్ కోహ్లి, రోహిత్‌శర్మ లాంటి స్టార్లకు ఇలాంటి గౌరవం దక్కలేదు. అందుకే ఈ అర్జెంటీనా సూపర్‌స్టార్ ఒక విదేశీ సెలబ్రిటీగా మాత్రమే భారత్‌కు రావట్లేదు. అభిమానుల్లో ఆట పట్ల ప్రేమను మరింత పెంచడానికి, ఉత్సాహాన్ని నింపడానికి, ఫుట్‌బాల్ క్రీడా సంస్కృతికి ప్రేరణగా నిలవడానికి మన గడ్డపై కాలుమోపుతున్నాడు. ఈ మూడు రోజుల పర్యటనలో మెస్సి అలా ర్యాంప్ వాక్ చేసినా అభిమానులకు సంతోషమే.. తన విగ్రహాన్ని తానే ఆవిష్కరించుకున్నా ఆనందమే.. ఎగ్జిబిషన్ మ్యాచ్‌లో బరిలో దిగినా కనువిందే.

– ఈనాడు క్రీడావిభాగం

మెస్సి.. ఆ ఇద్దరు అభిమానులు

కోల్‌కతా: అభిమానానికి హద్దులుండవు. ముఖ్యంగా క్రీడల్లో తమ దేశానికి చెందిన ప్లేయర్లు కాకపోయినా అభిమానులు మాత్రం అవేమీ చూడరు. వారికి తెలిసింది ఆరాధనే. లియొనల్ మెస్సినే ఇందుకు ఉదాహరణ. అతడికి భారత్‌లో వేలాది మంది అభిమానులు ఉన్నారు. కానీ శనివారం కోల్‌కతాకు రానున్న ఈ అర్జెంటీనా సూపర్ స్టార్‌ని కలిసే అవకాశం ఇద్దరికి మాత్రమే దక్కింది. అందులో ఒకరు ఇచ్చాపుర్‌కు చెందిన టీ అమ్మే శిబ్ శంకర్ పాత్రా కాగా.. మరొకరు సివిల్ ఇంజనీర్ షామీంద్ర ఘోష్.


మెస్సి టీ స్టాల్


శిబ్ శంకర్ పాత్రా

శిబ్ శంకర్ పాత్రా మెస్సికి వీరాభిమాని. అతడేం కుర్రాడు కాదు వయసు 56 ఏళ్లు. ఒకప్పుడు క్లబ్ స్థాయిలో ఫుట్‌బాల్ ఆడిన అతడికి అర్జెంటీనా అన్నా.. మెస్సి అన్నా వల్లమాలిన అభిమానం. పాత్రా టీ స్టాల్ నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. 2011లో వెనిజువెలా-అర్జెంటీనా మధ్య కోల్‌కతాలోని సాల్ట్‌లేక్ స్టేడియంలో స్నేహపూర్వక మ్యాచ్ జరిగిన సందర్భంగా పాత్రా తన మూడంతస్తుల భవంతిని అర్జెంటీనా జెండా రంగులతో నింపేశాడు. తన టీ స్టాల్ ఎదుట భారీ మెస్సి విగ్రహాన్ని ఏర్పాటు చేశాడు. ఈ టీ స్టాల్ లోపల గోడలు, వార్డ్‌రోబ్‌లతో సహా అంతా అర్జెంటీనా జెండా రంగుల మయమే. అభిమానులు ఇక్కడికి వచ్చి టీ తాగి.. మెస్సి విగ్రహంతో ఫొటోలు తీసుకుంటూ ఉంటారు. పాత్రా కుమార్తె నేహా కూడా మెస్సికి అభిమానే. ఈ ఏడాది పాత్రాకు గుండెకు శస్త్ర చికిత్స జరగడంతో అతడి కుటుంబం కూడా ఆర్థిక ఇబ్బందుల్లో పడింది. అయినా కూడా శనివారం జరిగే కార్యక్రమానికి రూ.7 వేలు పెట్టి రెండు టికెట్లు కొన్నాడు. ఈ స్థితిలో ఈ ఈవెంట్‌ను నిర్వహిస్తున్న శతద్రు దత్తా అతడికి ఫోన్ చేసి మెస్సిని నేరుగా కల్పిస్తానని చెప్పాడు. దీంతో పాత్రా ఆనందానికి అవధుల్లేకుండాపోయింది.

కేఫ్‌నే అడ్డాగా మార్చి..

మెస్సి కోసం తన కేఫ్‌ను అంకితం చేశాడు కోల్‌కతాకే చెందిన షామీంద్ర ఘోష్. డమ్ డమ్ విమానాశ్రయానికి సమీపంలో ఉండే మెస్సి థీమ్‌తో ఉండే డమ్ డమ్ లియో కేఫ్ గురించి ఫుట్‌బాల్ అభిమానులకు సుపరిచితం. తన జీవితంపై మెస్సి ముద్ర ఎంతో ఉందని అతడంటాడు. ఇంజనీరింగ్ చేసినా ఉద్యోగం రాకపోవడంతో ఘోష్ నిరుత్సాహంతో మునిగిపోయాడు. ‘రాత్రికి రాత్రే నేను విజయవంతం కాలేదు. ఎంతో శ్రమ, తపన వల్లే సాధ్యమైంది’ అని మెస్సి చెప్పిన మాటలు షామీంద్ర జీవితాన్ని మార్చాయి. దీంతో మెస్సి థీమ్‌తో కేఫ్‌ను నెలకొల్పాడు. ఈ కేఫ్ గోడల మీద మెస్సి జీవితంలో కీలక ఘట్టాలకు సంబంధించిన ఫొటోలు ఉంటాయి.


షామీంద్ర ఘోష్

అభిమానులకు ఇదో గుడి లాంటిది” అని షామీంద్ర తెలిపాడు. ఇప్పుడు మెస్సిని కలవబోతుండడంతో అతడు ఉబ్బితబ్బిబ్బవుతున్నాడు.

వైభవ్ వీరబాదుడు


వైభవ్ సూర్యవంశీ

- 14 సిక్స్‌లతో రికార్డు
- యూఏఈపై భారత్ ఘనవిజయం
- అండర్-19 ఆసియాకప్

95 బంతుల్లో 171 పరుగులు

దుబాయ్: యువ ఆటగాడు వైభవ్ సూర్యవంశీ సంచలన బ్యాటింగ్ కొనసాగుతూనే ఉంది. 14 ఏళ్ల ప్రాయంలోనే విధ్వంసక బ్యాటింగ్‌తో క్రికెట్ అభిమానులను ఆకర్షిస్తోన్న ఈ చిన్నోడు.. మరోసారి రెచ్చిపోయాడు. అండర్-19 ఆసియాకప్ ఆరంభ మ్యాచ్‌లో శుక్రవారం ఆకాశమే హద్దుగా చెలరేగిపోయాడు. వైభవ్ (171; 95 బంతుల్లో 9×4, 14×6) భారీ శతకం బాదేయడంతో భారత్ 234 పరుగుల తేడాతో యూఏఈని చిత్తు చిత్తుగా ఓడించింది. ఓపెనర్ వైభవ్‌తో పాటు ఆరోన్ జార్జ్ (69), విహాన్ మల్హోత్రా (69) మెరవడంతో మొదట భారత్ 6 వికెట్ల నష్టానికి 433 పరుగులు చేసింది. అండర్-19 వన్డేల్లో భారత్‌కు ఇదే అత్యధిక స్కోరు. వైభవ్ 56 బంతుల్లోనే శతకం సాధించాడు. యూఏఈ బౌలింగ్‌ను తుత్తునియలు చేసిన అతడు.. ఏకంగా 14 సిక్స్‌లు కొట్టాడు. అండర్-19 స్థాయిలో ఇక ఇన్నింగ్స్‌లో ఓ బ్యాటర్ అత్యధికంగా కొట్టిన సిక్స్‌లివే. అంబటి రాయుడు (177, 2002లో ఇంగ్లాండ్‌పై) తర్వాత యూత్ వన్డేల్లో అత్యధిక స్కోరు సాధించిన భారత బ్యాటర్‌గా వైభవ్ నిలిచాడు. లక్ష్య ఛేదనలో యూఏఈ తేలిపోయింది. 50 ఓవర్లలో 7 వికెట్లకు 199 పరుగులు మాత్రమే చేయగలిగింది. ఉద్దిష్ సురి (78 నాటౌట్) టాప్ స్కోరర్. పృథ్వీ మధు (50) రాణించాడు. యూఏఈ ఓ దశలో 53 పరుగులకే ఆరు వికెట్లు కోల్పోగా.. ఉద్దిష్, పృథ్వీ ఏడో వికెట్‌కు 85 పరుగులు జోడించారు. దీపేశ్ రెండు వికెట్లు పడగొట్టాడు. వైభవ్‌కు ‘ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్’ అవార్డు లభించింది. భారత జట్టు తన తర్వాతి మ్యాచ్‌లో ఆదివారం పాకిస్థాన్‌ను ఢీకొంటుంది.

సంక్షిప్త స్కోర్లు

భారత్ ఇన్నింగ్స్: 433/6 (వైభవ్ సూర్యవంశీ 171, విహాన్ మల్హోత్రా 68, ఆరోన్ జార్జ్ 69, వేదాంత్ త్రివేది 38, అభిజ్ఞాన్ కుందు 32 నాటౌట్; యుగ్ శర్మ 2/75, ఉద్దిష్ సురి 2/77)

యూఏఈ ఇన్నింగ్స్: 199/7 (ఉద్దిష్ సురి 78 నాటౌట్, పృథ్వీ మధు 50; దీపేశ్ 2/21)


సిరాజ్ 3/21

మెరిసిన సిరాజ్, తన్మయ్

ముంబయిపై హైదరాబాద్ గెలుపు

పుణె: సయ్యద్ ముస్తాక్ అలీ టీ20 టోర్నీలో ముంబయికి హైదరాబాద్ షాకిచ్చింది. కెప్టెన్ మహ్మద్ సిరాజ్ (3/21) విజృంభించడంతో సూపర్‌లీగ్ మ్యాచ్‌లో హైదరాబాద్ 9 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. సిరాజ్‌తోపాటు మిలింద్ (2/36), తనయ్ త్యాగరాజన్ (2/27) విజృంభించడంతో మొదట ముంబయి 18.5 ఓవర్లలో 131 పరుగులకే ఆలౌటైంది. యశస్వి జైస్వాల్ (29), హార్దిక్ తమోర్ (29), సూర్యాంశ్ (28) మాత్రమే రాణించారు. తన్మయ్ అగర్వాల్ (75; 40 బంతుల్లో 7×4, 4×6), అమన్ రావు (52 నాటౌట్; 29 బంతుల్లో 5×4, 3×6) మెరుపులతో హైదరాబాద్ 11.5 ఓవర్లలో ఒక వికెటే కోల్పోయి లక్ష్యాన్ని అందుకుంది.

నితీశ్ హ్యాట్రిక్ చేసినా..


నితీశ్

అంబి: నితీశ్ కుమార్‌రెడ్డి (3/17) హ్యాట్రిక్ సాధించినా.. మధ్యప్రదేశ్‌తో గ్రూప్-ఎ మ్యాచ్‌లో ఆంధ్రకు 4 వికెట్ల తేడాతో ఓటమి తప్పలేదు. మొదట ఆంధ్ర 19.1 ఓవర్లలో 112 పరుగులకే కుప్పకూలింది. శ్రీకర్ భరత్ (39), నితీశ్ కుమార్ (25) మాత్రమే చెప్పుకోదగ్గ స్కోర్లు చేశారు. శివమ్ శుక్లా (4/23), త్రిపురేశ్ (3/31), రాహుల్ (2/9) ఆంధ్రను కట్టడి చేశారు. బదులుగా మధ్యప్రదేశ్ 17.3 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని అందుకుంది. ఇన్నింగ్స్ మూడో ఓవర్లో నితీశ్ వరుస బంతుల్లో హర్ష్ (5), హర్‌ప్రీత్ (0), రజత్ పాటీదార్ (0)లను ఔట్ చేసి హ్యాట్రిక్ సాధించాడు. అయితే ఆ తర్వాత రిషబ్ చౌహాన్ (47), రాహుల్ బాథమ్ (35), వెంకటేశ్ అయ్యర్ (22) రాణించి మధ్యప్రదేశ్‌ను గెలిపించారు.

తితిదే అనుబంధ ఆలయాల్లోనూ అన్నప్రసాద వితరణ!

మార్చిలోగా ప్రారంభించే యత్నం



తిరుమల, న్యూస్‌టుడే: తితిదే ఆలయాల్లో భక్తులకు నాణ్యమైన, రుచికరమైన అన్నప్రసాదాల వితరణకు తితిదే ఏర్పాట్లు చేస్తోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలతో 60 అనుబంధ ఆలయాల్లో ప్రారంభించాలని తితిదే నిర్ణయించింది. వాటిలో 12 వరకు ఆలయాల్లో ఇప్పటికే వితరణ జరుగుతోంది. త్వరలో మిగిలినచోట్లా ప్రారంభించేందుకు తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో అనిల్‌కుమార్ సింఘాల్‌లు సమీక్షలు నిర్వహించారు. వితరణ, తయారీకి ముందుకువచ్చే ఇస్కాన్ వంటి ధార్మిక సంస్థలు, మఠాల నిర్వాహకులతో అవగాహన ఒప్పందం చేసుకొనే అంశాన్ని పరిశీలిస్తున్నారు. వచ్చే మార్చికల్లా అన్ని ఆలయాల్లో ప్రారంభించే దిశగా అధికారులు కసరత్తు చేస్తున్నారు. నాటి ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు సూచన మేరకు భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమానికి తితిదే శ్రీకారం చుట్టింది. 1985 ఏప్రిల్ 6న ఈ కార్యక్రమాన్ని ఆయనే ప్రారంభించారు. 1994 ఏప్రిల్ 1న శ్రీవేంకటేశ్వర నిత్యాన్నదానం ట్రస్టుగా ఏర్పడగా తదనంతరం దాన్ని శ్రీవేంకటేశ్వర అన్నప్రసాదం ట్రస్టుగా మార్చారు. మొదట్లో తిరుమలలోని కల్యాణకట్ట ఎదురుగా ఉన్న పాత అన్నదానం కాంప్లెక్స్‌ను వినియోగించేవారు. 2011 జులై 7న అత్యాధునిక వసతులతో నిర్మించిన మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాదం భవనాన్ని నాటి రాష్ట్రపతి ప్రతిభా పాటిల్ ప్రారంభించారు. తిరుమలలో సాధారణ రోజుల్లో 1.80 లక్షల నుంచి 1.90 లక్షలమంది, వారాంతపు రోజుల్లో సుమారు 2.10 లక్షలమంది అన్నప్రసాదాలు స్వీకరిస్తున్నారు. నవంబరు 15 నాటికి ట్రస్టు నిధులు రూ.2,316 కోట్లకు చేరడంతో పథకం విస్తరణకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని, మొదటి ప్రాధాన్యంగా దాతల సహకారం తీసుకుంటామని, వీలుకాకపోతే తితిదేనే సొంతంగా నిర్వహిస్తుందని, అవసరమైన సామగ్రి కొనుగోలు, వంటశాలల నిర్మాణం అంశాన్ని పరిశీలిస్తున్నామని అధికారులు చెబుతున్నారు.

చేనేత, హస్త కళల శాఖ నుంచి తితిదేకు పట్టువస్త్రాలు?

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారిని దర్శించుకునే ప్రముఖులకు కప్పే పట్టువస్త్రాలను రాష్ట్ర చేనేత, హస్తకళల శాఖ నుంచి కొనుగోలు చేయడంపై తితిదే దృష్టిసారించింది. గతంలో కొందరు పట్టు పేరుతో పాలిస్టర్ వస్త్రాలను సరఫరా చేసి అవినీతికి పాల్పడ్డారు. దీనిపై తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు ఆదేశాలతో విజిలెన్స్ విభాగం విచారణ చేయగా అవకతవకలు వెలుగు చూశాయి. ఈ నేపథ్యంలో చేనేత, హస్తకళల అభివృద్ధి శాఖ గౌరవ సలహాదారుగా వ్యవహరిస్తున్న తితిదే బోర్డు సభ్యురాలైన సుచిత్ర ఎల్ల స్పందిస్తూ తితిదేకు అవసరమైన పట్టువస్త్రాలను రాష్ట్ర చేనేత విభాగం నుంచి అందిస్తామని ప్రతిపాదించినట్లు తెలిసింది. నాణ్యమైన పట్టుతో కొన్ని వస్త్రాలు తయారు చేయించి తితిదే బోర్డు సమావేశంలో ఛైర్మన్, సభ్యుల ముందు ఉంచనున్నారు. వాటిని పరిశీలించిన అనంతరం ఒప్పందం చేసుకుంటే అవినీతికి అస్కారం లేకపోవడంతోపాటు పేద చేనేత కార్మికులకు న్యాయం జరిగే అవకాశం ఉంటుందని తితిదే భావిస్తోంది.

నెల రోజుల్లో.. 14వేల మెగావాట్ల విద్యుత్ ప్రాజెక్టులు గ్రౌండింగ్‌కు రెడీ!

- ప్రాజెక్టుల ఏర్పాటు వేగవంతానికి చర్యలు
- భూసేకరణలో ఇబ్బందులపై ప్రధానంగా దృష్టి
- గ్రౌండింగ్‌కు సిద్ధంగా మరో ఆరు

ఈనాడు, అమరావతి: కూటమి ప్రభుత్వం విద్యుత్ ప్రాజెక్టుల గ్రౌండింగ్‌పై దృష్టిపెట్టింది. నిర్దేశిత గడువులోగా ప్రాజెక్టులు పూర్తిచేసేందుకు వాటికి ఉన్న ఇబ్బందులు పరిష్కరించడంపై దృష్టి సారించింది. ప్రాజెక్టుల ఏర్పాటుకు ఉన్న సమస్యలపై సంస్థలతో చర్చించి.. నిర్దేశిత వ్యవధిలో గ్రౌండింగ్ చేయిస్తోంది. విద్యుత్ ప్రాజెక్టుల ఏర్పాటుకు ప్రభుత్వంతో ఒప్పందాలు కుదుర్చుకున్న సంస్థలు ఏళ్లుగా జాప్యం చేస్తున్నాయి. నిర్దేశిత వ్యవధిలో ప్రాజెక్టులు అందుబాటులోకి రాకపోవడంతో వార్షిక విద్యుత్ ప్రణాళిక దెబ్బతింటోంది. దాంతో అధిక ధరకు బహిరంగ మార్కెట్‌లో విద్యుత్ కొనాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. వైకాపా ప్రభుత్వం విద్యుత్ సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకోవడమే తప్ప, వాటిని గ్రౌండింగ్ చేయడంపై దృష్టిపెట్టలేదు.

ఫలితాలిస్తున్న కార్యాచరణ

కూటమి ప్రభుత్వం గత ఏడాది జూన్ నుంచి 33 ప్రాజెక్టులకు ఒప్పందాలు కుదుర్చుకుంది. వాటితో కలిపి ఇప్పటివరకు వివిధ ప్రభుత్వాల హయాంలో అనుమతులు ఇచ్చిన పవన, సౌర, పంప్డ్ స్టోరేజి ప్రాజెక్టులు(పీఎస్‌పీ) ప్రాజెక్టులు నిర్దేశిత వ్యవధిలో గ్రౌండింగ్ చేసేందుకు కసరత్తు చేస్తోంది. వాటితో పాటు కంప్రెస్డ్ బయోగ్యాస్(సీబీజీ) 11,070 టీపీడీ, ఎలక్ట్రోలైజర్స్ 2 గిగావాట్లు, గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్టులు ఒక ఎంఎంటీపీఏ ప్రాజెక్టులనూ నిర్దేశిత వ్యవధిలో గ్రౌండింగ్ చేసేలా కార్యాచరణ ప్రణాళిక రూపొందింది. ప్రాజెక్టుల ఏర్పాటుకు అవసరమైన భూముల సమస్యలపై వారంలో ఒకసారి జిల్లాల కలెక్టర్లతో కాన్ఫరెన్స్ నిర్వహించి సీఎస్ విజయానంద్ సమన్వయం చేస్తుండటంతో ప్రాజెక్టుల గ్రౌండింగ్ వేగవంతమైంది. గత నెల రోజుల్లో 14వేల మెగావాట్ల ప్రాజెక్టులను గ్రౌండింగ్‌కు సిద్ధం చేశారు.

- ఏపీ ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీలోని 'ఫస్ట్ మూవర్స్' కింద 16 ప్రాజెక్టుల ఏర్పాటుకు అవసరమైన భూములను ఆయా సంస్థలకు ప్రభుత్వం అప్పగించింది. ఆ సంస్థలు రూ.97,843 కోట్ల పెట్టుబడులతో ప్రాజెక్టుల ఏర్పాటుకు శంకుస్థాపన చేశాయి. రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ రూ.65 వేల కోట్లు, అయానా రెన్యువబుల్ పవర్ ప్రైవేట్ లిమిటెడ్ కర్నూలులో రూ.4,436 కోట్ల పెట్టుబడులతో ప్రాజెక్టుల నిర్మాణాన్ని ప్రారంభించాయి.
- మరో ఆరు ప్రాజెక్టులు గ్రౌండింగ్‌కు సిద్ధంగా ఉన్నాయి. వాటికి అవసరమైన భూములను అధికారులు సిద్ధం చేశారు. ఆ సంస్థలు రూ.27,960 కోట్ల పెట్టుబడులతో ప్రాజెక్టులు ఏర్పాటు చేయనున్నాయి. ఏఎం గ్రీన్ అమ్మోనియా (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్ రూ.12వేల కోట్లు, అదానీ రెన్యువబుల్ ఎనర్జీ 51 లిమిటెడ్ రూ.8,010 కోట్లతో ప్రాజెక్టు ఏర్పాటు చేయనుంది.
- మరో 23 సంస్థల ప్రాజెక్టులకు భూసేకరణను అధికారులు చేపట్టారు. అది పూర్తయిన తర్వాత ఏపీ ఎన్‌జీఈఎల్ హరిత్ అమృత్ లిమిటెడ్ రూ.22వేల కోట్లు, బొండాడ ఇంజినీరింగ్ లిమిటెడ్ రూ.9వేల కోట్లు, చింతా గ్రీన్ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ రూ.7వేల కోట్ల పెట్టుబడితో ఏర్పాటుచేసే ప్రాజెక్టులతో పాటు మొత్తం రూ.66,320 కోట్ల విలువైన ప్రాజెక్టుల ఏర్పాటుకు అవకాశం ఏర్పడనుంది.

రాష్ట్రంలో విద్యుత్ ఒప్పందాలు.. అమలు తీరు (మెగావాట్లలో)

కేటగిరీ	సామర్థ్యం	పూర్తయినవి	నిర్మాణంలో ఉన్నవి	నిర్మాణం ప్రారంభించాల్సినవి
సౌర	30,130	5,280	7,820	17,030
పవన	18,240	4,390	2,630	11,220
పీఎస్‌పీ	36,210	--	3,530	32,680
	84,580	9,670	13,980	60,930

2024 జూన్ నుంచి అనుమతించిన ప్రాజెక్టులు.. పెట్టుబడి వివరాలు

విద్యుత్ కేటగిరీ	ప్రాజెక్టుల సంఖ్య	ఉత్పత్తి (మె.వా)	పెట్టుబడి (రూ.కోట్లు)	ఉపాధి
పవన విద్యుత్	16	3,505	25,084	5,435
సౌర ప్రాజెక్టులు	15	12,180	60,138	41,260
పీఎస్‌పీలు	7	11,760	58,809	22,690
	38	27,445	1,44,031	69,385

పీఎస్‌పీ ప్రాజెక్టులకు డీపీఆర్‌లు

ప్రభుత్వం అనుమతించిన ఏడు పీఎస్‌పీ ప్రాజెక్టులకు డీపీఆర్‌లు, ప్రీ-ఫీజిబులిటీ స్టడీని చేపట్టారు. ఆయా ప్రాజెక్టుల ద్వారా రూ.82,003 కోట్ల విలువైన పెట్టుబడులను వివిధ సంస్థలు పెట్టనున్నాయి. నవయుగ ఇంజినీరింగ్ కంపెనీ లిమిటెడ్ రూ.19,900 కోట్లు, చింతా గ్రీన్ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ రూ.15,050 కోట్లు, అదానీ హైడ్రో ఎనర్జీ రెండుచోట్ల కలిపి రూ.10,900 కోట్ల పెట్టుబడుల ప్రతిపాదనలు ఉన్నాయి.



గ్రామీణాభివృద్ధి, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖల అధికారులతో చర్చిస్తున్న పవన్ కల్యాణ్

గ్రామీణాభివృద్ధి, తాగునీటి సరఫరా విభాగాల్లోనూ సంస్కరణలు

సమీక్షలో ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్

ఈనాడు, అమరావతి: పంచాయతీరాజ్‌శాఖ తరహాలో గ్రామీణాభివృద్ధి, గ్రామీణ తాగునీటి సరఫరా విభాగాల్లోనూ సంస్కరణలు చేపట్టాలని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ నిర్ణయించారు. క్షేత్రస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పరిపాలన ప్రక్రియలో సంస్కరణలు అవసరమని ఆయన అన్నారు. మంగళగిరిలోని క్యాంపు కార్యాలయంలో పంచాయతీరాజ్‌శాఖ, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ తాగునీటి సరఫరా విభాగాల అధికారులు, ఇంజినీర్లతో ఉప ముఖ్యమంత్రి శుక్రవారం సమావేశమయ్యారు. రెండు విభాగాల్లో ఉద్యోగుల ప్యాటర్న్, క్షేత్ర స్థాయి నుంచి ఉన్నత స్థాయి వరకు ఉన్న హోదాలు తదితర అంశాలపై ఆయన చర్చించారు. 'గ్రామీణాభివృద్ధి విభాగం ద్వారా అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన పనులు వేగవంతం కావాలి. అభివృద్ధిపై ప్రజల్లో సంతృప్తి స్థాయి పెంచే విధంగా మార్పులు, చేర్పులు చేయాలి. స్వచ్ఛ రథం, మ్యాజిక్ డ్రైన్ వంటి కొత్త ఆలోచనలతో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి. ఉద్యోగులకు ప్రోత్సాహకరమైన భరోసా కల్పించే పరిస్థితి తీసుకురావాలి. ప్రజలకు మెరుగైన రోడ్లు, స్వచ్ఛమైన నీరు అందించాలి. జలజీవన్ మిషన్ పనులపై నిరంతర పర్యవేక్షణ ఉండేలా సాంకేతిక పరంగా శాఖలో మార్పులు అవసరం. ఇప్పటికే ఉన్న నీటి సరఫరా పథకాల అమలు సమర్థంగా సాగాలి. నీటి నాణ్యత ప్రమాణాల పరీక్షలు సక్రమంగా చేపట్టాలి' అని పవన్‌కల్యాణ్ ఆదేశించారు.

సంస్కరణలపై నివేదికలివ్వండి

'ఉపాధి హామీ పథకంతో శ్రామికులతోపాటు ప్రజల్లో సానుకూలత పెంచే బాధ్యత ప్రతి ఉద్యోగిపై ఉంది. గ్రామ సభల్లో తీర్మానాల మేరకు చేస్తున్న పనులపై ఎప్పటికప్పుడు సమీక్షలు చేపట్టాలి. చేపట్టే సంస్కరణలు అంతిమంగా ప్రజలకు మేలు కలిగేలా ఉండాలి. గ్రామీణాభివృద్ధి, గ్రామీణ తాగునీటి సరఫరా విభాగాల్లో చేపట్టాల్సిన సంస్కరణలు, ఉత్తమ విధానాలపై నివేదిక ఇవ్వాలి' అని ఉప ముఖ్యమంత్రి ఆదేశించారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనర్ కృష్ణ తేజ, మంత్రి ఓఎస్డీ వెంకటకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విమానయాన విద్యానగరికి అడుగులు

- 500 ఎకరాల్లో అభివృద్ధికి ప్రణాళిక
- 16న ప్రముఖులతో మంత్రి లోకేశ్ భేటీ



ఈనాడు, విజయనగరం: రాష్ట్రంలో ఏవియేషన్ ఎడ్యుకేషన్ సిటీ (విమానయాన విద్యానగరి) ఏర్పాటుకు వడివడిగా అడుగులు పడుతున్నాయి. రాష్ట్ర ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేశ్ ఇటీవల జీఎంఆర్ సంస్థ అధికారులతో దిల్లీలో సమావేశమయ్యారు. ఈ నగరి అభివృద్ధిపై చర్చించారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన ప్రణాళికను ఖరారు చేశారు.

భీమిలి మండలంలోని అన్నవరంలో..

భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయాన్ని జీఎంఆర్ సంస్థ నిర్మిస్తోంది. దీనికి సమీపంలో భీమిలి మండలంలోని అన్నవరం వద్ద విమానయాన విద్యా నగరి ఏర్పాటుకు భూములు అనువుగా ఉన్నాయని ప్రభుత్వం గుర్తించింది. ఇక్కడ విజయనగరం మాన్సాస్ ట్రస్ట్‌కు చెందిన 130 ఎకరాల భూములున్నాయి. వాటికి ఆనుకొని ప్రభుత్వ, ప్రైవేటు భూములు అందుబాటులో ఉండడంతో ఏకంగా 500 ఎకరాల్లో ఈ ప్రాజెక్ట్ ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు.

ప్రభుత్వానికి లేఖ?: మాన్సాస్ ట్రస్ట్ ఛైర్మన్, ప్రస్తుత గోవా గవర్నర్ అశోక్ గజపతిరాజు సైతం విద్యా నగరి ఏర్పాటుకు మాన్సాస్ భూములను లీజు రూపంలో అప్పగించేందుకు సుముఖంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు ప్రభుత్వానికి లేఖ రాసినట్లు సమాచారం. ఇందుకు ట్రస్ట్ ఆస్తులను పర్యవేక్షిస్తున్న దేవాదాయ శాఖ ఆమోదం తెలిపినట్లు తెలిసింది.

జీఎంఆర్ భాగస్వామ్యం..

ఈ ప్రాజెక్టుపై జీఎంఆర్ భాగస్వామ్యంతో ప్రభుత్వం ముందుకెళ్లనుంది. దీనిపై ఈనెల 16న విజయనగరంలో తుది విడత చర్చలు జరగనున్నాయి. మాన్సాస్ ట్రస్ట్ ఛైర్మన్ అశోక్ గజపతిరాజు, జీఎంఆర్ అధినేత గ్రంధి మల్లికార్జునరావుతో మంత్రి లోకేశ్ భేటీ కానున్నారు. చర్చల అనంతరం ఒప్పందం కుదుర్చుకునే అవకాశం ఉంది.

- ఇది కార్యరూపం దాల్చితే ఈ ప్రాంతం విమానయానం, ఏరో స్పేస్, రక్షణ రంగానికి సంబంధించిన విద్య, శిక్షణకు జాతీయ హబ్‌గా మారనుంది. భోగాపురం విమానాశ్రయాన్ని ఆనుకొని విమానయాన విశ్వవిద్యాలయం ఏర్పాటుకు యోచిస్తున్నామని కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు గతంలో ప్రకటించారు. 'ఇది మంచి ప్రాజెక్ట్. జీఎంఆర్ సంస్థ చిన్న అకాడమీలు నిర్వహిస్తున్నా.. ఈ ప్రాజెక్ట్ కార్యరూపం దాల్చితే ఈ రంగంలో ఆసియాలో అతి పెద్దదిగా రికార్డు నెలకొల్పుతుంది. విమాన ఇంజిన్లు, ప్రయోగశాలలు, విద్యార్థుల వసతి గృహాలతో ఏవియేషన్ రంగం అభివృద్ధికి బాటలు పడనున్నాయి. నిరుద్యోగ యువతకు అంతర్జాతీయ స్థాయి ఉపాధి అవకాశాలు లభిస్తాయి' అని మాజీ వింగ్ కమాండర్ శ్రీధర్ 'ఈనాడు'కు తెలిపారు.

విమాన ఛార్జీలపై పరిమితులు విధించే అధికారం ప్రభుత్వానికి ఉంది

అదే ఏకైక పరిష్కారం కాదు: కె.రామ్మోహన్ నాయుడు



లోక్‌సభలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు

దిల్లీ: అసాధారణ పరిస్థితుల్లో విమాన ఛార్జీలపై పరిమితులు విధించే అధికారం ప్రభుత్వానికి ఉందని, అయితే అదే ఏకైక పరిష్కారం కాదని పౌర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు. లోక్‌సభలో 'విమాన ఛార్జీల నియంత్రణకు తగిన చర్యలు' అనే అంశంపై ప్రైవేట్ సభ్యుడు ప్రవేశపెట్టిన తీర్మానంపై శుక్రవారం ఆయన మాట్లాడుతూ, దేశంలో విమానాలు తగినంత సంఖ్యలో లేవని, వీటిని దేశీయంగా తయారుచేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని చెప్పారు. మిగతా దేశాలతో పోలిస్తే.. భారత్‌లోనే విమాన ఛార్జీలు తక్కువగా ఉన్నాయన్న మంత్రి. . పౌర విమానయాన రంగం అభివృద్ధి చెందాలంటే నియంత్రణలు ఉండకూడదని, అప్పుడే మరిన్ని సంస్థలు మార్కెట్లోకి ప్రవేశిస్తాయని చెప్పారు. ప్రభుత్వ అధీనంలోని అలెయన్స్ ఎయిర్.. స్థిర విమాన ఛార్జీల విధానాన్ని పైలట్ ప్రాజెక్టుగా తీసుకొచ్చిందని, ఆ పథకం ప్రయాణికులకు ఏ విధంగా లబ్ధి చేకూర్చనుందో పరిశీలిస్తామని.. ఫీడ్‌బ్యాక్ కూడా తీసుకొని ప్రయివేట్ ఎయిర్‌లైన్స్‌లకు కూడా అలాంటి పథకాన్ని అమలు చేయాలా లేదా అనే అంశాన్ని పరిశీలిస్తామని తెలిపారు. భారత విమానయాన సంస్థలు దాదాపు 1700 విమానాలకు ఆర్డర్లు పెట్టాయని, అంతర్జాతీయ సరఫరా గొలుసులో సమస్యల కారణంగా, వాటి అందజేత ఆలస్యమవుతోందని అన్నారు. వీటి కోసం నిరీక్షించకుండా, మేడిన్ ఇండియా విమానాలు తయారు చేయాలన్నది తమ ప్రభుత్వ సంకల్పమని తెలిపారు. ఇందు కోసం ఇప్పటికే హెచ్ఏఎల్.. రష్యా సంస్థతో ఒప్పందం కుదుర్చుకుందని వెల్లడించారు.

పొందూరు ఖాదీకి జీఐ ట్యాగ్: రామ్మోహన్ నాయుడు

ఇంటర్నెట్‌డెస్క్: పొందూరు ఖాదీకి ప్రతిష్ఠాత్మకమైన భౌగోళిక గుర్తింపు (జీఐ ట్యాగ్) లభించిందని కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు శుక్రవారం ఎక్స్‌లో పోస్ట్ చేశారు. 'శ్రీకాకుళం వాసిగా ఎంతో గర్వించదగ్గ క్షణం ఇది. ఎన్నో సంవత్సరాల నిరీక్షణ, లెక్కలేనన్ని సమావేశాలు, డాక్యుమెంటేషన్, ఫాలోఅప్‌ల తర్వాత పొందూరు ఖాదీకి ప్రతిష్ఠాత్మకమైన జీఐ ట్యాగ్ లభించడం ఎంతో ఆనందంగా ఉంది. ఇది కేవలం ఒక వస్త్రానికి వచ్చిన గుర్తింపు మాత్రమే కాదు.. శ్రీకాకుళం నేత కార్మికుల వారసత్వానికి లభించిన గౌరవం. ఈ జీఐ ట్యాగ్ సాధనలో అండగా నిలిచిన ఖాదీ, గ్రామీణ పరిశ్రమల కమిషన్‌కు ప్రత్యేక ధన్యవాదాలు. తరతరాలుగా ఈ కళను కాపాడిన నేత కార్మికులకు ఈ గౌరవం అంకితం. జీఐ ట్యాగ్.. వారి జీవనోపాధిని మెరుగుపరుస్తుంది. పొందూరు ఖాదీకి ప్రపంచ స్థాయిలో కొత్త వైభవం తెస్తుంది' అని రామ్మోహన్ నాయుడు ఆ పోస్టులో పేర్కొన్నారు.

డిజిటలైజేషన్‌కు ఉద్యోగ సంఘాల ఆమోదం

- పింఛను ప్రయోజనాలు, జీపీఎఫ్ సేవలు మరింత పారదర్శకం
- నూతన విధానంపై ఉద్యోగ సంఘాల నేతలకు వివరించిన అధికారులు



సచివాలయంలో ఆర్థిక శాఖ నిర్వహించిన సమావేశానికి హాజరైన ఉద్యోగ సంఘాల నేతలు

ఈనాడు, అమరావతి: ఉద్యోగుల పదవీ విరమణ ప్రయోజనాలు, జనరల్ ప్రావిడెంట్ ఫండ్ (జీపీఎఫ్) అందించేందుకు ప్రభుత్వం తీసుకొస్తున్న డిజిటలైజేషన్ విధానాన్ని ఉద్యోగ సంఘాలు ఆహ్వానించాయి. లోపాలకు తావు లేకుండా పకడ్బందీగా దీన్ని రూపొందించాలని ఆయా సంఘాల నాయకులు కోరారు. పెన్షనర్ల యాన్యువల్ వెరిఫికేషన్ ప్రక్రియను సైతం మొబైల్‌తో చేసుకునే సదుపాయం కల్పించడంపై సంతోషం వ్యక్తం చేశారు. పదవీ విరమణ ప్రయోజనాల ప్రాసెసింగ్ సిస్టమ్ (ఆర్‌బీపీ), జీపీఎఫ్ డిజిటలైజేషన్‌పై ఆర్థిక శాఖ శుక్రవారం సచివాలయంలో ఉద్యోగ సంఘాల నాయకులతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించింది. వారి నుంచి అభిప్రాయాలు, సూచనలు స్వీకరించింది. ఈ విధానానికి ఉద్యోగ సంఘాల నేతలు ఆమోదం తెలిపారు. కొత్త విధానాన్ని ఆర్థిక శాఖ అధికారులు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ఉద్యోగులకు సంబంధించిన అన్ని అంశాలనూ ఒకే ప్లాట్‌ఫాంపైకి తీసుకొచ్చి సరళీకృతం చేస్తున్నామని వెల్లడించారు. ఉద్యోగి పని చేస్తున్న కార్యాలయంలో కామన్ అప్లికేషన్ ఫారం నింపితే మొత్తం ఎకౌంటెంట్ జనరల్ కార్యాలయం వరకు ప్రాసెస్‌లోనే పూర్తయ్యేలా రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఈ విధానంలో దరఖాస్తును ట్రాక్ చేసుకునే సదుపాయాన్ని ఉద్యోగి మొబైల్‌కి ఇస్తామన్నారు. పెన్షన్ ప్రతిపాదనల్లో ఏదైనా జాప్యమైతే వాటిపై ఫిర్యాదు చేయడానికి నిధి పోర్టల్‌లోనే ఫిర్యాదు సేకరణ విభాగాన్ని ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రస్తుత మాన్యువల్ విధానంలో ఉన్న జాప్యాన్ని, మంజూరులో ఉన్న ఇబ్బందుల్ని, ఆథరైజేషన్, చెల్లింపుల్లో తలెత్తుతున్న సాంకేతిక సమస్యలను అధిగమించడానికి ఈ విధానం ఉపయోగపడుతుందని వివరించారు.

దరఖాస్తు సరళతరం

– విద్యాసాగర్, ఛైర్మన్, ఏపీ ఐకాస

ఆర్థిక శాఖ తీసుకొస్తున్న విధానాన్ని ఆహ్వానిస్తున్నాం. పెన్షన్ ఆర్డర్ నేరుగా అధికారికి పంపించేలా ఉండాలి. పెన్షనర్ ఏ కార్యాలయానికీ వెళ్లే అవకాశం లేకుండా రూపకల్పన చేయాలి. జీఓ-100 ద్వారా పెన్షన్ చెల్లింపులు సరళతరం చేస్తూ ఇచ్చిన నిబంధనలను ఈ విధానంలోనూ చేర్చాలి. పెన్షనర్లకు ఏడాదికోసారి నిర్వహించే పరిశీలన సైతం మొబైల్ ద్వారా చేపట్టేలా సదుపాయం ఉండటం సంతోషకరం.

ఉద్యోగి ఫ్రెండ్లీ ప్రభుత్వం

– బొప్పరాజు వెంకటేశ్వర్లు, ఛైర్మన్, ఏపీ ఐకాస అమరావతి

ఉద్యోగుల ఫ్రెండ్లీ ప్రభుత్వమని నిరూపించుకునే విషయంలో భాగంగా ముందుగా ఈ విధానాన్ని తెచ్చారు. దీనికి సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు. లక్షలాది మంది పెన్షనర్లు, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఇంత త్వరగా చొరవ చూపడం అభినందనీయం.

వెసులుబాటు కల్పించాలి

– హృదయరాజు, అధ్యక్షుడు, ఏపీటీఎఫ్

డిజిటలైజేషన్‌లో పెన్షన్ ప్రతిపాదనలను రెండేళ్ల ముందు కాకుండా ఉద్యోగి చివరి ఇంక్రిమెంట్ పొందిన తర్వాత గానీ, సంవత్సరం ముందుగానీ ప్రతిపాదనలు పంపే అవకాశం కల్పించాలి. సర్వీసు రిజిస్టర్ల నిర్వహణ పకడ్బందీగా ఉండేటట్లు డీడీఓలకు సూచనలు చేయాలి.

2027 జూన్ 26 నుంచి గోదావరి పుష్కరాలు

ఈనాడు, అమరావతి: గోదావరి పుష్కరాలను 2027 జూన్ 26 నుంచి జులై 7 వరకు నిర్వహించేందుకు ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. తితిదే ఆస్థాన సిద్ధాంతి తంగిరాల వెంకటకృష్ణ పూర్ణప్రసాద్ అభిప్రాయం తీసుకోగా.. పుష్కరాలను జూన్ 26 నుంచి జులై 7 వరకు 12 రోజులపాటు నిర్వహించాలన్నారని, ఈ తేదీలను ఖరారు చేయాలంటూ దేవాదాయశాఖ కమిషనర్ ఇటీవల ప్రభుత్వానికి లేఖ రాశారు. ప్రభుత్వం ఆ తేదీలను ఖరారు చేస్తూ గెజిట్ విడుదల చేసింది.

బెంగళూరుకు జగన్

ఈనాడు, అమరావతి: వైకాపా అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి జగన్ శుక్రవారం మరోసారి బెంగళూరుకు వెళ్లారు. బుధవారం ఆయన బెంగళూరు నుంచి తాడేపల్లికి రాగా, మళ్లీ అక్కడికే తిరిగి వెళ్లారు.

ఆకట్టుకునేలా అరటినార సంచులు!



విజయవాడ నగరంలో ఏపీ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ ఎక్స్‌పో-2025లో ఏపీ హ్యాండీక్రాఫ్ట్స్ ఏర్పాటు చేసిన లేపాక్షి స్టాల్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. ప్రదర్శనలో ఈ స్టాల్స్‌ను విభిన్నంగా రూపొందించారు. అరటినార, గుర్రపుడెక్కతో తయారు చేసిన బ్యాగులు, బుట్టలు, ఇతరత్రా వస్తువులను తాళ్ల సాయంతో వేలాడదీసి ప్రదర్శనకు ఉంచారు. రాష్ట్రంలో ఎక్కడ ఏ హస్తకళ ఉందో తెలిపేలా మ్యాప్‌ను రూపొందించారు. ఆయా హస్తకళలపై ఎంతమంది కళాకారులు ఆధారపడుతున్నారో సైతం చెప్పారు. కళంకారి, కొండపల్లి బొమ్మలు, బొబ్బిలి వీణ, తోలుబొమ్మలు సహా 15 ప్రాంతాల్లో రూపొందించే హస్తకళల వివరాలను పొందుపరిచారు.

– ఈనాడు, అమరావతి

తెర మీద.. బయటా.. రజనీకాంత్ హీరోనే

సీఎం చంద్రబాబు శుభాకాంక్షలు

ఈనాడు, అమరావతి: "నా ప్రియమిత్రుడు, లెజెండరీ సూపర్‌స్టార్ రజనీకాంత్‌కు జన్మదిన శుభాకాంక్షలు. తెర మీదా, బయటా ఆయన హీరోనే. ఆయన వ్యక్తిగత ప్రయాణం ఎంత ప్రేరణాత్మకమో, అసాధారణ సినీప్రయాణం కూడా అంతే" అని సీఎం చంద్రబాబు కొనియాడారు. రజనీకాంత్ పుట్టినరోజు సందర్భంగా ఎక్స్ వేదికగా శుక్రవారం ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

మీరిచ్చిన మద్దతుకు కృతజ్ఞతలు: లోకేశ్

"అత్యంత కష్టకాలంలో మా కుటుంబానికి మీరిచ్చిన మద్దతు, చూపిన శ్రద్ధకు హృదయపూర్వక కృతజ్ఞతలు" అని రజనీకాంత్‌కు మంత్రి నారా లోకేశ్ తెలిపారు. రజనీకాంత్ పుట్టినరోజు సందర్భంగా ఎక్స్ వేదికగా ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

పండ్లు, చేపల ఉత్పత్తిలో రాష్ట్రం టాప్

- పండ్ల తోటల సాగులో టాప్ 2 మనమే
- 2024-25 ఆర్‌బీఐ గణాంకాల విడుదల



ఈనాడు, అమరావతి: దేశం మొత్తమ్మీద పండ్ల ఉత్పత్తిలో మన రాష్ట్రం మొదటిస్థానం దక్కించుకుంది. పండ్లతోటల సాగులో రెండో స్థానంలో నిలిచింది. రిజర్వ్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా 2024-25 ఆర్థిక సంవత్సరం గణాంకాలు విడుదల చేసింది. దేశం మొత్తమ్మీద వివిధ అంశాల్లో ఏ రాష్ట్రం ఏ స్థానంలో ఉందో పేర్కొంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం 1.93 కోట్ల టన్నుల పండ్లు ఉత్పత్తి చేస్తూ దేశంలోనే ప్రథమస్థానాన్ని దక్కించుకుంది. తర్వాత మహారాష్ట్ర 1.68 కోట్ల టన్నుల ఉత్పత్తితో రెండోస్థానంలో ఉంది. మధ్యప్రదేశ్ 1.02 కోట్ల టన్నుల ఉత్పత్తితో మూడోస్థానంలో ఉంది.

- 8.07లక్షల హెక్టార్లలో పండ్లతోటలు సాగు చేస్తూ దేశంలో రెండోస్థానంలో ఏపీ ఉండగా 8.96 లక్షల హెక్టార్లలో సాగు చేస్తూ మహారాష్ట్ర మొదటిస్థానంలో ఉంది.

చేపల ఉత్పత్తిలోనూ టాప్

చేపల ఉత్పత్తిలో దేశంలోనే మొదటి స్థానంలో ఏపీ నిలిచింది. రాష్ట్రంలో 51.58 లక్షల టన్నుల చేపల ఉత్పత్తి సాధిస్తున్నాం. ఆ తర్వాత పశ్చిమబెంగాల్ 22 లక్షల టన్నులతో రెండోస్థానంలో, ఉత్తర్‌ప్రదేశ్ 11.60 లక్షల టన్నులతో మూడోస్థానంలో ఉన్నాయి.

రాష్ట్ర స్థూల ఉత్పత్తి రూ.15.93 లక్షల కోట్లు

ప్రస్తుత ధరల వద్ద రాష్ట్ర స్థూల ఉత్పత్తి 2024-25లో రూ.15.93 లక్షల కోట్లుగా రిజర్వు బ్యాంకు పేర్కొంది. స్థిరధరల వద్ద రూ.8.65 లక్షల కోట్లుగా తేల్చింది. సగటున రాష్ట్ర స్థూల ఉత్పత్తి రూ.2,66,240 (ప్రస్తుత ధరల్లో), రూ.1,41,609 (స్థిర ధరల వద్ద)గా పేర్కొంది.

- సగటు రాష్ట్ర నికర ఉత్పత్తి ప్రస్తుత ధరల వద్ద రూ.14.22 లక్షల కోట్లు కాగా స్థిర ధరల వద్ద రూ.7.56 లక్షల కోట్లు
- బియ్యం ఉత్పత్తి 81.59 లక్షల టన్నులు
- ఆహారధాన్యాల ఉత్పత్తి రాష్ట్రం మొత్తమ్మీద 1.17 కోట్ల టన్నులు
- రాష్ట్రవ్యాప్తంగా వరిసాగు 20.77 లక్షల హెక్టార్లు
- సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనలో 74 మార్కులతో ఆంధ్రప్రదేశ్ పదో స్థానంలో ఉంది. తెలంగాణ కూడా ఇదే స్థానంలో నిలిచింది.


సగటు జీవన కాలం 70 ఏళ్లు

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో సగటు జీవనకాలం 70 ఏళ్లు. పురుషులు 68 ఏళ్లు జీవిస్తుండగా, మహిళలు ఐదేళ్లు ఎక్కువగా 73 ఏళ్లు జీవిస్తున్నారు. జాతీయ సగటు కూడా 70 ఏళ్లతో తెలుగు రాష్ట్రాలు సమంగా ఉన్నాయి. అత్యధిక జీవితకాలం ఉన్న జాబితాలో తెలుగు రాష్ట్రాలది 9వ స్థానం.

EENADU Vol: 52, Issue: 123 Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. Founder Ramoji Rao


Hero
VIDA
ప్రతి ఇంట్లో EVOOTER
VIDA VX2 | మారుతున్న INDIA యొక్క స్కూటర్
THE ALL NEW GO 3.4 kWh
ఎక్కువ Range. ఎక్కువ Savings.
VX2 ఇప్పుడు 3 వేరియంట్లలో అందుబాటులో ఉంది
STARTING @JUST ₹84 990*/-
(EXCLUDING STATE SUBSIDY)
WITH BaaS @JUST ₹44 990*/-
& PER KM COST ₹1.24
REMOVABLE BATTERIES
VIDA | BaaS BATTERY AS A SERVICE
4600+ FAST CHARGING STATIONS
600+ OUTLETS
Visit us at: www.vidaworld.com


Symphony
Thinking of Tomorrow
హార్డ్ వాటర్ వల్ల మీ
జుట్టు దెబ్బతింటుందా?
జుట్టు రాలకుండా నియంత్రించే గీజర్లను సమర్పిస్తున్నాము*
9-పొరల నీటి మృదుత్వంతో
ఇన్‌స్టంట్ మరియు స్టోరేజ్ వేరియంట్లలో లభిస్తుంది.
Ai Powered
9-LAYER PUROPOD
₹ 2,000 విలువైన ఉచిత అదనపు ప్యూరోపాడ్ PUROPOD
₹ 2,991 నుండి*
0%
Available at: BAJAJ ELECTRONICS SONOVISION Vijay sales croma amazon Flipkart
మరిన్ని వివరాలకు సంప్రదించండి : 93463 01215, 81609 56557
ఎక్కువ వివరాల కోసం : institutional@symphonylimited.com


క్రిస్మస్ షాపింగ్ చేయండి...
వెండి ఉచితంగా పొందండి
క్రిస్మస్ సంక్రాంతి సంబరాలు
06th DEC'25 TO 15th JAN'26
FREE SILVER
స్పాట్ గిఫ్ట్స్
1500 పైబడి వస్త్రాల కొనుగోలు పై ఉచిత బహుమతులు
సంప్రదాయ వస్త్రాలు
అత్యాధునిక ఫ్యాషన్లు
ఫిజా కాటన్ ₹175
బిట్‌కాయిన్ ₹199
లినెన్ కాటన్ ₹225
పలాజో బాటమ్ 2 Pcs ₹333
లెగ్గింగ్స్ 2 Pcs ₹399
చున్నీస్ 2 Pcs ₹399
CAVALLO parx LINEN CLUB BUY 1 GET 20% OFF BUY 2 GET 30% OFF BUY 3 GET 40% OFF
RARE RABBIT BUY 1 GET 30% OFF
BLACKBERRYS BUY 1 GET 20% OFF BUY 2 GET 30% OFF
ARROW U.S. POLO ASSN. BUY 1 GET 20% OFF BUY 2 GET 30% OFF
UNITED COLORS OF BENETTON BUY 1 GET 20% OFF BUY 2 GET 30% OFF BUY 4 GET 40% OFF
MUFTI BUY 1 GET 25% OFF BUY 2 GET 40% OFF BUY 4 GET 50% OFF
JACK & JONES BUY 1 GET 30% OFF BUY 2 GET 40% OFF BUY 4 GET 50% OFF
KILLER BUY 1 GET 20% OFF BUY 2 GET 30% OFF BUY 3 GET 40% OFF BUY 4 GET 50% OFF
INDIAN TERRAIN BUY 1 GET 10% OFF BUY 2 GET 20% OFF BUY 3 GET 30% OFF BUY 4 GET 40% OFF
UNBELIEVABLE OFFERS On Menswear Brands
ది చెన్నయ్ షాపింగ్ మాల్
క్రిస్మస్ కాంబో ఆఫర్స్
పట్టు శారీస్ - ఫ్యాన్సీ శారీస్ - డిజైనర్ శారీస్ - కాటన్ శారీస్
హ్యాండ్లూమ్ శారీస్ - చుడీదార్స్ - గాగ్రాస్ - డ్రెస్ మెటీరియల్స్ - వెస్టర్న్ వేర్
ఇండో వెస్టర్న్ వేర్ - మెన్స్‌వేర్ - కిడ్స్‌వేర్
A Unit of marri Retail Private Limited
1800 309 9989 | 9000 999 444
ఎం.జి. రోడ్, విజయవాడ

లక్కీ ఉత్సవాలు 20-26

ఈనాడు

లక్కీ ఉత్సవాలు 20-26

విజయవాడ 13-12-2025 శనివారం సిటీ సంపుటి 52 . సంచిక 123

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-50 పేజీలు 24

www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

LADIES WEAR

టీ-షర్ట్స్ 7pcs/₹499	కుర్తీ 10pcs/₹749	వెస్ట్రన్ కార్డ్ సెట్ ₹899/50% OFF
ప్లెయిన్ ధోతీ 6pcs/₹599	ప్రింటెడ్ ధోతీ 6pcs/₹699	డ్రెస్ మెటీరియల్ 6pcs/₹999
ఫ్రాక్ మోడల్ కుర్తీ 6pcs/₹1499	ట్రాక్స్ 5pcs/₹499	చున్నీస్ 6pcs/₹199
కుర్తీ సెట్స్ (3PCS సెట్) 4pcs/₹999	వాటికన్ ట్రౌజర్ బాటమ్ & నైటీస్ 4pcs/₹499	వెస్ట్రన్ షార్ట్ ఫ్రాక్ 4pcs/₹999
వెస్ట్రన్ స్కర్ట్స్ 4pcs/₹999	కాటన్ కుర్తి సెట్ 2pcs/₹1199	ప్రాంజల్ పటియాలా సెట్స్ 2pcs/₹999
నైటీస్ 1pc ₹89	కాలర్ కుర్తీస్ (3XL, 4XL, 5XL) 5pcs ₹999	కలి కుర్తీ (3XL, 4XL, 5XL) 5pcs ₹1299





MENS WEAR

EXCLUSIVE DISCOUNTS on PREMIUM BRANDS

spykar BUY 4 @ 50% OFF

KILLER BUY 4 @ 50% OFF

parx BUY 3 @ 40% OFF

ARROW USA•1851 BUY 2 @ 30% OFF

CRIMSOUNE CLUB — FASHION CLOTHING — BUY 3 @ 30% OFF

FASHION SHIRTS	COTTONS	TROUSERS
3 @ ₹999	3 @ ₹999	3 @ ₹999

BOTTLE T-SHIRTS	TRACKS	SHORTS
4 @ ₹999	4 @ ₹999	3 @ ₹499

BRANDED SHIRTS	BRANDED SHIRTS	OXEMBERG CASUALS
3 @ ₹999	3 @ ₹1499	2 @ ₹1599

BUY 3 @ 20% OFF — TWILLS, COOL COLORS CASUALS, OXEMBERG FORMAL, BLUE JERSEY

BUY 2 @ 40% OFF — WALKER Jeans & Casuals

BUY 2 @ GET 1 — WHITE HOUSE

KIDS WEAR

1+1 STEALS & EXCITING COMBO PACKS!



LUCKY® shopping mall


WOMEN • MEN • KIDS

హోటల్ డి.వి. మేనర్, యం.జి. రోడ్డు,

విజయవాడ.


కొండంత వెలుగు


మనసంత దుర్గమ్మే..



జయహో దుర్గాభవానీ.. భవానీ దీక్షల విరమణ సందర్భంగా రెండోరోజైన శుక్రవారం ఉభయ తెలుగురాష్ట్రాల నుంచి దీక్షాధారులు విజయవాడ ఇంద్రకీలాద్రికి పోటెత్తి తరలివచ్చారు. గిరిప్రదక్షిణ అనంతరం అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా యంత్రాంగం సకల ఏర్పాట్లు చేయడంతో పాటు పర్యవేక్షణ చేశారు. శుక్రవారం ఒక్కరోజే 85 వేల మందికి పైగా భక్తులు దుర్గమ్మను దర్శించుకున్నారు. – ఇంద్రకీలాద్రి, వన్‌టౌన్

రేషన్ బియ్యం పక్కదారి పట్టకుండా చర్యలు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్)కు సంబంధించి విస్తృతంగా తనిఖీలు నిర్వహించాలని జేసీ ఎస్. ఇలక్కియా ఆదేశించారు. రేషన్ బియ్యం అక్రమ రవాణా, నిల్వలను అరికట్టేందుకు పౌరసరఫరాలు, పోలీస్, రెవెన్యూ తదితర శాఖల అధికారులతో నగరంలోని కలెక్టరేట్‌లో శుక్రవారం ఆమె సమీక్షించారు. సరిహద్దు చెక్ పోస్టులకు వచ్చే వాహనాలతో పాటు, క్షేత్రస్థాయిలో కోళ్ల ఫారాలు, చేపల చెరువుల వద్ద విస్తృతంగా తనిఖీ చేయాలని పేర్కొన్నారు. ఎక్కడైనా రేషన్ బియ్యాన్ని పక్కదారి పట్టిస్తే 6ఏ కింద కేసులు నమోదు చేయాలన్నారు. అత్యంత పారదర్శకంగా పీడీఎస్‌ను అమలు చేయాలని సూచించారు.


మాట్లాడుతున్న జేసీ ఇలక్కియా

★ గ్యాస్ అధిక ధరకు విక్రయిస్తే చర్యలు: గృహ అవసరాల గ్యాస్‌ను అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు తేలితే సంబంధిత గ్యాస్ ఏజెన్సీలపై చర్యలు తీసుకుంటామని జేసీ హెచ్చరించారు. గ్యాస్ డెలివరీ బాయ్‌లు వినియోగదారులతో మర్యాదపూర్వకంగా మాట్లాడాలని సూచించారు. గ్యాస్ పంపిణీపై ఎల్‌పీజీ డీలర్లతో ఆమె సమీక్షించారు. డీఎస్‌ఓ పాపారావు, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు విద్యుత్తు బిల్లులు చెల్లించొచ్చు

సూర్యారావుపేట, న్యూస్‌టుడే : రెండో శనివారం, ఆదివారం సెలవు దినాలైనప్పటికీ జిల్లాలోని అన్ని విద్యుత్తు బిల్లుల వసూలు కేంద్రాలు తెరిచి ఉంటాయని ఎస్ఈ యం.హనుమయ్య తెలిపారు. వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే ఇంటి వద్ద నుంచే ఏపీ సీపీడీసీఎల్ కస్టమర్ యాప్, గూగుల్‌పే, ఫోన్ పే, అమెజాన్ పే, బిల్‌డెస్క్ యాప్‌ల ద్వారా చెల్లించవచ్చని ఆయన వివరించారు.

పరిశ్రమించు... పరిశోధించు..!

ఈనాడు, అమరావతి

✦ ప్రైవేటు విశ్వవిద్యాలయాలతో వైద్యశాలల ఒప్పందాలు
✦ ఫలితాలు, మేధస్సు షేరింగ్.. బెంచ్ టు బెడ్‌కు శ్రీకారం

★ విజయవాడ ప్రాంతానికి చెందిన నరేశ్‌కు బయోలాజికల్ సైన్స్ అంటే మక్కువ. తాను చదివే వర్సిటీలో బోధన మాత్రమే ఉండడంతో నిరుత్సాహపడేవాడు. ఇటీవల అత్యధిక పరిశోధనలు ప్రోత్సహించేందుకు ఓ ప్రైవేటు సంస్థ ఒప్పందం చేసుకోవడంతో నరేశ్‌కు మార్గం సుగమమైంది.

★ గుంటూరుకు చెందిన పవన్ అమరావతిలోని ఓ ప్రైవేటు విశ్వవిద్యాలయంలో బయోటెక్నాలజీ చదువుతున్నాడు. కోర్సు పూర్తయ్యాక ఎక్కడ ఉద్యోగంలో చేరాలా అన్న ఆలోచనలో ఉండగా.. ల్యాబ్‌లో జరిగే పరిశోధనలు, అంకురాలకు తోడ్పాటు అందిస్తామంటూ ఓ ప్రముఖ ప్రైవేటు ఆసుపత్రి ఒప్పందం చేసుకుంది. పరిశోధనల్లో తన ఆలోచనలకు సానబట్టే అవకాశం పవన్‌కు దక్కడమే కాదు.. అదే ఆసుపత్రిలో చక్కని ఉద్యోగం పొందేందుకు దోహదపడింది.

కలిసి నడుద్దాం... కొత్తగా పరిశోధిద్దాం.. ఫలితాలు, అంకురాల ఫలాలు సమష్టిగా పంచుకుందాం.. మేధస్సును షేరింగ్ చేసుకుందాం.. మేధోసంపత్తి హక్కులను ఎవరికివారే కాపాడుకుందాం.. అంటూ ముందడుగు వేస్తున్నాయి కొన్ని ప్రైవేటు వైద్యశాలలు. అమరావతి, విజయవాడ పరిసరాల్లోని కొన్ని ప్రైవేటు విశ్వవిద్యాలయాలతో ఒప్పందాలు చేసుకుంటున్నాయి. వైద్యరంగ అనుబంధ కోర్సుల్లో ఆర్థిక సహకారం అందిస్తున్నాయి. బెంచ్ టు బెడ్ పేరుతో సరికొత్త ఫలితాలు సాధిస్తున్నారు.



ఒప్పందాలు ఇలా...
☆ రెండుపక్షాలు సంయుక్త ప్రాజెక్టులు చేపట్టేందుకున్న అవకాశాలను అన్వేషిస్తాయి. ☆ పరిశోధనలకు బాహ్య ఏజెన్సీల నుంచి నిధులు పొందేందుకు ప్రయత్నిస్తాయి. ☆ ప్రతి పరిశోధనకు సంబంధిత సంస్థల పరిశోధన, నైతిక కమిటీల ఆమోదం అవసరం.
☆ విద్య, పరిశోధన కార్యకలాపాల మెరుగుదలకు సంయుక్త ప్రచురణలు, బోధన, పరిశోధన కార్యక్రమాలు, మార్గదర్శకాలు అమలు చేస్తారు. ☆ ఎంవోయూ ఉన్నంతకాలం శాస్త్రీయ సదస్సులు, ఉపన్యాసాలు, విద్యా కార్యక్రమాల్లో పరస్పరం పాల్గొంటారు

నిర్ణీత గడువుతో అడుగులు...
కోర్సును బట్టి ఐదు నుంచి పదేళ్ల పాటు ఒప్పంద గడువు ఉంటోంది. పరస్పర సమ్మతితో పొడిగించుకోవచ్చు లేదా రద్దు చేసుకోవచ్చు. అకడమిక్, బయోలాజికల్ సైన్సెస్‌లో పరిశోధన సహకారం, పరస్పర ప్రయోజన రంగాలను ప్రోత్సహించే ఉద్దేశంతో ఈ విధానం అమలు చేస్తున్నారు. ఇరుపక్షాలు చెరోవైపు నుంచి ఒక్కో ప్రతినిధిని ఏర్పాటు చేసుకుని పర్యవేక్షణ చేస్తుండగా.. మేధోసంపత్తి హక్కులు మాత్రం ఎవరివి వారికే.

పరిశ్రమలు సైతం.. పారిశ్రామిక, వ్యవసాయ రంగాల్లోనూ బయోటెక్నాలజీ పరంగా ఒప్పందాలు కీలకమవుతున్నాయి. తద్వారా విద్యాలయాలను ప్రయోగశాలలుగా మార్చి నిపుణులను తయారు చేసి పారిశ్రామిక అవసరాలు తీర్చడం వీలవుతుంది.

వేదాద్రి సిగలో.. మరో మణిదీపం!

జగ్గయ్యపేట, జగ్గయ్యపేట గ్రామీణం

రెండు తెలుగు రాష్ట్రాల సరిహద్దుల్లో ఉన్న పంచ నారసింహ క్షేత్రంగా విశిష్టత సంతరించుకున్న వేదాద్రి దేవాలయం సిగలో మరో మణిదీపం చేరింది. కొండపై వెలసిన జ్వాలా నారసింహుని సన్నిధికి చేరుకునేందుకు హైదరాబాద్‌కు చెందిన వైద్యుడు ఉప్పలపాటి శ్రీహరి మరికొందరి దాతల సహకారంతో రూ.2 కోట్ల వరకు సమకూర్చిన విరాళంతో ఘాట్ రోడ్డు, ప్రవేశ ద్వారం, కొండపై షెడ్లు నిర్మించారు. బ్రహ్మోత్సవాలు, పవిత్రోత్సవాలు, పుష్కరాల సమయంలో ఇక్కడకు భక్తులు లక్షల్లో తరలి వస్తుంటారు. ప్రతి వారం వేల సంఖ్యలో స్వామివారిని దర్శించుకుంటారు. కృష్ణా నది ఒడ్డున కొలువుతీరిన సాలగ్రామ నరసింహస్వామితో పాటు గర్భాలయంలోని యోగానంద, లక్ష్మీనారసింహమూర్తులు, కొండపైన జ్వాలా ఉగ్రనారసింహమూర్తులతో ఈ క్షేత్రం చారిత్రక విశిష్టత కలిగి ఉంది. భక్తులకు కొంగుబంగారమై వెలసే ఈ స్వామి ముఖ్యంగా అనారోగ్య బాధలను తొలగిస్తాడని భక్తుల విశ్వాసం. అంత విశిష్టతకు మరింత వైభవాన్ని చేకూరుస్తూ నేరుగా వాహనాలు వెళ్లే విధంగా సీసీ రోడ్డుతో పాటు అందమైన ప్రవేశ ద్వారాలను కూడా నిర్మించడంతో భక్తులకు మరింత సౌకర్యం కలిగింది. వీటికి శనివారం త్రిదండి చినజీయర్ స్వామి ప్రారంభోత్సవం చేయనున్నారు. ఆలయ ట్రస్టీగా ఉన్న కేసీపీ సీఎండీ వెలగపూడి ఇందిరా దత్తు ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమానికి మంత్రులు ఆనం నారాయణరెడ్డి, సత్య కుమార్ యాదవ్, ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే శ్రీరాంతాతయ్యతో పాటు దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ హరిభజన్‌లాలు, కలెక్టర్ లక్ష్మీశ హాజరుకానున్నారు. ఈ మేరకు ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఆలయ వర్గాలు తెలిపాయి.


నేడు ప్రారంభించనున్న ఘాట్‌రోడ్డు

జాతీయ లోక్ అదాలత్ నేడు

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే : విజయవాడ న్యాయస్థానాల సముదాయంలో శనివారం జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మండల్ లీగల్ సర్వీసెస్ కమిటీ విజయవాడ ఛైర్మన్, రెండో అదనపు జిల్లా జడ్జి ఎ.సత్యానంద్ తెలిపారు. సివిల్ కేసులు, రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులు, కుటుంబ సమస్యలు, వ్యాపార వివాదాలు, మోటారు వాహనాల ప్రమాదాల కేసులు, ప్రీలిటిగేషన్ కేసులను ఇందులో పరిష్కరిస్తారు. దీనికోసం 16 బెంచ్‌లను ఏర్పాటు చేశారు. ఒక్కో బెంచ్‌లో ఒక న్యాయమూర్తి, ఒక న్యాయవాది, ఒక సామాజిక కార్యకర్త ఉంటారు. వీరు ఇరువర్గాలతో మాట్లాడి, ఆయా కేసులను పరిష్కరిస్తారు. శనివారం ఉదయం 9.30 గంటల నుంచి కార్యక్రమం ప్రారంభమవుతుందని ఎ.సత్యానంద్ తెలిపారు.

చిన్న జెల్లీ.. పెద్ద లొల్లి!

తల్లిదండ్రుల అప్రమత్తతతోనే అడ్డుకట్ట

“జెల్లీలు, చాక్లెట్లు, లాలీపాప్‌లు విక్రయించే.. ఏ చిల్లర దుకాణంలోనైనా చూడండి.. కుప్పలు తెప్పలుగా ఊరూపేరు లేని ఉత్పత్తులే కనిపిస్తున్నాయ్. పిల్లలు అడిగారని ఈ దుకాణాల్లో ఏదిపడితే అది కొనేసి ఇచ్చేసే తల్లిదండ్రులే అధికం. అందుకే.. చిన్నారులను ఆకర్షించేందుకు రకరకాల రూపాల్లో ఈ పంచదార బిళ్లలను.. రంగులు కలిపేసి తయారుచేసి.. సొమ్ము చేసుకుంటున్నారు.”

“విజయవాడ, మచిలీపట్నం, గుంటూరుల్లో రహస్య స్థావరాలు పెట్టి మరీ.. ఈ జెల్లీలు, చాక్లెట్లను తయారు చేసేవారున్నారు. ఐదారేళ్ల కిందట వరకూ వీటిని గుర్తించి.. వరస దాడులతో అధికారులు.. భారీగా నకిలీ సరకు పట్టేసేవారు. ఇప్పుడివి మరింతగా పెరిగాయి. అందుకే.. చిన్నారుల ఆరోగ్యం దృష్ట్యా.. తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి.”

బ్రాండెడ్‌ను పోలినట్లే: ప్రముఖ సంస్థల ఉత్పత్తులను పోలిన పేర్లతోనే ఈ నకిలీ జెల్లీలు, లాలీపాప్‌లు, చాక్లెట్లను తయారు చేస్తున్నారు. అసలైన దాని కంటే ఎక్కువ ఆకర్షించేలా.. రంగుల కవర్లను తొడిగి మోసగిస్తున్నారు.



లిక్విడ్ షుగర్ సొల్యూషన్
పేరుకే పండ్ల రసాల జామ్‌లు అంటారు. కానీ.. జామ్ అనేదే ఉండదిక్కడ. కేవలం లిక్విడ్ షుగర్ సొల్యూషన్‌కు (పంచదార పాకం).. ఎరుపు, పసుపు, నీలం, కాషాయ రంగులు, ఫ్లేవర్లను కలిపి చేసేస్తున్నారు.

ప్రమాదకర రంగులు
సోడియం బెంటోనైట్, కార్బోరెడ్, రోడమైన్-బి, సింథటిక్ రంగులు కలిపేస్తున్నారు. అలర్జీలు, క్యాన్సర్, నాడీ వ్యవస్థ పూర్తిగా దెబ్బతినడం, జీర్ణకోశ వ్యాధులు, గుండె, మూత్రపిండాలు, కాలేయం దెబ్బతింటున్నాయి.

కొనకపోవడమే విరుగుడు: నకిలీ ఉత్పత్తులను అరికట్టడం అధికారులకూ కత్తిమీద సామే. అందుకే.. వీటిని కొనకపోవడమే ఏకైక పరిష్కారం. కొనేవాళ్లు లేకపోతే.. తయారుచేసేవాళ్లూ కనుమరుగైపోతారు.

కిలోకు.. వంద మిల్లీగ్రాములే: ప్రముఖ సంస్థల చాక్లెట్లకు వేటికైనా.. కిలో పదార్థానికి వంద మిల్లీగ్రాములు.. సహజసిద్ధ రంగులనే కలపాలి. కానీ.. ఈ నకిలీ జెల్లీలకు.. కృత్రిమ రంగులను విచ్చలవిడిగా కలిపేస్తూ.. చూడగానే తినాలన్పించేలా చేస్తున్నారు. పైగా.. ప్లాస్టిక్ బొమ్మలను ఇస్తూ.. ఆకర్షిస్తున్నారు.

దిమ్మ తిరగాల్సిందే... విజయవాడ భవానీపురంలో గతంలో వెలుగుచూసిన ఓ కల్తీ జామ్ తయారీ యూనిట్‌ను చూసి.. అధికారులే విస్తుపోయారు. కృష్ణా మిక్స్‌డ్ ఫ్రూట్ జామ్, కృష్ణా మ్యాంగో మిక్స్‌డ్ జామ్ పేర్లతో సిద్ధం చేసిన.. వందల బాక్సులు స్వాధీనం చేసుకున్నారు.
★ ఇక్కడ 30 పెద్ద క్యాన్ల నిండా పంచదార, రంగు కలిపిన మిశ్రమం దొరికింది. ప్రమాదకర రంగులు, ఫ్లేవర్లను గుర్తించారు. – ఈనాడు, అమరావతి

వయసు ఎనభై.. స్ఫూర్తి ఇరవై..



ఆయన వయసు 80 ఏళ్లు.. అయినా నడక, పరుగు పోటీల్లో నవ యువకులతో పోటీ పడతారు. కేవలం ఆరోగ్యం కోసం ప్రారంభించిన వ్యాపకం ఇప్పుడు అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్నారు. మలి వయసులో ఇంటి నాలుగు గోడలకే పరిమితమయ్యే ఎంతో మందికి వయసు ఒక సంఖ్య మాత్రమేనని.. జీవితంతో పోటీపడుతూ నచ్చిన విధంగా విజయాలు సాధించవచ్చని చాటి చెబుతున్నారు.

కనగాల మల్లికార్జునరావు స్వగ్రామం గన్నవరం మండలం బాహుబలేంద్రనిగూడెం. పెద్దఅవుటపల్లిలోని కో-ఆపరేటివ్ బ్యాంకులో ఉద్యోగం చేస్తూ.. మరోవైపు వ్యవసాయం చేసేవారు. ఆయనకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె. 2004లో క్యాన్సర్‌తో భార్య నిర్మలకుమారి మరణానంతరం బాగా కుంగిపోయారు. దీంతో 2008లో పటమటలోని ఆర్టీసీకాలనీకి వచ్చి స్థిరపడ్డారు. నగరంలో ఎస్టీడీ బూత్ ఆపరేటర్‌గా పనిచేశారు. పక్కనే ఉండే వ్యాపారవేత్త శ్రీనివాస్ ఆయనకు ధైర్యాన్ని ఇచ్చి లయోలా కళాశాల మైదానంలో వాకింగ్‌కు తీసుకెళ్లారు. అప్పటి నుంచి రోజూ ఒక గంట వాకింగ్, సాయంత్రం యోగా సాధన చేసేవారు. ఎటువెళ్లినా సైకిల్‌పైనే ప్రయాణం. 2009లో ఉగాది వేడుకల్లో లయోలా మైదానంలో జరిగిన 5 కి.మీ. వాకింగ్ పోటీల్లో మొదటి స్థానంలో నిలిచారు. విజయవాడలో 2016, 2017లో 21 కి.మీ అమరావతి మారథాన్ పోటీల్లో సీనియర్ సిటిజన్ (60+) కేటగిరీలో వరుసగా రెండుసార్లు విజేతగా నిలిచారు. దీనిని 2గంటల 18 నిమిషాల్లో పూర్తి చేశారు.

“జిల్లా మాస్టర్స్ అథ్లెటిక్స్ సంఘంలో 2022లో సభ్యత్వం తీసుకున్నారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో అనేక పతకాలు సాధించి జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌కు ఎంపికయ్యారు. ఇప్పటి వరకు 17 పసిడి, ఒక కాంస్యం గెలిచారు. గత నవంబరులో చెన్నైలో జరిగిన ఏషియన్ మాస్టర్స్ అథ్లెటిక్స్‌లోనూ రెండు కాంస్య పతకాలు సాధించారు.
★ ఇప్పటి వరకు తనకు ఎలాంటి అనారోగ్య సమస్యలు లేవని, క్రీడా పోటీలతో సమాజంలో గౌరవం లభిస్తోందని' కనగాల మల్లికార్జున రావు చెబుతున్నారు.”
- విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే

అంతులేని... అదృశ్యం!

తప్పిపోయిన వారిలో దొరకని ఆచూకీ


ఈనాడు, అమరావతి

★ సింగ్‌నగర్ యువతి (20).. తన ప్రియుడితో కలసి ఇంటి నుంచి వెళ్లిపోయింది. పెళ్లి చేసుకునేందుకు ఇద్దరూ తిరుపతి వెళ్లారు. ఆమె తల్లిదండ్రుల ఫిర్యాదుతో పోలీసులు కేసు కట్టారు. యువకుడి సెల్ టవర్ లొకేషన్ తిరుపతి రావడంతో.. పోలీసులు వెళ్లి ఇద్దరినీ తీసుకొచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు.

★ జగ్గయ్యపేట మండల యువతి (22) కనిపించడం లేదని తల్లిదండ్రులు ఠాణాలో ఫిర్యాదు చేశారు. అదే గ్రామ యువకుడితో కలసి వెళ్లిపోయిందని తేలగా.. వారి సీడీఆర్ ఆధారంగా ఆచూకీ తెలుసుకుని తీసుకొచ్చారు.

	2022	2023	2024	2025
★ తప్పిపోయిన వారు	1,338	1,609	1,214	861
✦ దొరికిన వారు	1,232	1,507	1,116	699
✪ ఆచూకీ దొరకని వారు	106	102	98	162

మహిళలు, బాలికలు అధికం...
తప్పిపోతున్న వారిలో ఎక్కువ మంది మహిళలు, బాలికలే. 2025లో ఇంటి నుంచి వెళ్లిన వారిలో 162 మంది ఆచూకీ దొరకలేదు. వీరిలో 55 మంది మహిళలు, మిగిలిన 11 మంది బాలికలున్నారు. గతంతో పోలిస్తే మెరుగుదల కనిపిస్తోంది. 2024లో 1,214 మంది తప్పిపోగా 1,116 మంది ఆచూకీ లభించింది. చాలాప్రాంతాల్లో 10 వేల సీసీ కెమెరాలు పెట్టారు. వీటిలో నమోదైన దృశ్యాలు, కాల్ డేటా ఆధారంగా పోలీసులు కేసులు ఛేదిస్తున్నారు.



వివిధ కారణాలతో కనిపించకుండా పోతున్న వారి సంఖ్య పెరుగుతోంది. ఇందులోనూ ఆచూకీ తెలియని వారి సంఖ్య కూడా ఎక్కువగానే ఉంటోంది. కూటమి ప్రభుత్వం కొలువుదీరాక సాంకేతిక పద్ధతులను ఉపయోగించి తక్కువ సమయంలోనే మిస్సింగ్ కేసులను ఛేదిస్తున్నారు. కనిపించకుండాపోయిన వారిలో మహిళలతోపాటు పురుషులూ ఉండడం గమనార్హం. నగర కమిషనరేట్‌లో ఈ కేసులు ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఈ ఏడాది ఇప్పటికి 861 కేసులు నమోదవగా.. వీరిలో 55 మంది మహిళల వివరాలు తెలియలేదు. గత ఏడాదితో పోలిస్తే ఇది తగ్గింది.

దాదాపు ప్రేమను తిరస్కరించినవే...
☆ తప్పిపోతున్న కేసుల్లో ప్రధానంగా కుటుంబ కలహాలే కారణం. తల్లిదండ్రుల మధ్య సఖ్యత లేమి, పిల్లల ఆలన కొరవడటం, దురలవాట్లకు గురై ఇంటి నుంచి పారిపోతున్నారు. ఇది యుక్త వయస్కుల్లో ఎక్కువగా ఉంది. ☆ ప్రేమ వ్యవహారమూ కారణమే. ఇది యువతుల్లో ఎక్కువగా ఉంది. ఇంట్లో వారు ప్రేమను తిరస్కరించడంతో బయటకెళ్లి పెళ్లి చేసుకుంటున్నారు. ☆ వివాహేతర సంబంధాలూ గణనీయంగా ఉంటున్నాయి. పలువురు మోసగాళ్ల బారిన పడి గృహిణులు వెళ్లిపోతున్నారు. ఇలాంటి వారి జాబితాలో పురుషులూ ఉన్నారు.



జల రవాణా వెలుగులు ఇక్కడే!

పెడన మండలం కమలాపురం లాకులకు ఓ ప్రత్యేకత ఉంది. బంటుమిల్లి ప్రధాన కాలువలో లాంచీలు, పడవల్లో 1910-1970 మధ్య జల రవాణా సాగింది. ఆ తర్వాత రోడ్డు మార్గాలు దశల వారీగా అందుబాటులోకి రాగా నిరాదరణకు గురైంది. కౌతవరంలోని పుల్లేరు నుంచి బంటుమిల్లి ప్రధాన కాలువ 65 కి.మీ పెడన, బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాల మీదుగా కృత్తివెన్నులోని లక్ష్మీపురం వరకు ప్రవహిస్తుంది. దీని పరిధిలో లక్ష ఎకరాలు సాగులో ఉన్నాయి. అప్పట్లో రైతులు పంటలను తరలించడం, ఈ ప్రాంత ప్రజల రాకపోకలకు జల రవాణా ఏకైక మార్గంగా ఉండేది. గుడ్లవల్లేరు, పామర్రుల మీదుగా విజయవాడ వరకు లాంచీల రాకపోకలు సాగేవి. కమలాపురానికి చెందిన కొట్టే వీర బాపనయ్య, తిక్కిశెట్టి రంగారావు, తోట వెంకట్రావులు పడవలు, లాంచీలను నడిపేవారని ఆ గ్రామ ఉప సర్పంచి కొట్టే నారాయణరావు గుర్తు చేశారు. లాంచీల రాకపోకలు రాత్రుళ్లు కూడా సాగేలా కాలువపై కమలాపురం, మల్లేశ్వరం, లక్ష్మీపురం లాకుల వద్ద లస్కర్లు స్తంభంపై లాంతరు వెలిగించి ఉంచడంతో లాంచీల చోదకులు సమీపంలో లాకు ఉందని గుర్తించేందుకు అనువుగా ఉండేది. కమలాపురం లాకుల్లో ఇప్పటికీ ఈ ఇనుప లాంతరు స్తంభం చెక్కు చెదరకుండా గత స్మృతికి చిహ్నంగా నిలిచింది. – పెడన, న్యూస్‌టుడే



ఇ-చలానా.. తేలని లెక్క చానా!

చెల్లించకపోతే తప్పవు కష్టాలు

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే

నో పార్కింగ్ వద్దే వాహనం నిలుపుతారు. ట్రాఫిక్ పోలీస్ లేరు కదాని సిగ్నల్ జంప్ చేస్తారు. ఎవరూ చూడడం లేదని వన్‌వే లోకి దూసుకుపోతారు. అయితే ఎవరు చూడకపోయినా.. కెమెరా కన్ను చూస్తోందని తెలియదు. ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించిన వారిని ఆపి ఒకప్పుడు కేసులు నమోదు చేసేవారు. ఇప్పుడా పరిస్థితి మారింది. కొన్ని చోట్ల సీసీ కెమెరాలు ఆటోమెటిక్‌గా ఉల్లంఘనలను ఫొటోలు తీసి ఇ-చలానాలు పంపిస్తుంటే.. మరి కొన్ని చోట్ల పోలీసులు చరవాణిలో ఫొటోలు తీస్తుంటారు. వాటికి తగ్గట్టుగా జరిమానాలు విధిస్తుంటారు. ఒక్కసారి ఇ-చలానా పడితే దాన్ని తప్పక కట్టాల్సిందే. ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్‌లో ట్రాఫిక్ పోలీసులు నమోదు చేసిన ఇ-చలానాలు వేలల్లో పెండింగ్‌లో ఉన్నాయి. ఇక చెల్లించాల్సిన సొమ్ము రూ.కోట్లలోనే. విజయవాడలోని 5 ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్లు, ఇబ్రహీంపట్నం, జగ్గయ్యపేట, నందిగామ పీఎస్‌ల పరిధిలో అధికారులు ఇ-చలానాలు నమోదు చేస్తున్నారు. వీటిలో జరిమానాల సొమ్ము సగం వరకు వసూలు కాక పెండింగ్‌లో ఉంది.



గడువు ఇవ్వరు..
ఇ-చలానా నమోదు కాగానే వాహన యజమాని చరవాణికి సందేశం వస్తుంది. కొంత మంది చూసినా పట్టించుకోరు. మరికొందరు నంబర్లు మార్చేస్తుంటారు. అలాంటి వారికి మెసేజ్ వచ్చినా తెలియదు. వారి వాహనంపై చలానాలు పెండింగ్‌లో ఉన్నాయని పోలీసులు ఆపినప్పుడే తెలుస్తుంది. పెద్ద మొత్తంలో పెండింగ్‌లో ఉంటే.. పోలీసులు వాహనాన్ని స్వాధీనం చేసుకుంటారు. గతంలో 90 రోజులు గడువు ఇచ్చేవారు. ఇప్పుడు ఆ గడువు లేదు.

వాహన సేవలు కట్
వాహనంపై చలానాలు పెండింగ్‌లో ఉంటే వాహన సంబంధిత సేవలు నిలిచిపోతాయని రవాణాశాఖ అధికారులు చెబుతున్నారు. కొంత మంది ఫైనాన్స్‌లో వాహనం కొనుగోలు చేస్తారు. ఫైనాన్స్ క్లియర్ అయిన తర్వాత తమ పేరు మీద మార్చుకోవాలంటే కుదరదు. పెండింగ్ చలానాలు కడితేనే పేరు మారుతుంది. ఇక రెన్యువల్, చిరునామా మార్పు, పన్ను చెల్లింపు... ఈ సేవలన్నీ నిలిచిపోతాయి. చలానాలన్నీ క్లియర్ అయిన తర్వాతే ఈ సేవలు అందుబాటులోకి వస్తాయి. వాహన యజమానులూ.. ఇక జర భద్రం అంటున్నారు ట్రాఫిక్ పోలీసులు, రవాణాశాఖ అధికారులు.

ఏడాది	కేసులు	విధించిన జరిమానా (రూ.)	చలానాలు వేసింది	కట్టిన సొమ్ము	పెండింగ్ చలానాలు	చెల్లించాల్సిన జరిమానా (రూ)
2024	1,41,980	6,53,57,120	59,026	2,59,63,180	82,954	3,93,93,940
2025	2,16,188	12,73,96,150	1,43,627	6,82,12,190	72,561	5,91,83,960

వ్యాపారులకే సంపత్తి

సీసీఐ కొనుగోళ్లలో అక్రమాలు..

నందిగామ, పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే

నందిగామ మార్కెట్టు యార్డులో పత్తి అమ్మడానికి 72 మంది రైతులు స్లాట్ బుకింగ్ నిమిత్తం పేర్లు నమోదు చేశారు. యార్డు అధికారులు కొన్ని రోజులుగా కపాస్ కిసాన్ యాప్‌లో స్లాట్ బుక్ చేసేందుకు ప్రయత్నించినా దొరకట్లేదు. ఇదే సమయంలో బయట వ్యాపారులు తమ అనుకూలుర పేరుతో క్షణాల్లో స్లాట్ బుక్ చేసి లారీల కొద్దీ పత్తి అమ్మేస్తున్నారు. దీనిపై ప్రజాప్రతినిధులు, మార్కెటింగ్ ఉన్నతాధికారులు పట్టించుకోవట్లేదు. సీసీఐ ఉన్నతాధికారులు బరిలో దిగితేనే గుట్టు వీడేది. సీసీఐ పత్తి కొనుగోలుకు స్లాట్ బుకింగ్ సమాచారం రైతులకు తెలియడం లేదు. అదే సందర్భంలో స్లాట్ ఓపెన్ చేసే సమాచారాన్ని వ్యాపారులకు మాత్రం బయ్యర్లు తెలుపుతున్నారు. అప్పటికే సిద్ధంగా ఉంటూ స్లాట్ బుక్ చేసి అమ్ముకుంటున్నారు. తక్కువ ధరకు కొనుగోలు చేసి మద్దతు ధరకు విక్రయించి లాభాలు పొందుతున్నారు.

యార్డుల వారీగా ఇలా.. జిల్లాలో కొనుగోలు కేంద్రాలు అలంకారంగా మారాయి. బుధవారానికి యార్డుల వారీగా మైలవరం 44,000, నందిగామ 35,000, కంచికచర్ల 33,000, గంపలగూడెం 24,000, జగ్గయ్యపేట 2,000 క్వింటాళ్ల పత్తిని సీసీఐ కొంది. గుంటూరులోని జిన్నింగ్ మిల్లుల వద్దకు తీసుకెళ్లిన పత్తినే కొనుగోలు చేశారు.


పత్తి లోడింగ్..

వారికే లబ్ధి.. నాణ్యత బాగాలేదని రైతుల వద్ద కొనుగోలు చేయని సీసీఐ.. వ్యాపారులు తీసుకెళితే మాత్రం ఎలా ఉన్నా తీసుకుంటున్నారు. ఇదే వ్యాపారులకు అనుకూలంగా మారింది. సీసీఐ మద్దతు ధర క్వింటా రూ.8110 ఉంది. వ్యాపారులు క్వింటా రూ.6300 లోపు కొని సీసీఐకి మద్దతు ధరకు అమ్ముకుంటున్నారు. ఇలా వ్యాపారులు క్వింటాకు రూ.వెయ్యి నుంచి రూ.1500 వరకు లబ్ధి పొందుతున్నారు.

గాంధీ, నెహ్రూ జీవిత చరిత్రలతో స్ఫూర్తి పొందాలి

'విద్యార్థికో పుస్తకం, పుస్తకానికో విద్యార్థి' వినూత్న కార్యక్రమం



పంచతంత్ర కథల పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మండలి బుద్ధప్రసాద్, శివప్రసాద్, కోటేశ్వరరావు, మనోహర్‌నాయుడు, జయప్రకాశ్

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే : మహాత్మాగాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ జీవిత చరిత్రలు చదివి విద్యార్థులు స్ఫూర్తి పొందాలని అవనిగడ్డ శాసనసభ్యుడు మండలి బుద్ధప్రసాద్ సూచించారు. పుస్తకాలకు దూరమవుతున్న నేటి తరాన్ని పుస్తక పఠనం వైపు మళ్లించేందుకు ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ పునర్వికాస వేదిక, విజయవాడ పుస్తక మహోత్సవ కమిటీ వినూత్న కార్యక్రమం చేపట్టింది. 'విద్యార్థికో పుస్తకం, పుస్తకానికో విద్యార్థి' పేరుతో విద్యార్థులను సామూహిక పుస్తక పఠనం చేయించే కార్యక్రమం శుక్రవారం గవర్నర్‌పేటలోని విజయవాడ పుస్తక మహోత్సవ గ్రంథాలయంలో నిర్వహించారు. మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ.. పంచతంత్ర కథలను ప్రపంచానికి అందించిన ఘనత భారతదేశానిదేనని కొనియాడారు. పుస్తక పఠనంతో విజ్ఞానం, ఆలోచనా శక్తి పెరుగుతుందని చెప్పారు. ప్రతి విద్యార్థి పుస్తక పఠనాన్ని ఒక అలవాటుగా చేసుకోవాలని సూచించారు. గ్రంథాలయ పరిషత్ ఛైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు మాట్లాడుతూ.. ప్రభుత్వం విద్యార్థుల కోసం గ్రంథాలయాల్లో వేలాది పుస్తకాలను అందుబాటులో ఉంచిందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పుస్తక పఠనాన్ని నిత్యకృత్యంగా అలవాటు చేసుకోవాలని కోరారు. అరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరి శివప్రసాద్ మాట్లాడుతూ.. పిల్లల్లో పఠనాసక్తిని కలిగించేందుకు గ్రంథాలయ పునర్వికాస వేదిక రాష్ట్ర వ్యాప్తంగా ఏడాది పాటు లక్ష పుస్తకాలను పంపిణీ చేస్తోందని తెలిపారు. పంచతంత్ర కథలు, గాంధీ, నెహ్రూ జీవిత చరిత్రల పుస్తకాలను ఆవిష్కరించి.. విద్యార్థులకు పంపిణీ చేశారు. పుస్తక పఠనం ప్రాధాన్యతను వివరిస్తూ డాక్టర్ బేతవోలు రామబ్రహ్మం రాసిన పాటలను రామకృష్ణానంద చక్కగా ఆలపించారు. వీటిని యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేశారు. కార్యక్రమంలో విజయవాడ పుస్తక మహోత్సవ కమిటీ అధ్యక్షుడు మనోహర్‌నాయుడు, గ్రంథాలయ పునర్వికాస ఉద్యమ కోకన్వీనర్ బి.జయప్రకాశ్, కె.లక్ష్మయ్య, ఎస్.వి.నారాయణ, కొప్పర్తి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు (కిలో కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -120 రిటైల్ ధర 147 చికెన్ విత్ స్కిన్ - 213, చికెన్ స్కిన్‌లెస్ - 243.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 139, 148, 159 చికెన్ విత్ స్కిన్ - 264 చికెన్ స్కిన్‌లెస్ - 274.

అధిక జీతాలకు ఆశపడి వచ్చి ఇరుక్కుపోయాం

సిట్, ఎక్సైజ్ విచారణలో నకిలీ మద్యం నిందితుల వెల్లడి

ఈనాడు - అమరావతి

'మావి పేద కుటుంబాలు, పొట్ట కూటి కోసం జనార్దనరావు వద్ద పనిలో చేరాం. రెట్టింపు జీతం ఇస్తామని ఆశ చూపించాడు. చట్ట విరుద్ధమని తెలిసినా.. డబ్బులు వస్తున్నాయని పని చేశామని' నకిలీ మద్యం కేసులో సిట్, ఎక్సైజ్ పోలీసులు కస్టడీకి తీసుకున్న నిందితులు వాపోయారు. రెండో రోజు శుక్రవారం విజయవాడలోని తూర్పు ఎక్సైజ్ స్టేషన్‌లో సయ్యద్ హాజీ (ఏ5), కట్టా రాజు (ఏ6), మిథున్ దాస్ (ఏ9), అంతదాస్ (ఏ10)లను విచారించారు.

ములకలచెరువులో రాజు పర్యవేక్షణ... జనార్దనరావు (ఏ1), జగన్మోహన్‌రావు (ఏ2)లు మీకు ఎలా పరిచయం?.. నకిలీ మద్యం తయారీలో మీ పాత్ర ఏంటని? పోలీసులు కట్టా రాజును ప్రశ్నించారు. తాను గతంలో ఇబ్రహీంపట్నంలోని ఏఎన్ఆర్ బార్, కిరాణా దుకాణంలో పదేళ్లు పనిచేసి మానేసినట్లు వివరించాడు. ఈ ఏడాది ఏప్రిల్‌లో తనను జనార్దనరావు పిలిచి, ములకలచెరువులో నకిలీ మద్యం యూనిట్ పెడుతున్నట్లు.. అక్కడకు వెళ్లి పర్యవేక్షణ బాధ్యతలు చేపట్టాలని.. ఇందుకు అధిక జీతం ఇస్తానని ఆశచూపాడని చెప్పాడు. జీతం ఎక్కువనే ఆశతో ములకలచెరువు వెళ్లానని వివరించాడు. పాత దాబాను అద్దెకు తీసుకుని నకిలీ మద్యం తయారీకి తగ్గట్లుగా పనులు చేపట్టామన్నాడు. బెంగళూరు నుంచి బాలాజీ తెచ్చిన స్పిరిట్‌ను తాను తీసుకునేవాడిననీ.. అనంతరం అక్కడే బ్లెండింగ్ చేసి తిరిగి బాలాజీ వెళ్లేవాడని చెప్పాడు.

జనార్దనరావు చెప్పినట్లు బాలాజీ, అతని కుమారుడు సుదర్శన్‌కు చెల్లింపులు చేసేవాడిని. ఎవరెవరికి ఎంతెంత చెల్లించింది.. ప్రత్యేక పుస్తకంలో రాసుకునే వాడినని రాజు వెల్లడించాడు. నకిలీ మద్యాన్ని సీసాల్లోకి నింపి.. మద్యం, బెల్టు దుకాణాలకు సరఫరా చేసేవాడినన్నాడు.

పార్శిళ్లలో వచ్చే అక్రమ మద్యం క్యాన్ల రవాణా... తమది పెద్ద కుటుంబమనీ, తనకు ఇంకా పెళ్లి కాలేదనీ.. పొట్ట చేతబట్టుకుని ఇబ్రహీంపట్నం వచ్చానని రాజు చెప్పాడు. తాను గతంలో జనార్దనరావు బార్‌లో పనిచేసిన తర్వాత మానేసి దాబాలో పనికి కుదిరినట్లు వివరించాడు. తన వద్దకు వస్తే రెట్టింపు జీతం ఇస్తానని.. దాబాకు వచ్చినప్పుడు జనార్దనరావు చెప్పడంతో అంగీకరించానన్నాడు. హైదరాబాద్ నుంచి వచ్చే అక్రమ మద్యం క్యాన్లను ఇబ్రహీంపట్నంలో రాజు అందుకొని.. పాత ఏఎన్ఆర్ బార్‌కు తరలించేవాడు. అక్కడ సీసాల్లోకి నింపి బార్‌లో విక్రయించేవారు. నకిలీ మద్యం తయారీ ప్రారంభించాక.. నెలకు రెండుసార్లు బాలాజీ ఇబ్రహీంపట్నం వచ్చేవాడని హాజీ పోలీసులకు చెప్పాడు. ప్రతిసారీ 15 క్యాన్లను బాలాజీ తెచ్చిచ్చేవాడని, ఇబ్రహీంపట్నంలో బాలాజీ స్పిరిట్, క్యారమెల్, ఎసెన్స్ కలిపేవాడని వివరించాడు.

☛ ఒడిశా నుంచి ఉపాధి కోసం వచ్చి.. బార్, కిరాణా దుకాణంలో పని చేశామని మరో ఇద్దరు నిందితులు తెలిపారు. వీరిని జనార్దనరావు ములకలచెరువు పంపగా.. అక్కడ నకిలీ మద్యం తయారీ, సీసాలను మద్యం దుకాణాలకు తరలించామని వెల్లడించారు.


వేతనాలు పెంచాలని ధర్నా



హాజరైన అంగన్‌వాడీలు

గాంధీనగర్, న్యూస్‌టుడే : అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.గజలక్ష్మి, ఎన్.సి.హెచ్. సుప్రజ డిమాండ్ చేశారు. శుక్రవారం ధర్నా చౌక్‌లో నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో వారు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం జీవోలో 4687 మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మారుస్తూ జీవో ఇవ్వడం అభినందనీయమన్నారు. అన్ని యాప్‌లను కలిపి ఒకే యాప్‌గా మార్చాలని, గ్రాట్యుటీ అమలుకు మార్గనిర్దేశకాలు రూపొందించాలని, 164 సూపర్‌వైజర్ల పోస్టులు భర్తీ చేయాలని కోరారు. ప్రీ స్కూళ్లను బలోపేతం చేయడంతో పాటు పిల్లలకు టిఫిన్ పథకాన్ని అమలు చేయాలని, మెనూ ఛార్జీలు పెంచాలని, ఉచితంగా గ్యాస్ సరఫరా చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ కోశాధికారి ఎస్.జైనీ రత్నకుమారి, అధిక సంఖ్యలో అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

'చౌకగా భూములు కట్టబెట్టడం తగదు'



జీవో ప్రతి చూపుతున్న బాబూరావు, పక్కన కాశీనాథ్

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే : నగరంలో అభివృద్ధి పేరుతో భూకుంభకోణాలు, భూ అవినీతి తెరలేపారని సీపీఎం నాయకులు ఆరోపించారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సిహెచ్.బాబూరావు, రాష్ట్ర కమిటీ సభ్యుడు దోనేపూడి కాశీనాథ్ శుక్రవారం గవర్నర్‌పేటలోని శ్రీభవన్‌లో విలేకరులతో మాట్లాడారు. ప్రజల ఆస్తులను [illegible] హామీతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం.. సర్కారు భూములను బడా సంస్థలకు ధారాదత్తం చేసేందుకు పూనుకుందని విమర్శించారు. నగరంలో [illegible] అమ్మకానికి పెట్టారన్నారు. లీజుల పేరుతో రూ.5,525 కోట్ల విలువైన భూములను బడా కంపెనీలకు కట్టబెట్టారని, మరో 13 ఎకరాలను [illegible] ఆరోపించారు. వీటి మొత్తం విలువ రూ.5,824 కోట్లు ఉంటుందన్నారు. రూ.4,600 కోట్ల విలువైన బస్ [illegible] లీజుకు ఇస్తున్నారు.. లీజుకు పది ఎకరాలే [illegible]. మొత్తం 230 ఎకరాలు ధారాదత్తం చేస్తున్నారన్నారు. రూ.400 కోట్ల విలువైన పాత బస్టాండ్ స్థలాన్ని [illegible] ఆరోపించారు. మున్సిపల్ ఎంప్లాయీస్ కాలనీలోని 1000 గజాల స్థలాన్ని [illegible]. గొల్లపూడిలోని 30 ఎకరాల స్థలాన్ని పెద్ద కంపెనీకి కట్టబెట్టారన్నారు. బరంపార్కులోని హరిత రిసార్ట్స్‌ను ప్రైవేటీకరించే ప్రయత్నాలు చేస్తున్నారని చెప్పారు. [illegible] చిత్తశుద్ధి ఉంటే భవానీ ఐలాండ్ ప్రైవేటీకరణకు కట్టబెట్టే జీవో 137ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. [illegible] స్థలాన్ని స్వాధీనం చేసుకుని ప్రభుత్వం నడ[illegible] స్థలాన్ని పరిరక్షించాలని కోరారు. జోజినగర్ [illegible]లని సీపీఎం డిమాండ్ చేసింది.

రాయితీపై మురుగు శుద్ధి వాహనాలు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : సఫాయి కర్మచారీలకు రాయితీపై ఎన్.ఎస్.కె.ఎఫ్.డి.సి. పథకం కింద ఎనిమిది మురుగు శుద్ధి (సెప్టిక్ ట్యాంక్ క్లీనింగ్) వాహనాలు మంజూరు చేయడానికి దరఖాస్తుల దాఖలు గడువును ఈనెల 20వ తేదీ వరకు పొడిగించినట్లు జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ షేక్ షాహిద్ బాబు శుక్రవారం తెలిపారు. ఒక్కో వాహనం విలువ రూ.31,67,326లు ఉండగా, ఇందులో రూ.14,16,831.50లు రాయితీగా వస్తుంది, మిగతా రూ.17,50,494.50లను ఎన్.ఎస్.కె.ఎఫ్.డి.సి. రుణంగా పొందవచ్చన్నారు. అయిదుగురు కలిసి ఒక గ్రూపుగా ఏర్పడాలి. ప్రతి సభ్యుడూ సఫాయి కర్మచారి వృత్తిదారుడై ఉండాలి. ఒకరికి హెవీ మోటార్ వాహన డ్రైవింగ్ లైసెన్సు ఉండాలి. రుణంగా పొందిన మొత్తాన్ని రూ.33,064ల చొప్పున 72 నెలల వాయిదాల్లో చెల్లించాలి. దరఖాస్తులను నేరుగా ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలో అందజేయాలి. ఇతర వివరాలకు చరవాణి నంబరు 96520 57244లో సంప్రదించాలని ఆయన సూచించారు.



ధర వరలు

వంకాయలు-20/30, టమాటా-30, బెండ-44, పచ్చిమిర్చి-40, కాకర-40, బీర-44/50, క్యాలీఫ్లవర్-22/25, క్యాబేజి-24, క్యారెట్-44, దొండ-38, బంగాళదుంప-28, ఉల్లిపాయలు-22, గోరుచిక్కుళ్లు-48, దోస-32, సొర-15/20, పొట్ల-35, అరటికాయ-7/8, చామదుంప-26, అల్లం-80, మునగ-20/18, ఆకు కూరలు (కట్ట)-3, కంద-40, బీట్ రూట్-38, కీరదోస-32, బీన్స్-82/90, క్యాప్సికమ్-66, చింతకాయలు-60, నిమ్మ (డజను)-24/18, కొత్తిమీర-8/15, పుదీనా-5/15, ముల్లంగి-10, పచ్చిమామిడి-20/22 (నిన్నటివి). నగరంలోని రైతుబజార్లలో ఈ ధరలు (రూ.ల్లో) వర్తిస్తాయి. **- ఎన్టీఆర్ కలెక్టరేట్, విజయవాడ**

గృహ గ్యాస్.. వ్యాపారానికి వినియోగం

రూ.11,000 జరిమానా విధింపు

ఎన్టీఆర్ కలెక్టరేట్: గృహ వినియోగానికి నిర్దేశించిన గ్యాస్ సిలిండర్‌ను వ్యాపార అవసరాలకు వాడిన నేపథ్యంలో రూ.11,000 జరిమానా విధిస్తూ జేసీ ఎస్.ఇలక్కియా ఆదేశాలు జారీ చేశారు. నగరంలోని కలెక్టరేట్‌లో పౌరసరఫరాల కేసులకు సంబంధించిన కోర్టును ఆమె శుక్రవారం నిర్వహించారు. చౌక ధరల దుకాణం నుంచి రేషన్ బియ్యాన్ని అక్రమంగా రవాణా చేసేందుకు వినియోగించిన ఒక వాహన యజమానికి రూ.5,000, రేషన్ బియ్యంతో అక్రమంగా వ్యాపారం చేసిన వారికి రూ.58,000 జరిమానా విధించారు. దాడుల్లో అధికారులు స్వాధీనం చేసుకున్న సుమారు 133 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని ప్రభుత్వానికి అప్పగిస్తూ జేసీ ఉత్తర్వులు జారీ చేశారు.

క్రైస్తవుల అభ్యున్నతికి చంద్రబాబు కృషి



మాట్లాడుతున్న స్వామిదాసు, క్రిస్టియన్ సెల్ నాయకులు

పటమట: రాష్ట్రంలో క్రైస్తవుల అభ్యున్నతికి సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారని తెదేపా క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఈటె స్వామిదాసు అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు ప్రభుత్వం జిల్లాల వారీగా రూ.2 లక్షల చొప్పున నిధులు విడుదల చేసిన సందర్భంగా సీఎం చంద్రబాబుకు స్వామిదాసు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం గురునానక్ కాలనీలోని ఎన్టీఆర్ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వంలో క్రైస్తవులు, పాస్టర్లకు అనేక సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. గత వైకాపా ప్రభుత్వం క్రిస్టియన్ కార్పొరేషన్‌ను నిర్వీర్యం చేసిందని మండిపడ్డారు. అప్పుడు క్రిస్మస్ వేడుకలకు జిల్లాకు రూ.30 వేలు మాత్రమే ఇచ్చిందని ఆరోపించారు. నాయకులు చాట్ల రాజశేఖర్, మాధవ పాల్, బి.సురేష్, డేవిడ్ చక్రవర్తి, పరిశపోగు రాజేష్, మాదిగాని గురునాథం పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొన్న కారు.. మెకానిక్ మృతి



శ్రీనివాసరావు (పాతచిత్రం)

నందిగామ: నందిగామ మండలం మునగచర్ల అడ్డరోడ్డు వద్ద విజయవాడ-హైదరాబాద్ హైవేపై బైక్‌ను కారు ఢీకొట్టడంతో ట్రాక్టర్ మెకానిక్ మృతిచెందాడు. నందిగామ సీఎం రోడ్డులో నివాసం ఉండే చలమల శ్రీనివాసరావు(52) అనే ట్రాక్టర్ మెకానిక్.. శుక్రవారం ఉదయం పెనుగంచిప్రోలు మండలం తోటచర్ల గ్రామానికి బైక్‌పై వెళ్లాడు. తిరిగి నందిగామకు వస్తుండగా మునగచర్ల అడ్డరోడ్డు వద్ద వెనుక నుంచి వేగంగా వచ్చిన కారు ఢీకొట్టింది. దీంతో అతడికి తీవ్ర గాయాలు కాగా నందిగామ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అనంతరం విజయవాడకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. శ్రీనివాసరావుకు భార్య లక్ష్మి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ప్రమాద ఘటనపై ఎస్సై మహతి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తిరువూరు

• తిరువూరు • మైలవరం

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
తిరువూరు: 98853 28820 మైలవరం: 80085 74705



★ తిరువూరు 16వ వార్డులోని డ్రెయిన్లలో మట్టి పేరుకుందని స్థానికుడు రాజశేఖర్ 'ఈనాడు' మేమున్నాం.. మీకు తోడుగా ద్వారా సమస్యను మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. శానిటరీ అధికారి సంతోష్ స్పందించి పారిశుద్ధ్య కార్మికులతో డ్రెయిన్లను శుభ్రం చేయించారు. ★ తిరువూరు 18వ వార్డులోని మురుగు కాలువల్లో వ్యర్థాలు పేరుకున్నాయని స్థానికులు సమస్యను మున్సిపల్ అధికారులకు తెలిపారు. శానిటరీ అధికారి స్పందించి పారిశుద్ధ్య కార్మికులతో పూడిక తీయించారు. ★ తిరువూరు 18వ వార్డులోని డ్రెయిన్లో మురుగు నిల్వ ఉండి దోమలతో ఇబ్బంది పడుతున్నామని స్థానికుడు కృష్ణారావు సమస్యను అధికారులకు తెలిపారు. మున్సిపల్ శానిటరీ అధికారి స్పందించి పారిశుద్ధ్య కార్మికులతో దోమల మందు పిచికారీ చేయించారు. **- న్యూస్‌టుడే, తిరువూరు టౌన్**

? కొండపల్లి ఖిల్లా రోడ్డు కూడలిలో ఉదయం, సాయంత్రం విపరీతమైన వాహనాల తాకిడి ఉంటోంది. ఆయా సమయాల్లో ట్రాఫిక్ జామ్ ఏర్పడి బస్సులు ఎక్కే ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. **- డి.నరసింహారావు, కొండపల్లి**

✔ ఆ ప్రాంతాన్ని పరిశీలించి చర్యలు తీసుకుంటాం. సమస్య పరిష్కరిస్తాం. **- చంద్రశేఖర్, సీఐ - కొండపల్లి**

? జి.కొండూరు శివారు హోం హాస్టల్ సమీపంలోని పంచాయతీ బోరు మరమ్మతులకు గురై నీటి కోసం అవస్థలు పడుతున్నాం. **- దుర్గాప్రసాద్ గ్రామస్థుడు**

✔ సిబ్బందితో బోరుకు మరమ్మతులు చేయించి నీటి సరఫరా పునరుద్ధరిస్తాం. **- నవీన్ కుమార్ ఆర్‌డబ్ల్యూఎస్ సహాయక ఇంజినీర్** - న్యూస్‌టుడే, జి.కొండూరు

బోరు ఏర్పాటు హర్షణీయం

జి.కొండూరు: పినపాక శివారులోని చంద్రన్న కాలనీ వాసులు నీటి కోసం అవస్థలు పడుతున్నామని సమస్యను స్థానిక నాయకుల దృష్టికి తీసుకెళ్లారు. వారు ఈ విషయాన్ని ఎంపీడీవో బీవీ రామకృష్ణ నాయక్‌కు తెలుపగా మండల పరిషత్ నిధులతో నూతనంగా బోరు వేయించి నీటి సరఫరా కల్పించారు. ఈ సందర్భంగా దాన్ని తెదేపా మండల అధ్యక్షుడు వేములకొండ వెంకటేశ్వరరావు శుక్రవారం ప్రారంభించారు.

పత్తి విక్రయాలకు స్లాట్ బుకింగ్

మైలవరం: రైతులు పత్తిని కనీస మద్దతు ధర కోసం, సీసీఐ కేంద్రాల్లో విక్రయించడానికి కిసాన్ కపాస్ యాప్‌లో స్లాట్లు బుక్ చేసుకోవాలని ఆ శాఖ అధికారులు తెలియజేస్తున్నట్లు ఏఎంసీ కార్యదర్శి శ్రీనివాసరావు తెలిపారు. జనవరి 9వ తేదీ వరకు కొనుగోళ్లు కొనసాగుతాయని చెప్పారు. మార్కెట్ యార్డుకు కేటాయించిన జిన్నింగ్ మిల్లుకు నేరుగా తరలించిన 55 వేల క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేసినట్లు వివరించారు. దాని ద్వారా ఏఎంసీకి రూ. 40 లక్షల వరకు సెస్సు రూపేణా ఆదాయం సమకూరుతుందన్నారు.

పాల్ ల్యాబ్‌ల పరిశీలన

రెడ్డిగూడెం: రంగాపురం కేజీబీవీ, మద్దులపర్వ ఆదర్శ పాఠశాలల్లోని పాల్ ల్యాబ్‌లను ఎంఈవో పి.రమేష్ బాబు శుక్రవారం పరిశీలించారు. పాల్ ల్యాబ్‌ల్లో విద్యార్థులు ట్యాబ్‌ల ద్వారా నేర్చుకుంటున్న అంశాలను గురించి ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. దీనిపై వారికి పలు సూచనలు చేశారు.

బాలకృష్ణ అభిమానుల సందడి



మైలవరం : థియేటర్ ముందు కేకు కోస్తూ..

మైలవరం, న్యూస్‌టుడే : ప్రముఖ సినీ నటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ నటించిన అఖండ- 2 చిత్రం విడుదల సందర్భంగా శుక్రవారం స్థానిక సంఘమిత్ర థియేటర్ వద్ద ఆయన అభిమానులు, తెదేపా నాయకులు సందడి చేశారు. జైబాలయ్య అంటూ నినాదాలు చేస్తూ.. కేకు కోసి పంచి పెట్టారు.

పశుగ్రాసం కొరత.. విక్రయాల మోత

మైలవరం, న్యూస్‌టుడే



పొలాల్లో చుట్టలుగా కట్టిన వరిగడ్డి

ధాన్యం నూర్పిళ్లు ఒకప్పుడు కూలీల సాయంతో చేసేవారు. ఆ తర్వాత గడ్డిని కట్టలుగా కట్టి వాములుగా నిల్వ ఉంచేవారు. క్రమేపీ సాగులో యంత్రాల వినియోగం పెరగడంతో గడ్డిని ముక్కలు చేస్తూ, వడ్ల గింజలను వేరు చేసే హార్వెస్టర్లు రావడంతో వరిగడ్డికి కొరత ఏర్పడింది. ఏ పొలంలో చూసినా గడ్డి పొలాలు మారుతుంటే, వాటినే కట్టలు కట్టి పశువులకు మేతగా ఉపయోగించాల్సి వస్తోంది. పశుగ్రాసం కోసం చూసే వారు పోటీ పడటంతో దానికి గిరాకీ ఏర్పడింది. మైలవరం నియోజకవర్గ వ్యాప్తంగా సుమారు 22 వేలకు పైగా ఎకరాల్లో వరి సాగవుతోంది. ఇప్పటికే దాదాపు సగం విస్తీర్ణంలో నూర్పిళ్లు పూర్తి అయ్యాయి. అందులో పూర్తిగా హార్వెస్టర్లతో కోతలు ముగించారు. ప్రస్తుతం ఏ పొలంలో చూసినా ముక్కలైన గ్రాసమే కనిపిస్తోంది. దీంతో అదే స్థాయిలో దాని కోసం బేరాలు సాగుతున్నాయి. గ్రామాల్లో సైతం పశు సంపద తగ్గుతున్న నేపథ్యంలో ఎక్కువ మంది రైతులు గడ్డి అమ్మకానికే మొగ్గు చూపుతున్నారు.

✤ ఎకరం గడ్డికి రూ.3 వేలు

కోతలు ముగిశాక గడ్డిని పోగేయడం కష్టమైన పని. ఈ క్రమంలో అయిదారేళ్ల కిందట నుంచి గడ్డిని కట్టలుగా చుట్టే యంత్రాలు రావడంతో రైతుల పని సులువుగా మారింది. దీంతో పొలాల్లోనే వదిలేసిన గడ్డిని, ప్రస్తుతం చుట్టలుగా కట్టి ఉపయోగిస్తున్నారు. ఒకప్పుడు గడ్డి నామమాత్ర ధరకు లభించగా, గిరాకీ అమాంతంగా పెరుగుతోంది. ఈ ఏడాది ఎకరాలో కొనుగోలుకు రూ. 3 వేల వరకు చెల్లిస్తున్నారు. ఒక్కో ఎకరానికి సుమారు 7 టన్నుల వరకు లభిస్తుండగా, సరాసరి 80 నుంచి 90 కట్టలు అవుతున్నాయి. ఒక్కో కట్ట చేసేందుకు యంత్రానికి రూ.30లు చెల్లిస్తున్నారు. మొత్తం కలిపి ఎకరాలో కొనుగోలుకు రూ.5 వేల పైమాటే.

✤ పాల ఉత్పత్తిలో కీలకం

వరిగడ్డికి అంత డిమాండు రావడానికి ప్రధాన కారణం పాల ఉత్పత్తిలో నాణ్యత. పూర్తిగా వాటినే మేసే పశువులు ఇచ్చే పాలు చిక్కదనంతో పాటు వెన్నశాతం ఎక్కువగా వస్తుందని రైతుల ఆశ. ప్రస్తుతం పల్లెల్లో ఇళ్ల వద్ద పాలు విక్రయించే వారి వద్ద సైతం లీటరు రూ. 90ల వరకు ధర పలుకుతోంది. ఈ నేపథ్యంలోనే పాడి రైతులు అధికంగా గడ్డిని కొంటున్నారని రైతులు చెబుతున్నారు.

జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక



కౌశిక్‌తో ఉపాధ్యాయులు

మైలవరం: స్థానిక ఎస్సీఆర్‌జీఎన్నార్ జడ్పీ ఉన్నత పాఠశాల(బాలుర)లో పదో తరగతి చదువుతున్న విద్యార్థి మాదవరపు కౌశిక్ అండర్- 17 ఫుట్‌బాల్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్.సతీష్ శుక్రవారం తెలిపారు. పల్నాడు జిల్లా నరసరావుపేటలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో సత్తా చాటడం ద్వారా జాతీయ పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు. ఈ మేరకు విద్యార్థిని హెచ్‌ఎంతో పాటు పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

కిడ్నీ వ్యాధి బాధితులను ఆదుకోవాలని ధర్నా



తహసీల్దార్ శ్రీలక్ష్మికి వినతిపత్రం అందిస్తున్న సీపీఎం నాయకులు

గంపలగూడెం, ఎ.కొండూరు, న్యూస్‌టుడే : ఎ.కొండూరు మండలంలో మూత్రపిండాల వ్యాధి బాధితుల మరణాలను నియంత్రించడంలో ప్రభుత్వాలు, అధికారులు పూర్తిగా విఫలమవుతున్నారని సీపీఎం, గిరిజన సంఘాల నాయకులు ఆరోపించారు. మండల పరిధిలోని గ్రామాల్లో నెల రోజుల వ్యవధిలోనే 20 మంది వరకు బాధితులు మృతి చెందారంటే సమస్య ఎంత తీవ్రంగా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. మూత్రపిండాల వ్యాధి బాధితులను ఆదుకోవాలని, కృష్ణా జలాలు తండాలకు సరఫరా చేయాలని కోరుతూ శుక్రవారం మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయం వద్ద బాధితులతో కలిసి వారు ధర్నా చేశారు. తహసీల్దార్ కె. శ్రీలక్ష్మికి వినతిపత్రం అందించారు. సీపీఎం జిల్లా, మండల కార్యదర్శులు డీవీ.కృష్ణ, పి.ఆనందరావు, నాయకులు కుమార్ నాయక్, మురళీకృష్ణ, జె. వెంకటేశ్వరరావు, బిచ్చా, కేవల, జమలమ్మ తదితరులు పాల్గొన్నారు.

జనవరి 3న తిరువూరులో బాలోత్సవం



కరపత్రాలు విడుదల చేస్తున్న మండల విద్యా శాఖ అధికారులు

తిరువూరు టౌన్, న్యూస్‌టుడే : స్థానిక వాహిని ఇంజినీరింగ్ కళాశాలలో జనవరి 3న తిరువూరు మండల స్థాయిలో బాలోత్సవం నిర్వహిస్తున్నట్లు కార్యక్రమ నిర్వాహకులు తెలిపారు. ఈ మేరకు దీనికి సంబంధించిన కరపత్రాలను మండల విద్యా శాఖ అధికారులు ఎ.శ్యామ్ సుందరరావు, పి.యస్.ఎన్.రాజు చేతుల మీదుగా శుక్రవారం ఆవిష్కరించారు. బాలోత్సవ కమిటీ సభ్యులు ఎ.హరికృష్ణా, కె.పాపారావు, పి.శీనయ్య, యం.రమేష్, వెంకట స్వామి పాల్గొన్నారు.

పొలాలకు వెళ్లనీయకుండా అడ్డుకోవడం తగదు



తిరువూరు రెవెన్యూ కార్యాలయం ఎదుట రైతుల నినాదాలు

గంపలగూడెం, తిరువూరు: తిరువూరు మండలం లక్ష్మీపురం శివారు రాయగూడెంలో సాగు భూములకు వెళ్లే రోడ్డును గ్రామస్థుడు సీహెచ్.మోహన్‌రావు అనే వ్యక్తి ఆక్రమించి తమ పొలాలకు వెళ్లకుండా అడ్డుకుంటున్నాడని, అక్కడి ఎస్సీ రైతులు రెవెన్యూ అధికారులకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. రాకపోకలు సాగించేందుకు వీలుగా ఆక్రమణను తొలగించాలని కోరారు. జె. సింధు, డి.కృపమ్మ, డి.రాధా, డి.సీత తదితరులు పాల్గొన్నారు.

డివిజన్ స్థాయి ఆటల పోటీలు

విస్సన్నపేట: నరసాపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో ఈ నెల 15, 16 తేదీల్లో ప్రభుత్వ ఉపాధ్యాయులకు డివిజన్ స్థాయి ఆటల పోటీలు నిర్వహిస్తున్నామని తిరువూరు డివిజన్ స్పోర్ట్స్ ఇన్‌ఛార్జి ఎం.రమేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విస్సన్నపేట, రెడ్డిగుడెం, ఎ.కొండూరు, తిరువూరు, గంపలగూడెం మండలాలకు చెందిన పురుష ఉపాధ్యాయులకు 15న క్రికెట్, 16న మహిళా ఉపాధ్యాయులకు త్రోబాల్ పోటీలు జరుగుతాయని చెప్పారు.

క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదం



ప్రతిభ చాటిన ఉపాధ్యాయులతో సీతారామయ్య

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే : ఉపాధ్యాయుల నైపుణ్యం బోధనకే పరిమితం కాకుండా క్రీడల్లోనూ కనబరచడం హర్షనీయమని తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సీతారామయ్య అన్నారు. శుక్రవారం మండల స్థాయి ఆటల పోటీల్లో విజేతలైన ఉపాధ్యాయులను ఆయన సన్మానించి మాట్లాడారు. ఉపాధ్యాయుల మానసిక ఉల్లాసానికి ప్రభుత్వం క్రీడా ఆలోచన చేసిందన్నారు. అందులో భాగంగానే రాష్ట్ర వ్యాప్తంగా ఆటలు నిర్వహించిదని చెప్పారు. అనంతరం సాహితీ ఫౌండేషన్ తరపున ఉపాధ్యాయులకు ప్రోత్సహకాలు అందించారు.

ప్రతిభ చాటారు.. బహుమతులు పొందారు



శ్రావ్యకు ధ్రువపత్రం ఇస్తున్న బాలోత్సవ్ కమిటీ సభ్యులు

కొండపల్లి, న్యూస్‌టుడే : అమరావతి బాలోత్సవ్- 2025 పోటీల్లో కొండపల్లి విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ చాటారు. స్థానిక జడ్పీ బాలికోన్నత పాఠశాలకు చెందిన శ్రావ్య కూచిపూడి నృత్యం జూనియర్ విభాగంలో ప్రథమ బహుమతి పొందినది. నాటకీకరణలో క్రాంతి పాఠశాల విద్యార్థుల బృందం జూనియర్, సీనియర్ విభాగాల్లో ప్రథమంగా నిలిచారు. వీరితో పాటు జడ్పీ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు కవితా రచన, కోలాటం, స్పష్టమైన తెలుగు మాట్లాడడంలో తమ మార్కును చూపించారు. క్రాంతి పాఠశాల విద్యార్థులు 38 మంది పలు విభాగాల్లో ప్రతిభ చాటి ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించారు. ఈ సందర్భంగా వీరిని అమరావతి బాలోత్సవ్ కమిటీ సభ్యులు వి.మురళీమోహన్, కామేశ్వరరావు, జడ్పీ పాఠశాల హెచ్‌ఎం హేమలత, క్రాంతి పాఠశాల కరస్పాండెంటు అమ్మాజీ కొండపల్లిలో శుక్రవారం అభినందించారు.

ఏపీ ఎన్జీవోల సంఘం నూతన కార్యవర్గం



సత్కారం అందుకున్న సభ్యులతో నాయకులు

గంపలగూడెం, తిరువూరు : ఏపీ ఎన్జీవోల సంఘం తిరువూరు తాలూకా యూనిట్‌కు శుక్రవారం నిర్వహించిన ఎన్నికల్లో మాతంగి ప్రకాష్ బాబు, దద్దనాల రాంబాబు ప్యానెల్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి సీహెచ్ సీవీఆర్.ప్రసాద్ ప్రకటించారు. తిరువూరులోని తాలూకా యూనిట్‌లో జరిగిన ఎన్నికలో అధ్యక్షుడిగా ఎం.ప్రకాశ్ బాబు, కార్యదర్శిగా డి. రాంబాబు, ఉపాధ్యక్షులుగా కె.మహేష్, సీహెచ్. మల్లయ్య, ఎన్.అబ్రహం లింకన్, సంయుక్త కార్యదర్శులుగా పి.కృష్ణబాబు, ఎం.వెంకటేశ్వరరావు, టి. లావణ్య, ఎం.నాగమణి, కోశాధికారిగా ఎన్.రాఘవరావు ఎన్నికయ్యారు. సంఘం జిల్లా నాయకులు ఎం.గోపాలకృష్ణ, డీవీ.సత్యనారాయణరెడ్డి, జి.రామకృష్ణ తదితరుల సమక్షంలో నూతన కమిటీ సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు.

స్మార్ట్ కార్డులు తీసుకున్నారా లేదా?

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే



కార్డు నమూనా

మైలవరం నియోజకవర్గంలో పంపిణీ కాని స్మార్ట్ రేషన్ కార్డులను వెనక్కి పంపేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పౌర సరఫరాల శాఖ ప్రక్షాళనకు చర్యలు చేపట్టింది. చౌక బియ్యం పంపిణీలో అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు స్మార్ట్ కార్డులను అందుబాటులోకి తెచ్చారు. దీంతో రెండు నెలల నుంచి వీటిని లబ్ధిదారులకు ఇస్తున్నారు. మైలవరం నియోజకవర్గంలోని నాలుగు మండలాలతో పాటు గొల్లపూడి, రాయనపాడు, పైడూరుపాడు గ్రామాలకు 87,047 స్మార్ట్ కార్డులు వచ్చాయి. వీటిలో ఇంకా 4,698 కార్డులను లబ్ధిదారులు తీసుకోలేదు. ఈ నేపథ్యంలో వాటిని డిసెంబరు 15 నాటికి తీసుకోకపోతే వెనక్కి పంపించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. డీలర్ల వద్ద ఉన్న కార్డుల్లో మృతి చెందిన వారు, గ్రామాంతరం వెళ్లిన వారు, మ్యాపింగ్‌లో తేడాలపై నివేదిక ఇవ్వాలని అధికారులకు ఆదేశాలు వచ్చాయి. ఆయా వివరాలు ఆధారంగా కొన్ని కార్డులను రద్దు చేయనున్నారు.

మ్యాపింగ్‌లో తప్పిదాలు

వైకాపా హయాంలో సచివాలయాల వారీగా వాలంటీర్లు కుటుంబ సభ్యులను మ్యాపింగ్ చేశారు. ఆ ప్రక్రియ సరిగ్గా చేయకుండానే అప్పట్లో బియ్యం కార్డులు ఇచ్చారు. ఈ క్రమంలో అనర్హులకు కార్డులు వచ్చాయనే ఆరోపణలున్నాయి. వీటి ఆధారంగానే స్మార్ట్ కార్డులు వచ్చేయడంతో అవి మిగిలినట్లు తెలుస్తోంది. వీటిని తీసుకోవాలంటే లబ్ధిదారుల్లో ఎవరో ఒకరు వచ్చి బయోమెట్రిక్ వేసి ఓటీపీ చెప్పాలి. దీంతో బోగస్ కార్డు వివరాలు బయటపడతాయి. ఈ నేపథ్యంలో లబ్ధిదారులు అందుబాటులో ఉన్నారా...లేదా? వలస వెళ్లారా, మృతి చెందారా తదితర అంశాలను సమగ్రంగా విచారించి డీలర్లు నివేదించాలని అధికారులు సూచించారు.

ప్రమాదం.. లేదు అభయం..



గుంటుపల్లి జాతీయ రహదారి నుంచి గ్రామ ఆలయానికి వెళ్లే మార్గం ప్రమాదకరంగా మారింది. ఈ దారిలో గొయ్యి ఏర్పడటంతో ద్విచక్ర వాహనదారులు, పాదాచారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నెల రోజుల నుంచి సమస్య ఉన్న ఎన్‌హెచ్‌ఏఐ గుత్తేదారు సిబ్బంది గానీ, పంచాయతీ అధికారులు గానీ దీనిపై స్పందించక పోవడం విచారకరమని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే అక్కడి పరిస్థితిని సరి చేసి ప్రమాదాలు జరగకుండా చేయాలని కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, ఇబ్రహీంపట్నం**

అష్టోత్తర శత దీపాలంకరణ సేవ



నెమలి కృష్ణాలయంలో..

నెమలి (గంపలగూడెం), న్యూస్‌టుడే : మండలంలోని నెమలి వేణుగోపాల స్వామి గుడిలో శుక్రవారం రాత్రి అష్టోత్తర శత దీపాలంకరణ సేవ నిర్వహించారు. అర్చకుడు గోపాలాచార్యులు ఆధ్వర్యంలో భక్తులు దీపాలు వెలిగించారు. ఈ సందర్భంగా ఉత్సవమూర్తులకు అద్దాల మండపం వద్ద ప్రత్యేక పూజలు చేశారు.



తిరువూరు : సామూహిక వ్రతాలు నిర్వహిస్తున్న భక్తులు

తిరువూరు టౌన్, న్యూస్‌టుడే : స్థానిక శిర్డీ సాయి బాబా కల్యాణ మండపంలో శుక్రవారం భక్తులు సామూహిక వ్రతాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ మేరకు వేద పండితులు ప్రత్యేక పూజలు, హోమాలు చేశారు.



కవులూరు: విద్యార్థులతో రామకృష్ణ, దుర్గాదేవి తదితరులు

స్టడీ మెటీరియల్ వితరణ

జి.కొండూరు, న్యూస్‌టుడే : కవులూరులోని భోగినేని రాజగోపాలరావు పుష్పావతి జడ్పీ ఉన్నత పాఠశాలలో హిందీ ఉపాధ్యాయినిగా పని చేసే డి.దుర్గాదేవి 50 మంది పది విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను శుక్రవారం వితరణ చేశారు. యూటీఎఫ్ రూపొందించిన మెటీరియల్‌ను ఆమె సమకూర్చగా పాఠశాల హెచ్‌ఎం జీవీ.రామకృష్ణ విద్యార్థులకు ఇచ్చారు. సయ్యద్ అక్బర్‌పాషా, విద్యాసాగర్, సిబ్బంది పాల్గొన్నారు.

విస్సన్నపేట, న్యూస్‌టుడే : విస్సన్నపేటలోని ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాల విద్యార్థులకు వైభవ్ జ్యూవెలరీ అధినేత కేవీ.నాగేశ్వరరావు వితరణతో స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి బీసీహెచ్‌ఈ సూర్యనారాయణ, పాఠశాల ప్రిన్సిపల్ రత్నాకర్, సీహెచ్. చంటిబాబు, ఎ.మురళీకృష్ణ, నాయకులు పాల్గొన్నారు.



విస్సన్నపేట ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలలో..

'రాజకీయ దుమారం లేపిన వాట్సప్ స్టేటస్'

తిరువూరు, న్యూస్‌టుడే : తిరువూరు ఎమ్మెల్యే కె.శ్రీనివాసరావు తన వాట్సప్ స్టేటస్‌లో శుక్రవారం పోస్టు చేసిన సందేశాలు రాజకీయ దుమారం లేపాయి. 'కొండపర్వ గట్టు వద్ద డే అండ్ నైట్ మ్యాచ్..నువ్వు దేనికి అధ్యక్షుడివి.. పేకాట క్లబ్బుకా, పేకాట కోసం ఆఫీస్ పెట్టావంటే..నువ్వు నిజంగా.. రాయల్' అని ఎమ్మెల్యే వాట్సప్ పోస్టు ద్వారా చర్చకు తెరలేపారు. కొలికపూడి వ్యాఖ్యలు విస్సన్నపేట మండల అధ్యక్షుడు రాయల సుబ్బారావును ఉద్దేశించే చేసినట్లు సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేశాయి. దీనిపై ఎమ్మెల్యేను సంప్రదించేందుకు ప్రయత్నించగా ఆయన కుటుంబ సమేతంగా శిర్డీ వెళ్లినట్లు కార్యాలయ వర్గాలు తెలిపారు.

ఎమ్మెల్యే ఆత్మపరిశీలన చేసుకోవాలి

విస్సన్నపేట, న్యూస్‌టుడే : నియోజకవర్గంలోని తెదేపా నాయకులపై నిరాధారమైన ఆరోపణలు చేస్తున్న ఎమ్మెల్యే కె.శ్రీనివాసరావు వాటిలో ఎంత వరకు వాస్తవమో ఆత్మపరిశీలన చేసుకోవాలని ఆ పార్టీ విస్సన్నపేట మండల అధ్యక్షుడు రాయల సుబ్బారావు హితవు పలికారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో కొలికపూడి వ్యాఖ్యలను సుబ్బారావు ఖండించారు. తాను జూదం ఆడిస్తున్నట్లు చేస్తున్న అసత్య ఆరోపణను ప్రజలు విశ్వసించరన్నారు. దేవాలయంగా భావించి పార్టీ కార్యాలయం నిర్మిస్తే అందులో జూదం ఆడుతున్నారని చెప్పడం ఎంత వరకు సబబు అన్నారు. తిరువూరు అభివృద్ధికి మీరేమి చేస్తున్నారో, నియోజకవర్గంలో తెదేపా మొత్తం ఎటువైపు ఉందో గమనించుకోవాలన్నారు.

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

తిరువూరు టౌన్, న్యూస్‌టుడే : తిరువూరు మండలం చింతలపాడులోని కట్టలేరువాగు నుంచి తెలంగాణకు అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. దీనిపై కేసు నమోదు చేసి వాహన చోదకులను తిరువూరు పోలీసు స్టేషన్‌కు తరలించినట్లు సెక్టారు- 1 ఎస్సై వైవీ.శాతకర్ణి తెలిపారు. ఇసుకను అక్రమంగా రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

పొంచి ఉన్న ఆపద



మండల కేంద్రంలోని పశు వైద్యశాల, బీసీ కాలనీకి వెళ్లే రోడ్డులో చప్టా సగం పడిపోయి ఏళ్లు గడుస్తున్నా మరమ్మతులకు నోచుకోవడం లేదు. దీంతో చేసేది లేక ద్విచక్ర వాహనదారులు, ప్రజలు దానిపై నుంచే రాకపోకలు సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయాందోళనకు గురవుతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి దానికి మరమ్మతులు చేయించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. **- న్యూస్‌టుడే, రెడ్డిగూడెం**

విద్యుత్తు సరఫరా నిలిపివేత నేడు

మైలవరం, న్యూస్‌టుడే : ఉప కేంద్రాల నిర్వహణలో భాగంగా మైలవరం, పుల్లూరు, గణపవరం, చంద్రాల విద్యుత్తు ఉపకేంద్రాల పరిధిలో శనివారం సరఫరా నిలిపేస్తున్నట్లు ఆయా కేంద్రాల ఏఈలు జి.రమేష్ బాబు, సీహెచ్.రామ్మోహనరావు తెలిపారు. మైలవరం, పొందుగల, పుల్లూరు, చంద్రగూడెం, మొర్సుమిల్లి గ్రామాల పరిధిలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, గణపవరం, కీర్తిరాయునిగూడెం, చంద్రాల, టి.గన్నవరం, ఎదురుబీడెం, కనిమెర్ల, పోరాటనగర్ గ్రామాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 వరకు సరఫరా ఉండదని వారు చెప్పారు.

జి.కొండూరు, న్యూస్‌టుడే : జి.కొండూరు, కుంటముక్కల, వెలగలేరు విద్యుత్తు ఉపకేంద్రాల పరిధిలోని గ్రామాల్లో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 వరకు సరఫరా నిలిపేస్తునట్లు ఆ శాఖ సహాయక ఇంజినీరు షఫీ ఓ ప్రకటలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

తిరువూరు టౌన్, న్యూస్‌టుడే : తిరువూరులో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని టౌన్ ఏఈ.కృష్ణారెడ్డి తెలిపారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

గంపలగూడెం, తిరువూరు, న్యూస్‌టుడే : తిరువూరులోని సిద్ధార్థ విద్యాలయానికి చెందిన 16 మంది విద్యార్థులకు లయన్స్ క్లబ్ ప్రతినిధుల ఆధ్వర్యంలో శుక్రవారం ఉచితంగా కళ్లజోళ్లు పంపిణీ చేశారు. ఇటీవల విద్యాలయంలో లయన్స్ క్లబ్ సభ్యుల ఆధ్వర్యంలో నేత్ర వైద్య పరీక్ష శిబిరం నిర్వహించారు. అందులో కళ్లజోళ్లు అవసరమైన వారికి క్లబ్ అధ్యక్షుడు పి.వెంకటేశ్వరరావు, కార్యదర్శి సీహెచ్.శంకరరావు, సభ్యులు కళ్లజోళ్లు ఇచ్చారు.

మైలవరం: స్థానిక కృష్ణ దంత వైద్యశాల ఆధ్వర్యంలో మండల పరిధి చిలుకూరివారిగూడెం జడ్పీ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు శుక్రవారం ఉచిత దంత పరీక్షలు నిర్వహించారు. వైద్యుడు కృష్ణచైతన్య విద్యార్థుల దంతాలను పరిశీలించి, సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ప్రధానోపాధ్యాయురాలు కుసుమ కుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

21న యూటీఎఫ్ జిల్లా కౌన్సిల్ సమావేశాలు

గవర్నర్‌పేట : తిరువూరు, లక్ష్మీపురంలో ఈ నెల 21న నిర్వహించే యూటీఎఫ్ జిల్లా కౌన్సిల్ సమావేశాలను విజయవంతం చేయాలని కార్యవర్గం పిలుపునిచ్చింది. శుక్రవారం గవర్నర్‌పేటలోని రాష్ట్ర కార్యాలయంలో సమావేశాల గోడ పత్రికలను రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి కె.ఎస్.ఎస్.ప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు తదితరులు ఆవిష్కరించారు. జిల్లా అధ్యక్షుడు కె.శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి ఎ.సుందరయ్యలు మాట్లాడుతూ.. ఈ సమావేశాల్లో విద్యారంగ పరిణామాలు, ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలు, పీఆర్సీ, ఐఆర్, బోధనేతర సమస్యలపై చర్చించి భవిషత్తు కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు.

ఆదాయ మార్గం.. బహుళ ప్రయోజనం!

కంకిపాడు, న్యూస్‌టుడే


పురుగుమందు చల్లుతున్న వ్యవసాయ డ్రోన్

వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా రాయితీపై రైతులకు అందజేస్తున్న వ్యవసాయ డ్రోన్లు బహుళ ప్రయోజనకారిగా ఉంటున్నాయి. సాగు ఖర్చు తగ్గించడంతో పాటు వ్యయప్రయాసలు తప్పుతున్నాయి. లబ్ధిదారులైన రైతులు.. సొంత పొలాల్లోనే కాకుండా ఇతర ప్రాంతాల్లోని కర్షకుల పొలాల్లో ఉపయోగించడం ద్వారా ఆశించిన ఆదాయం పొందుతున్నారు.

80 శాతం రాయితీపై..

కంకిపాడు మండలం కోలవెన్నుకు చెందిన వల్లభనేని వరప్రసాద్(పండుబాబు) గత జులైలో వ్యవసాయ శాఖ ద్వారా రూ.10 లక్షల విలువైన డ్రోన్‌ను దాదాపు 80 శాతం రాయితీపై మరో నలుగురు రైతులతో కలిసి తీసుకున్నారు. దీనికి రైతు భాగస్వామ్యంగా రూ.2.25 లక్షలు చెల్లించగా మిగతా మొత్తాన్ని ప్రభుత్వ రాయితీగా ఇచ్చింది.

నెలకు రూ.25వేల మేర రాబడి

ఇప్పటి వరకు సుమారు 500 ఎకరాల్లో పురుగుమందులు, ఎరువులు చల్లడానికి డ్రోన్ వాడారు. ఎకరానికి రూ.350 చొప్పున మొత్తం రూ.1.75 లక్షల ఆదాయం వచ్చింది. ఖర్చులు పోగా నెలకు రూ.25వేలు మిగిలినట్లు వరప్రసాద్ 'న్యూస్‌టుడే'కు తెలిపారు. అంతేకాకుండా డ్రోన్ ఉపయోగించడం ద్వారా ఒనగూరే ప్రయోజనాలను రైతులు గుర్తిస్తున్నారన్నారు. వచ్చే రబీలో ప్రధానంగా అపరాలు, మొక్కజొన్న, మిరప, కంది, పత్తి తదితర పంటల సస్యరక్షణకు బాగా ఉపయోగపడుతుందంటున్నారు. ఆ మేరకు ఆదాయం కూడా పెరుగుతుందని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు.

విజయవాడ, గుంటూరులో శిక్షణ



డ్రోన్ నిర్వహణపై విజయవాడ, గుంటూరులో శిక్షణ ఇస్తున్నారు. దీంతో పాటు క్షేత్రస్థాయిలో అనుభవం పొందాలి. తద్వారా నడిపే సాంకేతిక నిపుణుల కొరత, ఖర్చు నివారించవచ్చు. నెలకు రూ.40-50 వేల ఆదాయం వచ్చే అవకాశం ఉందని రైతు వరప్రసాద్ తెలిపారు. డ్రోన్‌లో ఎదురయ్యే సాధారణ సమస్యలను పరిష్కరించుకునేలా తర్ఫీదు పొందాలి. రైతు, కుటుంబ సభ్యులైతే బాధ్యతా యుతంగా నడుపుతారు. దీనివల్ల మరమ్మతులు వచ్చే అవకాశాలు తక్కువంటున్నారు.

రైతేరాజు

రబీ మొక్కజొన్నలో సస్యరక్షణ చర్యలు



నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: నందిగామ ప్రాంతంలో రైతులు రబీ పంటగా మొక్కజొన్నను ఎక్కువ విస్తీర్ణంలో సాగుచేస్తున్నారు. అధిక వర్షాలకు పత్తిపంట దెబ్బతినడంతో దాన్ని తొలగించి ఈ పంట వేస్తున్నారు. మాగాణి రైతులు సైతం వరి తరువాత రెండో పంటగా మొక్కజొన్న సాగు చేస్తున్నారు. వాతావరణం అనుకూలిస్తే ఎకరానికి 40 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని ఆశిస్తున్నారు. ఈ నేపథ్యంలో తెగుళ్ల నివారణ, సస్యరక్షణ చర్యలను మండల వ్యవసాయాధికారి గింజుపల్లి నాగేశ్వరరావు సూచిస్తున్నారు. ☛ మొక్కజొన్న పంట 30 రోజుల దశలో పేనుబంక ఆశిస్తుంది. ఆకులు పసుపు రంగులోకి మారి ముడుచుకుపోతాయి. దీని నివారణకు డైమిథోయేట్ మందు రెండు మిల్లీలీటర్లు, ఎసిఫేట్ 1.5 గ్రాముల మందును లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. ☛ నల్లులు ఆశించకుండా పొలంలో కలుపు లేకుండా చూసుకోవాలి. ఒకవేళ ఆశిస్తే నివారణకు డైకోఫాల్ 5.0 మి.లీ.మందు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. ☛ తెల్లదోమ నివారణకు వేపనూనె మిల్లీలీటరు 5 గ్రాముల సబ్బుపొడిలో కలిపి పిచికారీ చేయాలి. ☛ కాండం తొలుచు పురుగుల నివారణకు మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ. లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. గులాబీ రంగు పురుగు ఉద్ధృతి ఎక్కువగా ఉంటే కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలను ఎకరానికి మూడు కిలోలు ఆకుసుడులలో వేయాలి.

పసుపులో తెగుళ్ల నివారణ

తోట్లవల్లూరు, న్యూస్‌టుడే



వాతావరణంలో వస్తున్న మార్పులతో పసుపు తోటల్లో తెగుళ్లు ఆశిస్తున్నాయి. ఆకుమచ్చ, దుంపకుళ్లు సోకి పంట ఎదుగుదల, దిగుబడి, నాణ్యతను దెబ్బతీస్తున్నాయి. సకాలంలో సమగ్ర సస్యరక్షణ చర్యలు, యాజమాన్య పద్ధతులు పాటిస్తే నాణ్యమైన దిగుబడి పొందవచ్చని ఉద్యానశాఖాధికారిణి మానస పేర్కొన్నారు.

ఆకుమచ్చ తెగులు: ఆకులపై చిన్నచిన్న పసుపు రంగు మచ్చలు ఏర్పడతాయి. అనంతరం చిన్న చిన్న గోధుమ మచ్చలుగా మారతాయి. తెగులు తీవ్రమైతే ఆకు మాడిపోతుంది. దుంపలు, కొమ్ములు, ఎదుగుదల లోపించి దిగుబడి, నాణ్యత తగ్గుతుంది. నివారణకు పొలంలో తగు మోతాదులో తేమ ఉండేలా తడులు ఇవ్వాలి. ఆకుమచ్చలున్న, ఎండిన ఆకులను కత్తిరించి నాశనం చేయాలి. మాంకోజెబ్ 2.5 గ్రాములు లేదా కార్బండిజమ్ గ్రాము లేదా ప్రోపికొనజోల్ మి.లీ + 0.5 మి.లీ జిగురు లీటరు నీటికి కలిపి 15 రోజులు వ్యవధిలో సమీపంలో ఉన్న రైతులంతా సామూహికంగా రెండు సార్లు పిచికారీ చేయాలి.

దుంపకుళ్లు: ఈ తెగులు ఆశిస్తే మొదటగా పసుపు కొమ్ములు కుళ్లిపోతాయి. లోపల బియ్యం గింజల్లాంటి పురుగులు ఉంటాయి. నీరు నిలిచే, తేమ ఎక్కువగా ఉన్న పొలంలో ఈ తెగులు ఉద్ధృతి ఎక్కువ. కాండంపై కొన్ని మచ్చలు కనిపిస్తాయి. మెల్లగా అవి గోధుమ రంగులోకి మారతాయి. మొక్కల్లో ఎదుగుదల లోపిస్తుంది. దుంప చూస్తే వేర్లు కుళ్లినట్లు నల్లగా ఉంటుంది. దుర్వాసన వస్తుంది. నివారణకు గాలి, వెలుతురు ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి. ఎకరాకు 100 కిలోల వేపపిండి వేయాలి. తల్లి పురుగుల నివారణకు 3జీ కార్బోఫ్యూరాన్ గుళికలు ఎకరాకు 10 కిలోలు వేయాలి. కుళ్లిన చోట కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రాములు లీటరు నీటికి కలిపిన ద్రావణాన్ని ముందుగా తడిచేలా పోయాలి.

ప్రశ్న: మిరప పంటకు అనుకూల నేలలు, కాలం, విత్తన మోతాదు, శుద్ధి, ఎరువుల గురించి వివరించండి?
-కె.శ్రీనివాస్, రైతు, ఘంటసాల

రైతు ప్రశ్న? శాస్త్రవేత్త సలహా

సమాధానం: వర్షాధార మిరప పంటకు నల్లనేలలు, లంక భూములు, ఇసుకతో కూడిన ఒండ్రు నేలలు అనుకూలం. పొలాన్ని మూడు నుంచి నాలుగు సార్లు దుక్కిదున్ని రెండు సార్లు గుంటక తోలాలి. పంట సాగుకు అనుకూల సమయం ఇదే. విత్తన మోతాదుకు సంబంధించి నారు పెంచేందుకు సెంటుకు 650 గ్రాములు (ఒక ఎకరానికి సరిపడా), ఎదబెట్టేందుకు 2.5 కిలోల విత్తనం అవసరమవుతుంది. కిలో మిరప విత్తనానికి రసం పీల్చే పురుగులు నివారణకు 8 గ్రాముల ఇమిడాక్లోప్రిడ్, తెగుళ్ల నివారణకు 3 గ్రాముల కాప్టాన్ లేదా 3 గ్రాముల మాంకోజెబ్ కలిపి శుద్ధి చేసుకోవాలి. ఎకరానికి 10 టన్నుల పశువుల ఎరువు వేయాలి. లేదా పచ్చిరొట్ట పైరు పెంచి భూమిలో కలియదున్నాలి. ఎకరానికి 120 కిలోల నత్రజని, 24 కిలోల భాస్వరం, 48 కిలోల పొటాషియం అందించే ఎరువులు వేయాలి. **-వి.మంజువాణి, ఉద్యాన శాస్త్రవేత్త, కృషి విజ్ఞానకేంద్రం, ఘంటసాల. - న్యూస్‌టుడే, ఘంటసాల**

దుర్గగుడి విశేషాలు


దుర్గమ్మను దర్శించుకునేందుకు వస్తున్న దివ్యాంగులు

✷ భవానీ దీక్షా విరమణలు వైభవంగా కొనసాగుతున్నాయి. శుక్రవారం తెల్లవారుజాము నుంచి ఉదయం 11 గంటల వరకు భవానీ మాలధారణ భక్తులు దుర్గమ్మను దర్శించుకున్నారు. తిరిగి సాయంత్రం ఐదు గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు రద్దీ కొనసాగింది.

✷ గిరిప్రదక్షిణ మార్గంలో ఈవో వీకే శీనానాయక్ భవానీ భక్తులతో కలిసి గిరిప్రదక్షిణ చేశారు. ఈ సందర్భంగా భక్తులతో ఏర్పాట్ల గురించి మట్లాడగా.. సంతృప్తికరంగా ఉన్నాయని చెప్పారు.

✷ **ఆదాయ వివరాలు..** రెండో రోజు వివిధ సేవల ద్వారా అమ్మవారి ఆలయానికి మొత్తం రూ.58,10,796 ఆదాయం వచ్చింది. ✷ రూ.15లు లడ్డూ ప్రసాదం ద్వారా రూ.1,09,650 ✷ రూ.100లు లడ్డూ బాక్సుల ద్వారా రూ.52,20,400 ✷ కేశఖండనశాల సేవ ద్వారా రూ.4,75,280 ✷ ఇతర సేవల ద్వారా రూ.5,466 ఆదాయం సమకూరింది. ✷ సాయంత్రం ఆరు గంటల వరకు మొత్తం 85 వేల మంది భవానీభక్తులు దుర్గమ్మను దర్శించుకున్నారు. ✷ అల్పాహారం 8,700 మంది భక్తులు స్వీకరించగా, అన్నప్రసాదాన్ని 14,000 మంది భక్తులు స్వీకరించారని ఆలయ అధికారులు వెల్లడించారు. ✷ దివ్యాంగుల కోసం ఆలయ అధికారులు కొండ కింద నుంచి ప్రత్యేక బస్సును ఏర్పాటు చేశారు. అనంతరం వారిని బ్యాటరీ వాహనాల ద్వారా ఆలయానికి తీసుకొచ్చి రూ.500 క్యూలైన్ ద్వారా వారికి అమ్మవారి దర్శనం కల్పిస్తున్నారు. **- న్యూస్‌టుడే, విజయవాడ వన్‌టౌన్, ఇంద్రకీలాద్రి**

కన్వేయర్ బెల్ట్ ద్వారా వస్త్రాల తరలింపు



భవానీ భక్తుల దీక్షా విరమణోత్సవాల సందర్భంగా రద్దీని దృష్టిలో ఉంచుకొని మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు కృష్ణవేణిఘాట్‌లో కన్వేయర్ బెల్ట్ ఏర్పాటు చేశారు. ఈ ఘాట్ సమీపంలోని కేశ ఖండనశాలలో భవానీలు మొక్కులు చెల్లించుకుని, స్నానాలు చేస్తారు. దీక్షా వస్త్రాలను ఘాట్‌లో వదిలేస్తున్నారు. వాటిని పారిశుద్ధ్య సిబ్బంది సేకరించి కన్వేయర్ బెల్ట్‌పైకి చేర్చుతున్నారు. అనంతరం బెల్ట్ చివరన ఏర్పాటు చేసిన వాహనంలో వస్త్రాలను నింపుతున్నారు. ఇలా రోజుకు సుమారు ఎనిమిది టన్నుల వస్త్రాలను తరలిస్తున్నారు. - **కృష్ణలంక, న్యూస్‌టుడే**



రెండు లడ్డూలు కావాలని అడుగుతున్న భక్తుడు


6 లడ్డూలతో సిద్ధం చేసిన బాక్సులు

విడి లడ్డూలకు.. కౌంటర్లు వేరండి..

ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గమ్మను దర్శించుకుని దీక్ష విరమించేందుకు భవానీ భక్తులు లక్షల్లో విజయవాడకు వస్తున్నారు. వీరి కోసం కనకదుర్గానగర్‌లో పెద్దఎత్తున ప్రసాదం కౌంటర్లు ఏర్పాటు చేశారు. 80 గ్రాముల లడ్డూ రూ.15కి అని బోర్డులు ఉన్నా కేవలం రెండు కౌంటర్లలో మాత్రమే విడిగా విక్రయిస్తున్నారు. దాదాపు అన్ని కౌంటర్లలో రూ.100కు 6లడ్డూలు ఉన్న బాక్సులు మాత్రమే అమ్ముతున్నారు. దీంతో రెండు, మూడు లడ్డూలు కావాలని వచ్చే భక్తులు నిరాశతో వెనుదిరుగుతున్నారు. అలా విడిగా ఇచ్చేందుకు ప్రత్యేక కౌంటర్లు ఉన్న సంగతి తెలియజేస్తే భక్తులకు సౌకర్యంగా ఉంటుంది. **- ఈనాడు, అమరావతి**

సాంకేతికతతో భద్రతా ఏర్పాట్లు


డీసీపీ షిరీన్ బేగంకు సూచనలు ఇస్తున్న సీపీ రాజశేఖరబాబు, పక్కన ఇన్‌ఛార్జి కలెక్టర్ ఇలక్కియా

విద్యాధరపురం: సాంకేతికత ఆయుధంగా భక్తుల భద్రతా ఏర్పాట్లు పరిశీలిస్తున్నామని సీపీ రాజశేఖరబాబు అన్నారు. మోడల్ గెస్టు హౌస్‌లోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో ఇన్‌ఛార్జి కలెక్టర్ ఇలక్కియాతో కలిసి భవానీ దీక్షల విరమణ రెండో రోజు శుక్రవారం క్షేత్రస్థాయిలో సమీక్షించారు. భవానీల రద్దీ, ట్రాఫిక్ సమస్యలు, ఘాట్లు, క్యూలైన్లలో పరిస్థితిని ఎప్పటికప్పుడు వీక్షించి అధికారులకు కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి సూచనలు చేశారు. డ్రోన్ కెమెరాల ద్వారా గిరిప్రదక్షిణ మార్గాన్ని పరిశీలించారు. ఫేసియల్ రికగ్నైజేషన్ కెమెరాల ద్వారా ఆలయ పరిసరాల్లో నేరస్థులపై నిఘా ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. అమ్మవారి దర్శనానికి ఎంత సమయం పడుతుందనే విషయాన్ని కూడా సచివాలయాల పోలీసులు భక్తులకు తెలియజేస్తారన్నారు. కార్యక్రమంలో డీసీపీ షిరీన్ బేగం, లక్ష్మీనారాయణ, ఏడీసీపీ రామకృష్ణ పాల్గొన్నారు.

దీక్షాధారులకు సమస్యలు లేకుండా చూడాలి


భక్తులతో మాట్లాడుతున్న ఈవో శీనానాయక్

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: భవానీ దీక్షాధారులకు క్షేత్రస్థాయిలో సమస్యలు తలెత్తకుండా అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఈవో శీనానాయక్ ఆదేశించారు. భవానీ దీక్షాధారులకు ఘాట్లు, క్యూలైన్లు, గిరిప్రదక్షిణ మార్గంలో ఎదురయ్యే ఇబ్బందులను తెలుసుకునేందుకు శుక్రవారం ఈవో శీనానాయక్ ద్విచక్ర వాహనంపై పర్యటించారు. సీతమ్మవారి పాదాల ఘాట్ వద్ద దీక్షాధారులతో మాట్లాడారు. సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. గిరిప్రదక్షిణ మార్గంలో ఇబ్బందులు ఉంటే తెలియజేయాలని సూచించారు. పారిశుద్ధ్య సమస్యలు ఎప్పటికప్పుడు తెలుసుకుని శుభ్రం చేసేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. కౌంటర్లలో ప్రసాదాలు అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు.

చిన్నారులకు ఐసీడీఎస్ ట్యాగ్


ట్యాగ్‌లు వేసిన వారితో ఐసీడీఎస్ సిబ్బంది

విజయవాడ వన్‌టౌన్, న్యూస్‌టుడే: జిల్లా మాతా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో భవానీ దీక్షల విరమణలకు వచ్చే చిన్నారులు తప్పిపోకుండా ముందు జాగ్రత్తగా చైల్డ్ మానిటరింగ్ ట్యాగ్‌లను వేస్తున్నట్టు ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ రుక్సానా బేగం తెలిపారు. సిబ్బందితో పాటు శుక్రవారం ఆలయ పరిసరాల్లో చిన్నారులకు ట్యాగ్‌లు వేశారు. ఇప్పటి వరకు 800 ట్యాగ్‌లు వేసినట్టు తెలిపారు.

ప్రభుత్వానిది స్పీడ్ ఆఫ్ బిజినెస్ నినాదం

రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి


మాట్లాడుతున్న మంత్రి పార్థసారథి, వేదికపై సుబ్బారావు, విశ్వ, శేఖర్‌బాబు, భాస్కర్‌రావు తదితరులు

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే: దేశంలోనే మొట్టమొదటిగా క్వాంటం కంప్యూటర్‌ను ఏర్పాటు చేయబోయే రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ కావడం ఎంతో గర్వకారణంగా ఉందని రాష్ట్ర సమాచార, పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. దీనికి సంబంధించిన సన్నాహాలు ఇప్పటికే ప్రారంభమయ్యాయని చెప్పారు. క్వాంటం అభివృద్ధికి కేంద్రం కేటాయించిన రూ.లక్ష కోట్ల నిధిని ఉపయోగించుకుంటున్న మొట్టమొదటి రాష్ట్రం కూడా ఆంధ్రప్రదేశ్ అని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ ఇండస్ట్రీస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో విజయవాడ ఎస్ఎస్ కన్వెన్షన్‌లో మూడు రోజుల పాటు నిర్వహించే ఏపీ ఛాంబర్స్ బిజినెస్ ఎక్స్‌పో-2025ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి మాట్లాడుతూ క్వాంటం కంప్యూటర్‌ను దిగుమతి చేసుకోవడమే కాకుండా దానిని రాష్ట్రంలోనే తయారు చేయాలనే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఎస్క్రో ఖాతా ద్వారా పెట్టుబడిదారులకు సకాలంలో ప్రోత్సాహకాలు అందించేలా ప్రభుత్వం చారిత్రక నిర్ణయం తీసుకుందన్నారు. రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనకు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలని, సింగిల్ విండో ద్వారా 21 రోజుల లోపే అనుమతులు ఇస్తామని తెలిపారు. స్పీడ్ ఆఫ్ బిజినెస్ నినాదంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. కాలుష్య నియంత్రణ మండలి ఛైర్మన్ పి.కృష్ణయ్య మాట్లాడుతూ.. రాష్ట్రాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేయడంతో పాటు కాలుష్య రహితంగా తీర్చిదిద్దడమే సర్కారు లక్ష్యమన్నారు. ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ టి.శివశంకరరావు మాట్లాడుతూ పెట్టుబడిదారులు ఆర్థికంగా బలోపేతమై రాష్ట్రాభివృద్ధికి తోడ్పాటునందించాలని కోరారు. కార్యక్రమంలో ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ సీఈవో డాక్టర్ గడ్డం శేఖర్‌బాబు, ఎంఎస్ఎంఈ కార్పొరేషన్ సీఈవో ఎం.విశ్వ, ఆంధ్రప్రదేశ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఇండస్ట్రీస్ ఫెడరేషన్ అధ్యక్షుడు పోట్లూరి భాస్కరరావు, ప్రధాన కార్యదర్శి రావూరి సుబ్బారావు, ఉపాధ్యక్షుడు బి.రాజశేఖర్, కోశాధికారి సుంకర అక్కయ్యనాయుడు, పారిశ్రామికవేత్తలు, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్తు పొదుపు ముఖ్యం



ర్యాలీలో డీఆర్ఎం మోహిత్ సొనాకియా, ఇతర అధికారులు

విజయవాడ(రైల్వేస్టేషన్), న్యూస్‌టుడే: భవిష్యత్తు అవసరాల దృష్ట్యా విద్యుత్తును పొదుపుగా వాడాలని డీఆర్ఎం మోహిత్ సొనాకియా సూచించారు. ఇంధన పరిరక్షణ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం విజయవాడ రైల్వే విద్యుత్తు నిర్వహణ విభాగం ఆధ్వర్యంలో డీఆర్ఎం కార్యాలయం నుంచి రైల్వేస్టేషన్ మీదుగా ర్యాలీ నిర్వహించి కార్యాలయంలో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యుత్తు నిర్వహణ విభాగం ఆధ్వర్యంలో సౌరశక్తి వినియోగం ద్వారా డివిజన్ వ్యాప్తంగా రూ.లక్షల్లో ఆదా చేయడం అభినందనీయమన్నారు. విద్యుత్తు పొదుపు పాటిస్తూ ఏటా అవార్డులు సాధించడం గర్వకారణమని చెప్పారు. రానున్న రోజుల్లో మరింత ప్రగతిని సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఏడీఆర్ఎంలు కొండా శ్రీనివాసరావు, ఎడ్విన్, సీనియర్ డీఈఈ(నిర్వహణ) టి.సురేష్‌బాబు, అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వామపక్ష నాయకులపై కేసు కొట్టివేత


విచారణకు హాజరైన రామకృష్ణ, మధు తదితరులు

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే : పెట్రోల్, డీజిల్, నిత్యావసర వస్తువుల ధరల పెంపును వ్యతిరేకిస్తూ దాసరిభవన్ వద్ద నిరసన వ్యక్తం చేసిన సీపీఐ, సీపీఎం నాయకులపై పెట్టిన కేసును శుక్రవారం కొట్టివేశారు. 2021, జూన్ 18న సీపీఐ, సీపీఎం నాయకులు కె.రామకృష్ణ, పి.మధు, సి.హెచ్.బాబూరావు, దోనేపూడి శంకర్‌లు ప్రజా వ్యతిరేక పాలనను నిరసిస్తూ ఆందోళన చేపట్టారు. దీనిపై గవర్నర్‌పేట పోలీసులు ఐపీసీ 341, 188, 269, 143 రెడ్ విత్ 149 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఈ కేసును విచారించిన న్యాయమూర్తి.. సదరు నాయకులపై పెట్టిన కేసును కొట్టివేస్తూ శుక్రవారం తీర్పు చెప్పారు. ఇది ప్రజాతంత్ర శక్తుల విజయమని సీపీఐ జాతీయ సమితి కార్యదర్శి కె.రామకృష్ణ వ్యాఖ్యానించారు. న్యాయవాదులు ఎన్.సాయిశంకర్, జి.వి.రాజు ఈ కేసును వాదించారు.

బదిలీల ఉత్తర్వులు

విజయవాడ వైద్యం, న్యూస్‌టుడే: విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రి, సిద్ధార్థ వైద్య కళాశాలకు చెందిన పలువురిని బదిలీ చేస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో డిప్యూటేషన్‌పై విధులు నిర్వహిస్తున్న ఫిజియాలజీ ప్రొఫెసర్ సీహెచ్ శ్రీనివాసరావును సిద్ధార్థ వైద్య కళాశాల ఫిజియాలజీ ప్రొఫెసర్‌గా నియమించింది. ✷ మచిలీపట్నంలోని ఎస్వీవీ ప్రభుత్వ వైద్య కళాశాలలో ఆప్తమాలజీ ప్రొఫెసర్ డా.గీత.. స్పౌజ్ కోటా కింద విజయవాడ ప్రభుత్వాసుపత్రికి బదిలీ అయ్యారు. ✷ విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో సీఎస్ఆర్ఎంవోగా విధులు నిర్వహిస్తున్న డా.ఎ.హనుమంతరావు భద్రతా విధుల్లో నిర్లక్ష్యంగా ఉన్నారంటూ వచ్చిన ఆరోపణల నేపథ్యంలో విచారణ చేపట్టారు. అవి నిరూపితం కాకపోవడంతో అతడిపై నమోదైన ఫిర్యాదును రద్దు చేస్తూ ప్రభుత్వం శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది.

తిరుపతమ్మ ఆదాయానికి గండి

బకాయిలు చెల్లించని పాటదారులు ● అయినా కొనసాగిస్తున్న అధికారులు

పెనుగంచిప్రోలు, నందిగామ(న్యూస్‌టుడే)



పెనుగంచిప్రోలులోని శ్రీలక్ష్మీతిరుపతమ్మ అమ్మవారి ఆలయంలో పలు వ్యాపారాలు నిర్వహించుకునేందుకు ఆలయ అధికారులు వేలం పాటలు నిర్వహిస్తారు. దీనిలో ఎక్కువ మొత్తానికి పాడిన వారికి ఖరారు చేస్తారు. పాట దక్కించుకున్న వారు 72 గంటల్లోపు ఆలయానికి పూర్తిగా డబ్బులు చెల్లించాలి. జీవో 426 ప్రకారం అలా చెల్లించిన వారే ఆలయం వద్ద అనుమతి ఇస్తామని, లేకపోతే పాట రద్దు చేస్తామని ఆలయ అధికారులు వేలంపాట షరతులు విధిస్తారు. అయితే దీనికి విరుద్ధంగా వేలంపాట చెల్లించని వారికి అధికారులు, ఉద్యోగులు వ్యవహరిస్తుండడంతో బకాయిలు పేరుకుపోయాయి. అయినా అధికారులు పట్టించుకోవట్లేదు.

నిబంధనలు బేఖాతర్..

షరతులను పాటదారులు పట్టించుకోవడం మానేసి.. వ్యాపారులకు సహకరిస్తున్నారు. అమ్మవారి ఆదాయంతోనే వ్యాపారాలు చేస్తున్నారు. బకాయిలు రూ.లక్షల్లో పేరుకు పోతున్నాయి. వచ్చే ఏడాది జనవరిలో పాటలకు మళ్లీ వేలం పాటలు నిర్వహించనున్నారు. అడపాదడపా కొంత మొత్తం జమ చేస్తూ దేవాలయ ఆదాయానికి గండి కొడుతున్నారు. కాలవ్యవధి పూర్తయ్యాక బకాయిలు వసూలు కాక అధికారులు కోర్టును ఆశ్రయిస్తున్నారు.

వేలంపాటల నిర్వహణ వీటికే..

కొబ్బరి కాయలు, కొబ్బరి చిప్పల విక్రయాలు, పొంగళ్ల షెడ్లు, దుకాణాల సముదాయాలు, పాపమాంబ వనం, సత్రాల నిర్వహణ, అమ్మవారికి భక్తులు సమర్పించే వస్త్రాలు, తలనీలాలు సేకరణ, వాహనాల పార్కింగ్ ఫీజు వసూలు, క్యాంటీన్, మరుగుదొడ్లు, క్లోక్‌రూమ్ నిర్వహణ, సెల్‌ఫోన్‌లు భద్రపరచడం, ఆలయంలో ఫొటోలు తీసుకునేందుకు తదితర 29 వ్యాపారాలకు బహిరంగ వేలం పాటలు నిర్వహించారు.

రూ.86.41 లక్షల బకాయిలు

కొన్ని వ్యాపారాల పాటలకు గత జనవరి 20న, మిగిలిన వాటికి తర్వాత వేలం పెట్టి ఖరారు చేశారు. దీని ద్వారా జీఎస్టీతో కలిసి అమ్మవారికి రూ.5,75,23,193 ఆదాయం రావాలి. తలనీలాలు సేకరించే వేలం పాట రూ.2.50 కోట్లు కాగా పాటదారు, కొందరు పూర్తిగా చెల్లించారు. మరికొందరు పాటదారులు బకాయిలు ఉన్నా వ్యాపారాలు చేసుకుంటున్నారు. దీని వల్ల జీఎస్టీతో కలిపి రూ.86,41,518 బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయి. ఇప్పటికైనా దేవాదాయ శాఖ అధికారులు బకాయిలు వసూలుకు చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు. ★ దీనిపై డిప్యూటీ కమిషనర్ మహేశ్వరరెడ్డిని వివరణ కోరగా.. పాటదారుల బకాలయిలపై చర్యలు తీసుకుంటామని చెప్పారు.

'50 శాతం రిజర్వేషన్ల పరిమితి ఎత్తివేయాలి'


గోడప్రతులను ఆవిష్కరిస్తున్న శంకరరావు, వెంకటేశ్వరరావు, ఉమామహేశ్వరరావు, కనకారావు తదితరులు

మొగల్రాజపురం (విజయవాడ సిటీ): ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ రిజర్వేషన్లు మొత్తం కలిపి 50 శాతం మించకూడదన్న సుప్రీంకోర్టు నిబంధన అసంబద్ధమైందని, రాజ్యాంగ విరుద్ధమని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు ఆరోపించారు. ఓబీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్లు, ఏళ్ల నుంచి ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 15న దిల్లీ జంతర్ మంతర్ వద్ద నిర్వహించే మహాధర్నా-పార్లమెంట్ ముట్టడి కార్యక్రమానికి సంబంధించిన 'చలో దిల్లీ' గోడప్రతులను విజయవాడ టిక్కిల్‌రోడ్డులోని బీసీ సంక్షేమ ఉద్యోగుల సంఘ కార్యాలయంలో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శంకరరావు మాట్లాడుతూ ఈ నెల 16న ఓబీసీల డిమాండ్లపై ప్రధాని నరేంద్రమోదీ, కేంద్రహోంశాఖ మంత్రి అమిత్‌షా, కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, మల్లికార్జునఖర్గేలతో పాటు పార్లమెంట్ సభ్యులను కలిసి వినతి పత్రాలు ఇవ్వనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కనకారావు, ఉద్యోగ సంఘాల కార్యనిర్వాహక అధ్యక్షుడు గుంటుపల్లి ఉమామహేశ్వరరావు, బీసీ నాయకులు మేకా వెంకటేశ్వరరావు, వాక వెంకటేశ్వరరావు, రాంప్రసాద్ పాల్గొన్నారు.

మహిళా వాలీబాల్ పోటీలకు ఎన్టీఆర్ వర్సిటీ జట్టు


జట్టుతో ఉపకులపతి చంద్రశేఖర్, రిజిస్ట్రార్ రాధికారెడ్డి, త్రిమూర్తి

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: చెన్నై ఎస్ఆర్ఎం వర్సిటీ ఆధ్వర్యంలో ఈ నెల 15 నుంచి 19 వరకు నిర్వహించే దక్షిణ మండల అంతర్ విశ్వవిద్యాలయాల మహిళా వాలీబాల్ పోటీలో పాల్గొనే డాక్టర్ ఎన్టీఆర్ వర్సిటీ జట్టును.. వర్సిటీ స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి ఇ.త్రిమూర్తి శుక్రవారం ప్రకటించారు. ఈ సందర్భంగా జట్టు సభ్యులకు వర్సిటీ ఉపకులపతి డాక్టర్ పి.చంద్రశేఖర్, రిజిస్ట్రార్ డాక్టర్ వి.రాధికారెడ్డిలు వర్సిటీ ప్రాంగణంలో క్రీడా దుస్తులు అందజేశారు. జట్టుకు ఎంపికైన వారిలో ఎన్.యామిని, కె.జయలక్ష్మీ సాయి అనీల, ఎం.వేదాశ్రీ, డి.సృజన, ఎంఎం హేమలత, బి.శ్రీసాయి జ్యోతిర్మయి, టి.గ్రీష్మ, డి.సంజన, షేక్ ఛరిష్మా, బీఎన్‌జీజీ అన్నపూర్ణాదేవి, షాహిస్తా అఫ్రీన్, జి.సిరి, కె.నవ్య గీతిక, కె.నాగ శ్రీవల్లి ఉన్నారు. జట్టుకు మేనేజరుగా జి.లక్ష్మణరావు (పీడీ, రంగరాయ వైద్య కళాశాల, కాకినాడ), కోచ్‌గా ఎ.ఆంజనేయులు(కృష్ణా జిల్లా వాలీబాల్ సంఘం కోచ్)నియమితులయ్యారు.

విద్యను మానవ వనరుల అభివృద్ధిగానే చూడాలి

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యను మార్కెట్ సరకుగా కాకుండా, దేశ ప్రగతికి ఉపకరించేలా మానవ వనరుల అభివృద్ధిగా చూడాలని పీడీఎస్‌యూ జాతీయ కన్వీనర్ ఎం.రామకృష్ణ విన్నవించారు. కేజీ నుంచి పీజీ వరకు ఉన్న విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నగరంలోని కలెక్టరేట్‌లో డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహానికి శుక్రవారం వినతి పత్రం అందజేశారు. రామకృష్ణ మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా రూ.6,400 కోట్లు ఫీజు రీఎంబర్సుమెంటు, ఉపకార వేతనాలు రావాల్సి ఉందన్నారు. ప్రభుత్వ వైద్య కళాశాలల పీపీపీ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగ భృతి రూ.3,000లను అందజేయాలన్నారు. సంక్షేమ వసతి గృహాల్లో ఖాళీలను భర్తీ చేయాలని, విద్యార్థులకు మెస్, కాస్మోటిక్ ఛార్జీలను పెంచాలని కోరారు. పీడీఎస్‌యూ నగర అధ్యక్ష, కార్యదర్శులు పి.వైష్ణవ్, ఆర్.వేణు తదితరులు పాల్గొన్నారు.

వంశీ పిటిషన్‌పై విచారణ వాయిదా

ఈనాడు - అమరావతి: సత్యవర్ధన్ కేసులో పటమట స్టేషన్‌లోని సీసీటీవీ ఫుటేజీని కోర్టు ముందుంచాలని వల్లభనేని వంశీ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ వాయిదా పడింది. శుక్రవారం ఎస్సీ, ఎస్టీ కోర్టులో విచారణకు వచ్చింది. వాదనల నిమిత్తం 17వ తేదీకి న్యాయాధికారి భాస్కరరావు వాయిదా వేశారు. తేలప్రోలు రాము (ఏ3), వజ్రకుమార్ (ఏ6), యర్రంశెట్టి రామాంజనేయులు అలియాస్ పొట్టి రాము (ఏ9) దాఖలు చేసిన బెయిల్ పిటిషన్లపై పటమట పోలీసులు కౌంటర్లు ఫైల్ చేశారు. వీటిపై వాదనల నిమిత్తం 17కి వాయిదా పడింది. * ఈ ముగ్గురిని కస్టడీకి ఇవ్వాలని పోలీసులు వేసిన కస్టడీ పిటిషన్లపై శుక్రవారం నిందితుల తరఫు న్యాయవాదులు కౌంటర్లు దాఖలు చేశారు. తదుపరి వాదనల నిమిత్తం 15కు వాయిదా వేశారు.

చెవిరెడ్డి కుటుంబ సభ్యుల అనుమతి విషయమై...

ఈనాడు - అమరావతి: ఏసీబీ కోర్టుకు రిమాండ్ పొడిగింపు నిమిత్తం చెవిరెడ్డిని తీసుకొచ్చిన సందర్భాలలో కేవలం కుటుంబ సభ్యులను మాత్రమే కలిసేందుకు అనుమతించాలని సిట్ వేసిన పిటిషన్‌పై విచారణ వాయిదా పడింది. శుక్రవారం ఏసీబీ కోర్టులో ఇది విచారణకు వచ్చింది. కౌంటరు దాఖలు కోసం 17వ తేదీకి వాయిదా వేశారు. తనకు జైలులో ప్రత్యేక మెనూ అనుమతించాలని రోనక్ వేసిన పిటిషన్ విచారణకు వచ్చింది. తదుపరి వాదనల నిమిత్తం సోమవారానికి న్యాయాధికారి వాయిదా వేశారు.

మావోయిస్టుల న్యాయ సహాయానికి లాయర్ శాంతి నియామకం

ఈనాడు - అమరావతి: విజయవాడ నగరంలో అరెస్టు అయి, నెల్లూరు కారాగారంలో జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న నలుగురు మావోయిస్టులకు న్యాయ సహాయం అందించేందుకు విజయవాడకు చెందిన న్యాయవాది శాంతిని మండల సేవాధికార సంస్థ నియమించింది. గత నెలలో నగరంలోని పలు ప్రాంతాల్లో తలదాచుకున్న నలుగురు మావోయిస్టులను పటమట పోలీసులు అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. అరెస్టు అయిన పోడియం రెంగు అలియాస్ భీమ, మడకం మదన్ అలియాస్ మదన అలియాస్ జగ్గు అలియాస్ లక్మ, సోది మనీలా అలియాస్ మాధవి సిన్మయ అలియాస్ మనీలా, మంగిలకు న్యాయ సహాయం నాలుగో ఏసీజేఎం కోర్టు న్యాయాధికారి నుంచి వచ్చిన లేఖ మేరకు మండల న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్, రెండో ఏడీజే కోర్టు న్యాయాధికారి సత్యానంద్ ఉత్తర్వులు జారీ చేశారు.

మోసపోతే అలా.. ఫిర్యాదు చేయడం ఇలా!

● కిరణ్ కొన్న ఓ వస్తువు వారెంటీ కన్నా ముందే పాడైంది. షాపు యజమానిని ప్రశ్నిస్తే కంపెనీ వారితో మాట్లాడి చెబుతానన్నారు. 20 రోజులవుతున్నా సరైన సమాధానం లేదు. ఇటువంటి స్పందనని ఊహించని కిరణ్‌కు ఏం చేయాలో తోచలేదు.



రమేశ్ ఓ థియేటర్‌లో కూల్‌డ్రింక్ కొన్నారు. అమ్మిన వ్యక్తి బాటిల్‌పై ఉన్న ధర కంటే అధికంగా డబ్బును వసూలుచేశారు. ఇదేంటని నిలదీస్తే యజమాని దురుసుగా ప్రవర్తించాడు. దీంతో చేసేదేం లేక రమేశ్ అక్కడి నుంచి వెనుదిరిగారు.

చాలామందికి ఇలాంటి పరిస్థితులు ఎదురవుతుంటాయి. అలా నష్టపోయిన వారికి పరిహారం చూపించేందుకే వినియోగదారుల రక్షణ చట్టం ఉంది. దీన్ని గురించి తెలిసినా ఫిర్యాదు చేయడంపై అవగాహన ఉండట్లేదు. వినియోగదారుల ఫోరం గురించి పూర్తి వివరాలు తెలుసుకుందాం రండి!

వీటిపై ఫిర్యాదు చెయ్యొచ్చు..

● ఒక వస్తువును కొనుగోలు చేసినా, సేవను ఉపయోగించుకున్నా వినియోగదారుడవుతారు. వీరికి వస్తువులు, సేవల విషయంలో జరిగిన ఏ నష్టం, కష్టం గురించైనా ఫోరంలో ఫిర్యాదు చేయవచ్చు.

● వస్తు, సేవల ప్రమాణాల్లో లోపాలు, ఉల్లంఘనలు.. నాణ్యత, పరిమాణం విషయంలో అతిక్రమణలు, దుకాణాలు మొదలు బస్టాండ్, సినిమా హాళ్లు, రైల్వే స్టేషన్లు తదితర ప్రాంతాల్లో వస్తువులపై ముద్రించిన ధర కంటే ఎక్కువకు అమ్మడం, ప్రకటించిన ఆఫర్లు ఇవ్వకపోవడం, పాత వస్తువులను కొత్తవిగా తయారు చేసి విక్రయించడం, వినియోగదారుల ప్రాణాలు, ఆరోగ్యానికి హాని కలిగించే వస్తువుల అమ్మకాలు జరపడం వంటి వాటిపై ఫిర్యాదు చేయవచ్చు.

ఏం చేయాలి..?

● ముందుగా జరిగిన నష్టానికి పరిహారం లేదా మరో వస్తువు ఇవ్వాలని అమ్మకందారుడిని కోరాలి. నిరాకరించినా.. మీ ప్రతిపాదనపై 15 రోజుల వరకు స్పందన రాకున్నా.. అప్పుడు వినియోగదారుల ఫోరాన్ని ఆశ్రయించాలి.

● వస్తువు, లేదా సేవ వల్ల జరిగిన నష్టం రూ.20లక్షల లోపు ఉంటే జిల్లా వినియోగదారుల ఫోరం, రూ.20లక్షల నుంచి రూ.కోటి వరకు రాష్ట్ర వినియోగదారుల ఫోరం, రూ.కోటి దాటితే జాతీయ వినియోగదారుల ఫోరానికి ఫిర్యాదుచేయాలి.

● ఫిర్యాదుకు ప్రత్యేక నమూనాలు, శాస్త్రీయ పద్ధతులు ఏమీ లేవు. తెల్ల కాగితంపై వస్తువు, సేవ వివరాలు, ఎంత ధరకు కొనుగోలు చేశారు, కలిగిన నష్టం ఏంటి.. డిమాండ్ చేస్తున్న పరిహారం రాసి నిర్దేశిత ఫోరానికి నేరుగా గానీ, రిజిస్టర్ పోస్ట్ ద్వారా కానీ పంపించడమే. దీనికి వస్తువులకు సంబంధించిన బిల్లు, ఇతర ఆధారాలు జత చేయాలి.

● వస్తువును కొనుగోలు చేసిన రెండేళ్ల లోగా ఫిర్యాదు చేయవచ్చు. అనివార్య కారణాల వల్ల రెండేళ్ల లోపు ఫిర్యాదు చేయలేకపోయినా కారణం సహేతుకంగా ఉంటే తర్వాత కూడా ఫిర్యాదు తీసుకుంటారు.

● ఫిర్యాదు చేయడంపై ఎటువంటి సందేహాలున్నా రెండు తెలుగు రాష్ట్రాల వారు నేరుగా 1800114000, లేదా 1915 టోల్ ఫ్రీ నంబర్లకు, సందేశం ద్వారా సమాచారం పొందేందుకు 88000 01915 నంబరును సంప్రదించవచ్చు. ఫిర్యాదులను ఆన్‌లైన్ ద్వారా రిజిస్టర్ చేసి, తర్వాత స్థితి తెలుసుకునేందుకు కూడా ఈ నంబర్లను సంప్రదించవచ్చు. ఉదయం 8 నుంచి రాత్రి 8 వరకు మాత్రమే ఫోన్‌లో సంప్రదించేందుకు అవకాశం ఉంటుంది.

నామమాత్రపు ఫీజు...

● వినియోగదారుల ఫోరంలో సేవలకు కొంత ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. నష్ట పరిహారం విలువ రూ.లక్ష వరకు ఉంటే రూ.100, రూ.5లక్షల వరకైతే రూ.200, రూ.10లక్షల వరకు ఉంటే రూ.400, రూ.20లక్షల వరకు రూ.500 ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. రూ.20లక్షల నుంచి 50లక్షల వరకు రూ.2వేలు, రూ.కోటి వరకు రూ.4వేలు, రూ.కోటి పైన అయితే రూ.5వేలు రుసుము చెల్లించాల్సి ఉంటుంది.

● వినియోగదారుడు దారిద్ర్య రేఖకు దిగువన ఉంటే రూ.లక్ష పరిమితి వరకు ఎలాంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేకుండా వెసులుబాటు ఉంది.

వినియోగదారుడే వాదించుకోవచ్చు..

● జిల్లా స్థాయి ఫోరంలో ఇచ్చిన తీర్పుపై సంతృప్తి చెందకుంటే 30 రోజుల్లో రాష్ట్ర స్థాయికి, అక్కడ తీర్పు నచ్చకుంటే 30 రోజుల్లోగా జాతీయ స్థాయి ఫోరానికి అప్పీల్ చేయాలి. ఏ స్థాయిలోనూ న్యాయం జరగలేదన్న భావన ఉంటే 30 రోజుల్లోగా సుప్రీం కోర్టులో కూడా అప్పీల్ చేసుకునే అవకాశం ఉంది.

● ఫోరం కోర్టులో వాదించేందుకు న్యాయవాది అవసరం కూడా లేదు. సదరు వినియోగదారుడే నేరుగా వాదించుకోవచ్చు. అవసరం అనుకుంటే న్యాయవాదిని సైతం పెట్టుకోవచ్చు. ఈ కేసులకు ఆరు నెలల్లోగా పరిష్కారం లభిస్తుంది.

శిక్షలున్నాయి బ్రో..

● వస్తువు, సేవ పొందే ముందు నాణ్యతా ప్రమాణాలపై దృష్టి పెట్టాలి. వస్తువులకు ఐఎస్ఐ, బంగారానికి హాల్, ఆహార ఉత్పత్తులైతే ఎఫ్‌పీవో మార్కులు ఉన్నాయా లేదా చూసి కొనాలి. ప్రతి వస్తువుకూ కంపెనీ నుంచి నగదు బిల్లు తీసుకోవాలి. వస్తువు కొనే సమయంలో ఇచ్చే వారెంటీ, గ్యారెంటీ కార్డులు జాగ్రత్తగా ఉంచుకోవాలి.

● వినియోగదారుడి హక్కులకు భంగం కలిగించినట్లు నిరూపణ అయితే అమ్మకందారులకు 2 నుంచి 3 ఏళ్ల వరకు జైలు శిక్ష, కేసును బట్టి జరిమానాలు విధిస్తారు. - ఈనాడు, అమరావతి



చిన్నారులకు పద్య, పురాణాలు బోధిస్తున్న వైదేహి


బామ్మ ఇంట.. బాలతరంగిణి

విజయవాడ వెటర్నరీ కాలనీకి చెందిన కూరపాటి వైదేహి (85) సుమారు 30 ఏళ్ల పాటు ఉపాధ్యాయురాలిగా పనిచేశారు. ఉద్యోగ విరమణ చేసి 25 ఏళ్లు దాటుతున్నా, ఆ వృత్తినే వ్యాపకంగా మలుచుకొని చుట్టుపక్కల పిల్లలకు సాయంత్రం వేళ విలువల పాఠాలు బోధిస్తున్నారు. భారతీయ సంస్కృతి, ఔన్నత్యం, రామాయణ, భారత ఇతిహాసాలు, భాగవత కథలు, పురాణాలు ఔపోసన పట్టిస్తున్నారు. యోగా, సూర్య నమస్కారాలు సాధన చేయిస్తున్నారు. కథలను ఆటలు, నృత్యాల రూపంలో చెబుతూ ఆసక్తి పెంచుతున్నారు. వైదేహి వద్ద శిక్షణ తీసుకున్న విద్యార్థులెందరో భగవద్గీత పఠన పోటీల్లో రాష్ట్ర, జాతీయ స్థాయిలో బహుమతులు గెలుచుకున్నారు. 'పిల్లల్లో భాషా నైపుణ్యాలు మెరుగుపరిస్తే వేదికలపై బెరుకు లేకుండా మాట్లాడతారు. తల్లిదండ్రులు, పెద్దలను ఎలా గౌరవించాలి? సమాజంలో ఎలా మెలగాలో బాల్యం నుంచే నేర్పించాలి. చదువు, ఉద్యోగాల విషయంలో ఒత్తిడిని అధిగమించేందుకు శారీరక, మానసిక దృఢత్వం పెంపొందించాలి' అని సూచిస్తున్నారు వైదేహి. - ఈనాడు, అమరావతి



గీతాపఠనంలో బహుమతులు గెలుచుకున్న విద్యార్థులతో వైదేహి

నేను ఎవరంటారు?



ఎండిపోయిన ఆకులా కనిపిస్తున్న ఈ జీవి ఓ సీతాకోకచిలుక. ఇలాంటివి శ్రీకాకుళం జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో పెద్దసంఖ్యలో సంచరిస్తూ చూపరులను ఆకట్టుకుంటున్నాయి. ఈ విషయమై జిల్లా అటవీశాఖ అధికారి ఎస్.వెంకటేశ్‌ను 'ఈనాడు' సంప్రదించగా 'ఇవి ఎక్కువగా శీతాకాలం, వర్షాకాలాల్లో చెట్లు గుబురుగా ఉన్నచోట కనిపిస్తాయి. నారింజ ఓక్ లీఫ్, కల్లిమా ఇనాకస్ అనే పేర్లతో పిలుస్తారు. పక్షులు, సాలెపురుగులు, చీమల నుంచి రక్షణ పొందడానికి ఎండిన ఆకుల్లో ముడుచుకొని విశ్రాంతి తీసుకుంటాయి' వివరించారు. – ఈనాడు డిజిటల్ శ్రీకాకుళం



జలసవ్వడి.. పక్షుల సందడి

ఈ ఏడాది వర్షాకాలంలో కురిసిన భారీ వర్షాలకు ప్రకాశం బ్యారేజీ నుంచి మూడు నెలలుగా నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం నిలిపేసినా.. గేట్ల మీద నుంచి నీరు జాలువారుతూనే ఉంది. ఆప్రాన్‌పై నీరు నెమ్మదిగా పారుతుండడంతో వందల సంఖ్యలో పక్షులు చేరి ఆహారవేటలో నిమగ్నమవుతున్నాయి. నీటిలో కొట్టుకొస్తున్న చేపల కోసం ఆప్రాన్‌పై నీటిబాతులు, కొంగలు చేరి సందడి చేస్తున్నాయి. - ఈనాడు,అమరావతి

మా ఇంటికొస్తే ఏమీ తేవద్దు!

పెళ్లిళ్లు, ఇతర శుభకార్యాలప్పుడు ప్రతి కుటుంబమూ కానుకలు స్వీకరిస్తుంది. ఒట్టి చేతులతో ఏం వెళ్తామని బంధువులూ బహుమతో, నగదో తీసుకెళ్లడం సాధారణం. శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట మండలం బాలసీమ గ్రామస్థులు మాత్రం తమకు కానుకలే వద్దంటారు. ఇక్కడ 175 ఇళ్లు ఉండగా.. 600 మంది నివసిస్తున్నారు. ఏ శుభకార్యం జరిగినా బంధువులనూ, స్నేహితులను పిలుచుకుంటారు. వారికి అతిథి సత్కారాలు చేసి.. ఆశీస్సులు తీసుకుంటారు. కానీ బహుమతులు ఎట్టి పరిస్థితుల్లోనూ స్వీకరించరు. ఈ ఆచారం తరతరాల నుంచీ వస్తోందని.. గ్రామానికి చెందిన 87 ఏళ్ల వృద్ధుడు ఆరంగి తిరుపతిరావు వివరించారు. – న్యూస్‌టుడే, నరసన్నపేట గ్రామీణం

'తరువు'తీరా సేదతీరొచ్చు!

ఏళ్ల నాటి తరువు ఊరి మధ్య శీతల మండపంగా మారింది. కాకినాడ జిల్లా ప్రత్తిపాడు, శంఖవరం మండలాల కూడలిలో ఉన్న ఈ మహావృక్షం తరతరాల ముచ్చట్లకు వేదికగా ఉంది. చెట్టు చుట్టూ అరుగు, వానొచ్చినా తడవకుండా రేకుల షెడ్డు నిర్మించారు. దీంతో చాలామంది ఇక్కడ సేద దీరతారు. ఈ చల్లని లోగిలి ప్రత్యేకతను కొంతంగి కొత్తూరు జనం కాపాడుకుంటున్నారు. - న్యూస్‌టుడే, ప్రత్తిపాడు





చెట్లు నాటక ముందు బైపాస్ రహదారి

పచ్చదనానికి పునరుజ్జీవం

రహదారులు, ఫ్లైఓవర్లు, ఇతర అభివృద్ధి పనులు చేపట్టే సమయంలో అడ్డుగా ఉన్న చెట్లను నరికి పక్కన పడేస్తుంటారు. అలా చేయకుండా.. వాటిని వేరేచోటకు తరలించి ప్రాణ ప్రతిష్ఠ చేసే విధానమే 'ట్రీ ట్రాన్స్ లొకేషన్'. 2014లో విజయవాడ బెంజిసర్కిల్ ఫ్లైఓవర్ నిర్మాణం చేపట్టేందుకు అక్కడున్న చెట్లను తొలగించాల్సి వచ్చింది. అప్పటి అధికారులు వాటిని 'ట్రీ ట్రాన్స్ లొకేషన్' విధానంలో తరలించి భవానీపురం, విద్యాధరపురం ప్రాంతంలోని బైపాస్ రహదారి వెంట నాటించారు. ప్రస్తుతం 280 చెట్లు ఏపుగా పెరిగి ఆ ప్రాంతామంతా పచ్చదనం ఆవరించింది. - న్యూస్‌టుడే, విజయవాడ (భవానీపురం)



తొలగించిన చెట్లను తీసుకొచ్చి ఇక్కడ నాటారిలా..



ఏపుగా పెరిగిన చెట్లు

ప్రయాణంలో వికారం... మీ కోసం చిట్కాలు!

కారులో లేదా బస్సులో ప్రయాణిస్తున్నప్పుడు చాలామంది వాంతులు, కళ్లు తిరగడం వంటి సమస్యలను ఎదుర్కొంటారు. ఇక ఎగుడుదిగుడు, ఘాట్ల రోడ్లలోనైతే పరిస్థితి మరీ ఘోరం.

దీంతో కొందరు ప్రయాణాలే మానుకుంటే... మరికొందరు తప్పని పరిస్థితుల్లో ప్రత్యామ్నాయాన్ని వెదుక్కుంటారు.



ప్రయాణ సమయంలో కొందరికి చెవి లోపల ఉండే లాబ్రింథైన్, యూట్రికెల్ భాగాలు మెదడుకు సంకేతాలు సరిగా అందించకపోవడమే దీనికి కారణంగా వైద్యులు చెబుతున్నారు.

వైద్య పరిభాషలో మోషన్ సిక్‌నెస్‌గా పిలిచే దీనికి చిన్నపాటి చిట్కాలు పాటిస్తే చాలని వైద్యులు సూచిస్తున్నారు.

వెనక సీట్లో వద్దు: పరిశీలనగా చూస్తే 90 శాతం మంది వెనక సీట్లో కూర్చున్న వారే వాంతులు చేసుకుంటారు. ఈ సమస్య ఉన్నవాళ్లు ముందు సీట్లో కూర్చోవాలి. వెనక సీట్లో కూర్చోవడం వల్ల వాహన వేగం ఎక్కువగా ఉన్నట్లు అనిపిస్తుంది. ఇది మానసికంగా ఇబ్బంది కలిగిస్తుంది.

ఫోన్ చూడొద్దు: కాస్త సమయం దొరికినా సెల్‌ఫోన్‌కు అతుక్కుపోతుంటారు. మోషన్ సిక్‌నెస్ ఉన్న వాళ్లు ప్రయాణంలో ఫోన్‌కు దూరంగా ఉండడమే మంచిది. ఎందుకంటే వాహనం కదులుతూ ఉంటే మెదడుకు అందే సంకేతాలు తికమక కలిగిస్తాయి.

గాలి ధారాళంగా...: కారులో స్వచ్ఛమైన గాలి లేకపోయినా వాంతులవుతుంటాయి. ప్రయాణంలో కాస్త ఇబ్బందిగా ఉంటే, కారు కిటికీ తెరిచి, బయట కాస్త స్వచ్ఛమైన గాలికి సేదతీరాలి. గాఢమైన పెర్ఫ్యూమ్, మసాలా వాసనలు లేకుండా చూడాలి. ప్రయాణం మధ్యలో విరామం తీసుకోవాలి. కిందికి దిగి కాసేపు నడవాలి. తాజా గాలి పీల్చుకోవాలి.

తేలికపాటి ఆహారం: ఖాళీ కడుపుతో ప్రయాణించడం వల్ల వాంతులు రావనేది అపోహ మాత్రమే. ఆహారం తీసుకోకుండా ఉంటే వికారం ఎక్కువగా ఉంటుంది. అందుకే తేలికపాటి పోషకాహారాన్ని తీసుకోవాలి.



నీరు తాగారా?: డీహైడ్రేషన్ వల్ల కూడా వాంతులు అవుతాయి. ప్రయాణ సమయంలో నీరు, ద్రవ పదార్థాలు పుష్కలంగా తీసుకోవాలి. పొడి, వేడి ప్రాంతాల్లో ప్రయాణం చేసేటప్పుడు కెఫిన్, ఆల్కహాల్, చక్కెర పానీయాలకు దూరంగా ఉండాలి.

చిన్ని చిన్ని చిట్కాలు

● ప్రయాణ సమయంలో నిమ్మకాయ దగ్గర పెట్టుకోవాలి. వికారం అనిపించినప్పుడు వాసన చూస్తే తాజా అనుభూతి కలుగుతుంది.

● తులసి ఆకులను నమలడం వల్ల వాంతులు రావు. నిమ్మ, పుదీనా రసాన్ని ఒక సీసాలో నింపి.. నల్ల ఉప్పును వేసుకుని ప్రయాణంలో అప్పుడప్పుడూ తాగుతుండాలి.

● గ్లాసు నీళ్లలో కొద్దిగా జీలకర్ర పొడి కలిపి ప్రయాణానికి ముందు తాగాలి. లేదా అల్లం టీ తాగినా కాస్త ఉపశమనం ఉంటుంది.

● పిప్పరమింట్ ఎసెన్షియల్ ఆయిల్ లేదా పుదీనా ఆకుల వాసన పీల్చాలి.

● తరచూ ప్రయాణాలు చేసేవారు పరగడుపున రెండు మూడు గ్రాముల శొంఠి పొడి తీసుకోవాలి. లేకుంటే ఉసిరి, జీలకర్ర, లవంగాలు, మిరియాలు సమాన భాగాలుగా తీసుకొని, పొడిచేసి తేనెతో కలిపి తీసుకోవాలి.

- మాధవీ కల్యాణి, భీమవరం ప్రాంతీయ ఆసుపత్రి

బ్యాండ్లూ ఉన్నాయి..: కారులో దూర ప్రయాణాలకు వెళ్లేవారికి మోషన్ సిక్‌నెస్ బ్యాండ్లు అందుబాటులో ఉన్నాయి. ఇందులోని బటన్‌ను నొక్కితే నాడీభాగంలో ఒత్తిడి ఏర్పడి వికారం, తలనొప్పి తగ్గుతాయి. ఈ బ్యాండ్లను చేతికి ఎంతసేపు పెట్టుకున్నా ఎలాంటి అసౌకర్యం లేకుండా ఉంటాయి.



● అవోమైన్, డ్రామామైన్ వంటి ఔషధాలతో ఉపశమనం కలుగుతుంది. అయితే ఇవి వాడేందుకు వైద్యుల సూచన తప్పనిసరి.

-ఈనాడు డిజిటల్, భీమవరం

రంగు మారిన సంపెంగ!

విరుల్లో రారాజు సంపెంగ. మన దేశంలో కనిపించేవి ఆకుపచ్చ, పసుపు రంగులో ఉంటాయి. థాయ్‌లాండ్‌కు చెందిన చెంపా జాతి రకం గులాబీ రంగులో కనువిందు చేస్తోంది. తూర్పుగోదావరి జిల్లా కడియం నర్సరీల్లో ఈ మొక్క ఆకట్టుకుంటోంది. 5 నెలల క్రితం తెచ్చిన మొక్క.. 30 అడుగుల వరకూ పరిమళాన్ని వెదజల్లుతోంది. – న్యూస్‌టుడే, కడియం



వరదా.. గేటు వద్దే ఆగిపో!

ఈనాడు, చెన్నై: ఈశాన్య రుతుపవనాలు, బంగాళాఖాతంలో ఏర్పడే తుపాన్‌ల ప్రభావంతో అక్టోబర్ నుంచి సంక్రాంతి వరకూ తమిళనాడు, పుదుచ్చేరిల్లో వర్షాలు జోరుగా కురుస్తాయి. ఉన్నట్టుండి వరదలు ఉపద్రవంలా ముంచెత్తుతాయి. ఇళ్లలోకి వరద, బురద, చెత్తాచెదారాలు కొట్టుకొచ్చి చెన్నై నగరవాసులు పడే ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. ఈ ముప్పును ఎదుర్కొనేందుకు చెన్నైకి చెందిన హాంఢ్రీ రాబిన్స్ ఓ వినూత్న ఆలోచనను ఆచరణలోకి తెచ్చారు. తొలుత తన ఇంటికి అల్యూమినియం పలకలతో గేట్ అమర్చుకొని వరద ముప్పును తప్పించుకున్న ఆయన.. నేడు నగరంలో చాలాచోట్లకు ఈ ప్రయోగాన్ని విస్తరిస్తున్నారు. వేలచ్చేరిలో మూడేళ్ల కిందట రాబిన్స్ ఇల్లు కట్టుకుంటున్న సమయంలో వరదలొచ్చి, పనులు ఆగిపోయాయి. మున్ముందు ఈ ముప్పు వాటిల్లకుండా అరికట్టే మార్గాలను ఇంటర్‌నెట్‌లో వెతికారు. సరైన పరిష్కారాలు దొరక్క, చివరకు సొంత ఆలోచనతో ఓ గేట్‌ను రూపొందించి ఇంటికి అమర్చారు. ఇది వరదను కట్టడి చేయడంతో స్థానికులు ఆసక్తి చూపారు. ప్రజల అవసరం, ఆసక్తి దృష్ట్యా అప్పటిదాకా ఓ లాజిస్టిక్ కంపెనీలో ఆపరేషనల్ ప్రాసెస్ మేనేజర్‌గా ఉన్న రాబిన్స్.. ఆ ఉద్యోగాన్ని వదిలేసి ఈ గేట్‌ల తయారీపై పరిశోధించి, 'గేట్ ద ఫ్లడ్ (జీటీఎఫ్)' పేరుతో కంపెనీ ఏర్పాటు చేశారు.



హాంఢ్రీ రాబిన్స్

ఎలా పని చేస్తుందంటే?

'మన దేశంలో ప్రహరీ, ఇంటి ద్వారాలు, కిటికీలు ఒకే సైజ్‌లో ఉండవు. అన్ని ఇళ్లకూ ఒకే డిజైన్ గేట్ పనికి రాదు. ఇళ్ల ద్వారాలకు దోమ తెర ఫ్రేమ్‌ను బిగించినట్లుగానే ఈ గేట్‌నూ అమర్చేలా డిజైన్లు రూపొందించాం. గుమ్మానికి రెండు వైపులా అవసరమైన ఎత్తువరకు రెండు దిమ్మెలుంటాయి. వాటి మధ్య నిర్ణీత ఎత్తుదాకా అల్యూమినియం పలకలుంచి, వరద నీరు లోపలికి రాకుండా ఫ్రేమ్, పలకలకు ఉండే రబ్బర్ సీల్ అరికడుతుంది. ఈ పలకల్ని అదిమిపట్టేలా దిమ్మెలపై స్క్రూలుంటాయి. వరద సమయంలో ఈ పలకల్ని ఉంచడం, మిగతా రోజుల్లో తీసేయడం చాలా సులువు' అని వివరించారు కంపెనీ ఎండీ రాబిన్స్. గేట్ల సైజును బట్టి ఒక్కో ఇంటికి అమర్చడానికి రూ.3500-4200 వరకూ ఖర్చవుతుందని తెలిపారు. దీన్ని వ్యాపారంగా కాకుండా, వరదలకు వీధిన పడుతున్న ప్రజలకు ఉపశమన చర్యగా భావిస్తున్నట్లు చెప్పారు రాబిన్స్.



చెన్నై మాంబాక్కంలోని ఓ ఇంటికి ఏర్పాటుచేసిన గేటు



అల్యూమినియం పలకల్ని గేటుకు అమర్చుతున్న టెక్నీషియన్



వసుంధర

vasundhara@eenadu.in

కెరియర్‌లోనూ ‘మినిమమే’!

ఎంతసేపూ పనేనా? దాని వెనకే నిరంతరం పరుగులు పెడుతూ కూర్చుంటారు సరే! ఎప్పటికో అప్పుడు వెనక్కి తిరిగి చూసుకుంటే ఆ పరుగే మిగులుతుంది. ఆనందం, మనకంటూ నలుగురు మనుషులే కనిపించరు... ఏ పెద్దవాళ్లో యువతకు సలహాలిస్తున్నట్లు ఉంది కదూ! కానీ ఈ అభిప్రాయం ఈ తరం అమ్మాయిలదే! అన్నింట్లోనూ మినిమలిజాన్ని మెచ్చుతున్న వీళ్లు... కెరియర్ అందుకు భిన్నం కాదంటున్నారు. కాబట్టే, మంచి జీతం, నిర్ణీత పనివేళలున్న కొలువులకే ఓటేస్తున్నారు. గంటలకొద్దీ పని, హోదాలు, ప్రమోషన్ల వెంట పరుగులు మావల్ల కాదంటున్నారు. ఎక్కువ గంటల పని... ఎక్కువ సక్సెస్, ఎంత పెద్ద హోదా అయితే అంత విజయం అనే పాత విధానాల్ని వీళ్లు పాటించడం లేదు. కాబట్టే, తమ మనస్తత్వాలు, అవసరాలకు తగ్గట్టుగా లేకపోతే వెంటనే సంస్థల్ని వీడుతున్నారు.

బర్నవుట్, ఒత్తిడి, మానసిక అనారోగ్యాలు, ఇంటికొచ్చినా ఆఫీసు పని కొనసాగుతుండటం, ఇష్టాలకు సమయమే లేకపోవడం వంటివి వాళ్లని ఈ ‘కెరియర్ మినిమలిజం’వైపు నడిపిస్తున్నాయి. అలాగని కెరియర్ అంటే నిర్లక్ష్యం, బద్ధకం అనుకోవడానికి లేదు. పనివేళల్లో శ్రద్ధగా, అంకిత భావంతోనే పనిచేస్తున్నారు. సృజనాత్మకతకీ చోటిస్తున్నారు. కాకపోతే వ్యక్తిగతం అంటూ లేకుండా పని చేయడాన్నే ఇష్టపడట్లేదు. పనివేళలు ముగిశాక మిగిలిన సమయాన్ని తమ ఆనందాలు, ఆసక్తులు, కుటుంబంతో గడపడానికే కేటాయిస్తామంటున్నారు. పాటించాల్సిన సలహానే అనిపించట్లేదూ?



చిన్నప్పుడు నాట్యం నేర్చుకోలేదు... కానీ, భిన్న రంగంలో ఏదైనా సాధించాలనే పట్టుదలే డాక్టర్ హిమ బిందూని కళాక్షేత్రం వైపు నడిపింది. కళ మీద ఇష్టంతో నృత్యరీతులు నేర్చుకున్నారు డాక్టర్ పీవీకే కుందనిక. భిన్న నేపథ్యాలైనా ఇద్దరి అభిలాష కళను ముందుకు తీసుకువెళ్లడమే. వారిద్దరినీ వసుంధర పలకరించింది.

ఒకరికి వృత్తి... మరొకరికి అనురక్తి!

హిమబిందు

‘పాడటం రాదు... ఆడటం రాదు... ఏ ఆశతో అప్లికేషన్ పట్టుకుని కళాక్షేత్రానికి వచ్చావమ్మా’ అంటూ ఆశ్చర్యంగా అడిగారు నన్ను ఇంటర్వ్యూ చేయడానికి కూర్చున్న ప్రిన్సిపల్. నాకంటూ ఓ గుర్తింపును సంపాదించుకోవాలనేదే నా ప్రయత్నం. దానిలో భాగంగానే చెన్నై వెళ్లా. కళాక్షేత్రంలో చేరాలి అనుకున్నా. మాది కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు. నాన్న నరసింహులు. అమ్మ శాంత కుమారి. మేం నలుగురం అక్కచెల్లెళ్లం. నేనే చిన్నదాన్ని. బీకాం అయ్యాక ఎల్ఎల్‌బీ చేయాలనుకున్నా. కానీ తెలిసిన వాళ్లు ఎవరో కళాక్షేత్రం గురించి గొప్పగా చెప్పడంతో నాట్యం వైపు మనసు మళ్లింది. అదే నా కెరియర్ అవుతుందని ఎప్పుడూ ఊహించలేదు.

అవకాశాల్ని వదులుకుని...

భాష రాదు, నాట్యంలో అనుభవం లేదు... దాంతో వెనకబడుతున్నానేమో అని బాధపడేదాన్ని. వెనక్కి వచ్చేస్తా అంటే... ‘ఓ ఏడాది ప్రయత్నించి చూడు. అప్పటికీ నచ్చకపోతే పీజీ చేద్దువు’ అంటూ అమ్మే ధైర్యం చెప్పింది. అలా మొదలైన నా ప్రయాణం నాలుగేళ్లు విజయవంతంగా సాగింది. అక్కడ రెండో ఏడాది శిక్షణలో ఉన్నప్పుడే పెళ్లయ్యింది. మావారు యోగా టీచర్. తర్వాత హైదరాబాద్ సెంట్రల్ వర్సిటీలో మాస్టర్ ఆఫ్ పర్ఫార్మింగ్ ఆర్ట్స్ (ఎంపీఏ)లో చేరా. పసుమర్తి రామలింగశాస్త్రి దగ్గర నృత్యంలో శిక్షణ తీసుకున్నా. ఆ తర్వాత ఎంఫిల్, పీహెచ్‌డీ కూడా పూర్తిచేశా. అన్నీ స్కాలర్‌షిప్, ఫెలోషిప్‌లతోనే చదివా. ఈ క్రమంలో సినిమాల్లో, సీరియల్స్‌లో ఎన్నో అవకాశాలు వచ్చాయి. కానీ ఉపాధ్యాయ వృత్తినే ఎంచుకున్నా. ఈ కళ నాతోనే ఆగిపోకూడదనేదే నా లక్ష్యం. ప్రస్తుతం తిరుపతి పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నా. నాట్యవిద్యాధరి, నాట్యరత్న బిరుదులు... 2018లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతులమీదుగా ఉగాది పురస్కారం వంటివెన్నో అందుకున్నా.

– గుడికోన కృష్ణకుమారి, తిరుపతి



కుందనిక

నేను డ్యాన్సర్ కావాలన్నది అమ్మ కల. అందుకే నాకు మూడేళ్లు ఉన్నప్పుడే కూచిపూడిలో ఓనమాలు దిద్దించారు. అది మొదలు ఇప్పటిదాకా నృత్యం మీద ఇష్టం పెరుగుతూ వచ్చిందే కానీ, ఏ రోజూ తగ్గలేదు. పైపెచ్చు ఇదే నాకు ఒత్తిడిలో ఉపశమనం అయ్యింది. మాది హైదరాబాద్‌లోని అశోక్ నగర్. అమ్మ రాధిక. నాన్న ప్రొఫెసర్ కె.సుదర్శన్. వృత్తిరీత్యా డాక్టర్‌ని. ఓ ప్రముఖ ఆస్పత్రిలో డెంటల్ విభాగంలో సేవలందిస్తున్నా. అమ్మకు చిన్నప్పట్నుంచి నృత్యం అంటే ఇష్టమట. అందుకే పట్టుబట్టి నేర్చుకున్నారు. కానీ కోరుకున్న రంగంలో కొనసాగే అవకాశాలు రాకుండానే... పెళ్లీ పిల్లలూ అంటూ కుటుంబ బాధ్యతల్లో మునిగిపోయారు. కళను విడిచిపెట్టకూడదని ఇంట్లోనే శిక్షణ ఇచ్చేవారు. నన్నూ అందులో భాగం చేశారు. అయితే ఊహ తెలిసినప్పట్నుంచీ దీన్ని పేషన్‌గానే భావించా. డాక్టర్ కావాలనేది నా కల. అందుకే రెండింటినీ సమన్వయం చేసుకుంటూ వచ్చాను. అందుకు అమ్మానాన్నలు అందించిన ప్రోత్సాహమూ చాలానే.

ఒత్తిడి ఎదురైనప్పుడు...

2012 నుంచి జాతీయ, అంతర్జాతీయ వేదికల మీద ప్రదర్శనలిచ్చా. ఎన్నో అవార్డులూ అందుకున్నా. నాకు 14ఏళ్లు ఉన్నప్పుడే వండర్ బుక్, యునిక్ బుక్ ఆఫ్ రికార్డ్సుల్లో స్థానం దక్కించుకున్నా. 2023లో జరిగిన ప్రపంచ ఆధ్యాత్మిక మహోత్సవంలో కథక్ నృత్య ప్రదర్శన ఇచ్చి రాష్ట్రపతి ద్రౌపదిముర్ము ప్రశంసలూ అందుకున్నా. నా విజయానికి కారణం అమ్మే. నేనెప్పుడు డల్ అయినా, అలసట, ఒత్తిడితో సతమతమవుతున్నా ఆమె నాలో స్ఫూర్తి నింపేవారు. చదివే క్రమంలో ఎదురయ్యే ఒత్తిడిని అధిగమించడానికీ డ్యాన్స్ ఉపయోగపడింది. ఒత్తిడి అనిపించిన ప్రతిసారీ దీన్నే ఆశ్రయించేదాన్ని. వృత్తిలోకి చేరాకా అంతే. ఈ క్రమంలో దివంగత పద్మశ్రీ శోభానాయుడు, డీవీ సత్యనారాయణ, మహంకాళి మోహన్, ఉస్తాద్ షఫి వంటి ప్రముఖుల దగ్గర కథక్, కూచిపూడి నేర్చుకున్నా. 2023లో కూచిపూడిలో దూరదర్శన్ బీ-గ్రేడ్ కళాకారిణిగా, ఈ ఏడాది కథక్ డ్యాన్సర్‌గానూ గుర్తింపు పొందాను.

– సీఆర్ రెడ్డి, హైదరాబాద్

మీకూ ఇలాంటి స్నేహితులు ఉన్నారా..?



మన చుట్టూ ఉండే వారిలో ఏ ఒక్కరూ ఇంకో వ్యక్తిలా ఉండరు. వ్యక్తిత్వం, పలకరింపులు, గుణాలు... వంటివన్నీ అందరిలోనూ భిన్నంగానే ఉంటాయి. కొత్తా, పాత లేకుండా అందరితో కలిసిపోయే మనస్తత్వం కొందరు అమ్మాయిలకుంటే... మరికొందరు మాట్లాడటానికే భయపడుతుంటారు. ఇంకొందరు పార్టీ కల్చర్‌కు దగ్గరగా ఉంటే... మరికొందరు అమ్మాయిలు పార్టీ అన్న మాట చెవితేనే దూరంగా పారిపోతుంటారు. ఇదేంటి ‘నాతో బాగానే ఉంటుంది కదా... బయటకు రమ్మన్నా, పార్టీ చేసుకుందామన్నా దూరంగా వెళ్లిపోతుందేంటి’ అనుకుంటున్నారా? వాళ్లని ‘యాంటీసోషల్ ఫ్రెండ్స్’ అంటారు. వాళ్లు ఒక వ్యక్తితోనే కంఫర్ట్‌గా ఉండగలరు. వాళ్లతోనే మాట్లాడగలరు. ఇలాంటి వాళ్లని సోషల్ లైఫ్‌లోకి తీసుకువెళ్లే బాధ్యత మీదే. ఎందుకంటే వాళ్లలో ఏవో భయాలు పాతుకుపోయి ఉంటాయి. అవి వాళ్లని నోరు మెదపనివ్వవు. కాలు కదపనివ్వవు. అలాంటి పరిస్థితుల్లో ఉన్నవాళ్లని చూసి స్నేహితులమైన మనమూ దూరం పెడితే... వాళ్ల తీరులో మార్పు వచ్చేదెలా? పైగా ఎన్నో అవకాశాలూ కోల్పోతారు. అందుకే వాళ్లనలా చూస్తూ ఉండొద్దు, వదిలేయొద్దు. అందరిలోకి రావడానికి వాళ్లు భయపడితే... మీరే వాళ్ల జోన్‌లోకి వెళ్లేందుకు ప్రయత్నించండి. మీ స్నేహితుల్ని వాళ్లకు పరిచయం చేయండి. పార్టీలు, కలిసి చదువుకోవడం, చిన్న సమావేశాలు అన్నీ ఆమె ఉండే చోట పెట్టేందుకు ప్రయత్నించండి. అప్పుడు వాటిని తప్పించుకునే అవకాశం ఆమెకి ఉండదు. అంతేకాదు, నెమ్మదిగా వాటికి అలవాటు పడుతుంది. నలుగురిలో కలవడం మొదలుపెడుతుంది. మరి ఆమెను మార్చడానికి ప్రయత్నిస్తారుగా మరి?

మెరుగైన జీవక్రియకు... పాశాసనం

ఊపిరితిత్తుల సామర్థ్యాన్ని పెంచి, జీవక్రియకు ఉపయోగపడుతుంది. పాశము అంటే తాడు లేదా బంధం అని అర్థం. కూర్చున్న మనిషిని తాడుతో కట్టేసినట్లుగా ఈ ఆసనం వుంటుంది.



చేసే విధానం: ముందుగా యోగా మ్యాట్‌పైన విశ్రాంతంగా నిల్చొని రెండు సార్లు దీర్ఘశ్వాసలు తీసుకోండి. తర్వాత చేతులను ముందుకు చాచి ఉంచి పాదాలు మాత్రమే నేలపైన ఉండేవిధంగా కూర్చోండి. పాదాలు సాధ్యమైనంత దగ్గరగా వుండేటట్లు చూడండి. ఫొటోలో చూపిన విధంగా ఛాతీ విస్తరించి వుండేలా కుడి చేత్తో కాళ్లను మెలివేయాలి. తాడుతో కట్టినట్లుగా కుడి చేతిని ముందు నుంచి, ఎడమ చేతిని వెనక నుంచి మెలివేసి పట్టుకోండి. ఇప్పుడు తలను పక్కకు తిప్పి చూడండి. ఇలా 10-15 సెకన్లు ఉంచి నిదానంగా ఆసనం నుంచి బయటకు రండి. ఆపైన విశ్రాంతి తీసుకోండి.

జాగ్రత్తలు: ఊబకాయులు చేయలేరు. చేసినా జాగ్రత్తగా ప్రయత్నించాలి. మోకాళ్లు, వెన్ను సర్జరీలు అయినవాళ్లు చేయరాదు.

ఉపయోగాలు: ఊపిరితిత్తుల సామర్థ్యాన్ని పెంచుతుంది. కాలేయం, పాంక్రియాస్, జీర్ణాశయానికి మంచి మర్దనా ఇస్తుంది. జీవక్రియను మెరుగు పరుస్తుంది.

ఆహారం: ఊపిరితిత్తుల సామర్థ్యాన్ని పెంచుకునేందుకు... చెర్రీలు, నిమ్మజాతి పండ్లు ఆకుకూరలు, ముఖ్యంగా పాలకూర ఎక్కువగా తీసుకోవాలి. తృణధాన్యాలు, గింజలు ఎక్కువగా తీసుకోండి. ఫ్రిజ్‌లో పెట్టిన ఆహారానికి దూరంగా ఉండాలి.

– శిరీష, యోగ గురు



బంగారం - వెండి

12న ముగింపు

	బంగారం (24క్యా)	ఆర్నమెంట్ (22క్యా)	వెండి (కిలో)
హైదరాబాద్	1,37,290	1,22,000	2,01,450
విజయవాడ	1,30,900	1,21,600	1,96,800
ప్రొద్దుటూరు	1,30,500	1,20,060	1,91,000
రాజమహేంద్రవరం	1,33,200	1,22,100	2,15,100
విశాఖపట్నం	1,32,180	1,21,600	1,95,000
తమిళనాడు	-----	1,23,700	2,16,000



విద్య, ఆరోగ్య రంగాల్లో దేశవ్యాప్తంగా మహిళలు స్థానికంగా గొప్ప పరిష్కారాలు చూపిస్తున్నారు. తక్షణమే దాన్నుంచి దేశ ఆర్థికవ్యవస్థకు మేలు ఉండకపోవచ్చు. కానీ, వాళ్ల పరిష్కారాలు భవిష్యత్తుకు పెట్టుబడే. మహిళలు ఎప్పుడూ ఒక్కరే అభివృద్ధివైపు వెళ్లరు, తమతోపాటు కుటుంబాన్నీ, బృందాన్నీ, సమాజాన్నీ తీసుకువెళ్తారు. కాబట్టే, ఆ ఫలితాలు తర్వాత తరంలోనూ కనిపిస్తాయి.

- అనూరాధ పరేఖ్, సహ-వ్యవస్థాపకులు, ద బెటర్ ఇండియా



సంక్రాంతి ముగ్గులకు ఆహ్వానం...



రంగవల్లిక

ధనుర్మాసం మొదలవగానే... మగువలు సంక్రాంతి సంబరాలకు శ్రీకారం చుడతారు. వీధులన్నీ ముగ్గులతో నింపేస్తారు. నక్షత్రాల్నే చుక్కలుగా పేర్చి... వాటి మధ్య నుంచి సన్నటి గీతల్ని ఒడుపుగా తిప్పేస్తూ రంగవల్లికల్ని వేసేస్తారు. నేలనే కాన్వాస్‌గా మలచుకుని ముగ్గులెన్నో పెట్టేస్తారు. చక్కటి చిత్రాలెన్నో చూపిస్తారు. మీరూ ఇలా అందంగా ముగ్గులు వేయగలరా? మరి ఇంకెందుకాలస్యం

తెల్లటి కాగితంపై చుక్కలు స్పష్టంగా కనిపించేలా ముగ్గులు పెట్టి మాకు పంపించండి. వచ్చిన వాటిల్లో ఉత్తమమైన రంగవల్లికల్ని ‘వసుంధర’ పేజీలో ప్రచురిస్తాం. మరికొన్నింటిని ఈ-పేపర్, ఈనాడు.నెట్, వసుంధర.నెట్‌ల్లో అప్‌లోడ్ చేస్తాం.

గమనిక: ముగ్గుల్లో చుక్కలు స్పష్టంగా కనిపించాలి. చుక్కల వివరాలు, మీ పేరు, ఫొటో, ఫోన్ నంబర్‌నూ జతచేయడం మరిచిపోవద్దు.

మెయిల్: vasundhara@eenadu.in

వాట్సప్ నం: 9154091911

మా చిరునామా: **వసుంధర, ఈనాడు ప్రధాన కార్యాలయం, రామోజీ ఫిల్మ్‌సిటీ, అనాజ్‌పూర్, అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, రంగారెడ్డి జిల్లా - 501 512**



శరీరం చెబితే... వినాలి..!

ఆదివారం... ఉదయం ఐదవుతుందనగా సౌమ్య అలారం మోగింది. నిద్రలేవాలి... యోగ, ధ్యానం, వంట, స్నానం చేయాలి. తర్వాత షాపింగ్ అంటూ లేచిన దగ్గర నుంచి రాత్రి పడుకునే వరకూ టు డూ లిస్ట్ తన టేబుల్‌పై ఉంది. కానీ తన శరీరం మాత్రం ఇంకా నిద్రపొమ్మని చెబుతోంది. ఈ భావన తనది మాత్రమే కాదు. జెన్ జీ అమ్మాయిలందరిదీ. మన గురించి మనం పట్టించుకోవడాన్ని కూడా ఒక పనిలా వాళ్ల టు డూ లిస్ట్‌లో చేర్చుకుంటున్నారు. అందుకే ఇవి ఆరోగ్యాన్ని ఇవ్వకపోగా కొన్నిసార్లు ఒత్తిడికి గురిచేస్తున్నాయంటున్నారు నిపుణులు. సెలవు రోజుల్లో అలారం మోగినా, లేవాలనిపించకపోతే లేవద్దు అంటున్నారు. అంతేకాదు, వారానికోసారి ఏ పనీ చేయకుండా నిద్రపోవడం కూడా ఆరోగ్యానికి మంచిదే అంటున్నారు. దీన్నే ‘థెరప్యూటిక్ లేజీనెస్’గా పిలుస్తున్నారు. దీనివల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయట...

- ఒత్తిడి, బర్నవుట్ నుంచి విశ్రాంతి లభించి శరీరం, మనసు తేలికపడి తిరిగి శక్తిని పుంజుకుంటాయి. కండరాలు, కీళ్ల నొప్పుల నుంచి ఉపశమనం లభిస్తుంది.
- కార్టిసాల్ వంటి ఒత్తిడి హార్మోన్లను నియంత్రించి నిద్ర నాణ్యత పెంచుతుంది. అంతేకాదు, కొల్లాజెన్ ఉత్పత్తి పెరిగి వృద్ధాప్యం దరిచేరదట.
- వారంలో ఒకసారి ఇలా నిద్రపోవడం వల్ల వెన్నెముకకు ఒత్తిడి తగ్గి, రక్తప్రసరణ బాగా జరుగుతుంది. ఆ సమయంలో ఎలాంటి ఆలోచనలు ఉండవు కాబట్టి మెదడు ఆరోగ్యం మెరుగుపడి సృజనాత్మకతా పెరుగుతుంది.

పని పని పని... ఈ ఏటి ఊతపదం!

జపనీయులకు పని నిబద్ధత గురించి చెప్పడమంటే చేపపిల్లకు ఈత నేర్పడమే! ఆ దేశ సంస్కృతిలో నిర్దేశిత సమయానికి మించి పని చేయడం అంతలా భాగమైపోయింది. దీన్ని మరోసారి వార్తల్లో అంశంగా మార్చారు ఆ దేశ ప్రధాని సనాయె తకాయిచి. జపాన్ మొట్టమొదటి మహిళా ప్రధానిగా అక్టోబరులో బాధ్యతలు తీసుకున్నారీమె. అప్పట్నుంచీ ఆమె నోట ‘వర్క్ వర్క్ వర్క్ అండ్ వర్క్’ అనే మాట తరచూ వినిపిస్తోంది. జపాన్‌లో ఏటా ఇయర్ బుక్‌ని విడుదల చేస్తారు. అందులో ఆ సంవత్సరం జనంలో, మీడియాలో బాగా నలిగిన పదాల్నీ, మాటల్నీ ఎంపికచేసి అందుకు కారణమైన వ్యక్తికి అవార్డు అందిస్తారు. ఈ ఏడాది ఆ అవార్డుని తకాయిచి అందుకున్నారు. 24 పదాలతో పోటీపడి ‘వర్క్ వర్క్ వర్క్ అండ్ వర్క్’ ఈ ఏడాది ఊతపదంగా నిలిచింది. రెండో స్థానంలో ఉన్న మాటేంటో తెలుసా? ‘ఫస్ట్ ఫిమేల్ ప్రైమ్ మినిస్టర్’. పదిమందితో కూడిన న్యాయనిర్ణేతల బృందం వీటిని ఎంపిక చేస్తుంది.



తకాయిచి

నిద్ర రెండు గంటలే...

ప్రధాని బాధ్యతలు తీసుకున్నప్పట్నుంచీ తకాయిచి దేశం కోసం కష్టపడి పనిచేయడం గురించే ఎక్కువగా మాట్లాడుతున్నారు. ‘అందరూ గుర్రంలా పరిగెడుతూ పనిచేయాలి’ అంటూ తన పార్టీ ఎంపీలకు సూచిస్తున్నారు. తాను రోజూ 2-4 గంటలే నిద్రపోతాననీ, దీనివల్ల తన చర్మానికి నష్టం జరగొచ్చనీ, అలాగే వర్క్-లైఫ్ బ్యాలెన్స్‌కు తన జీవితంలో చోటులేదనీ చెబుతారు. ఒకరోజు తన అధికారిక నివాసంలో తెల్లవారుజాము మూడింటికి అధికారులతో సమావేశం ఏర్పాటుచేశారట తకాయిచి. జపాన్‌లో పనిలో పడి ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తున్నవాళ్ల సంఖ్య ఎక్కువైపోయింది. అధిక పనివేళలతో చనిపోవడాన్ని అక్కడ ‘కరోషి’గా చెబుతారు. ఈ కేసులూ ఇటీవల పెరిగాయి. దీంతో అక్కడ ప్రజల నుంచి తకాయిచి చెబుతున్న పని సంస్కృతిపై అసంతృప్తి వ్యక్తమవుతోంది. అయితే, ఈ అవార్డుని స్వీకరిస్తూ... ‘నా ఉద్దేశాన్ని తప్పుగా అర్థం చేసుకుంటున్నారు. ప్రజల్ని ఎక్కువ సమయం పనిచేయమనీ, ఎక్కువ గంటలు పనిచేయడాన్ని సద్గుణమనీ చెప్పడంలేదు. నాయకురాలిగా నాకున్న అంకితభావాన్ని తెలియజేయడమే ఇక్కడ నా ఉద్దేశం’ అని వివరించారు తకాయిచి.

కురులకు... క్రోషే పూలు!



చలికాలం వచ్చిందంటే... బామ్మ శాలువాలో దూరిపోవడం చిన్ననాటి ఓ మధుర జ్ఞాపకం. తను ప్రేమగా అల్లి ఇచ్చిన స్వెటర్లను వేసుకుని, ఆమె ప్రేమ వెచ్చదనాన్ని ఆస్వాదించడాన్నీ మర్చిపోలేం. కేవలం స్వెటర్లేనా... జడకి రంగుల రబ్బర్ బ్యాండ్లు, మఫ్లర్, పూల క్లిప్పు అంటూ ఎన్నెన్ని సర్‌ప్రైజ్‌లు వచ్చేవో! వాటిని పెట్టుకోవడం, స్నేహితుల ముందు బడాయి కొట్టడం... ఎంత బాగుండేది? కాబట్టే, నోస్టాలజీ అంటూ ఈ తరం అమ్మాయిలు నాటి అలవాట్లు, రోజుల్ని మరీ మరీ తలుచుకుంటున్నారు. కాబట్టే... క్రోషే సోషల్‌మీడియాలో సందడి చేస్తోంది. అంతేనా, ఒత్తిడి పోగొట్టుకోవడానికి ఖాళీ రోజుల్లో బామ్మల చెంతకి వాలిపోతున్నారీ అమ్మాయిలు. ఆమె అల్లికలను ప్రేమగా నేర్చుకుంటున్నారు. కేవలం నేర్చుకుంటే ఏం బాగుంటుంది? మన సృజనాత్మకత చూపించాలిగా! అందుకే నచ్చినట్లుగా అల్లేసి... వాటిని సోషల్ మీడియాలో పంచుకుంటున్నారు. అలా ఎక్కువమంది శ్రద్ధ చూపింది మాత్రం హెయిర్ యాక్సెసరీలపైనే! అందరితో వావ్ అనిపించుకోవడమే కాదు. అమ్మి ఆదాయమూ పొందుతున్నారు. దీంతో వీటికి మరింత పాపులారిటీ వచ్చేసింది. వాటిల్లోనూ క్రోషే ఫ్లోరల్ హెయిర్ యాక్సెసరీలదే హవా! క్లిప్పు, హెయిర్ బ్యాండ్, వేణీ, పరండా... ఎన్నెన్ని రూపాలో! పైగా ఏ దుస్తులమీదకైనా పెట్టేసుకోవచ్చు. ఇంకేం నచ్చిన రూపాల్లో మెచ్చిన క్రోషే పూలు హాజరు. రంగురంగుల్లో మనసును దోచేస్తూ అచ్చమైన పూలను తలపిస్తూ భలేగున్నాయి కదూ! మీరూ తెచ్చేసుకోండి. అల్లిక వస్తే స్వయంగా ప్రయత్నించొచ్చు కూడా. ఇంతకీ ఏది మీ ఎంపిక?





నేటి ఫ్యాషన్

నది వ్యర్థాలతో నెలకు 5,000 మ్యాట్‌లు...

నదుల ఒడ్డున ఎన్నో నాగరికతలు వికసించాయి. కానీ ప్రస్తుతం మన అజాగ్రత్త వల్ల అవి కాలుష్య కాసారాలుగా మారుతున్నాయి. ఇందుకు తమిళనాడులోని తామిరభరణి నది కూడా మినహాయింపు కాదు. మానవ, గృహ వ్యర్థాలు, పారిశ్రామిక మురుగుతో పాటు గుడికి వచ్చే భక్తులు పారేసే పాత దుస్తులతో ఇది ఉక్కిరిబిక్కిరవుతోంది. ఈ పరిస్థితిని ఓ ఎన్జీవో సహకారంతో స్థానిక మహిళలు మారుస్తున్నారు. ముఖ్యంగా పాత దుస్తులను ఉపయోగకరమైన వస్తువులుగా మార్చుతూ ఉపాధి పొందుతున్నారు.




పోతిగై కొండల్లో పుట్టి, కరైయార్ అటవీ ప్రాంతం గుండా ప్రవహించి పాపనాశం, శ్రీవైకుంఠం మీదుగా పున్నక్కాయల్‌లో సముద్రంలో కలుస్తుంది తామిరభరణి. ఈ నదీ తీరంలో ఉన్న ప్రసిద్ధ ఆలయాల్లో పాపనాశం ఒకటి. పాపాలు కడిగేసే ప్రదేశంగా ఇది పేరు పొందడంతో భక్తులు స్నానం చేసి పాత దుస్తుల్ని నదిలో వదిలేస్తారు. ముఖ్యంగా అమావాస్య వచ్చిందంటే చాలు... ఆ రోజు ఆ నదిలో దుస్తులు కుప్పలు కుప్పలుగా కనిపిస్తాయి. మొత్తం 128 కిలోమీటర్లు ప్రవహిస్తుంది. నగరాల్లో సరైన మురుగునీటి వ్యవస్థ లేకపోవడం, ఇళ్ల నుంచి వచ్చే వ్యర్థాలు నదిలో కలవడం వల్ల అది కాలుష్యం అవుతోంది. ప్రజల ఆరోగ్యానికి ముప్పు తీసుకొస్తోంది. దీంతో ప్రభుత్వం, సామాజిక సంస్థలు దాన్ని స్వచ్ఛంగా మార్చడానికి నడుం బిగించాయి. ముఖ్యంగా ఓ ఎన్జీవో మహిళల నేతృత్వంలో దీన్ని శుభ్రపరచడంతో పాటు మళ్లీ వినియోగంలోకి తీసుకురావాలని సంకల్పించింది. వాటిని సేకరించి మ్యాట్‌లను తయారుచేస్తోంది.



ముఖ్యంగా పాపనాశం శివాలయ పరిసరాల్లో అమావాస్య వచ్చేసరికి భక్తులు పితృదేవతలకు తిథులు నిర్వహిస్తుంటారు. స్నానం చేసి ఆ దుస్తుల్ని నదిలో విడుస్తుంటారు. దాంతో అవి పెద్ద ఎత్తున నదిలో పేరుకుంటున్నాయి. ఈ పరిస్థితిలో మార్పు తేవడానికి ఓ ఇనుప మెష్‌ని ఏర్పాటుచేశారు. తర్వాత నదిలో తేలే బట్టల్ని సేకరించి, శుభ్రం చేసి ఆరబెట్టి ఆ సంస్థకు అప్పగిస్తారు. ఇవి నెలకు సుమారు పదిటన్నుల వరకూ ఉంటాయి. వీటిల్లో కాటన్ చీరలు, ధోతీలు, లుంగీలు, స్కర్టులు మాత్రమే ఈ మ్యాట్‌లకోసం వాడతారు. పాలిస్టర్ డ్రెస్‌లను మెషీన్‌లో వేసి చిన్న చిన్న ముక్కలుగా చేసి రీసైక్లింగ్ కోసం పంపుతారు. ప్రస్తుతం ఈ పనిలో 15 మంది మహిళలు పనిచేస్తున్నారు. వారిలో ఒకరైన పద్మ ‘గతంలో చేసిన ఉద్యోగం వల్ల పిల్లల్ని చూసుకోవడం కష్టమయ్యేది. ఇప్పుడు పిల్లల కోసం మధ్యలో ఇంటికి, స్కూలుకి వెళ్లే అవకాశం దొరుకుతోంది. ఇది నాకు సౌకర్యంగా ఉంది. దీనికి తోడు మా నదీ శుభ్రపడుతోంది. ఇంతకన్నా సంతోషం ఏముంటుంది’ అని అంటారు. ఇక్కడ నెలకు సగటున 5000లకు పైగానే మ్యాట్లను తయారు చేస్తారు. ఆర్థిక భరోసానీ అందుకుంటున్నారు.

వెండి ధగధగలు

- మైక్రోసాఫ్ట్ సమీపానికి మార్కెట్ విలువ
- ఔన్సు ధర 62 డాలర్లకు
- ఆభరణాలు, పారిశ్రామిక వినియోగానికి తోడు ఈటీఎఫ్ డిమాండ్
- దేశీయ మార్కెట్లో కిలో రూ.1.93 లక్షలకు



ధర అనూహ్యంగా పెరగడంతో అంతర్జాతీయంగా వెండి ఎంతో విలువైన ఆస్తిగా సరికొత్త రికార్డులు సృష్టిస్తోంది. ప్రపంచ అగ్రగామి ఐటీ సంస్థ మైక్రోసాఫ్ట్ మార్కెట్ విలువ (మార్కెట్ కేపిటలైజేషన్) సమీపానికి వెండి మార్కెట్ విలువ చేరింది. శుక్రవారం అంతర్జాతీయంగా ఔన్సు (31.10 గ్రాముల) వెండి ధర 62 డాలర్లకు చేరడంతో, వెండి మార్కెట్ విలువ 3.491 లక్షల కోట్ల డాలర్లని కంపెనీస్‌మార్కెట్ క్యాప్.కామ్ వెబ్‌సైట్ తెలిపింది. ఇప్పటివరకు అంతర్జాతీయంగా వెలికి తీసిన వెండి మొత్తం 17,51,000 మెట్రిక్ టన్నులుగా అంచనా వేస్తూ, ఈ విలువను సంస్థ లెక్క వేసింది. ఈ ప్రకారం ప్రపంచంలోనే అత్యధిక మార్కెట్ విలువ కలిగిన అయిదో ఆస్తిగా వెండి నిలుస్తోంది.

మైక్రోసాఫ్ట్ మార్కెట్ విలువ 3.556 లక్షల కోట్ల డాలర్ల సమీపానికి, వెండి మార్కెట్ విలువ చేరింది. వెండి కంటే ఎక్కువ మార్కెట్ విలువ గల కంపెనీలు ప్రస్తుతం 4 మాత్రమే ఉన్నాయి. వెండి ధర ఇటీవల తగ్గినట్లే తగ్గి, మళ్లీ వేగంగా పెరిగింది. ఈ ఏడాదిలో జనవరి నుంచి ఇప్పటి వరకు వెండి ధర 115% పెరగడం గమనార్హం. మనదేశంలో కిలో వెండి ధర లోహ రూపంలో గురువారమే రూ.2 లక్షలు మించగా, శుక్రవారం ఎంసీఎక్స్ ట్రేడింగ్‌లోనూ రూ.2 లక్షలు మించినా, తరవాత తగ్గింది.

ఇవీ కారణాలు

రష్యా- ఉక్రెయిన్ యుద్ధం, అమెరికా అధ్యక్షుడిగా రెండోసారి బాధ్యతలు చేపట్టాక ట్రంప్ అనుసరిస్తున్న విధానాలు, వివిధ దేశాల ఉత్పత్తులపై సుంకాల వడ్డింపు ఫలితంగా అంతర్జాతీయంగా నెలకొన్న అనిశ్చితి, ద్రవ్యోల్బణం పెరిగి - వృద్ధి మందగించటం తదితర కారణాల వల్ల సురక్షితమని భావించి బంగారం, వెండి కొనుగోలు చేయడం పెరిగింది. వెండికి ఆభరణాల రంగాన్ని మించి, పారిశ్రామిక గిరాకీ అధికం. సెమీకండక్టర్, సౌర విద్యుత్తు, విద్యుత్తు వాహన విభాగాల నుంచి వెండికి గిరాకీ పెరుగుతోంది. ధర పెరుగుతున్నందున, ఎక్కువ మంది వెండి ఈటీఎఫ్ (ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్)లలో పెట్టుబడి పెడుతున్నారు. ధర బాగా అధికమయ్యేందుకు ఇది దోహదపడుతోంది.

ఫెడ్ వడ్డీరేటు తగ్గించడంతో

అమెరికా కేంద్రబ్యాంక్ ఫెడ్ ఇటీవల వడ్డీరేటును 0.25% తగ్గించింది. దీంతో బాండ్లపై ప్రతిఫలం తగ్గుతుంది. ఫలితంగా బంగారం, వెండిపై మదుపరుల్లో ఆసక్తి మళ్లీ పెరిగింది. అమెరికా డాలర్ బలహీనపడటమూ కలిసొచ్చింది. ప్రపంచ వ్యాప్తంగా వెండి ఉత్పత్తి కంటే, గిరాకీ ఎక్కువగా ఉండటమూ కారణమే.

ధర తగ్గే అవకాశం ఉందా?

వెండి ధర ఇప్పటికిప్పుడు తగ్గే పరిస్థితి కనిపించడం లేదు. కానీ అనుకోకుండా ఒక్కసారిగా దిగిరావచ్చనీ బులియన్ నిపుణులు చెబుతున్నారు. దశాబ్దకాలం క్రితం మనదేశంలో కిలో వెండి ధర రూ.40,000 స్థాయి నుంచి వేగంగానే రూ.65-70 వేలకు చేరింది. అప్పుడు కిలో రూ.లక్ష కాబోతోందనే ప్రచారం జోరుగా సాగడంతో, ఎంతో మంది వెండి కొనుగోలు చేశారు. ఆ తర్వాత ఏడాదిలోపే మళ్లీ రూ.40,000 కంటే దిగువకు వెండి ధర పతనం అయింది. ఆ తర్వాత మళ్లీ ధర పెరగడానికి ఇంత కాలం పట్టింది. ప్రస్తుతానికి వెండి ధర 'ఓవర్ వాల్యుయేషన్' దశలో ఉందని.. లాభాల స్వీకరణ జరిగినా, ఫిజికల్ కొనుగోళ్లు తగ్గినా, ఈటీఎఫ్ డిమాండ్ క్షీణించినా, ఒక్కసారిగా ధర దిగిరావచ్చని అంటున్నారు. కానీ రష్యా- ఉక్రెయిన్ యుద్ధం ముగిసి, ట్రంప్ విధానాల్లో అనిశ్చితి తొలగితేనే వెండి ధర బాగా తగ్గే అవకాశం ఉంటుందని సంబంధిత వర్గాలు వివరిస్తున్నాయి.

రూ.7,000 తగ్గిన కిలో వెండి ధర: హైదరాబాద్ బులియన్ విపణిలో గురువారం కిలో వెండి ధర రూ.2,00,100 (అన్ని పన్నులతో కలిపి) వద్ద ముగియగా, శుక్రవారం రాత్రి రూ.7,000 తగ్గి రూ.1,93,100కు పరిమితమైంది.
✦ బంగారం ధర శుక్రవారం అంతర్జాతీయంగా ఔన్సు 4297 డాలర్లకు చేరడంతో, దేశీయంగా 10 గ్రాముల మేలిమి బంగారం ధర రూ.1,36,000కు (అన్ని పన్నులతో కలిపి) చేరింది.



ఏఐతో ఉద్యోగాలు పోవు

- నేర్చుకోవడానికి వెనకాడితే భవిష్యత్తు ఉండదు
- మైక్రోసాఫ్ట్ ఇండియా, దక్షిణాసియా ప్రెసిడెంట్ పునీత్ చందోక్



ముంబయి: కృత్రిమ మేధ (ఏఐ) వల్ల ఉద్యోగాలు పోవని, అయితే ఆ సాంకేతికతను నేర్చుకోవడానికి వెనకాడితే మాత్రం భవిష్యత్తు ఉండకపోవచ్చని మైక్రోసాఫ్ట్ ఇండియా, దక్షిణాసియా ప్రెసిడెంట్ పునీత్ చందోక్ అభిప్రాయపడ్డారు. ఒక ఉద్యోగం కింద చేసే పనులను, ఈ కొత్త తరం సాంకేతికత వేర్వేరుగా విభజిస్తుందన్నారు. 'స్థిరమైన, దీర్ఘకాలం పాటు వృత్తిజీవితాలను కొనసాగించే చివరి తరం మనదే అవుతుంది. మన పిల్లలు పలు ఉద్యోగాలను నిర్వహించాల్సి ఉంటుంది' అని మైక్రోసాఫ్ట్ ఏఐ టూర్లో పాల్గొన్న వారిని ఉద్దేశించి ఆయన అన్నారు. 'మనం ఇప్పుడు రోజూ పోరాటం చేయాల్సిందే. కొత్త సామర్థ్యాలను నేర్చుకోవాల్సిందే. ఆక్సిజన్ మాస్కును ఎలా వేసుకోవాలో మనం ఇప్పుడు నేర్చుకుంటున్నాం కదా' అని అన్నారు. దిల్లీలో కాలుష్యాన్ని ఉద్దేశించి ఆయన ఈ వ్యాఖ్యలు చేసినట్లు భావిస్తున్నారు. ఏఐ మోడళ్లు కంపెనీలకు ఒక వస్తువుగా, డేటా ఒక వ్యూహాత్మక ఆస్తిగా మారుతుందని మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్య నాదెళ్ల అభిప్రాయపడ్డారు. మహారాష్ట్రలో మైక్రోసాఫ్ట్ ఏఐ టూల్స్‌ను సైబర్ భద్రతకు వినియోగిస్తున్నారని నాదెళ్ల గుర్తు చేశారు. అదానీ సిమెంట్, యెస్ బ్యాంక్, ఆదిత్య బిర్లా గ్రూప్, ఎల్‌టీఐమైండ్‌ట్రీ వంటి కంపెనీలు తమ ఏఐ క్లయింట్లని సత్య నాదెళ్ల వెల్లడించారు.

నలుగురు ఫ్లైట్ ఆపరేషన్స్ ఇన్‌స్పెక్టర్ల సస్పెన్షన్

ఇండిగో సంక్షోభ కారకులపై డీజీసీఏ చర్యలు షురూ



ముంబయి: రోజూ వందల సంఖ్యలో ఇండిగో విమాన సర్వీసులు రద్దయి, లక్షల మంది ప్రయాణికులు ఇబ్బంది పడిన అంశంపై విమానయాన నియంత్రణ సంస్థ డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) కఠిన చర్యలకు శ్రీకారం చుట్టింది. డీజీసీఏలోని నలుగురు ఫ్లైట్ ఆపరేషన్స్ ఇన్‌స్పెక్టర్ల (ఎఫ్ఓఐ)ను శుక్రవారం సంస్థ సస్పెండ్ చేసింది. డీజీసీఏలో సీనియర్ అధికారులే ఎఫ్ఓఐలుగా ఉన్నారు. సంస్థ తరఫున విమాన కార్యకలాపాల నియంత్రణ, భద్రతా వ్యవహారాలను వీరు పర్యవేక్షించాల్సి ఉంది.

దర్యాప్తుకు ఏవియేషన్ కన్సల్టింగ్ నిపుణుడి నియామకం: ఇటీవలి విమాన సర్వీసుల భారీ అంతరాయాలకు మూల కారణాన్ని విశ్లేషించేందుకు విదేశీ విమానయాన నిపుణుడు, ఏవియేషన్ అడ్వైజర్ ఎల్ఎల్‌సీకి చెందిన జాన్ ఇల్సన్‌ను నియమించినట్లు ఇండిగో బోర్డు తెలిపింది. ఈ ఘటనపై దర్యాప్తు చేపట్టిన నిపుణుడు, స్వతంత్రంగా తగిన సమగ్ర నివేదికను బోర్డుకు సమర్పిస్తారని ఇండిగో ప్రకటించింది. ఇండిగో సంక్షోభానికి కారణాలు గుర్తించేందుకు డీజీసీఏ ఏర్పాటు చేసిన నలుగురు సభ్యుల కమిటీ ముందు వరుసగా రెండో రోజూ ఇండిగో సీఈఓ పీటర్ ఎల్బర్స్, సీఓఓ ఇసిడ్రే పోర్క్వెరాస్ హాజరయ్యారు.

ఇండిగోపై సీసీఐ దృష్టి: ఇండిగో పోటీ నిబంధనలను ఉల్లంఘించిందా అన్నదానిపై కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) దర్యాప్తు చేస్తున్నట్లు ఓ అధికారి తెలిపారు. ✦ జీఎస్‌టీ అంశాలకు సంబంధించి ఇండిగోకు రూ.58.74 కోట్ల జరిమానా నోటీసును దిల్లీ సౌత్ కమిషనరేట్ పంపింది. దీన్ని సవాలు చేస్తామని ఇండిగో తెలిపింది.

మధుమేహ బాధితులకు 'ఒజెంపిక్' ఇంజెక్షన్

దేశీయంగా విడుదల చేసిన నొవో నార్డిస్క్



ఈనాడు, హైదరాబాద్: టైప్-2 డయాబెటిస్ వ్యాధి చికిత్సలో వినియోగించే ఒజెంపిక్ (సెమాగ్లుటైడ్ ఇంజెక్షన్) మందును బహుళ జాతి ఫార్మా కంపెనీ నొవో నార్డిస్క్ మనదేశంలో విడుదల చేసింది. ఈ మందును ఊబకాయాన్ని తగ్గించడానికి కూడా వివిధ దేశాల్లో వినియోగిస్తున్నారు. మనదేశంలో 0.25, 0.5, 1 ఎంజీ డోసుల్లో 'ఫ్లెక్స్ టచ్ పెన్' రూపంలో దీన్ని నొవో నార్డిస్క్ అందుబాటులోకి తెచ్చింది. వారానికి ఒక ఇంజెక్షన్ వాడాలి. కనీసం రూ.2,200 అవుతుంది. ఎక్కువ మంది కొనుగోలు చేసేలా అందుబాటు ధరలో, ఈ ఔషధాన్ని విడుదల చేసినట్లు నొవో నార్డిస్క్ ఇండియా ఎండీ విక్రాంత్ షోత్రీయ తెలిపారు. సీడీఎస్‌సీఓ (సెంట్రల్ డ్రగ్స్ స్టాండర్డ్ కంట్రోల్ ఆర్గనైజేషన్) అనుమతి మేరకు ప్రస్తుతానికి ఈ మందును మధుమేహ వ్యాధి చికిత్సకే విడుదల చేసినట్లు వెల్లడించారు. ఈ ఇంజెక్షన్‌ను డెన్మార్క్ నుంచి దిగుమతి చేసుకుని, ఇక్కడ విక్రయిస్తామని.. అందుకే విడుదలలో కొంత జాప్యం జరిగిందని వివరించారు.
✦ ఎమ్‌క్యూర్ ఫార్మాతో చేసుకున్న ఒప్పందం 'ఊబకాయాన్ని తగ్గించేందుకు ఉద్దేశించిన పొవిజ్‌ట్రా (2.4 ఎంజీ సెమాగ్లుటైడ్ ఇంజెక్షన్) మందుకే పరిమితమని' ఆయన స్పష్టం చేశారు. ఇదే మందును 'వెగోవి' బ్రాండుతో నొవో నార్డిస్క్ విక్రయిస్తోంది.

బీమా రంగంలో 100% ఎఫ్‌డీఐ

బిల్లును ఆమోదించిన కేంద్ర మంత్రివర్గం



దిల్లీ: బీమా రంగంలో భారీ సంస్కరణల దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డీఐ) పరిమితిని ప్రస్తుత 74% నుంచి 100 శాతానికి పెంచే బిల్లుకు శుక్రవారం కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈనెల 19న ముగియనున్న పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లోనే బీమా సవరణ బిల్లు-2025ను ప్రవేశ పెట్టే అవకాశం ఉంది. ఇన్సూరెన్స్ చట్టం-1938లో సవరణలు చేసి, జీవిత, సాధారణ బీమా రెండింటినీ ఒకే సంస్థ అందించే విధంగా కాంపోజిట్ లైసెన్స్ విధానాన్ని తీసుకురావాలని కొత్త బిల్లు నిర్ణయించింది.
✦ ఎఫ్‌డీఐ పెట్టుబడులను మరింతగా ఆకర్షించడంతో పాటు, బీమా కంపెనీల ఏర్పాటుకు అవసరమైన మూలధన నిబంధనలను తగ్గించాలని బిల్లులో ప్రతిపాదించారు.
✦ ఇన్సూరెన్స్ చట్టం-1938తో పాటు, లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్ఐసీ) చట్టం-1956, ఐఆర్‌డీఏఐ చట్టం-1999లకు సవరణలను ఈ బిల్లులో పొందుపర్చారు. ఎల్ఐసీ చట్టంలో చేయబోయే సవరణల ద్వారా ఆ సంస్థ బోర్డుకు నిర్వహణపరమైన నిర్ణయాల్లో స్వేచ్ఛ లభించనుంది. ముఖ్యంగా శాఖల విస్తరణ, ఉద్యోగుల నియామకాల వంటి విషయాల్లో బోర్డు సొంతంగా నిర్ణయాలు తీసుకునేందుకు వీలు కల్పించనుంది.

బొగ్గు గనుల వేలానికి కోల్‌ఎస్ఈటీయూ

బొగ్గు కేటాయింపు వేలం కోసం 'కోల్‌ఎస్ఈటీయూ' పేరుతో ప్రత్యేక గవాక్షం (విండో) ఏర్పాటుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. బొగ్గు వనరులను సమర్థంగా ఉపయోగించుకునేందుకు, లభ్యతను పెంచేందుకు ఇది దోహదం చేయనుందని ప్రభుత్వం తెలిపింది.

ఎస్‌బీఐ రుణరేట్ల తగ్గింపు

ఈనెల 15 నుంచి రుణరేట్లు తగ్గిస్తున్నట్లు స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) శుక్రవారం ప్రకటించింది. ఎక్స్‌టర్నల్ బెంచ్‌మార్క్ లింక్డ్ రేట్ (ఈబీఎల్ఆర్)ను 0.25% తగ్గించి, 7.90 శాతానికి పరిమితం చేస్తున్నట్లు వెల్లడించింది. నిధుల వ్యయం ఆధారిత రుణ రేటు (ఎంసీఎల్ఆర్)ను 5 బేసిస్ పాయింట్లు, బేస్‌రేటును 10 బేసిస్ పాయింట్ల చొప్పున తగ్గిస్తామని ప్రకటించింది. ఆర్‌బీఐ రెపోరేటును తగ్గించిన నేపథ్యంలో, ఎస్‌బీఐ తన ఖాతాదార్లకు రుణరేట్లను తగ్గించింది.

డిపాజిట్ రేటు కూడా: 2-3 ఏళ్ల కాలావధి డిపాజిట్ రేటును 5 బేసిస్ పాయింట్లు తగ్గించి 6.40 శాతానికి; 444 రోజుల డిపాజిట్ రేటును 6.60% నుంచి 6.45 శాతానికి పరిమితం చేస్తామని తెలిపింది.
✦ **ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్** కూడా, ఈనెల 15 నుంచి రెపో ఆధారిత రుణరేటును 8.35% నుంచి 8.10% చేస్తున్నట్లు పేర్కొంది.

ఎంఎస్ఎంఈ రుణాల్లోకి వివిఫై ఇండియా

ఈనాడు, హైదరాబాద్: ఉద్యోగులు, స్వయం ఉపాధి పొందుతున్న వారికి రుణాలు అందించే బ్యాంకింగేతర ఆర్థిక సంస్థ వివిఫై ఇండియా.. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా (ఎంఎస్ఎంఈ) సంస్థల రుణ విభాగంలోకి అడుగు పెట్టింది. సూక్ష్మ సంస్థలకు రూ.10 లక్షల వరకు, చిన్న, మధ్య స్థాయి సంస్థలకు గరిష్ఠంగా రూ.10 కోట్ల వరకు రుణాలిస్తామని సంస్థ సహ వ్యవస్థాపకుడు, సీఈఓ అనిల్ కుమార్ పినపాల తెలిపారు. ప్రస్తుతం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో ఉన్న సంస్థలకు రుణాలు అందిస్తున్నామని, త్వరలోనే దక్షిణ భారతానికి విస్తరిస్తామని పేర్కొన్నారు.

కోడి గుడ్లు
13న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్)
(100కు రూపాయలలో)

హైదరాబాద్	656
వరంగల్	658
విజయవాడ	690
తూ/ప గోదావరి	665
విశాఖపట్నం	660
చిత్తూరు	673

రూ.9,000 కోట్లతో ముంబయి జీసీసీ: బ్రూక్‌ఫీల్డ్



ఆసియాలోనే అతిపెద్ద గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ (జీసీసీ)ను ముంబయిలో ఏర్పాటు చేయనున్నట్లు మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ తెలిపారు. దీనిపై ఆస్తుల నిర్వహణ అగ్రగామి సంస్థ బ్రూక్‌ఫీల్డ్ సుమారు రూ.9,000 కోట్లు (1 బిలియన్ డాలరు) పెట్టుబడి పెట్టనుంది. ఈ జీసీసీ ద్వారా 45,000 మందికి ఉద్యోగావకాశాలు లభిస్తాయని ముఖ్యమంత్రి తెలిపారు.

విదేశీ మారకపు నిల్వలు పెరిగాయ్



మన విదేశీ మారకపు నిల్వలు డిసెంబరు 5తో ముగిసిన వారంలో 1.033 బిలియన్ డాలర్లు పెరిగి 687.26 బిలియన్ డాలర్లకు చేరాయి. అంతకుముందు వారంలో ఇవి 1.877 డాలర్లు తగ్గి 686.277 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. డిసెంబరు 5తో ముగిసిన వారంలో విదేశీ కరెన్సీ ఆస్తులు 151 మిలియన్ డాలర్లు తగ్గి 556.88 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. పసిడి నిల్వల విలువ 1.88 బి.డాలర్లు పెరిగి 106.984 బిలియన్ డాలర్లకు చేరింది. ప్రత్యేక ఉపసంహరణ హక్కులు (ఎస్‌డీఆర్) 93 మిలియన్ డాలర్లు అధికమై 18.721 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) వద్ద భారత నిల్వల స్థితి 97 మిలియన్ డాలర్లు తగ్గి 4.675 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి.

సంక్షిప్తంగా..

✦ **ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ** పబ్లిక్ ఇష్యూ మొదటి రోజున 72% స్పందన లభించింది. ఇష్యూలో భాగంగా 3,50,15,691 షేర్లను జారీ చేయనుండగా.. 2,53,66,506 షేర్లకు బిడ్‌లు దాఖలయ్యాయి. చిన్న మదుపర్ల విభాగంలో 21% స్పందన లభించింది.
✦ **పార్క్ మెడి వరల్డ్** ఐపీఓ ముగిసే సరికి 8 రెట్ల స్పందన లభించింది. చిన్న మదుపర్ల విభాగంలో 3.16 రెట్లు ఎక్కువగా బిడ్‌లు దాఖలయ్యాయి.
✦ సెక్యూరిటీల జారీ ద్వారా ఒకటి లేదా అంతకుమించి విడతల్లో రూ.10,000 కోట్లు సమీకరించే ప్రతిపాదనకు **జేఎస్‌డబ్ల్యూ ఎనర్జీ** బోర్డు తెలిపింది.

కార్ల టోకు విక్రయాల్లో 19% వృద్ధి

నవంబరుపై సియామ్ గణాంకాలు



పండగల సీజన్ తర్వాత కూడా గిరాకీ కొనసాగడంతో.. నవంబరులో కంపెనీల నుంచి డీలర్లకు ప్రయాణికుల వాహనాల (పీవీలు- కార్లు, ఎస్‌యూవీలు, వ్యాన్లు) సరఫరా 19% పెరిగినట్లు వాహన తయారీదార్ల సమాఖ్య (సియామ్) తెలిపింది. నవంబరులో మొత్తం ప్రయాణికుల వాహన విక్రయాలు 4,12,405గా నమోదయ్యాయి. 2024 ఇదే నెలలో విక్రయమైన 3,47,522 వాహనాలతో పోలిస్తే ఇవి 18.7% అధికం. మారుతీ సుజుకీ సరఫరాలు 1,41,312 నుంచి 21% అధికమై 1,70,971కు చేరాయి. మహీంద్రా అండ్ మహీంద్రా 56,336 కార్లను, హ్యుందాయ్ 50,340 కార్లను డీలర్లకు పంపింది.
✦ ఏడాది వ్యవధిలో ద్విచక్రవాహన టోకు విక్రయాలు 16,04,749 నుంచి 21% వృద్ధితో 19,44,475కు పెరిగాయి. స్కూటర్ల విక్రయాలు 29% పెరిగి 7,35,753కు చేరగా, మోటార్ సైకిల్ సరఫరాలు 17.5% అధికమై 11,63,751గా నమోదయ్యాయి. తిచక్ర వాహనాల సరఫరా 21% పెరిగి 71,999 కు చేరింది.
✦ 'జీఎస్‌టీ రేట్ల కోత ఫలితంగా, పండగల తర్వాతా భారత వాహన పరిశ్రమ విక్రయాల జోరు కొనసాగించింది. పీవీలు, ద్విచక్రవాహనాలు, త్రిచక్ర వాహనాలు విక్రయాలు రికార్డుస్థాయిలో సాగాయి. రాబోయే రోజుల్లో ఇదే ధోరణి కొనసాగొచ్చు' అని సియామ్ డైరెక్టరు జనరల్ రాజేశ్ మీనన్ తెలిపారు.
✦ **మెక్సికో సుంకాల పెంపుతో వ్యయ ఒత్తిళ్లు: ఏసీఎంఏ:** భారత ఉత్పత్తులపై మెక్సికో సుంకాలను పెంచడంతో, దేశీయ వాహన విడిభాగాల తయారీదార్లపై వ్యయ ఒత్తిళ్లు పడతాయని పరిశ్రమ సంఘం ఏసీఎంఏ డైరెక్టర్ జనరల్ విన్నీ మెహతా పేర్కొన్నారు. ఇరు దేశాల ప్రభుత్వాల మధ్య నడుస్తున్న చర్చలతో స్థిరత్వం లభించొచ్చని తెలిపారు. 2024-25లో మెక్సికోకు వాహన విడిభాగాల ఎగుమతులు 834 మి.డాలర్లు (సుమారు రూ.7500 కోట్లు)గా, 2025-26 ప్రథమార్ధంలో 370 మి.డాలర్లు (సుమారు రూ.3,330 కోట్లు)గా ఉన్నాయి. 2026 జనవరి 1 నుంచి 5-50% మేర నూతన సుంకాలు ఉంటాయి.

పెట్రోలియం, గ్యాస్ రంగంలో మరింత సులభతర వ్యాపారం

- 30 ఏళ్ల పాటు లీజుకు అనుమతి
- కొత్త నిబంధనల నోటిఫై



దిల్లీ: చమురు, గ్యాస్ రంగంలో సులభతర వ్యాపార విధానాలను మెరుగుపరచి, మరిన్ని పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో సరికొత్త నిబంధనలను కేంద్రం అమల్లోకి తెచ్చింది. ఆ మేరకు 'న్యూ పెట్రోలియం అండ్ నేచురల్ గ్యాస్ రూల్స్-2025'ను ప్రభుత్వం నోటిఫై చేసింది. అంతక్రితం ఉన్న వ్యవస్థను ఇటీవల ఆమోదముద్ర పడ్డ ఆయిల్‌ఫీల్డ్స్ (రెగ్యులేషన్ అండ్ డెవలప్‌మెంట్) అమెండ్‌మెంట్ యాక్ట్, 2025 భర్తీ చేస్తుంది. కొత్త విధానంలో 30 ఏళ్ల పాటు లీజు గడువు ఉంటుంది. క్షేత్రాల పూర్తి స్థాయి ఆర్థిక జీవితం వరకూ గడువు పొడిగించుకునే వీలుంటుంది. అసాధారణ పరిస్థితులు ఎదురైన పక్షంలో రక్షణ నిచ్చే షరతులూ ఉంటాయి. ఉల్లంఘనలకు క్రిమినల్ పెనాల్టీల స్థానంలో అధిక అపరాధ రుసుము (రూ.25 లక్షల)తో పాటు, ఉల్లంఘన కొనసాగింపు జరిగితే రోజుకు రూ.10 లక్షల చొప్పున పెనాల్టీ విధిస్తారు. లీజుదార్లు మౌలిక వసతులను పంచుకోవడానికీ అనుమతి ఇచ్చారు. తద్వారా కార్యకలాపాల సామర్థ్యాన్ని పెంచుకోవడానికి వీలవుతుంది. ఇకపై పెట్రోలియం లీజు దరఖాస్తులపై 180 రోజుల్లోగా నిర్ణయం తీసుకోవాలి. వివాదాల పరిష్కారానికి వేగవంతమైన వ్యవస్థనూ తీసుకొచ్చారు. 'తాజా నిబంధనలు ఒక మైలురాయిలాంటివి. వ్యాపారాలు, కార్యకలాపాలను సులభరీతిన నిర్వహించుకోవడానికి ఈ సవరణలు చేశామ'ని చమురు శాఖ మంత్రి హర్దీప్ సింగ్‌పురి పేర్కొన్నారు. ఇటువంటి సంస్కరణలను తన జీవితకాలంలో చూస్తానని అనుకోలేదని మంత్రి వివరించారు. దేశీయ చమురు అవసరాల్లో కనీసం 50 శాతాన్ని స్థానికంగా ఉత్పత్తి చేసేందుకు, ఈ సంస్కరణలు ఉపయోగ పడతాయనే ధీమా వ్యక్తం చేశారు.

ఆహార ధరలు పెరిగాయ్

నవంబరులో రిటెయిల్ ద్రవ్యోల్బణం 0.71%



దిల్లీ: ఆహార వస్తువుల ధరలు పెరగడంతో, నవంబరులో రిటెయిల్ ద్రవ్యోల్బణం 0.71 శాతానికి పెరిగింది. అక్టోబరులో ఇది రికార్డు కనిష్ఠ స్థాయి అయిన 0.25 శాతానికి పరిమితమైంది. జాతీయ గణాంకాల కార్యాలయం (ఎన్ఎస్ఓ) ఈ గణాంకాలను శుక్రవారం విడుదల చేసింది. వినియోగదారు ధరల సూచీ (సీపీఐ) ఆధారంగా లెక్కవేసే రిటెయిల్ ద్రవ్యోల్బణం వరుసగా పదో నెలా ఆర్‌బీఐ లక్షిత 4% కంటే దిగువనే నమోదు కావడం విశేషం. 2014లో సీపీఐ గణాంకాలను ఇవ్వడం మొదలుపెట్టాక, 1% లోపు నమోదవడం ఇది రెండో సారి. అక్టోబరులో ఆహార ధరల్లో తగ్గుదల (ప్రతిద్రవ్యోల్బణం) 5.02 శాతంగా నమోదు కాగా, నవంబరులో 3.91 శాతానికి పరిమితమైంది. కూరగాయలు, గుడ్లు, మాంసం-చేపలు, సుగంధ ద్రవ్యాలు, ఇంధనాల ధరలు పెరగడంతో నవంబరులో టోకు, ఆహార ద్రవ్యోల్బణాలు పెరిగాయి. కొన్ని కూరగాయల ధరలు పెరగడం వల్ల వచ్చే నెల ద్రవ్యోల్బణం 1.5 శాతానికి చేరొచ్చని ఇక్రా ముఖ్య ఆర్థికవేత్త అదితి నాయర్ అంటున్నారు.

మళ్లీ 26,000 ఎగువకు నిఫ్టీ

సెన్సెక్స్ ▲ 450	నిఫ్టీ ▲ 148
85268	26047

- విదేశీ సానుకూలతలతో లాభాలు
- డాలరు @ రూ.90.49

ఎఫ్ఐఐ అమ్మకాలు రూ.1114.22 కోట్లు
డీఐఐ కొనుగోళ్లు రూ.3868.94 కోట్లు



సమీక్ష

విదేశీ మార్కెట్ల సానుకూలతల ప్రభావంతో దేశీయ సూచీలు శుక్రవారం లాభాల్లో ముగిశాయి. లోహ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడమూ కలిసొచ్చింది. నిఫ్టీ మళ్లీ కీలక స్థాయైన 26,000 ఎగువకు వెళ్లింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ 17 పైసలు తగ్గి రూ.90.49కు దిగివచ్చింది. ఇది తాజా జీవనకాల కనిష్ఠ స్థాయి. బ్రెంట్ ముడి చమురు ధర 0.1% తగ్గి 61.23 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఆసియా మార్కెట్లన్నీ లాభాల్లో ముగియగా.. ఐరోపా మార్కెట్లూ సానుకూల ధోరణిలోనే ఆరంభమయ్యాయి.
✦ బీఎస్ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.3.65 లక్షల కోట్లు పెరిగి రూ.470.29 లక్షల కోట్లకు చేరింది.

ఒడుదొడుకుల్లో..: సెన్సెక్స్ (క్రితం ముగింపు 84,818.13) ఉదయం 233 పాయింట్ల లాభంతో 85,051.03 వద్ద ఆరంభమైంది. ఆ తర్వాత ఒడుదొడుకుల మధ్య కదలాడి 85,320.82 వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని చేరింది. చివరకు 449.53 పాయింట్ల లాభంతో 85,267.66 పాయింట్ల వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 148.40 పాయింట్లు పెరిగి 26,046.95 పాయింట్ల వద్ద స్థిరపడింది.


ఏడు మినహా మిగతావి లాభాల్లో: సెన్సెక్స్ 30 కంపెనీల షేర్లలో ఏడు మినహా మిగతావి లాభాల్లో ముగిశాయి. టాటా స్టీల్ 3.34%, ఎటర్నల్ 2.37%, అల్ట్రాటెక్ సిమెంట్ 2.25%, ఎల్అండ్‌టీ 1.71%, మారుతీ సుజుకీ 1.59%, భారతీ ఎయిర్‌టెల్ 1.47%, అదానీ పోర్ట్స్ 1.28% చొప్పున రాణించాయి. హిందుస్థాన్ యునిలీవర్ 1.89%, సన్‌ఫార్మా 0.7%, ఐటీసీ 0.63%, ఏషియన్ పెయింట్స్ 0.49%, పవర్‌గ్రిడ్ 0.42% నష్టపోయాయి.
✦ **జీఎంఆర్ పవర్ రూ. 1200 కోట్ల సమీకరణ:** జీఎంఆర్ గ్రూపు సంస్థ జీఎంఆర్ పవర్ అండ్ అర్బన్ ఇన్‌ఫ్రా రూ.1200 కోట్ల నిధులు సమీకరించే ఆలోచన చేస్తోంది. దీనికోసం ప్రిఫరెన్షియల్ ఇష్యూ పద్ధతిలో ఈక్విటీ షేర్లు/ వారెంట్లు జారీ చేయనుంది. ఈ నెల 17న జరిగే కంపెనీ డైరెక్టర్ల బోర్డు సమావేశంలో దీనిపై చర్చించి నిర్ణయం తీసుకుంటారు.
✦ హైదరాబాద్‌కు చెందిన **బార్‌ట్రానిక్స్ ఇండియా** లిమిటెడ్ పేరు మారనుంది. ఈ కంపెనీ ఇకపై 'అవియో స్మార్ట్ మార్కెట్ స్టాక్ లిమిటెడ్' పేరుతో పనిచేయనుంది. రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులతో పాటు వారికి సలహాలు, సేవలు అందించడం కోసం 'స్మార్ట్ అగ్రి స్టోర్ ఫ్రాంఛైజీ మోడల్' అమలు చేయనున్నట్లు సంస్థ పేర్కొంది.
✦ డయాలసిస్ సేవల సంస్థ **నెఫ్రోకేర్**, రూ.871 కోట్ల ఐపీఓకు 13.96 రెట్ల అధిక స్పందన లభించింది. 1,33,87,854 షేర్లను సంస్థ ఆఫర్ చేయగా, 18,68,94,592 షేర్లకు బిడ్లు వచ్చాయి.
✦ ఇ-కామర్స్ సంస్థ **మీషో**లో 6.3% వాటాను పెట్టుబడుల నిర్వహణ సంస్థ ఫిడెలిటీ ఇంటర్నేషనల్ కొనుగోలు చేసింది. మీషో ఐపీఓ జారీ ధర రూ.111 ప్రకారం చూస్తే.. ఈ 6.3% వాటా కొనుగోలు విలువ రూ.3,155 కోట్లు.
✦ **పీఎన్‌బీ హౌసింగ్** ఎండీ, సీఈఓగా అజయ్ కుమార్ శుక్లా నియమితులయ్యారు. 2025 డిసెంబరు 18న ఆయన బాధ్యతలు స్వీకరిస్తారు. అయిదేళ్ల పాటు శుక్లా ఈ పదవిలో ఉంటారు.
✦ ఇండియా పోస్ట్‌కు దేశవ్యాప్తంగా ఉన్న నెట్‌వర్క్ ద్వారా మ్యూచువల్ ఫండ్ పథకాల పంపిణీ నిమిత్తం తపాలా విభాగంతో భాగస్వామ్యాన్ని కుదుర్చుకున్నట్లు ప్రముఖ స్టాక్ ఎక్స్ఛేంజీ బీఎస్ఈ తెలిపింది.

హైదరాబాద్‌కు విస్తరించిన నియో స్ట్రెచ్

ఈనాడు, హైదరాబాద్: డోనియర్ గ్రూపు ఆధ్వర్యంలోని నియో స్ట్రెచ్ తన అయిదో విక్రయ కేంద్రాన్ని హైదరాబాద్‌లో ఏర్పాటు చేసింది. ఆధునిక యువకులు ఇష్టపడే దుస్తులను అందిస్తున్నట్లు సంస్థ వ్యవస్థాపకుడు, బ్రాండ్ డైరెక్టర్ రిషి అగర్వాల్ తెలిపారు. రెండేళ్లలో తెలుగు రాష్ట్రాల్లో 15 స్టోర్లు ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో ఉన్నామన్నారు. నాలుగేళ్లలో దేశ వ్యాప్తంగా 300కు పైగా స్టోర్లు ఏర్పాటు చేసే లక్ష్యంతో ఉన్నట్లు వివరించారు.

విలీనాలు-కొనుగోళ్ల రుణాలపై ఆచితూచి నిర్ణయం

ఎస్‌బీఐ ఛైర్మన్



దిల్లీ: కంపెనీలు జరిపే విలీనాలు-కొనుగోళ్ల (ఎం అండ్ ఏ) కోసం నిధులు అందించే విషయంలో తమ బ్యాంకు ఆచితూచి వ్యవహరించనున్నట్లు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ) ఛైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి పేర్కొన్నారు. 'ఈ కొత్త మార్కెట్లోకి అడుగుపెట్టేముందు ఆలోచించి అడుగులేస్తామ'ని వివరించారు. 'గృహ రుణాల వంటి భద్రమైన వ్యాపారంలోనూ, బ్యాంకు తొందర పడలేదు. క్రమంగా పోర్ట్‌ఫోలియోను పెంచుకుంటూ వెళ్లి, ప్రస్తుతం రూ.9 లక్షల కోట్ల మార్కును అధిగమించింది. ఈ విభాగంలోనే అతిపెద్ద బ్యాంకుగా ఉన్నామ'న్నారు. ఎం అండ్ ఏ రుణాలకు అనుమతివ్వడంపై ఆర్‌బీఐని ప్రశంసిస్తూ, భారతీయ బ్యాంకులు ఈ కార్యకలాపాల్లోకి దిగేంత పరిపక్వత కలిగి ఉన్నాయని ఎస్‌బీఐ ఛైర్మన్ అన్నారు. ఈ విభాగంలో ఇప్పటికే ఉన్న బహుళజాతి బ్యాంకులతో ఎస్‌బీఐ జట్టుకడుతుందని తెలిపారు. రుణ వృద్ధికి చేయూతనిచ్చేందుకు బ్యాంకుకు ఈక్విటీ మూలధనం ఇప్పటికైతే అవసరం లేదని శెట్టి స్పష్టం చేశారు.

75 వసంతాల రజనీ

● ప్రధాని సహా పలువురు శుభాకాంక్షలు



'జైలర్-2' చిత్రబృందం సమక్షంలో కేక్ కట్ చేస్తున్న రజనీకాంత్

అగ్ర కథానాయకుడు రజనీకాంత్ శుక్రవారం తన 75వ పుట్టినరోజు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు భారత ప్రధాని నరేంద్రమోదీ తన 'ఎక్స్' పేజీలో తమిళంలోనే జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. తన నటన ద్వారా రజనీకాంత్ పలు తరాలను ఆకర్షించారని, ఎన్నో ప్రశంసలు అందుకున్నారని పేర్కొన్నారు. ఆయన చిత్రాలు, పాత్రలు, శైలి తనదైన ముద్రవేశాయని తెలిపారు. సినీరంగంలో ఆయన 50ఏళ్లు పూర్తి చేసుకోవడం ఈ ఏడాది ప్రత్యేకాంశమని వివరించారు. ఆయన సుదీర్ఘకాలం ఆరోగ్యకరమైన జీవితం గడపాలని ప్రార్థిస్తున్నానని తెలిపారు. తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ 'ఎక్స్'లో... "రజనీకాంత్‌కు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు. మరిన్ని విజయవంతమైన చిత్రాలను అందించి ప్రేక్షకుల ఆదరాభిమానాలతో విజయపతాకం ఎగరేస్తూనే ఉండాలి" అని ఆకాంక్షించారు. రజనీకాంత్‌కు శుభాకాంక్షలు తెలుపుతూ అగ్ర నటుడు, రాజ్యసభ సభ్యుడు కమల్‌హాసన్‌కు చెందిన రాజ్‌కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ ప్రత్యేక వీడియో సందేశాన్ని విడుదల చేసింది. తమిళనాడు ప్రతిపక్షనేత ఎడప్పాడి పళనిసామి తదితర రాజకీయ ప్రముఖులు రజనీకాంత్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. 'జైలర్-2' చిత్రబృందం సమక్షంలో రజనీకాంత్ కేక్ కోసిన వీడియోను 'జైలర్' సినిమా నేపథ్య సంగీతంతో సన్ పిక్చర్స్ విడుదల చేసింది. - న్యూస్‌టుడే, చెన్నై

ఈనాడు సినిమా

రామోజీ ఫిల్మ్ సిటీలో ఎన్టీఆర్ యాక్షన్



ఎన్టీఆర్

కథానాయకుడు ఎన్టీఆర్.. దర్శకుడు ప్రశాంత్ నీల్ కలయికలో ఓ భారీ పీరియాడిక్ యాక్షన్ థ్రిల్లర్ రూపొందుతున్న సంగతి తెలిసిందే. మైత్రీ మూవీ మేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. రుక్మిణీ వసంత్ కథానాయిక. ఈ సినిమా సుదీర్ఘ విరామం తర్వాత రామోజీ ఫిల్మ్ సిటీలో కొత్త షెడ్యూల్‌ను ప్రారంభించుకుంది. తారక్‌తో పాటు ప్రధాన తారాగణంపై కీలక యాక్షన్ ఘట్టాల్ని తెరకెక్కిస్తున్నారు. దాదాపు మూడు వారాలు ఈ షెడ్యూల్ కొనసాగనున్నట్లు తెలిసింది. ఈ చిత్రంలో ఎన్టీఆర్ రెండు భిన్నమైన లుక్స్‌లో కనువిందు చేయనున్నట్లు తెలుస్తోంది. ఈ సినిమా వచ్చే ఏడాది జూన్ 25న తెరపైకి రానున్నట్లు చిత్ర బృందం ఇప్పటికే ప్రకటించింది. దీనికి రవి బస్రూర్ సంగీత దర్శకుడిగా వ్యవహరిస్తున్నారు.

రెండు రాష్ట్రాల్లో 'అఖండ2' విజయోత్సవాల్ని నిర్వహిస్తాం



గోపీ ఆచంట, రామ్ ఆచంట

"ప్రేక్షకులు 'అఖండ 2' సినిమాని ఆస్వాదిస్తున్న తీరు చూసి ఎంతో సంతృప్తినిచ్చింది. అభిమానులైతే సీట్లలో కూర్చోవడం లేదు. ప్రతి సన్నివేశానికీ నిలుచుని చప్పట్లు కొడుతూ, ఈలలు వేస్తూ సినిమాని చూస్తున్నారు. అన్ని ప్రాంతాల్లోనూ ఇదే రకమైన స్పందన కనిపిస్తోంది"ని చెప్పారు రామ్ ఆచంట, గోపీ ఆచంట. ఆ ఇద్దరూ 14 రీల్స్ ప్లస్ పతాకంపై నిర్మించిన చిత్రమే 'అఖండ 2: తాండవం'. బాలకృష్ణ కథానాయకుడిగా నటించారు. బోయపాటి శ్రీను దర్శకుడు. సంయుక్త కథానాయిక. గురువారం రాత్రి ప్రత్యేక ప్రదర్శనలతో విడుదలైన ఈ చిత్రంతో అటు ప్రేక్షకులూ, ఇటు వ్యాపార వర్గాలు సంతోషంగా ఉన్నాయని చెప్పారు నిర్మాతలు. శుక్రవారం నిర్మాణ సంస్థ కార్యాలయంలో సంబరాల్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గోపీ ఆచంట మాట్లాడుతూ "కొన్ని అనివార్య కారణాలతో సినిమా వారం రోజులు వాయిదా పడింది. అయినా సరే, ప్రత్యేక ప్రదర్శనలకు గొప్ప స్పందన లభించింది. శుక్రవారం ఉదయం ఆటలు కూడా అద్భుతంగా ప్రారంభమయ్యాయి. ఉత్తరాది రాష్ట్రాల్లోనూ 800 థియేటర్లలో విడుదల చేశాం. అక్కడ కూడా సినిమాకి బ్రహ్మరథం పడుతున్నారు ప్రేక్షకులు. త్వరలోనే రెండు తెలుగు రాష్ట్రాల్లో విజయోత్సవాల్ని నిర్వహిస్తాం" అన్నారు. రామ్ ఆచంట మాట్లాడుతూ "తెలుగు రాష్ట్రాల్లో జరిపిన ప్రత్యేక ప్రదర్శనలతోనే రూ.10 కోట్ల గ్రాస్ వసూళ్లు సొంతం అయ్యాయి. కన్నడలోనూ రికార్డు స్థాయిలో వసూళ్లు వచ్చాయి. శుక్రవారం సాయంత్రం నుంచి కుటుంబ ప్రేక్షకులూ తోడు కానున్నారు. ఈ వారాంతంలో అదిరిపోయే వసూళ్లు వస్తాయనే నమ్మకం ఉంది. ఈ సినిమా విడుదల తర్వాత అందరం సంతోషంగా ఉన్నాం. ముఖ్యంగా బాలకృష్ణ అభిమానులు అద్భుతమైన సినిమాని తీశారని అభినందిస్తున్నార"న్నారు.

25ఏళ్లుగా డిన్నర్‌కి బయటికెళ్లలేదు - సల్మాన్



తన ప్రయాణంలో సంతృప్తి చెందిన క్షణాలు ఎన్నో ఉన్నాయని అంటున్నారు బాలీవుడ్ అగ్రహీరో సల్మాన్ ఖాన్. ప్రస్తుతం 'బ్యాటిల్ ఆఫ్ గల్వాన్' సినిమాతో బిజీగా ఉన్నారాయన. తాజాగా రెడ్‌సీ అంతర్జాతీయ చిత్రోత్సవంలో పాల్గొన్న ఆయన తన కెరీర్ గురించి కొన్ని ఆసక్తికర విషయాల్ని పంచుకున్నారు. "నా జీవితంలో ఎక్కువ భాగం నేను ఎప్పుడూ కుటుంబం, స్నేహితుల చుట్టూనే ఉన్నాను. నా సన్నిహితుల్లో కొందర్ని కోల్పోయాను. ఇప్పుడు స్నేహితుల్లో కొంతమంది మాత్రమే నాతో ఉన్నారు. గత 25ఏళ్లుగా డిన్నర్ కోసం బయటకి అడుగుపెట్టలేదు. నా జీవితం అంతా షూటింగ్‌కి, విమానాశ్రయానికి, హోటల్‌కి లేకపోతే ఏదైనా ఈవెంట్‌కి వెళ్లడం మళ్లీ ఆపై చిత్రీకరణలో పాల్గొనడం.. ఇదే నా పని. అయినప్పటికీ ఈ విషయంలో నేను చింతించడం లేదు. ప్రేక్షకులు అపారమైన ప్రేమ, గౌరవాన్ని ఇస్తారు. అందుకే నేను చాలా కష్టపడి పని చేస్తాను. ఈ ప్రయాణాన్ని ఇష్టంగా ఆస్వాదిస్తున్నాన"ని అన్నారు సల్మాన్.

మీరు తెలుసుకోవాల్సిన చరిత్ర



'ఫ్రీడమ్ ఎట్ మిడ్‌నైట్'

స్వాతంత్ర్య పోరాటం, నాటి రాజకీయ పరిస్థితులను కళ్లకు కట్టినట్లు చూపించిన సిరీస్ 'ఫ్రీడమ్ ఎట్ మిడ్‌నైట్'. ఇప్పుడు సీజన్ 2తో మరోసారి ప్రేక్షకుల్ని అలరించడానికి సిద్ధమైందీ సిరీస్. నిఖిల్ అద్వాణీ రూపొందిస్తున్న ఈ సిరీస్‌లో సిద్ధాంత్ గుప్తా, చిరాగ్ వోరా, ఆరిఫ్ జకారియా తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఇటీవల సీజన్ 2ను అధికారికంగా ప్రకటిస్తూ.. సామాజిక మాధ్యమాల వేదికగా ట్రైలర్‌ను విడుదల చేసింది ఓటీటీ సంస్థ సోనీలివ్. "మీరు తప్పకుండా తెలుసుకోవాల్సిన చరిత్ర" అనే వ్యాఖ్యను జోడించింది. భారత్-పాకిస్థాన్ విభజనకు నాంది పలికిన పరిణామాలు, దేశాన్ని ఒకే తాటిపైకి తీసుకురావడానికి జరిగిన భారీ పోరాటం చుట్టూ ఈ సిరీస్ కథ తిరుగుతుందని ట్రైలర్‌తో స్పష్టమవుతోంది. జనవరి 9న ప్రేక్షకుల ముందుకు రాబోతుందీ సిరీస్

ఆ రెండు టోపీలూ ధరించడం కష్టమే!



ప్రియాంక చోప్రా

ప్రపంచ సినిమాల్లో తన పరిధిని విస్తరించుకోవడానికి ఆసక్తిగా ఎదురుచూస్తున్నానని అంటోంది ప్రియాంక చోప్రా. వైవిధ్యమైన పాత్రలతో బాలీవుడ్‌లో తనకంటూ మంచి క్రేజ్‌ను సంపాదించుకున్న కథానాయికీమె. ప్రస్తుతం హాలీవుడ్ చిత్రాలతో బిజీగా ఉన్న ఈ తార.. అగ్రహీరో మహేశ్‌బాబు సరసన 'వారణాసి' చిత్రంతో తెలుగు తెరపై సందడి చేయబోతుంది. నటనతో అలరించడమే కాదు.. నిర్మాతగా కూడా రాణిస్తుంది. ఈ నేపథ్యంలోనే ఇటీవలే ఓ ఇంటర్వ్యూలో పాల్గొని.. తన సినీప్రయాణానికి సంబంధించిన సంగతుల్ని పంచుకుంది ప్రియాంక.

అక్కడ పదేళ్లు పూర్తి

"హాలీవుడ్‌లోకి అడుగుపెట్టి ఇటీవలే పదేళ్లు పూర్తి చేసుకున్నా. కానీ అంతర్జాతీయంగా నాకు లభించిన పాత్రలతో పోలిస్తే.. భారతీయ చిత్రాలలో మరింత వైవిధ్యమైన పాత్రల్లో నటించే అవకాశం వచ్చింది. నా హిందీ సినిమా ప్రయాణం గమనిస్తే మీకు అది అర్థమవుతుంది. నేను వైవిధ్యాన్ని సృష్టించగలనని.. బాలీవుడ్ చిత్రాల్లో ప్రయోగాలు చేసినట్లుగా భవిష్యత్తులో హాలీవుడ్‌లో కూడా చేస్తానని అనుకుంటున్నా. ఇంగ్లిష్ సినిమాల్లోకి అడుగుపెట్టి దశాబ్దం పూర్తయినా.. అక్కడ ఇప్పుడే కెరీర్ ప్రారంభించినట్లు ఉంది. భాషతో సంబంధం లేకుండా ప్రపంచవ్యాప్తంగా ఉన్న వివిధ రకాల చిత్రనిర్మాతలతో కలిసి పనిచేసే గొప్ప అవకాశం నాకుంది'.

"నేను చిత్రపరిశ్రమకు వచ్చినప్పుడు ఎలాంటి సినిమాలు ఎంచుకోవాలో తెలియలేదు. వచ్చిన ప్రతి ప్రాజెక్ట్‌ను అంగీకరించాను. అసలు అవకాశాలు రావడమే అదృష్టమని భావించాను. దీంతో ఎలాంటి పాత్ర అయినా ఒకే చెప్పేదాన్ని. 20ఏళ్ల వయసులో ఖాళీ లేకుండా ప్రాజెక్టులు చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నా. ఇప్పుడు నా త్యాగానికి అవతలి వైపు చూస్తున్నట్లు ఉంది. నేనెంత కష్టపడ్డానో నాకు మాత్రమే తెలుసు. నా పుట్టినరోజులు మిస్ అయ్యాను. ఆఖరికి నా తండ్రి ఆసుపత్రిలో ఉంటే ఆయన చివరి రోజులలో కూడా చూసుకోలేకపోయాను. కుటుంబంతో గడిపిన సందర్భాలూ చాలా తక్కువ. ఆ సమయంలో అంత కష్టపడ్డాను కాబట్టే ఈ రోజు ఈ స్థాయిలో ఉన్నా. 20ఏళ్ల త్యాగం చేసి నేడు ఇలా ఉన్నాను".

కదిలించే కథలకే మద్దతు

"నేను 'పర్పుల్ పెబుల్ పిక్చర్స్' అనే నిర్మాణ సంస్థను నడుపుతున్నట్లు అందరికీ తెలుసు. నటిగా, నిర్మాతగా రెండు టోపీలు ధరించడం కొంచెం భిన్నంగా, కష్టంగానూ ఉంది. అప్పుడప్పుడు నా మెదడు రెండుగా కూడా విడిపోతుంది. ఒక నటిగా నిరంతరం నన్ను ఛాలెంజ్ చేసుకోవడానికి ప్రయత్నిస్తుంటా. యాక్షన్, కామెడీ, డ్రామా ఇలా అన్ని జానర్లలో నటించగలనా? లేదా అనేది చూడాలనుకుంటున్నా. నన్ను నేను సవాలు చేసుకోవడమే ఎక్కువ ఇష్టం. అందుకే నా నటనా జీవితంలో చాలా వైవిధ్యం ఉంటుంది. కానీ ఒక నిర్మాతగా నేను సానుభూతిపరురాలిని. కొత్త దర్శకులకు అవకాశాలు ఇవ్వాలనుకుంటా. వారు సాధించలేకపోయినవి నెరవేరాలని ఆశిస్తా. వ్యక్తిగతంగా కదిలించే కథలకే నా మద్దతు".

దారితప్పినట్లు అనిపిస్తుంది

"ఎలాంటి సినీ నేపథ్యం లేని కుటుంబం నుంచి చిత్రపరిశ్రమలోకి అడుగుపెట్టాను. తొలి నాళ్లలో బాలీవుడ్‌లో బయటి వ్యక్తిగా గడిపిన క్షణాలు ఇంకా నాకు గుర్తున్నాయి. ఏదో కోల్పోయినట్లు అనిపించేది. నాలాంటి పరిస్థితి ఎవరికి రావద్దని అందరికీ అవకాశాలు రావాలనే ఉద్దేశ్యంతో నేను చిత్ర నిర్మాణం వైపు ఆకర్షితురాలినయ్యాను. నా తల్లిదండ్రులు వైద్యులు. వారికి ఈ సినిమా అనే వ్యాపారం గురించి ఏమీ తెలియదు. అందుకే ఈ క్రేజీ పరిశ్రమలో ఒంటరిగా నడవడానికి ప్రయత్నిస్తున్నా. కానీ కొన్ని సందర్భాల్లో దారితప్పినట్లు అనిపిస్తుంది".

గ్యాంగ్‌స్టర్‌గా మమ్ముట్టి?



మమ్ముట్టి

'కలాంకావల్' చిత్రంతో ఇటీవలే ప్రేక్షకుల్ని పలకరించారు అగ్ర హీరో మమ్ముట్టి. ఓ వైపు ఈ సినిమా విజయాన్ని ఆస్వాదిస్తూనే.. మరో వైపు తన రాబోయే ప్రాజెక్టుల కోసం రంగం సిద్ధం చేసుకుంటున్నారాయన. 'ఫాలిమీ'తో మంచి హిట్ అందుకున్న దర్శకుడు నితీశ్ సహదేవ్ ఓ సినిమా కోసం మమ్ముట్టితో చేతులు కలిపిన సంగతి తెలిసిందే. ఈ ప్రాజెక్టు ప్రకటించి ఏడాది కావొస్తున్నా.. కొన్ని కారణాలతో చిత్రీకరణకు నోచుకోలేదు. ఇప్పుడీ సినిమా షూటింగ్ సన్నాహాలు మొదలైనట్లు తెలుస్తోంది. కేరళ-తమిళనాడు సరిహద్దు నేపథ్యంలో యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా దీన్ని తీర్చిదిద్దుతున్నారని, ఇందులో తిరువనంతపురం యాసలో సంభాషణలు పలికే గ్యాంగ్‌స్టర్‌గా మమ్ముట్టి కనిపించనున్నారని చిత్ర సన్నిహిత వర్గాలు తెలిపాయి. మమ్ముట్టి నిర్మాణ సంస్థలో రూపొందుతున్న చిత్రమిది.

సిటీకి వస్తే నా ప్రపంచం కాదనిపించేది

"నిజాయతీతో నిండిన ప్రేమకథగా రూపొందిన సినిమా 'మోగ్లీ'. ఇది రేసీ స్క్రీన్‌ప్లేతో ఆద్యంతం ఆసక్తికరంగా సాగుతుంది" అన్నారు రోషన్ కనకాల. 'బబుల్‌గమ్' చిత్రంతో హీరోగా తెరకు పరిచయమైన ఆయన రెండో ప్రయత్నంగా 'మోగ్లీ'తో అలరించేందుకు సిద్ధమయ్యారు. సందీప్ రాజ్ తెరకెక్కించిన ఈ సినిమా ఈ రోజు థియేటర్లలోకి వస్తోంది. ఈ నేపథ్యంలోనే శుక్రవారం హైదరాబాద్‌లో విలేకర్లతో చిత్ర విశేషాలు పంచుకున్నారు రోషన్.



రోషన్

- "ప్రేమ కోసం దేన్నికైనా సిద్ధపడే మోగ్లీ అనే కుర్రాడి కథ ఇది. అలాంటి కుర్రాడి ప్రేమకు వచ్చిన అడ్డంకి ఏంటి? క్రిస్టఫర్ నోలన్ అనే వ్యక్తి నుంచి తనకెలాంటి సవాళ్లు ఎదురయ్యాయి అనేది అసలు కథ. పూర్తిగా అటవీ నేపథ్యంలో సాగే అందమైన ప్రేమకథగా ఉంటుంది. ఇది ఒక్క క్షణం కూడా నిరుత్సాహపరచని విధంగా సందీప్ చక్కటి స్క్రీన్‌ప్లేని రాసుకున్నారు. ఈ కథలో వినోదం, యాక్షన్‌తో పాటు అన్ని రకాల భావోద్వేగాలు పుష్కలంగా ఉంటాయి. అవన్నీ ఈ సినిమాలో చాలా సహజంగా పండాయి".
- "ఇది అటవీ నేపథ్యంలో సాగే ప్రేమకథ కాబట్టే దీనికి మోగ్లీ అనే టైటిల్ సరిగ్గా సరిపోతుందనుకున్నాం. దీనికి తోడు సినిమాలో నా పాత్ర కూడా ఈ పేరుకు తగ్గట్లే సాగుతుంది. ఇంటర్వెల్, ప్రీ ఇంటర్వెల్ ఆసక్తిరేకెత్తించేలా ఉంటుంది. క్లైమాక్స్ కూడా అద్భుతంగా ఉంటుంది. నాకు.. బండి సరోజ్‌కు మధ్య వచ్చే సన్నివేశాలన్నీ ఆద్యంతం అలరిస్తాయి. కచ్చితంగా ఈ సినిమా ప్రేక్షకులకు గుర్తుండిపోతుంది. అటవీ ప్రాంతంలో చిత్రీకరణ చేయడం సవాళ్లతో కూడుకున్న పనే. అయితే నేనీ ప్రయాణాన్ని ఆద్యంతం ఎంజాయ్ చేస్తూ చేశా. ఈ సినిమా తర్వాత నేను అడవికి చాలా దగ్గరయ్యా అనే అనుభూతి కలిగింది. సిటీకి వస్తే చాలా కొత్తగా.. ఇది నా ప్రపంచం కాదన్నట్లు అనిపించేది".
- "నేను చిన్నప్పటి నుంచి సినిమా వాతావరణంలోనే ఉండటం వల్ల సినిమాలపై ఓ ప్రేమ ఏర్పడిపోయింది. ఈ విషయంలో నాకెలాంటి ఒత్తిడి లేదు. ఒక్కో విషయాన్ని స్వయంగా నేర్చుకుంటూ ముందుకెళ్తున్నా. నటన పరంగా ఇంట్లో నాకు మా నాన్నకి మధ్య ఎప్పుడూ ఒక చర్చ నడుస్తూనే ఉంటుంది. అమ్మ కూడా కొన్ని సలహాలిస్తుంటుంది. మా మధ్య ఇలాంటి చర్చ ఎప్పుడూ ఉండాలని కోరుకుంటా. ప్రస్తుతం నేను రెండు సినిమాలకు ఓకే చెప్పా. అందులో ఒకటి ఇంటెన్స్ లవ్‌స్టోరీ, మరొకటి రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్. త్వరలోనే ఆ చిత్ర వివరాల్ని ప్రకటిస్తా".

అందుకే డార్క్ కామెడీ జానర్



జయకాంత్, అమర్

"మంచి వినోదంతో ప్రేక్షకుల్ని ఆద్యంతం నవ్వించే సినిమా 'గుర్రం పాపిరెడ్డి'" అన్నారు నిర్మాతలు జయకాంత్, అమర్ బురా. వీళ్లిద్దరూ కలిసి నిర్మించిన ఈ చిత్రంలో నరేశ్ అగస్త్య, ఫరియా అబ్దుల్లా జంటగా నటించారు. మురళీ మనోహర్ తెరకెక్కించారు. బ్రహ్మానందం, యోగిబాబు, రాజ్‌కుమార్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమా ఈనెల 19న రానుంది. ఈ నేపథ్యంలోనే శుక్రవారం హైదరాబాద్‌లో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నిర్మాత జయకాంత్ మాట్లాడుతూ.. "మా తొలి చిత్రం రొటీన్‌కు భిన్నంగా ఉండాలన్న ఉద్దేశంతో డార్క్ కామెడీ జానర్‌లో ఈ 'గుర్రం పాపిరెడ్డి'ని తెరకెక్కించాం. ఈ సినిమాలో టైటిల్ పాత్రలో నరేశ్ అగస్త్య, సౌధామినిగా ఫరియా అద్భుతంగా నటించారు. మా కంటెంట్‌పై ఉన్న నమ్మకంతోనే దీన్ని 'అవతార్ 3'తో పాటు ఈ నెల 19న విడుదల చేస్తున్నాం" అన్నారు. "'మ్యాడ్', 'మ్యాడ్ 2' చిత్రాల్లోని పాత్రల్ని చూసి ఎలా నవ్వుకున్నారో.. మా సినిమాలోని పాత్రల్ని చూసి అంతే నవ్వుకుంటారు" అన్నారు నిర్మాత అమర్ బురా.


విజయాన్ని గుర్తుచేసుకునేలా టీజర్ సందడి



'బార్డర్ 2'

వార్‌డ్రామా నేపథ్యంలో రూపొందుతున్న చిత్రం 'బార్డర్ 2'. బాలీవుడ్ సీనియర్ హీరో సన్నీ దేఓల్ ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రమిది. అనురాగ్‌సింగ్ దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా ఈ సినిమా టీజర్‌ను ఈ నెల 16న విడుదల చేయబోతున్నట్లు తెలుపుతూ.. సామాజిక మాధ్యమాల వేదికగా కొత్త పోస్టర్‌ను పంచుకుంది చిత్రబృందం. 1971లో జరిగిన యుద్ధ విజయాన్ని గుర్తుచేసుకునేలా ఇప్పుడు రాబోయే టీజర్ ఉంటుందని చిత్ర వర్గాలు తెలిపాయి. బ్లాక్‌బస్టర్ హిట్‌గా నిలిచిన 'బార్డర్'కు సీక్వెల్‌గా దీన్ని రూపొందిస్తున్నారు. వరుణ్ ధావన్, దిల్జీత్ దోసాంజ్, అహాన్ శెట్టి తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. దేశ గొప్పతనాన్ని, సైనికుల వీరత్వాన్ని చూపేలా తీర్చిదిద్దుతున్న ఈ చిత్రాన్ని జేపీ దత్తా, నిధి దత్తా, క్రిషన్ కుమార్, భూషణ్ కుమార్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. వచ్చే ఏడాది జనవరి 23న ప్రేక్షకుల ముందుకు రానుందీ సినిమా.

ఏదైనా 'సూపర్‌గర్ల్' ఆధీనంలోనే..



మిల్లీ ఆల్కాక్

'స్పైడర్ మ్యాన్', 'బ్యాట్‌మ్యాన్', 'సూపర్‌మ్యాన్'. ఈ పేర్లు వింటే చాలు సినీప్రియుల్లో ఏదో తెలియని ఉత్సాహం. ఇప్పటి వరకు వీరు చేసిన సాహసాలతో థియేటర్లలో పండగ చేసుకున్న అభిమానులకు.. అంతకు మించి వినోదాన్ని పంచబోతున్నాను అంటూ రంగంలోకి దిగింది 'సూపర్ గర్ల్'. సూపర్‌గర్ల్ ఏంటి.. సాహసాలు చేయడమేంటని అనుకుంటున్నారా? ప్రముఖ నిర్మాణ సంస్థ డీసీ యూనివర్స్‌లో రాబోతున్న చిత్రమిది. మిల్లీ ఆల్కాక్ కథానాయికగా నటిస్తుంది. క్రెయిగ్ గిల్లెస్పీ దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా ఈ సినిమా ట్రైలర్‌ను ఇన్‌స్టా వేదికగా విడుదల చేసింది చిత్రబృందం. 'నిజం..న్యాయం.. ఇప్పుడు ఏదైనా సూపర్‌గర్ల్ ఆధీనంలోనే' అనే వ్యాఖ్యను జోడించింది. "సూపర్‌మ్యాన్ అందరిలో మంచిని వెతుకుతాడు.. నేను పంచ్‌ని వెతుకుతా" లాంటి సంభాషణలతో ఆద్యంతం ఆసక్తిగా సాగుతోందీ ట్రైలర్. ఇందులో మిల్లీ.. కారా జోర్-ఎల్ అనే సూపర్‌గర్ల్‌గా కనిపించనుంది. వచ్చే ఏడాది జూన్‌లో థియేటర్లలోకి రానుందీ చిత్రం.

హాలీవుడ్ చిత్రంలో విద్యుత్



విద్యుత్ జమ్వాల్

'కమాండో', 'క్రాక్', 'ఐబీ71' లాంటి చిత్రాలతో ప్రేక్షకుల్ని అలరించాడు నటుడు విద్యుత్ జమ్వాల్. ఇప్పుడాయన హాలీవుడ్‌లో కూడా తన ప్రతిభను నిరూపించుకోవడానికి సిద్ధమవుతున్నాడు. ఓ వీడియో గేమ్ సిరీస్ ఆధారంగా రూపొందుతున్న హాలీవుడ్ చిత్రం 'స్ట్రీట్ ఫైటర్'. జేసన్ మోమోవా, రోమన్ రెయిన్స్ తదితరులు ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. కిటావో సకురాయ్ దర్శకత్వం వహిస్తున్నారు. ఇందులో ఓ కీలక పాత్రలో కనిపించనున్నాడు విద్యుత్. తాజాగా తన పాత్రకు సంబంధించిన లుక్‌ను సామాజిక మాధ్యమాల వేదికగా పంచుకుంది చిత్రబృందం. ఈ లైవ్ యాక్షన్ చిత్రంలో ధల్సిమ్ పాత్రలో తన యాక్షన్‌తో అదరగొట్టనున్నాడాయన. వచ్చే ఏడాది అక్టోబరు 16న థియేటర్లలోకి రానుందీ చిత్రం.

ఈతరం

youthpage@eenadu.in

అందరికీ తెలిసేలా..



క్రష్ అంటే సీక్రెట్‌గా ఉండేది అని మనకి తెలుసు. వారు కనపడగానే వచ్చే సిగ్గు, వారికోసం ఆరాటపడే చూపు, స్నేహితులు ఆటపట్టిస్తుంటే అందరికీ తెలిసిపోతుందేమోననే భయం.. ఇవన్నీ మామూలే. కానీ దీనికి భిన్నంగా కొత్త ట్రెండ్ ఒకటి వచ్చింది తెలుసా! అదే లౌడ్ క్రషింగ్. అంటే ఎవరి మీదనైనా ఇష్టం ఉంటే.. 'నువ్వంటే నాకు క్రష్ ఉంది' అని ధైర్యంగా వారికి తెలియజేయడం. ఇతరులతో కూడా మన మనోభావాలను దాచకుండా పంచుకోవడం. దీని ద్వారా మనలోని స్పష్టత, ఆత్మవిశ్వాసం అందరికీ తెలిసే అవకాశం ఉండటంతో.. ప్రస్తుతం ఇది ట్రెండ్‌గా మారింది. సెలబ్రిటీలు కూడా కొందరు ఇలా బాహాటంగా తమకు నచ్చిన వారి గురించి తెలియజేస్తుండటంతో యూత్ దాన్నే ఫాలో అయిపోతున్నారు.

నా ప్రేమ ఓ చరిత్ర!

వెరైటీ ప్రేమలేఖ



ఆదిమానవుడు చూసి ఉండడు ఇంత అందాన్ని! లేకపోతే భీమ్‌బేట్కా గుహల్లో అన్నీ నీ చిత్రాలే ఉండేవి. నదీప్రవాహంలో నీ కోసం ప్రయాణం, హరప్పా సంస్కృతికి పడింది సోపానం. మొహంజదారోలో దొరికిన కంచు నర్తకి బొమ్మ పోలికలు నీవేనమ్మా.. ముద్దుగుమ్మా! ఆర్యుల దండయాత్ర నీకోసమే అయ్యి ఉంటుందని నా అనుమానం. బుద్ధుడు సూచించిన అష్టాంగ మార్గాన్ని పెడచెవిన పెట్టి, మీ ఇంటి మార్గం వైపున నడిచిన నాకు మోక్షం ఎప్పుడు సిద్ధిస్తుందో తెలియట్లేదు. అశోకుడి శిలాశాసనాల కన్నా నీకై రాసి నచ్చక చింపేసిన ప్రేమలేఖలు మూడురెట్లు అధికం. కాలగర్భంలో కలిసిన ఆ పిచ్చిరాతలు అప్పుడప్పుడు తవ్వకాలలో నాకు తారసపడుతూనే ఉన్నాయి. నలంద, తక్షశిలల్లోని పుస్తకాలను చూసి వ్యాకరణం మీద పట్టుతెచ్చుకున్నా. మహామహుల సాంగత్యంలో ప్రేమపాఠాలను అభ్యసించి నీ ముందు నిల్చునే ధైర్యం తెచ్చుకున్నా. నీ చూపు కోసం గజినీ మహమ్మద్‌లా అలుపెరుగని దండయాత్రలు మీ వీధిపై చేశా. అల్లావుద్దీన్ ఖిల్జీలా పిచ్చివాడినై నీ దర్శనం కోసం నిరీక్షించా. నన్ను మీ నాన్నకు పట్టించకుండా ఉండటానికి మీ వాచ్‌మెన్‌కి కుత్‌బుద్దీన్ ఐబక్‌లా దానధర్మాలు చేసి, నా ఖజానాకి చిల్లు పెట్టుకున్నా. ఇక పానీపట్, కాన్వా లాంటి యుద్ధాలు చేయలేని పరిస్థితి నాది. మొఘలుల వలె పెద్దపెద్ద కట్టడాలు కట్టలేను కానీ నీ ప్రసన్న వదనాన్ని బంగారపు సిరాతో భిట్టి చిత్రపు తరహాలో నాకున్న 2 బీహెచ్‌కే ఫ్లాట్‌లో అలంకరిస్తాను. ఈ కోహినూర్ వజ్రాన్ని నా లాకర్‌లో పెట్టుకోవాలంటే నీ అనుమతి కావాలి. షేర్షా నిష్క్రమణ కోసం ఎదురుచూసిన హ్యూమయూన్‌లా నీ రిప్లై కోసం ఎదురు చూస్తూ ఉంటా! – **వివేకవర్ధన్ నాయుడు**

మిమ్మల్ని ఎక్కడో చూసినట్టుందే!

..అని అనాల్సిందే ఇక్కడికి వెళ్తే. ఎందుకంటే అక్కడ మనకెవరూ తెలియదు కాబట్టి. విషయమేమిటంటే.. భోజనం చేయాలంటే పక్కన ఫోన్‌లో ఏదైనా వీడియో ఆన్ అవ్వాల్సిన పరిస్థితిలోకి వచ్చేశాం మనం. ఇంట్లో అందరూ కలిసి తింటున్నా కానీ టీవీ మోగుతూ ఉండాల్సిందే. మరి ఒక్కసారి ఊహించుకోండి, అంతగా తెలియని వారితో, మొదటిసారి పరిచయం అయిన వారితో.. బోలెడు కబుర్లు చెబుతూ భోంచేస్తుంటే! ఆ మాటల్లో ట్రావెల్, ఆర్ట్, లైఫ్‌స్టైల్.. ఇలా చాలా విషయాలు చర్చకు వస్తే! లైఫ్‌లో ఎప్పుడూ తినని వెరైటీలు ఆ డైనింగ్ టేబుల్ మీద ఉంటే! ఇవన్నీ కలిస్తే.. సోషల్ సప్పర్. తెలుగురాష్ట్రాల్లోని ప్రధాన నగరాల్లో ట్రెండ్ అవుతున్న యూత్ స్పెషల్ డిన్నర్ క్లబ్స్ ఇవి.



ఈ క్లబ్స్‌లో అందరికీ ఫోన్లు ఉన్నా.. ఎవరూ వాటిని తినే సమయంలో వినియోగించరు. రెండు, మూడు గంటలపాటు కేవలం ఆహారం, మాటలతోనే కాలక్షేపం. న్యూయార్క్ వంటి సిటీల్లో ఈ తరహా క్లబ్స్ ఎప్పటి నుంచో ఉండగా.. దిల్లీ, ముంబయి, బెంగళూరు, హైదరాబాద్ వంటి నగరాల్లో వేగంగా విస్తరిస్తున్నాయి. విశాఖలో మరింత ట్రెండీగా నిర్వాహకులు వీటిని ముందుకు తీసుకెళ్తున్నారు. వీరు ఇళ్లల్లోనే ఆహారం తయారు చేస్తారు. వచ్చే వారికి కొత్త కొత్త రుచులను పరిచయం చేస్తారు.

ప్రత్యేకంగా..

- ఈ క్లబ్స్‌లో డైనింగ్ టేబుల్‌ని వినూత్నంగా తీర్చిదిద్దుతారు. వచ్చే వారి సంఖ్య ఆధారంగా సీట్లు ఉంటాయి. 8 నుంచి 20 మంది వరకూ ఒకేసారి తినొచ్చు. ఇంట్లో తిన్న భావన కోసం కింద కూర్చునేలా ఏర్పాట్లు చేస్తారు.
- రిజిస్టర్ చేసుకున్న వారిలో.. ఒకరితో ఒకరికి పరిచయం లేని వ్యక్తులను బ్యాచ్‌గా డిన్నర్‌కి నిర్వాహకులు ఆహ్వానిస్తారు.
- వచ్చిన వారి పేర్లతో ఆహారానికి సంబంధించి విభిన్నమైన ప్రశ్నలుంటాయి. మీ బెస్ట్ ఫుడ్ ఎక్స్‌పీరియన్స్ ఏంటి?, ఫుడ్ ఎవరితో షేర్ చేసుకోవడానికి ఇష్టపడతారు? మీ కంఫర్ట్ ఫుడ్ ఏంటి? ఇలాంటి ప్రశ్నలకు ప్రతి ఒక్కరూ జవాబు ఇవ్వాలి.
- ట్రావెలింగ్‌లో మంచి ఫుడ్ మెమరీస్ పంచుకుంటారు.
- టేబుల్‌పైకి తెచ్చిన కొత్త ఫుడ్‌ను ఎలా తినాలి, వాటి తయారీ పద్ధతి గురించి మాట్లాడుకుంటూ ఎంజాయ్ చేస్తారు.

వెళ్లాలంటే..

- తెలుగు రాష్ట్రాల్లో వంటమ్మాయిలు, ద సప్పర్ సోషల్, బజార్ ఎన్‌వైసీ వంటి పేర్లతో ఈ క్లబ్స్ నడుస్తున్నాయి.
- వీటిలో రాత్రి 7 నుంచి 9 గంటల వరకు భోజనం ఉంటుంది.
- నెలలో ఒకటి రెండుసార్లు, ప్రత్యేక రోజుల్లో సందర్భానుసారం నిర్వహిస్తారు. ఎప్పుడెప్పుడు నిర్వహిస్తారో ముందే తేదీలు ప్రకటిస్తారు.
- ముందుగా ఫోన్ నంబరు, పేరుతో రిజిస్టర్ చేసుకోవాలి.
- గ్రూప్‌గా వచ్చే స్నేహితులను ఒప్పుకోరు. అంతగా పరిచయం లేని వ్యక్తులకే ఆహ్వానం.
- నమోదు చేసుకున్నాక 'యువర్ సీట్ ఈజ్ రిజర్వ్‌డ్' అని ఈ-ఇన్విటేషన్ పంపుతారు. వచ్చేటప్పుడు ఏదైనా ఆర్ట్, ఫ్లవర్స్ తీసుకురమ్మంటారు.
- మద్యం ఉండదు, ప్రవేశ రుసుము చెల్లించాలి.

– సురేశ్ రావివలస, విశాఖపట్నం

టిల్లూ ది రోబో!



ప్ర : హిస్టరీని మార్చినది ఏంటి టిల్లూ?
–రవి, ఆదిలాబాద్

జ: ఇంకేంటి.. యాపిల్ పండు! ఎలా అంటారా.. ఈవ్ యాపిల్‌తో ప్రపంచం మొదలైంది అంటారు. న్యూటన్ యాపిల్ వల్ల సైన్స్ మొత్తం మారిపోయింది. ఇక స్టీవ్‌జాబ్స్ యాపిల్ వల్ల ఆధునిక జీవనమే కొత్తగా తయారైంది. మరి అదేగా చరిత్ర గతిని మార్చింది!

మీరు కూడా టిల్లూని మీకు నచ్చిన ప్రశ్న అడగండి. దానికి నచ్చిన జవాబు అది చెబుతుంది.

పావలా నాణెం



90 ల్లోకి వెళ్దామా..



నేను జలదుర్గం ప్రభుత్వ పాఠశాలలో రెండో తరగతి చదువుతున్నా అప్పుడు. మా నాన్న ఉద్యోగరీత్యా తరచూ క్యాంపులు వెళ్లేవారు. ఆ రోజు ఆదివారం. నేను, అక్క, పక్కింటి పిల్లలందరం కలిసి సరదాగా మా ఇంటి పక్కనే ఉన్న ఖాళీ స్థలంలో ఆడుకుంటున్నాం. అంతకుముందు రోజున మా స్కూల్‌కి మెజీషియన్ వచ్చి మ్యాజిక్ షో చేశారు. ఆట మధ్యలో హఠాత్తుగా నాకా విషయం గుర్తొచ్చింది. 'ఇప్పుడు నేను మీ అందరికీ ఓ మ్యాజిక్ చేసి చూపిస్తా' అని గొప్పలు పోయా. దాంతో అంతా ఆసక్తిగా నా ముందు కొచ్చి నిలబడ్డారు. ఇంతకీ నేను ఎంచుకున్న ట్రిక్ ఏంటి అంటే.. ఊరెళ్తూ నాన్న ఇచ్చిన పావలా నాణేన్ని మింగి, మళ్లీ బయటకు తీయడం. 'ఇదిగో మింగేస్తున్నా' అంటూ నోట్లో వేసి దాచిపెట్టాలని ట్రై చేశా. కానీ ఆ ప్రాసెస్‌లో కాయిన్ కింద పడిపోవడంతో అందరూ గొల్లున నవ్వారు. దాంతో నా పిల్ల ఈగో దెబ్బ తినేసింది. 'నన్ను చూసి నవ్వుతారా.. ఇప్పుడు చూడండ్రా' అంటూ నిజంగా గొంతులోకి నాణెం వేశా. దాచిపెడదాం అనుకునేలోపే కిందకి జారిపోయిందది. అది చూసి కంగారుపడిన అక్క, పరుగున వెళ్లి అమ్మను పిలుచుకొచ్చింది. తను ఎంత కక్కించినా కాయిన్ రాదే! భయంతో బిగుసుకుపోయిన నన్ను అమ్మ తిట్టిన తిట్లు ఇంకా ఇంకా జడుసుకునేలా చేశాయి. 'ఓరి నాయనో.. నేనేం చేసేది దేవుడో' అంటూ తను రాగాలు తీస్తున్న టైమ్‌లో నాన్న సరిగ్గా ఊరి నుంచి వచ్చారు. వెంటనే అమ్మను సముదాయించి, నన్ను ఊర్లో ఉన్న వైద్యుడి దగ్గరకి తీసుకెళ్లారు. ఆ డాక్టర్ పరీక్షించి.. 'ఏం కంగారు పడకండి, బాబుకి అరటిపళ్లు తినిపించండి, కాయిన్ అదే బయటకు వస్తుంది' అని చెప్పారు. ఇక ఆ మరుసటి రెండు రోజులు నా తిప్పలు చూడాలి.. అరటిపళ్లు ఖానా, బాత్రూమ్‌కి జానా. దెబ్బకి మ్యాజిక్‌షోలకు వెళ్లడమే మానేశాను అనుకోండి!

– ఎ.రాజారామ్, కర్నూలు

రీల్స్ పల్లె సమస్యలు తీర్చేందుకు..

సోషల్‌మీడియా రీల్స్‌తో ఏం చేయొచ్చు అంటే.. గంటల తరబడి టైమ్‌పాస్ చేయొచ్చు అనుకుంటారు మనలో కొందరు. కానీ పల్లెల స్థితిగతులే మార్చేయొచ్చు అంటున్నాడు ఈ కుర్రాడు. కేవలం అనడమే కాదు.. చేతల్లో చూపించాడు కూడా! గ్రామాల్లో ప్రజలను వేధిస్తున్న సమస్యల గురించి రీల్స్ చేస్తూ, వాటిని సోషల్‌మీడియాలో పోస్ట్ చేస్తూ.. ఆ ఇబ్బందులను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నాడు విజయనగరం జిల్లా శృంగవరపుకోటకు చెందిన యూట్యూబర్ నవీన్ రాంసింగ్.



హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న నవీన్ ప్రస్తుతం వర్క్ ఫ్రం హోమ్ చేస్తున్నాడు. ఇంజినీరింగ్ చదువుతుండగా 'నవీన్ రాంసింగ్' పేరుతో యూట్యూబ్ ఛానల్ ప్రారంభించాడు. అప్పటి నుంచి ప్రజాసమస్యలు, సామాజిక విషయాలపై వీడియోలు చేస్తున్నాడు. ప్రస్తుతం ఇతడికి 3 లక్షల మందికిపైగా ఫాలోవర్స్ ఉన్నారు. ఈ ప్రయాణంలో తాను గమనించిన ప్రతి సమస్యనూ పరిష్కరించుకుంటూ ముందుకు వెళ్తున్నాడు. ఇందుకోసం తను సొంతంగా డబ్బు ఖర్చు చేయడంతోపాటు దాతల సహకారంతో ఊళ్లలో మంచి పనులు చేయిస్తున్నాడు. గిరిజన గ్రామాల్లో వంతెనలు, మారుమూల పల్లెల్లో రక్షిత మంచినీటి ట్యాంకులు, వీధుల్లో రోడ్ల నిర్మాణాలే కాదు.. చిన్నారుల చదువులకు సాయం చేయడంతోపాటు పేదలకు మేలు చేసే ఎన్నో కార్యక్రమాలు తన రీల్స్ ద్వారా సాధ్యమయ్యాయి. ఇదంతా చేసేందుకు వాళ్ల అమ్మ, మేనమామే స్ఫూర్తి అంటాడు నవీన్. ఇప్పటివరకూ 500 కుటుంబాలకు ఇలా వివిధ రూపాల్లో సాయం అందించాడు. ఇంకా మరింతగా రీల్స్ ద్వారా ప్రజల కోసం పనిచేస్తానంటున్నాడీ అబ్బాయి. మరి మనమూ ఆల్ ది బెస్ట్ చెప్పేద్దాం.

– ఎస్‌వీఎస్ రామరాజు, శృంగవరపుకోట

మెయిల్ పంపండి

ఈతరం పేజీలో వస్తున్న కథనాలు, శీర్షికలపై మీ విలువైన సలహాలు, సూచనలు మాకు రాసి పంపండి. మా మెయిల్ అడ్రస్
youthpage@eenadu.in

స్థాయి కోసమే..

తెలుసా?



కొన్ని రిలేషన్‌షిప్స్ చూస్తుంటాం. ఒకరిపై ఒకరి ప్రేమ కంటే.. ఒకరితో ఒకరికి అవసరమే ఎక్కువ కనిపిస్తూ ఉంటుంది. డబ్బు, సామాజిక స్థాయి కోసం కలిసి తిరుగుతూ ఉంటారు. దీనికో కొత్త పేరు వచ్చింది.. అదే థ్రోనింగ్. థ్రోన్ అంటే సింహాసనం కదా, ఆ పేరు మీదే ఇది ట్రెండ్ అవుతోంది. అంటే కేవలం గొప్ప కోసం సంబంధంలో ఉండటం అన్నమాట. సంపద, హోదా, పాపులారిటీ సంపాదించుకోవడం కోసమే తప్ప, పవర్ కపుల్ అనిపించుకోవడం కోసమే తప్ప.. ఎటువంటి ఎమోషనల్ బాండింగ్ ఇందులో ఉండదు.

నేనే లీడర్

నాయకత్వానికి 10 సూత్రాలు

పని చేయడం వేరు, పది మందితో పని చేయించడం వేరు. మంచి వర్కర్లు అందరూ గొప్ప లీడర్లు కావాలని లేదు. కానీ ప్రయత్నిస్తే, ఆ నాయకత్వ లక్షణాలు నేర్చుకోవచ్చు అంటున్నారు నిపుణులు. ఇందుకు పది సూత్రాలున్నాయి.

1. **ప్రోత్సాహం:** మన బృందాన్ని ఎల్లప్పుడూ ప్రోత్సహించాలి. వారి విషయంలో మంచి నిర్ణయాలు తీసుకునేందుకు ప్రయత్నించాలి. వారు మరింత బాగా పనిచేసేలా చూడాలి. ఇది బలమైన నమ్మకాన్ని కలిగించడంతోపాటు.. మీ నాయకత్వాన్ని బలపరుస్తుంది.
2. **ఆర్థిక నిర్వహణ:** డబ్బును మేనేజ్ చేయడం ఏ వ్యాపారానికి అయినా ఆయువుపట్టు. బడ్జెట్, అకౌంటింగ్, ఆర్థిక వ్యవహారాలపై అవగాహన ఉండాలి.
3. **సమస్యా పరిష్కారం:** కొన్నిసార్లు సవాళ్లను ఎదుర్కోవాల్సి వస్తుంది. అయినా వాటిని అధిగమించడానికి వినూత్న మార్గాలను ఎంచుకోవాలి.



4. **మార్కెటింగ్:** ఏ రంగంలోనైనా మార్కెటింగ్ చాలా ముఖ్యమైనది. మారుతున్న పరిస్థితులకు తగ్గట్లు నైపుణ్యాలు మెరుగుపరుచుకోవాలి.
5. **సంబంధాలు:** సహచరులు, భాగస్వాములతో మంచి సంబంధాలు పెంపొందించుకోవాలి.
6. **అనుకూలత:** మార్కెట్ మార్పులు, కొత్త సాంకేతికతలు, మారుతున్న కస్టమర్ అవసరాలకు అనుకూలంగా ఉండాలి.
7. **సమయ పాలన:** అన్ని రకాల బాధ్యతలను నిర్వహించడానికి సమయం కేటాయించాలి. అవసరమైతే ఇతరుల సహాయం తీసుకోవాలి.
8. **నిర్ణయాలు:** ఏదైనా విషయం గురించి నిర్ణయం తీసుకునేటప్పుడే ఒకటికి రెండుసార్లు ఆలోచించాలి. కష్టమైన విషయాలను అంచనా వేసే సామర్థ్యం అలవరుచుకోవాలి.
9. **చర్చలు:** క్లయింట్లు, పెట్టుబడిదారులు, సరఫరాదారులతో సమర్థవంతంగా చర్చించాలి. అప్పుడే లాభదాయకమైన ఫలితాలు వస్తాయి.
10. **పట్టుదల:** ఒక సంస్థ అనేది ఎప్పుడో ఒకప్పుడు ఎదురుదెబ్బలు, కొన్నిసార్లు నష్టాలలో ఉంటుంది. ముందుకు సాగడానికి పట్టుదలగా ప్రయత్నించడం రావాలి.


పార్టీ.. ప్రయోజనం

మన కుర్రకారుకు పార్టీలంటే ఎంత మోజో! బర్త్‌డే వచ్చినా, ఎగ్జామ్ పాసైనా, నచ్చిన అమ్మాయి లవ్ ఓకే చేసినా, కోరిన కాలేజీలో సీటొచ్చినా.. ప్రతిదాన్నీ ఫ్రెండ్స్‌తో పార్టీగా సెలబ్రేట్ చేసుకుంటాం. ఇవన్నీ మనకు తెలిసినవే అయినా.. తాజాగా తెలియని కొత్తరకం పార్టీ వచ్చింది, అదే ఫోర్సింగ్ పార్టీ.



ఇది ఒకరకంగా ప్రయోజనకరమైన పార్టీ అన్నమాట. ఎలా అంటారా.. మనం చాలారోజులుగా పాస్‌పోర్ట్‌కి అప్లై చేద్దాం అనుకుంటున్నాం. కానీ హడావుడిలో అలా అలా ఆ పని వెనక్కి పోతోంది. సో ఫ్రెండ్స్ అందరూ ఒకచోట కూర్చుని, సరదాగా మాట్లాడుకుంటూ, స్నాక్స్, కూల్‌డ్రింక్స్ తీసుకుంటూ.. అందుకు సంబంధించిన డాక్యుమెంటేషన్ అంతా సిద్ధం చేయడం. ఎప్పటి నుంచో పెండింగ్ పడిపోతున్న పనులను పూర్తి చేయడానికి ఇదో చక్కని సందర్భం. ఇలా ఆఫీస్ వర్క్స్, పర్సనల్ పనులు.. ఏవైనా పూర్తిచేయొచ్చు. ఆ పార్టీ ప్రొడక్టివ్‌గా ఉండాలి అనేది ఇందులో ప్రధానమైన అంశం. మనసు విప్పి మాట్లాడుకోవడం, కష్టసుఖాలు పంచుకోవడం కూడా ఇందులో భాగమే! ఎందుకంటే నేటి రోజుల్లో మానసిక ఆరోగ్యం ఎంత అవసరమో అందరికీ తెలిసిందే కదా. మరి ఈ కొత్త పార్టీ ఐడియా మీక్కూడా నచ్చిందా!

కొంటె కొటేషన్



1. బుర్ర పనిచేయాలంటే బాగా.. చెయ్యకతప్పదు యోగా..
– మమత, హన్మకొండ


2. ల్యాప్‌ట్యాప్‌తో యోగా.. ఇంకెక్కడా దొరకలేదా జాగా?
– కిమ్మి నవీన్‌కుమార్

3. తలకిందులుగా కొలువు పట్టు తప్పావా.. ఇక సెలవు
– రవి అడబాల, రాజోలు

4. సాఫ్ట్‌వేర్ అబ్బాయి.. బాగుంది నీ బడాయి
– చైతన్య ఆకుల, డాలస్

5. జాబ్ జేబుకి.. ఆసనం ఆరోగ్యానికి!
– సయ్యద్ గౌస్ ఖాజా

6. బాగుంది నీ ఫీట్.. స్లిప్పయితే మారుతుంది ఫేట్
– రమేష్ రెడ్డి, పీలేరు



చలి బాగా పెరగడంతో మీది కూడా ఇదే పరిస్థితి కదా.. అందుకే సరదాగా ఈ ఫొటోకి వ్యాఖ్య రాసి పంపండి. బాగున్నవి ప్రచురిస్తాం.

పెళ్లి.. ఇలా కూడా!

పెళ్లంటే ధూమ్‌ధామ్ ఉండాలి అనేది మనందరి కోరిక. 'లైఫ్‌లో ఒక్కసారి వచ్చే సందర్భం. ఆమాత్రం హడావుడి, ఖర్చు లేకుండా ఎలా?' అని చాలామంది అనుకుంటాం. తల్లిదండ్రుల జీవితకాల సేవింగ్స్‌ను ఒక్కరోజులో ఖర్చుచేసే వాళ్లు చాలామందే ఉన్నారు మనలో. కానీ ఒక్కసారి ఆలోచించండి.. ఇంత ఆడంబరం అవసరమా? పీకి పారేసే సెట్టింగులు.. వృథాగా పోయే వందల రకాల ఆహార పదార్థాలు.. మళ్లీ తిరిగి వాడని ఖరీదైన దుస్తులు.. ఎంతకని! ఏ విషయంలోనైనా మార్పు యువతతోనే సాధ్యం. మరి ఇలా కాకుండా పెళ్లి ఇంకెలా చేసుకోవాలి అంటారా.. దానికీ కొన్ని మార్గాలున్నాయి.



ప్రకృతిపై ప్రేమ

ఈ ఆదర్శవంతమైన వివాహాల్లో 'సస్టైనబుల్ వెడ్డింగ్'కు సముచిత ప్రాధాన్యం ఉంది. ఇప్పటికే కొన్ని జంటలు ఈ విధంగా ఒక్కటై ప్రకృతిపై తమ ప్రేమ చాటుకున్నాయి. ముంబయికి చెందిన అశ్విన్ మాల్వాడే, నూపూర్ అగర్వాల్ దంపతులు వారి పెళ్లిలో ఎలాంటి ప్లాస్టిక్ వాడలేదు. పూర్తిగా సహజమైన అలంకరణ, స్టీల్ మిఠాయి బాక్సులనే ఉపయోగించారు. జీరో ప్లాస్టిక్ వివాహంతో అందరినీ ఆకట్టుకున్నారు.

★ బెంగళూరుకు చెందిన డాక్టర్ పూర్వీభట్, శమంత్ తమ వివాహం కోసం చెరకు మండపం, తిరిగి వినియోగించడానికి వీలైన అలంకరణకు ఓటేశారు. ఆహార వ్యర్థాలను కంపోస్ట్ ఎరువుగా వాడేలా చూసుకున్నారు. ఆలోచన బాగుంది కదూ!

పిల్లల చదువులు

పేద పిల్లల చదువులకు డబ్బు సహాయం చేయడం కంటే మంచి పని ఇంకేం ఉంటుంది చెప్పండి? అందుకే ఇప్పుడు చాలా యువ జంటలు ఈ దారిని కూడా ఎంచుకుంటున్నాయి. కాన్పూర్‌లోని అమిత్, దీక్షా యాదవ్ వివాహ బంధంలోకి అడుగుపెట్టిన సందర్భంగా 11 మంది అనాథ బాలలను దత్తత తీసుకున్నారు. వారి చదువులకు అయ్యే పూర్తి ఖర్చులు భరించాలని నిర్ణయించుకున్నారు. ఐఆర్ఎస్ అధికారులైన సీతా కృష్ణమూర్తి, చందన్ కుమార్‌లు.. విభిన్నంగా తమ ఇంట్లోని పూజ గదిలోనే పెళ్లి చేసుకున్నారు. దానికి అవ్వాల్సిన ఖర్చు మొత్తాన్ని 20 మంది పిల్లల చదువు కోసం కేటాయించారు. అహ్మద్‌నగర్‌లోని అమర్ కలాంకర్, రాణి దంపతులు వారి వివాహానికి అయ్యే ఖర్చుతో పోటీ పరీక్షలకు సిద్ధం అయ్యే విద్యార్థులకు పుస్తకాలను బహుమతిగా ఇచ్చారు. పిల్లలకు ఉచిత లైబ్రరీని ఏర్పాటు చేయాలని నిర్ణయించుకున్నారు.

సేవతో ఏడడుగులు

వివాహానికి మనం ఖర్చు చేయాలి అనుకున్న డబ్బును సమాజానికి సేవగా తిరిగి ఇవ్వడం. ఇది ఏ రూపంలో అయినా కావొచ్చు. కేరళలోని ఇడుక్కికి చెందిన కలేష్ కుమార్, సుజిత దంపతులు ఇలాగే తమ వివాహానికి వచ్చిన బహుమతులను వయనాడ్ కొండచరియలు విరిగిపడిన ఘటన బాధితులకు సహాయంగా అందించారు. మదురైకి చెందిన ఎం.హరిహరన్, తేన్మోళి కూడా క్యాన్సర్ రోగులకు ఉచితంగా ఆహారం, సంరక్షణ అందించడానికి లక్షల రూపాయలను విరాళంగా ఇచ్చారు. బబ్లూ చౌదరి, అతని భార్య భూమిక పాండే విదర్భ ప్రాంతానికి చెందిన పేద రైతులు, వితంతు వివాహాలకు అయ్యే ఖర్చును తామే స్వయంగా భరిస్తున్నారు. పోలీసు దంపతులు మనోజ్ పాటిల్, సరితా లేకర్ తమ వివాహానికి ఎలాంటి ఖర్చు చేయకుండా.. వారి గ్రామ ఉన్నత పాఠశాల, పబ్లిక్ లైబ్రరీకి విరాళాలు ఇచ్చారు. మరి మన చుట్టూ ఇందరు ఇన్ని చేస్తున్నప్పుడు.. మనం కూడా చేయొచ్చుగా!

ఇలా సింపుల్‌గా పెళ్లాడటం నామోషీ ఏంకాదు. నిజానికి ఇలాంటి వినూత్న, ఉపయుక్తమైన దారుల్లో వివాహం చేసుకోవడం మనకు చాలా గర్వకారణం. ప్రకృతిని, విలువైన డబ్బునూ సమయాన్ని ఆదా చేసిన వారమవుతాం. మరి మీరు కూడా కాబోయే భాగస్వామితో చర్చించి చూడండి!

గెలవాలంటే..

మన యువతకు కొండల్ని పిండిచేసే శక్తి ఉంటుంది. కానీ కొన్నిసార్లు ఆ విషయాన్ని నమ్మలేం. చదవగలమో లేదో, ఉద్యోగం వస్తుందో రాదో.. ఇలాంటి ఆలోచనలతో మనల్ని మనమే సందేహిస్తూ ఉంటాం. కానీ గెలవాలనే తపన ఉండాలేగానీ, పెద్ద పెద్ద డిగ్రీలతో పని లేదనే విషయం అనేకసార్లు రుజువయ్యింది. దానికి తాజా ఉదాహరణే ఇది.



అతని పేరు **అబ్దుల్ అలీం.** తమిళనాడు రాష్ట్రం. 2013లో ఓరోజు వెయ్యి రూపాయలు జేబులో పెట్టుకుని ఇంటి నుంచి బయలుదేరాడు. రూ.800 రైలు టిక్కెట్లకే ఖర్చయ్యాయి. పని కోసం వెతుకుతూ రెండు నెలలు రోడ్లపైనే! చివరికి ఓ సెక్యూరిటీ గార్డు ఉద్యోగం దొరికింది. ఒకరోజు డ్యూటీలో ఉండగా, ఒక సీనియర్ అలీంను చూశారు. నీ కళ్లలో ఏదో ప్రత్యేకత ఉందన్నారు. ఏదో సినిమాటిక్‌గా చెప్తున్నాడనిపించింది. ఏం చదువుకున్నావంటే 'టెన్త్ పాస్' అని చెప్పాడు అలీం. కంప్యూటర్ల గురించి తెలుసా? అనడిగితే, స్కూల్లో హెచ్‌టీఎంఎల్ గురించి కొద్దిగా విన్నానన్నాడు. 'ఆసక్తి ఉంటే చెప్పు నేర్పిస్తా' అన్నారు ఆ సీనియర్. 'సరే' నని తలూపాడు అలీం. ఇంకేముంది, రోజూ పన్నెండు గంటలు డ్యూటీ చేయడం, సీనియర్ రూంకి వెళ్లి కంప్యూటర్ గురించి నేర్చుకోవడం మొదలుపెట్టాడు. ఎనిమిది నెలలు గడిచాయి. ఒక చిన్న యాప్‌నే తయారు చేసేశాడు అలీం! యూజర్ల ఇన్‌పుట్ తీసుకుని, విజువలైజ్ చేసే యాప్ అది. దాన్ని ఆ సీనియర్ వాళ్ల మేనేజర్‌కు చూపించారు. బాగుందని ప్రశంసలు వచ్చాయి. రూల్స్ ఒప్పుకోంటే, అతన్ని ఇంటర్వ్యూ చేయాలని సీనియర్ తమ మేనేజర్‌ను కోరారు. ఇంటర్వ్యూ జరిగింది, ఉద్యోగమూ వచ్చింది. పని చేయడానికి స్కిల్ ఉండాలిగానీ, డిగ్రీలతో పనేముందని తేలింది. ఎనిమిదేళ్లుగా ఉద్యోగం చేస్తున్నాడు తను. అలీం నైపుణ్యాల్ని నమ్మి, కష్టించేతత్వాన్ని, శ్రద్ధాసక్తుల్ని గుర్తించి ఉద్యోగం ఇచ్చిన ఆ కంపెనీయే జోహార్!

ఇందులో మనం తెలుసుకోవాల్సిందేంటంటే, నేర్చుకోవడానికి చదువు, వయసు, పరిస్థితులు అడ్డంకావు. ఏది, ఎప్పుడైనా మొదలుపెట్టొచ్చు. మనసుపెట్టి నేర్చుకున్న కోడింగ్ నైపుణ్యాలే అలీం జీవితాన్ని మార్చేశాయి. ఒకప్పుడు సెక్యూరిటీ గార్డుగా గేటు వద్దే డ్యూటీ. ఇప్పుడ లాంటి గేటు- సాఫ్ట్‌వేర్ డెవలపర్ హోదాలో అలీంను గౌరవంగా లోపలికి పంపుతోంది. తన నేపథ్యం, ప్రస్థానం, విజయగాథను తనే స్వయంగా 'లింక్డిన్'లో పోస్టు చేశాడు. మూడు లక్షలకుపైగా లైకులు, వేల సంఖ్యలో కామెంట్లతో ప్రశంసల వర్షమే కురిసింది. ఒక పనిపై మనకుండే ఇష్టం, పడే కష్టం, మనసులో నమ్మకం ఉంటే చాలు, రేపు మనదే! – **డి.శ్రీనివాస్**

అర్ధసత్యాలు, దుష్ప్రచారాలు.. న్యాయస్థానాలను ప్రభావితం చేయలేవు

- దేశ బహిష్కరణ కేసులో సుప్రీంకోర్టు వ్యాఖ్య

దిల్లీ: న్యాయస్థానాల పరిశీలనలో ఉన్న కేసుల్లో అర్ధసత్యాలు, దుష్ప్రచారాలతో కూడిన వ్యాఖ్యానాలు ప్రజల అవగాహనను తప్పుదారిపట్టిస్తాయని సుప్రీంకోర్టు పేర్కొంది. ప్రచారం కోసం లేదా అనుకూలమైన కథనాల వ్యాప్తి దృష్టితో కొందరు చేసే జబ్బులాంటి ప్రయత్నాలు న్యాయస్థానాలను ప్రభావితం చేయలేవని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చి, జస్టిస్ విపుల్ మనుభాయ్ పంచోలితో కూడిన త్రిసభ్య ధర్మాసనం శుక్రవారం స్పష్టం చేసింది. దేశబహిష్కరణకు అనుసరించే విధానాలను సక్రమంగా పాటించకుండా తొందరపాటుతో కొందరు వ్యక్తులను బంగ్లాదేశ్‌కు పంపించారనే ఆరోపణలతో దాఖలైన కేసు విచారణ సందర్భంగా ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. నిండు గర్భిణి అయిన సునాలీ ఖాతూన్ అనే మహిళ, ఆమె ఎనిమిదేళ్ల కుమారుడిని ప్రస్తుతం భారత్‌కు తిరిగి తీసుకొచ్చారని, పశ్చిమ బెంగాల్‌లోని బీర్భూమ్‌లో తండ్రి ఇంట వైద్యం పర్యవేక్షణలో ఆమె ఉన్నారనే సమాచారం ధర్మాసనానికి చేరింది. ఈ వివాదానికి సంబంధించి ఓ ఆంగ్లపత్రికలో వచ్చిన కథనంపై సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. న్యాయస్థానం ముందున్న కేసును ప్రభావితం చేసేలా ఆ కథనం ఉందన్నారు. అయితే, అలాంటి కథనాలు కోర్టు నిర్ణయాలను మార్చలేవన్న విశ్వాసం తనకుందని తెలిపారు. దుష్ప్రచారాలు, అర్ధసత్యాలు వ్యక్తుల జీవితాలను దుర్భరం చేయరాదని జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చి పేర్కొన్నారు. వారిని వెనక్కి రప్పించాలని ఆదేశించాలని సీనియర్ న్యాయవాది సంజయ్ హెగ్డే కోరారు.



ఇదే కేసులో స్వీటీ బీబీ అనే మహిళ, ఆమె భర్త, ఇద్దరు పిల్లలు బంగ్లాదేశ్‌లోనే ఉండిపోయారని, వారు భారతీయ పౌరులని నిరూపించే ఆధారాలు ఇక వద్ద ఉన్నాయని సీనియర్ న్యాయవాది సంజయ్ హెగ్డే... ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. బంగ్లాదేశ్‌కు పంపించి వేసిన ఆరుగురిని భారత్‌కు తీసుకురావాలంటూ కలకత్తా హైకోర్టు ఉత్తర్వులను సవాల్ చేస్తూ కేంద్ర ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై జనవరి 6న విచారణ జరుపుతామని త్రిసభ్య ధర్మాసనం తెలిపింది.

శిక్షార్హత నిర్ణయానికి సానుభూతి కాదు.. సాక్ష్యాలుండాలి

దిల్లీ: మోటారు వాహనాల చట్టం కింద శిక్షార్హత నిర్ణయానికి విశ్వసనీయ సాక్ష్యాధారాల ప్రాతిపదికన నిర్ణయించాలే తప్ప, సానుభూతి ఆధారంగా కాదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. కర్ణాటక హైకోర్టు వెలువరించిన తీర్పుపై దాఖలైన అప్పీలును కొట్టివేస్తూ జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం ఈ వ్యాఖ్య చేసింది. శివమొగ్గలోని మోటార్ యాక్సిడెంట్ క్లెయిమ్స్ ట్రైబ్యునల్ 2013లో ఒక రోడ్డు ప్రమాదంలో మరణించిన ఇద్దరి తరఫున దాఖలైన వ్యాజ్యాలను కొట్టివేసింది. దాన్ని కర్ణాటక హైకోర్టు సమర్థించింది. "ప్రమాద మరణాల్లో మృతుల కుటుంబాల వేదన మాకు తెలుసు. చిన్న వయసులో మరణించినవారి బంధువులు అనుభవించే దుఃఖాన్ని కొలవజాలం లేదు. అయితే ఆ సానుభూతి కారణంగా న్యాయసూత్రాలను పక్కనపెట్టలేం" అని న్యాయమూర్తులు అన్నారు. మోటార్ వాహనాల చట్టం కింద శిక్షార్హతను విశ్వసనీయ సాక్ష్యాధారాల ప్రాతిపదికన నిర్ణయించాలని పేర్కొన్నారు. అప్పీలుదారులు నిందిత వాహనం కారణంగానే ప్రమాదం జరిగినట్టు నిరూపించలేకపోయారని గతంలో హైకోర్టు పేర్కొంది.

క్యాన్సర్‌ను గుర్తించదగిన వ్యాధిగా ప్రకటించాలి

- సుప్రీంకోర్టులో దాఖలైన పిల్
- కేంద్రం, రాష్ట్రాల స్పందన కోరిన న్యాయస్థానం

దిల్లీ: క్యాన్సర్ బాధితుల వివరాలను వైద్యులు తప్పనిసరిగా ప్రభుత్వానికి సమాచారం అందించేలా ఆ వ్యాధిని గుర్తించదగిన (నోటిఫయబుల్) దిగా ప్రకటించాలని కోరుతూ దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని (పిల్) సుప్రీంకోర్టు విచారణకు స్వీకరించింది. ఓ ప్రముఖ వైద్యుడు దాఖలు చేసిన ఈ వ్యాజ్యంపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చి, జస్టిస్ విపుల్ పంచోలీలతో కూడిన ధర్మాసనం కేంద్రంతోపాటు అన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు జారీ చేసింది. దేశవ్యాప్తంగా విస్తరిస్తున్న క్యాన్సర్‌ను ప్రకటించదగిన వ్యాధిగా గుర్తించడంలో కేంద్ర ఆరోగ్యశాఖ, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని పిటిషనర్ పేర్కొన్నారు. "దేశంలో క్యాన్సర్ విపరీతంగా ప్రబలుతున్నా దాన్ని నోటిఫయబుల్ వ్యాధిగా ప్రకటించడం ప్రభుత్వాల రాజ్యాంగంలోని 14, 21వ అధికరణాలు నిర్దేశించిన బాధ్యతను విస్మరిస్తున్నాయి. దీని కారణంగా ఈ వ్యాధిగ్రస్తులందరికీ ఒకే విధమైన చికిత్స అందడం లేదు. ఫలితంగా పౌరుల మౌలిక హక్కులు ఉల్లంఘనకు గురవుతున్నాయి" అని పిటిషనర్ పేర్కొన్నారు. పొగాకు, హెచ్‌పీవీ, ఆహారం కారణంగా వ్యాప్తి చెందే వ్యాధులు నోటిఫయబుల్ వ్యాధులు కోవకు చెందుతాయి. మహమ్మారిలా వ్యాప్తి చెందుతున్న క్యాన్సర్‌ను నిరోధించడానికి, వ్యాధిగ్రస్తులకు సరైన చికిత్స అందించడానికి ఏకరూప విధానం లేకుండా పోయిందని పిటిషనర్ వాపోయారు.

అలాంటి వ్యాజ్యాలతో న్యాయవ్యవస్థను దిగజార్చవద్దు

- సుప్రీంకోర్టు గత తీర్పును సవాల్ చేసిన పిటిషనర్‌పై ధర్మాసనం ఆగ్రహం

దిల్లీ: విద్యా హక్కు (ఆర్టీఈ) చట్టంలోని నిబంధనల నుంచి మైనార్టీల పాఠశాలలకు మినహాయింపునిస్తూ పదేళ్ల క్రితం సర్వోన్నత న్యాయస్థానం వెలువరించిన తీర్పును సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌పై జస్టిస్ బి.వి.నాగరత్న, జస్టిస్ ఆర్.మహాదేవన్‌తో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం శుక్రవారం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇటువంటి వ్యాజ్యాలతో న్యాయవ్యవస్థను దిగజార్చవద్దని తెలిపింది. పిటిషనర్‌కు రూ.లక్ష జరిమానా విధించింది. ఈ తరహా పిటిషన్లు వేయాలనే సలహాలు ఇవ్వరాదని న్యాయవాదులకు హితవు పలికింది. ధిక్కరణకు పాల్పడితే న్యాయవాదులకు కూడా జరిమానా విధించాల్సి వస్తుందని హెచ్చరించింది.



రష్యా క్షిపణి దాడులతో ఉక్రెయిన్‌లోని కోస్తియాంటినివ్కాలో ధ్వంసమైన భవనాలు

రష్యా చమురు క్షేత్రంపై ఉక్రెయిన్ దాడి

ఇంటర్నెట్ డెస్క్: ఉక్రెయిన్, రష్యాల మధ్య యుద్ధం ఆపేందుకు ఓ వైపు చర్చలు కొనసాగుతున్నా.. రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలు మాత్రం రోజురోజుకీ మరింత తీవ్రమవుతున్నాయి. తాజాగా కాస్పియన్ సముద్రంలోని రష్యా కీలక చమురు క్షేత్రంపై తాము దీర్ఘశ్రేణి డ్రోన్‌లతో దాడులు చేసినట్లు ఉక్రెయిన్ ప్రకటించింది. చమురు నుంచి వస్తున్న ఆదాయంతో రష్యా యుద్ధాన్ని కొనసాగిస్తున్నందున దానిని దెబ్బతీసే యత్నాల్లో భాగంగా ఈ దాడులు చేసినట్లు పేర్కొంది. చమురు కేంద్రంలోని రిజర్వాయర్లే లక్ష్యంగా డ్రోన్లను ప్రయోగించాం అని ఉక్రెయిన్‌కు చెందిన ఓ అధికారి వెల్లడించారు. రష్యాకు చెందిన చమురు క్షేత్రాలే లక్ష్యంగా మరిన్ని దాడులకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. కాగా, ఈ దాడులకు సంబంధించి రష్యా అధికారులు ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. మరోవైపు ఉక్రెయిన్‌లోని కోస్తియాంటినివ్కా పట్టణంపై రష్యా క్షిపణి దాడి చేసింది. ఇందులో పలు భవనాలు ధ్వంసమయ్యాయి.

కార్మిక సంఘాల ప్రతినిధులతో రాహుల్ భేటీ



దిల్లీ: దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల నుంచి వచ్చిన కార్మిక సంఘాల ప్రతినిధులతో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ పార్లమెంటు హౌస్ సముదాయంలో శుక్రవారం భేటీ అయ్యారు. కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన కార్మిక స్మృతులపై వారితో చర్చించారు. "నూతన కార్మిక స్మృతులపై కార్మిక సంఘాల ప్రతినిధులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. అవి కార్మికుల హక్కులను, సంస్థలను అణచివేసేలా ఉన్నాయని ఆవేదన చెందుతున్నారు" అని సమావేశం అనంతరం 'ఎక్స్'లో రాహుల్ పేర్కొన్నారు. కార్మికుల ఆందోళనలను లోక్‌సభలో లేవనెత్తుతానని హామీ ఇచ్చారు.

జస్టిస్ స్వామినాథన్‌పై నోటీసు గర్హనీయం

- ప్రకటన విడుదల చేసిన 56 మంది విశ్రాంత న్యాయమూర్తులు

దిల్లీ: మద్రాసు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జి.ఆర్.స్వామినాథన్‌ను విధుల నుంచి తొలగించేందుకు డీఎంకే చేస్తున్న ప్రయత్నాలను 56 మంది విశ్రాంత న్యాయమూర్తులు తీవ్రంగా తప్పుబట్టారు. జడ్జీలను బెదిరించే ప్రయత్నాలు జరుగుతున్నాయంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటనను విడుదల చేశారు. దానిపై సంతకాలు చేసినవారిలో ఇద్దరు సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తులు, ఐదుగురు హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తులు, 49 మంది విశ్రాంత హైకోర్టు జడ్జీలు ఉన్నారు. తిరుపరన్‌కుండ్రం కొండపై ఓ దర్గా సమీపంలోని దీపస్తంభం వద్ద దీపం వెలిగేలా చూడాలని అరుల్మిగు సుబ్రహ్మణ్య స్వామి ఆలయానికి జస్టిస్ స్వామినాథన్ ఈ నెల 1న ఆదేశాలిచ్చారు. 3న మరోసారి అదే తరహా ఆదేశాలు జారీ చేశారు. ఈ వ్యవహారంపై డీఎంకే ఆగ్రహం వ్యక్తం చేసింది. జస్టిస్ జి.ఆర్.స్వామినాథన్ అభిశంసన కోరుతూ తీర్మానం ప్రవేశపెట్టేందుకు తమను అనుమతించాలని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు డీఎంకే ఎంపీల నేతృత్వంలో విపక్ష ఎంపీలు ఈ నెల 9న నోటీసు సమర్పించారు. దాన్ని తప్పుబడుతూ విశ్రాంత న్యాయమూర్తులు తాజా ప్రకటన విడుదల చేశారు.

రాజీనామాకు సిద్ధపడిన బంగ్లా అధ్యక్షుడు

- యూనస్ ప్రభుత్వం అవమానకరంగా ప్రవర్తిస్తోందని వెల్లడి

ఢాకా: బంగ్లాదేశ్‌లో మహ్మద్ యూనస్ నేతృత్వంలోని తాత్కాలిక ప్రభుత్వాన్ని ఉద్దేశిస్తూ ఆ దేశ అధ్యక్షుడు మహ్మద్ షాబుద్దీన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. యూనస్ ప్రభుత్వం అవమానకరంగా ప్రవర్తిస్తోందని, పదవీకాలం ముగియకముందే తాను రాజీనామా చేయాలని యోచిస్తున్నట్లు వెల్లడించారు. ఢాకాలోని తన అధికార నివాసం నుంచి ఓ వార్తా సంస్థకు షాబుద్దీన్ ఆన్‌లైన్‌లో ఇంటర్వ్యూ ఇచ్చారు. అధ్యక్షుడిగా బాధ్యతలు తీసుకున్నప్పటి నుంచి.. మీడియాతో మాట్లాడటం ఇదే తొలిసారి అని ఆయన చెప్పారు. 'నేను వెళ్లిపోవాలని యోచిస్తున్నా. బయటకు వెళ్లాలని ఆసక్తిగా ఉంది. ఎన్నికలు జరిగేవరకు నేను కొనసాగుతా. ఎన్నికల అనంతరం అధికారం చేపట్టే ప్రభుత్వం వారి సొంత అధ్యక్షుడిని ఎన్నుకోవాలని నిర్ణయించుకుంటే.. నేను తప్పుకుంటా. యూనస్ నా గొంతును నొక్కేశారు. దాదాపు ఏడు నెలలుగా మా మధ్య ఎలాంటి భేటీ జరగలేదు. యూనస్ నాకున్న అధికారాలను తొలగించారు. సెప్టెంబరులో అనేక దేశాల్లోని బంగ్లా రాయబార కార్యాలయాల నుంచి నా చిత్రపటాలను తొలగించారు. ఇదంతా రాత్రికి రాత్రే జరిగింది. దీనివల్ల బంగ్లా అధ్యక్షుడిని తొలగించనున్నారనే తప్పుడు సందేశం ప్రజల్లోకి వెళ్ళే ప్రమాదం ఉండడంతో వీటన్నింటి గురించి యూనస్‌కు లేఖ రాశా. కానీ అటునుంచి ఎలాంటి స్పందన లేదు' అని షాబుద్దీన్ వ్యాఖ్యానించారు. కాగా, ఈయన వ్యాఖ్యలపై యూనస్ కార్యాలయం ఇప్పటివరకు ఏ ప్రకటన చేయలేదు.



దక్షిణ అండమాన్ జిల్లా బెయోద్నాబాద్‌లో శుక్రవారం జరిగిన స్వాతంత్ర్య సమరయోధుడు వీడీ సావర్కర్ విగ్రహావిష్కరణలో పాల్గొన్న కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భాగవత్

'రెప్పపాటు' వెనుక కథ ఇదీ!

- కెనడా శాస్త్రవేత్తల పరిశోధన

దిల్లీ: రణగొణ ధ్వనులున్న ప్రదేశంలో కళ్లు రెప్పవేయడం తగ్గిపోయిందంటే.. ప్రసంగాన్ని అర్థం చేసుకోవడానికి ఆ వ్యక్తి మెదడు ఎంతో శ్రమపడుతోందని అర్థమని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. రెప్పలాడించడం.. రోజువారీ శ్రవణ ప్రక్రియలో మానసిక శ్రమకు సూచిక అని వివరించారు. కెనడాలోని కంకార్డియా విశ్వవిద్యాలయానికి చెందిన శాస్త్రవేత్తలు ఈ పరిశోధన చేశారు. విభిన్న పరిస్థితుల్లో ఈ రెప్పలాడించే ప్రక్రియలో వచ్చిన మార్పులను వారు వెలుగులోకి తెచ్చారు. దీనిపై.. కాంతి తీరుతెన్నుల్లో మార్పు ప్రభావం ఉండదని పేర్కొన్నారు. పరిశోధనలో భాగంగా వారు 50 మందిని సౌండ్‌ప్రూఫ్ గదిలో పర్యవేక్షించారు. అక్కడ ఒక తెరపై ఉన్న క్రాస్‌పై దృష్టిని కేంద్రీకరించాలని వారికి సూచించారు. అదే సమయంలో వారికి హెడ్‌ఫోన్లు అమర్చి, వాటి ద్వారా చిన్నపాటి వాక్యాలను వినిపించారు. అదే సమయంలో వారు కనురెప్పలు ఆడిస్తున్న తీరును నమోదు చేశారు. హెడ్‌ఫోన్ల ద్వారా వాక్యాలతోపాటు ఇతరత్రా ధ్వనులనూ వినిపించారు. ఆ శబ్దాలు కొన్నిసార్లు పెద్దగా, మరికొన్నిసార్లు చిన్నగా ఉండేలా చేశారు. పరీక్షార్థులు వాక్యాలు మాత్రమే వింటున్నప్పుడు కనురెప్పలు ఆడించే రేటు పడిపోయింది. ధ్వని బాగా ఉన్న సమయంలో, వాక్యాలను అర్థం చేసుకోవడం కష్టమైపోయిన సందర్భంలో రెప్పలు కొట్టుకునే రేటు బాగా తగ్గిపోయింది. "కనురెప్పలు ఆడించడమనేది దృశ్య, శ్రవణ సమాచారాన్ని కోల్పోవడంతో ముడిపడి ఉన్నట్లు మా పరిశోధన సూచిస్తోంది. అందువల్లే ముఖ్యమైన సమాచారాన్ని అందుకునేటప్పుడు మనం కనురెప్పలు ఆడించడాన్ని ఆపేస్తాం" అని పరిశోధనలో పాలుపంచుకున్న మైఖేల్ డెరోచ్ తెలిపారు. మరో ప్రయోగంలో.. విభిన్న రణగొణ ధ్వనులు, కాంతి పరిస్థితుల మధ్య నిర్వహించారు. మొదటి ప్రయోగంలో వచ్చిన తరహా ఫలితాలే ఇందులోనూ ఉత్పన్నమయ్యాయి. దీన్నిబట్టి కాంతి తీవ్రతతో సంబంధం లేకుండా విషయగ్రహణ డిమాండ్ల ఆధారంగానే కనురెప్పలు కొట్టుకునే రేటు ఆధారపడి ఉంటుందని వెల్లడైంది. ఒక వ్యక్తిలో విషయగ్రహణ సామర్థ్యాన్ని కొలవడానికి ఈ విధానాన్ని ఉపయోగించొచ్చని స్పష్టమవుతోందని శాస్త్రవేత్తలు తెలిపారు.

పారిశ్రామిక కలుషిత జలాలను శుద్ధి చేసే పదార్థం

- యూపీ పరిశోధకుల సృష్టి

ఈటీవీ భారత్: పరిశ్రమల నుంచి విడుదలయ్యే కలుషిత నీటిని కూడా శుద్ధి చేసే సరికొత్త విధానాన్ని ఉత్తర్‌ప్రదేశ్‌లోని మేరఠ్‌లో ఉన్న చౌధరీ చరణ్ సింగ్ విశ్వవిద్యాలయ పరిశోధకులు అభివృద్ధి చేశారు. ఇందుకోసం అనేక సంవత్సరాలు శ్రమించి ఒక ప్రత్యేక ఉత్ప్రేరకాన్ని రూపొందించారు. వీరు టైటానియం డైఆక్సైడ్‌ను క్రియాశీలం చేసి, కలుషిత నీటిని శుద్ధ జలాలుగా మార్చారు. రంగులు, సిమెంట్, జౌళి, ఎలక్ట్రానిక్ పరిశ్రమల నుంచి వచ్చే వ్యర్థ జలాల్లో మురుగునీటి వ్యవస్థలో కలిసే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు తెలిపారు. అనంతరం మరింత ప్రమాదకరమైన రసాయనాలు వృద్ధి చెందే ప్రమాదం ఉందన్నారు. సాధారణంగా టైటానియం డైఆక్సైడ్.. అతినీలలోహిత కాంతిని పరావర్తనం చెందిస్తుంది. అందువల్ల దాన్ని సన్‌స్క్రీన్ లేపనాల్లోనూ వాడుతుంటారు. రంగులు పరిశ్రమలో తెల్ల పిగ్మెంట్‌గా, ఔషధాల్లోనూ ఉపయోగిస్తుంటారు. ఇది విషతుల్యం కాని పదార్థం. వివిధ రకాల రంగులతో కలుషితమైన నీటిని శుద్ధి చేయడానికి శాస్త్రవేత్తలు టైటానియం ఆక్సైడ్‌తో ఒక ఫొటోకెటలిస్ట్‌ను తయారుచేశారు. ఇందుకోసం వెండి రేణువులను అందులోకి చొప్పించారు. సూర్యకాంతి సమక్షంలో ఈ ఉత్ప్రేరకం.. కలుషిత జలాల నుంచి 93 శాతానికి పైగా రంగులను తొలగించగలదని వెల్లడైంది.

ఎంపిక చేసుకున్న కేంద్రంలోనే దివ్యాంగ అభ్యర్థులకు పరీక్ష

- యూపీఎస్సీ కీలక నిర్ణయం

దిల్లీ: పరీక్ష కేంద్రాల ఎంపిక విషయంలో దివ్యాంగులకు యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) శుభవార్త చెప్పింది. కమిషన్ నిర్వహించే అన్ని పరీక్షలకు దివ్యాంగ అభ్యర్థులు దరఖాస్తు సమయంలో ఎంపిక చేసుకున్న కేంద్రాన్నే వారికి కేటాయించేలా కీలక నిర్ణయం తీసుకుంది. పరీక్షలు రాసే నిమిత్తం ఆయా కేంద్రాలకు చేరుకునేందుకు దివ్యాంగ అభ్యర్థులకు ఎదురవుతున్న సవాళ్లు, అవసరమైన ప్రత్యేక అవసరాల దృష్ట్యా ఈ సౌలభ్యాన్ని కల్పించనున్నట్లు యూపీఎస్సీ వెల్లడించింది. దీనిపై యూపీఎస్సీ ఛైర్మన్ అజయ్ కుమార్ శుక్రవారం మాట్లాడుతూ.. "గత అయిదేళ్ల పరీక్ష కేంద్రాల సమాచారాన్ని విశ్లేషించాం. ఎక్కువ మంది అభ్యర్థులు దరఖాస్తులు చేస్తుండటంతో దిల్లీ, కటక్, పట్నా, లఖ్‌నవూ వంటి చోట్ల ఉన్న పరీక్ష కేంద్రాలు తొందరగా నిండిపోతున్నాయి. ఈ క్రమంలో కొందరు దివ్యాంగులకు పరీక్ష కేంద్రాలు వేరే చోట్ల వస్తున్నాయి. ఫలితంగా వారు ఇబ్బందులు పడుతున్నారు. తాజా నిర్ణయం దివ్యాంగ అభ్యర్థులకు మేలు చేస్తుంది. దరఖాస్తు సమయంలో వారు ఎంచుకున్న పరీక్ష కేంద్రమే వారికి కచ్చితంగా వస్తుందని హామీ ఇస్తున్నాం. దివ్యాంగ అభ్యర్థులు వారు ఎంచుకున్న కేంద్రాన్ని కేటాయించిన తర్వాతే సాధారణ అభ్యర్థుల ఎంపికలను పరిగణనలోకి తీసుకుంటాం" అని పేర్కొన్నారు.

జుబీన్ గార్గ్ మృతి.. నలుగురిపై హత్యా కేసు నమోదు

గువాహటి: అస్సాంకు చెందిన ప్రముఖ గాయకుడు జుబీన్ గార్గ్ మృతి పట్ల విచారణ చేపట్టిన ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) నలుగురు నిందితుల పేర్లను నమోదుచేసిన ఛార్జిషీట్‌ను గువాహటి కోర్టులో శుక్రవారం సమర్పించింది. గార్గ్ వ్యక్తిగత కార్యదర్శి అయిన సిద్ధార్థ శర్మ, నార్త్ ఈస్ట్ ఇండియా ఫెస్టివల్ నిర్వాహకుడు శ్యామ్‌కాను మహంత, గార్గ్ బ్యాండ్ సభ్యులు శేఖర్ జ్యోతి గోస్వామి, అమృత్‌ప్రవా మహంతలపై కేసు నమోదు చేసింది. ఇదే కేసులో గార్గ్ బంధువు, సస్పెండైన అస్సాం పోలీస్ అధికారి సందీపన్‌గార్గ్‌పై హత్యతో సమానం కాని నేరాభియోగాన్ని మోపింది. వీరితోపాటు జుబీన్ వ్యక్తిగత భద్రతా అధికారులు(పీఎస్‌వో) నందేశ్వర్ బోరా, ప్రబీన్ బైశ్యాల పైనా క్రిమినల్ కేసు నమోదు చేసినట్లు సీఐడీ ప్రత్యేక డీజీపీ, ఈ కేసులో సిట్‌కు న్యాయకత్వం వహిస్తోన్న ఎం.పి.గుప్తా శుక్రవారం పేర్కొన్నారు. కాగా, శ్యామ్‌కాను మహంత ఆధ్వర్యంలో సింగపుర్‌లో సెప్టెంబరు 19న జరిగిన నార్త్ ఈస్ట్ ఇండియా ఫెస్టివల్‌లో జుబీన్ మృతిచెందిన విషయం తెలిసిందే. దీంతో అస్సాం ప్రభుత్వం విచారణ నిమిత్తం డీజీపీ ఎం.పి.గుప్తా నేతృత్వంలో సిట్ ఏర్పాటుచేసింది. ఈ సిట్ బృందం చీఫ్ జుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టులో 3,500 పేజీల ఛార్జిషీట్ సమర్పించింది. ఆరు వాహనాల్లో వచ్చిన తొమ్మిది మంది సిట్ అధికారులు నాలుగు ట్రంకు పెట్టెల్లో ఈ ఛార్జిషీట్‌ను తీసుకొచ్చారు.

రష్యా రాయబారికి జర్మనీ సమన్లు

బెర్లిన్: రష్యా తమ దేశంలో విధ్వంసం సృష్టిస్తోందని, సైబర్ దాడులకు, ఎన్నికల్లో జోక్యానికి పాల్పడుతోందని జర్మనీ ఆరోపిస్తోంది. దీనిపై వివరణ ఇవ్వాల్సిందిగా కోరుతూ జర్మనీ రష్యా రాయబారికి సమన్లు జారీ చేసింది. రష్యా తమపై అబద్ధపు ప్రచారానికి కూడా పాల్పడుతోందని జర్మనీ పేర్కొంటోంది. "రష్యా జరుపుతున్న సైబర్ దాడులు, తప్పుడు సమాచార వ్యాప్తి వంటి చర్యల లక్ష్యం సుస్పష్టం. వీటి ద్వారా జర్మనీ సమాజంలో భేదాభిప్రాయాలు సృష్టించాలని, అపనమ్మకాన్ని వ్యాప్తి చేయాలని రష్యా భావిస్తోంది. ప్రజాస్వామ్య వ్యవస్థలపై నమ్మకాన్ని బలహీనపరుస్తోంది" అని జర్మనీ విదేశాంగ శాఖ ప్రతినిధి మార్టిన్ గియెస్ అన్నారు.

వెంటిలేటర్ మీద ఖాలిదా జియా

ఢాకా: బంగ్లాదేశ్ మాజీ ప్రధానమంత్రి ఖాలిదా జియా ఆరోగ్యం మరింత తీవ్రంగా విషమించింది. దీంతో ఆమెను వెంటిలేటర్ మీద ఉంచినట్లు వైద్యులు తెలిపారు. శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు పెరిగాయని, ఆక్సిజన్ స్థాయులు తగ్గి, కార్బన్ డై ఆక్సైడ్ స్థాయులు పెరిగాయని పేర్కొన్నారు. తొలుత ఆమెకు అధిక ప్రవాహ నాసిక కాన్యులా, బైలెవల్ పాజిటివ్ ఎయిర్ వే ప్రెజర్(బీపీఏపీ) మెషీన్‌ల ద్వారా వైద్యం అందించినప్పటికీ ఎలాంటి పురోగతి కనిపించలేదన్నారు. దీంతో ఆమెను వెంటిలేటర్ మీద ఉంచామని వివరించారు. స్థానిక, విదేశీ నిపుణుల వైద్య బృందం ఆమెను నిరంతరం పర్యవేక్షిస్తోందని వెల్లడించారు.

శాంతించిన థాయ్, కంబోడియా

- కాల్పుల విరమణ ఒప్పంద పునరుద్ధరణకు అంగీకారం: ట్రంప్

వాషింగ్టన్: కొద్దిరోజులుగా ఘర్షణలు పడుతున్న థాయ్‌లాండ్, కంబోడియాలు తమ మధ్య గతంలో కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందాన్ని పునరుద్ధరించుకోవాలని నిర్ణయించినట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తెలిపారు. థాయ్ ప్రధాని అనుతిన్ చార్న్‌విరాకుల్, కంబోడియా ప్రధాన మంత్రి హున్ మానెట్‌లతో ఫోన్ సంభాషణల అనంతరం ఆయన ఈ మేరకు పేర్కొన్నారు. "శుక్రవారం సాయంత్రం నుంచే కాల్పుల విరమణను అమల్లోకి తెచ్చేందుకు అంగీకరించారు" అని వివరించారు. ట్రంప్ ఒత్తిడి, మలేసియా ప్రధాని అన్వర్ ఇబ్రహీమ్ మధ్యవర్తిత్వంతో ఈ ఏడాది జులైలో థాయ్, కంబోడియాల మధ్య కాల్పుల విరమణ కుదిరింది. అయినా రెండు దేశాలు ఘర్షణ పడుతూనే ఉన్నాయి.

చంద్రుని మీదకు ప్రజలను తరలించాలా?

- పిటిషనర్‌ను ప్రశ్నించిన సుప్రీంకోర్టు

దిల్లీ: దేశ జనాభాలో 75 శాతం మంది భూకంప ప్రమాదం తీవ్రంగా ఉన్న ప్రాంతాలలో నివసిస్తున్నారనీ, అందువల్ల భూకంప నష్టాలను తగ్గించాల్సిందిగా అధికారులను ఆదేశించాలని కోరుతూ సుప్రీంకోర్టులో ఒక పిటిషన్ దాఖలైంది. ఇంతకాలం దిల్లీకే భూకంప ప్రమాదం ఎక్కువని భావించేవారమనీ, ఇప్పుడు మిగతా దేశానికీ ముప్పు ఉందని తేలిందని పిటిషనర్ పేర్కొన్నారు. 'అయితే ఏం చేద్దామంటారు? మన జనాభాను చంద్రుని మీదకో, మరేదైనా గ్రహానికో పంపాలంటారా?' అని సుప్రీంకోర్టు ద్విసభ్య ధర్మాసనం ప్రశ్నించింది. భూకంపం వల్ల కలిగే నష్టాన్ని తగ్గించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పిటిషనర్ పేర్కొనగా, అది ప్రభుత్వ బాధ్యత అనీ, ఆ విషయంలో తాము ఎటువంటి చర్యలూ తీసుకోలేమంటూ పిటిషన్‌ను ధర్మాసనం కొట్టివేసింది.

ఒక్క హెచ్-1బీ ఉద్యోగి 10 మంది అక్రమ వలసదారులతో సమానం

- అమెరికన్ సీఈవో విద్వేషం

ఇంటర్నెట్ డెస్క్: హెచ్-1బీ వీసాదారులు, ముఖ్యంగా భారతీయ ఉద్యోగులపై అమెరికా పోల్‌స్టర్, రాజకీయ వ్యాఖ్యాత మార్క్ మిచెల్ విద్వేషపూరిత వ్యాఖ్యలు చేశారు. ఒక్క హెచ్-1బీ వీసా కలిగిన ఉద్యోగి 10 మంది అక్రమ వలసదారులతో సమానమంటూ అక్కసు వెళ్లగక్కారు. "సిలికాన్ వ్యాలీ శ్రామికశక్తిలో మూడింట రెండింతలు విదేశీయులే. కొన్ని సంస్థలు అయితే 85-95 శాతం మంది భారతీయులనే నియమించుకుంటున్నాయి" అని వ్యాఖ్యలు చేశారు.

అమెరికాకు చెందిన ప్రముఖ పోలింగ్ కంపెనీ రాస్ముస్సేన్ రిపోర్ట్స్‌కు మార్క్ సీఈవోగా వ్యవహరిస్తున్నారు. అగ్రరాజ్య అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మాజీ సలహాదారు స్టీవ్ బానన్ నిర్వహించిన కార్యక్రమంలో మార్క్ ఈ వ్యాఖ్యలు చేశారు. హెచ్-1బీ వీసాదారుల్ని వెనక్కి పంపడంలేదంటూ ట్రంప్ యంత్రాంగం పైనా విమర్శలు చేశారు. "యాపిల్ వంటి టెక్ దిగ్గజాల వద్ద పనిచేసే ఒక్క హెచ్-1బీ ఉద్యోగి 10 మంది అక్రమ ఉద్యోగులతో సమానం. వీరంతా కింది స్థాయిలోనే ఉంటారు. కానీ భారీగా సొమ్ము వెనకేసుకుంటున్నారు. తక్కువ వేతనాలకు పనిచేసే కార్మికులపై సిలికాన్ వ్యాలీ కంపెనీలు ఆధారపడుతున్నాయి. ఈ వీసా మార్గాలను ఉపయోగించుకొని కంపెనీలు తక్కువ వేతనానికి పనిచేసే థర్డ్ వరల్డ్ ఇంజినీర్లను అమెరికన్ల స్థానంలోకి తీసుకువస్తున్నాయి. ఇదొక దోపిడీ" అని విషం కక్కారు.

సిలికాన్ వ్యాలీలోని 66 శాతం టెక్ ఉద్యోగాల్లో విదేశీయులే ఉన్నారని 2025 ఇండస్ట్రీ ఇండెక్స్ గణాంకాలు వెల్లడించాయి. అందులో 23 శాతం మంది భారతీయులని, 18 శాతం మంది చైనా జాతీయులని పేర్కొన్నాయి. ఈ నేపథ్యంలో మార్క్ మిచెల్ నుంచి ఈ వ్యాఖ్యలు వెలువడ్డాయి. అమెరికాలోని ప్రధాన కంపెనీల్లో భారతీయులను తగ్గించేందుకు తన వంతుగా కన్సల్టెన్సీ సంస్థను ప్రారంభిస్తానని పేర్కొన్నారు. తన జీవితంలో ఇంతకంటే గొప్పగా ఇంకేదీ కోరుకోబోనంటూ తన అక్కసును బయటపెట్టారు. భారతీయులను ఉద్దేశించి మిచెల్ చేసిన వ్యాఖ్యల పట్ల సామాజిక మాధ్యమాల్లో విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఆయన వ్యాఖ్యలు జాత్యాంహకారాన్ని ప్రతిబింబిస్తున్నాయని తప్పుబడుతున్నారు.

భారత్, చైనా ద్వైపాక్షిక సంప్రదింపులు

బీజింగ్: ద్వైపాక్షిక సంబంధాల మెరుగుదలకు చేపట్టిన చర్యల్లో భాగంగా భారత్- చైనా విదేశాంగ శాఖల సీనియర్ అధికారులు సరికొత్తగా సంప్రదింపులు ప్రారంభించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌ల సమావేశం అనంతరం సంభవించిన సానుకూల పరిణామాల ఫలితంగానే తాజా సంప్రదింపులు జరిగాయని అధికార వర్గాలు తెలిపాయి. భారత విదేశాంగశాఖకు చెందిన తూర్పు ఆసియా విభాగం సంయుక్త కార్యదర్శి సుజిత్ ఘోష్, చైనా విదేశాంగ శాఖ ఆసియా వ్యవహారాల డైరెక్టర్ జనరల్ లియు జిన్‌సోంగ్‌లు సంప్రదింపుల్లో పాల్గొన్నారని చైనా విదేశాంగ శాఖ పేర్కొంది. చర్చలు నిర్మాణాత్మకంగా సాగాయని అధికారిక ప్రకటన ఒకటి తెలియజేసింది. వచ్చే సంవత్సరం చేపట్టాల్సిన కార్యకలాపాలు, పరస్పర ఇచ్చిపుచ్చుకోలు వ్యవహారాలపై చర్చించామని వెల్లడించింది. ఎగుమతుల నియంత్రణ తదితర అపరిష్కృత అంశాలను భారత్ నొక్కి చెప్పింది. అనేక ప్రాంతీయ, భౌగోళిక విషయాలు సైతం చర్చల సందర్భంగా ప్రస్తావనకు వచ్చాయి.



వాషింగ్టన్‌లోని సుమాస్ సిటీలో నీట మునిగిన ఇళ్లు

వాషింగ్టన్‌లో రికార్డు స్థాయిలో వరదలు

మౌంట్ వెర్నాన్: కొన్నిరోజులుగా కుండపోత వర్షాలతో అతలాకుతలమవుతోన్న అమెరికాలోని వాషింగ్టన్‌లో వరదలు బీభత్సం సృష్టిస్తున్నాయి. వరద తాకిడికి చాలాచోట్ల వంతెనలు కొట్టుకుపోయాయి. రోడ్లన్నీ ధ్వంసమయ్యాయి. చెట్ల కొమ్మలు విరిగిపడి అనేక వాహనాలు వరదల్లో చిక్కుకున్నాయి. వాషింగ్టన్‌లో నివసించే 16,000 మందికి పైగా ప్రజలు దాదాపు గురువారం మధ్యాహ్నం నుంచే విద్యుత్ లేకుండా గడపాల్సివచ్చింది. మరోవైపు, సియాటిల్‌లోని స్కాగిట్ నది పరిసర ప్రాంతాల్లో నివసిస్తోన్న దాదాపు 78,000 మందిని ఆ ప్రాంతాన్ని వదిలి వెళ్లాల్సిందిగా అధికారులు ఆదేశించారు.

ప్రముఖనటిపై లైంగికదాడి కేసు.. ఆరుగురికి 20 ఏళ్ల జైలుశిక్ష

కొచ్చిన్: ప్రముఖనటిపై కేరళలో జరిగిన లైంగికదాడి కేసులో ఎర్నాకుళం సెషన్స్ కోర్టు తీర్పు వెలువరించింది. ఈ కేసులో ఆరుగురికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష విధించింది. బాధితురాలికి రూ.5 లక్షల పరిహారం చెల్లించాలని శుక్రవారం ఆదేశించింది. తీర్పు సందర్భంగా నిర్భయ కేసులో సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలను న్యాయమూర్తి ప్రస్తావించారు. ఈ తీర్పు గురించి స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటరు మీడియాతో మాట్లాడుతూ.. నిందితులకు తక్కువ శిక్షే పడిందని, త్వరలో కేరళ హైకోర్టులో అప్పీలు చేస్తామని చెప్పారు. మలయాళం, తమిళం, తెలుగు సినిమాల్లో నటించిన ఆ ప్రముఖనటి 2017 ఫిబ్రవరి 17న అపహరణకు గురయ్యారు. ఆరోజు రాత్రి ఆమెపై కారులోనే లైంగిక వేధింపులకు పాల్పడిన దుండగులు.. తర్వాత అక్కడి నుంచి పారిపోయారు. కొచ్చిన్‌లో ఈ ఘటన జరిగింది. ఇదే కేసులో నటుడు దిలీప్ సహా 10 మందిపై పోలీసులు అప్పట్లో కేసులు నమోదు చేశారు. కిడ్నాప్, లైంగిక వేధింపులు, గ్యాంగ్‌రేప్, ఉద్దేశపూర్వకంగా ఆధారాలను చెరిపివేయడం వంటి అభియోగాల కింద ఈ కేసులు నమోదయ్యాయి. అదే ఏడాది తొలి ఛార్జిషీటు కూడా దాఖలైంది. ఆ ఏడాది జులైలో అరెస్టు అయిన దిలీప్‌ను కోర్టు ఇటీవల నిర్దోషిగా తేల్చింది. మరో ముగ్గురికీ ఉపశమనం కల్పించింది.

అమెరికా రక్షణ బిల్లు ఆమోదం

వాషింగ్టన్: అమెరికా కాంగ్రెస్ (పార్లమెంటు) దిగువ సభ ఈ ఆర్థిక సంవత్సర రక్షణ కార్యక్రమాల కోసం 90,100 కోట్ల డాలర్లను వెచ్చించడానికి ఉద్దేశించిన బిల్లుకు బుధవారం ఆమోద ముద్ర వేసింది. ఇది తరవాత ఎగువ సభ సెనెట్ ఆమోదం కోసం వెళుతుంది. వారం రోజుల్లోగా అక్కడ ఆమోదం పొందే అవకాశం ఉంది. ఈ బిల్లును జాతీయ రక్షణ అధీకృత చట్టంగా వ్యవహరిస్తారు. సైనిక దళాలకు వేతనం పెంచడానికి, ఆయుధ సేకరణను వేగవంతం చేయడానికి కూడా బిల్లు ఏర్పాటు చేస్తోంది. ఇటీవల కరీబియన్ సముద్రంలో మాదకద్రవ్యాలను దొంగరవాణా చేస్తున్న బోట్లపై అమెరికా రక్షణ దళాలు 20సార్లకు పైగా దాడులు చేశాయి. ఆ దాడుల వీడియోలను దిగువ సభకు చూపాలనీ, అంతవరకు రక్షణ మంత్రి పీటర్ హెగ్సెత్ ప్రయాణ బడ్జెట్‌కు 25 శాతం కోత పెట్టాలని బిల్లు నిర్దేశించింది. వచ్చే రెండేళ్ల వరకు ఉక్రెయిన్‌కు ఆయుధ సహాయం చేయడానికి ఏటా 40 కోట్ల డాలర్లను కేటాయించింది. ఐరోపా గడ్డపై కనీసం 76,000 మంది అమెరికన్ సైనికులను, ఆయుధాలను మోహరించి ఉంచాలని కూడా తీర్మానించింది. దక్షిణ కొరియాలో కనీసం 28,500 మంది అమెరికన్ సైనికులను ఉంచాలనీ పేర్కొంది. వాతావరణ మార్పుల నిరోధానికి అమెరికా వెచ్చించాల్సిన నిధులకు బిల్లు 160 కోట్ల డాలర్ల మేర కోత పెట్టింది.

ఈనాడు ప్రతిభ
■ e-mail: support@epratibha.net
23
శనివారం డిసెంబరు 13, 2025

ఆంగ్లేయులకు కొరకరాని కొయ్య.. ఆ తండ్రీకొడుకులు!

ఫ్రెంచ్ కంపెనీతో సాగించిన కర్ణాటక యుద్ధాలు, స్వదేశీ రాజులతో జరిగిన ప్లాసీ, బక్సార్ యుద్ధాల్లో విజయాలతో భారతదేశంలో బ్రిటిష్‌వారి సామ్రాజ్య విస్తరణ ప్రారంభమైంది. ఆంగ్లేయుల తర్వాతి చూపు మైసూర్ రాజ్యంపై పడింది. కానీ ఈ ప్రాంత పాలకులైన హైదర్‌అలీ, అతడి కుమారుడు టిప్పు సుల్తాన్ బ్రిటిష్ వారిని ముప్పుతిప్పలు పెట్టారు. ఆంగ్లేయులు మైసూర్‌ను జయించడానికి మూడు దశాబ్దాల పాటు నాలుగు యుద్ధాలు చేశారు. వీటినే ఆంగ్లో-మైసూర్ యుద్ధాలు అంటారు. ఆంగ్లేయుల కుట్రలు, సంధి అనే పేరుతో చేసిన మోసాలు, స్వదేశీ రాజుల నుంచి లభించని మద్దతు కారణంగా మైసూర్ ఆంగ్లేయుల వశమైంది.

ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం
భారతదేశ చరిత్ర

ఈస్ట్ ఇండియా కంపెనీ అధికార స్థాపన

మైసూర్ ఆక్రమణ

మొదటి ఆంగ్లో - మైసూర్ యుద్ధం (1767-69)

ఈ యుద్ధం హైదర్‌అలీ, మద్రాస్ గవర్నర్ లార్డ్ వెరెల్స్ట్ మధ్య జరిగింది. హైదర్‌అలీ రాజ్య విస్తరణ పద్ధతులు ఇతర రాజ్యాలకు కంటగింపుగా మారాయి. బ్రిటిష్ వారు ఈ విస్తరణను చూసి అసహనానికి గురయ్యారు. ఆంగ్లేయులు తమ సైన్యాన్ని వెల్లూరు (మైసూర్ పరిధిలోనిది)కు పంపించారు. దీన్ని వ్యతిరేకించిన హైదర్ అలీ 1767లో ప్రత్యక్ష యుద్ధానికి తెరలేపాడు. ఈ యుద్ధంలో హైదర్‌అలీ బ్రిటిష్ సేనాని జోసెఫ్ స్మిత్‌ను ఓడించాడు. తన సైన్యంతో మద్రాస్‌పై దాడిచేశాడు. దీంతో ఆంగ్లేయులు మద్రాస్ సంధి చేసుకున్నారు. దీని ప్రకారం యుద్ధకాలంలో ఇరుపక్షాలు స్వాధీనం చేసుకున్న ప్రాంతాలు ఎవరివి వారికి ఇచ్చేయాలి. తమపై ఎవరైనా దాడికి పాల్పడితే ఒకరికి ఒకరు సాయం చేసుకోవాలి.

రెండో ఆంగ్లో - మైసూర్ యుద్ధం (1780-84)



ఈ యుద్ధం హైదర్‌అలీ, గవర్నర్ జనరల్ వారెన్ హేస్టింగ్స్ మధ్య ప్రారంభమైంది.

✦ 1771లో మహారాష్ట్రులు మైసూర్‌పై దండెత్తి వచ్చారు. మద్రాస్ సంధి ప్రకారం సహాయం చేయాల్సిన ఆంగ్లేయులు సాయం చేయకుండా సంధిని ఉల్లంఘించారు.

✦ మలబారు తీరంలోని మాహే ఓడరేవు హైదర్‌అలీ అధీనంలో ఉండేది. ఆంగ్లేయులు మైసూర్ పాలకుల రక్షణలో ఉన్న ఫ్రెంచ్ స్థావరం మాహేపై దాడి చేయడంతో రెండో ఆంగ్లో-మైసూర్ యుద్ధం మొదలైంది.

✦ హైదర్‌అలీ బ్రిటిష్ సేనలను కల్నల్ బైలీ, కల్నల్ బ్రైత్‌వెయిట్‌లను ఓడించాడు. పోర్టోనోవా దగ్గర జరిగిన యుద్ధంలో బ్రిటిష్ సేనాని ఐర్ కూట్ చేతిలో అలీ ఓటమి పాలయ్యాడు.

✦ యుద్ధం జరుగుతున్న సమయంలోనే 1782లో హైదర్‌అలీ రాచపుండు కారణంగా మరణించాడు.

✦ అలీ మరణానంతరం అతడి కుమారుడు టిప్పుసుల్తాన్ యుద్ధం కొనసాగించాడు. ఇతడు బ్రిగేడియర్ మాథ్యూస్‌ను ఓడించాడు. కానీ యుద్ధంలో విజయావకాశాలు పూర్తి స్థాయిలో ఎవరివైపు లేకుండా పోయాయి. దీంతో 1784లో మంగళూరు సంధి పేరుతో శాంతి ఒప్పందం చేసుకున్నారు.

✦ ఈ సంధి ప్రకారం, యుద్ధసమయంలో ఎవరు జయించిన ప్రాంతాలను వారికే ఇవ్వాలి. భవిష్యత్తులో ఒకరికి ఒకరు సహాయం చేసుకోవాలి.

మూడో ఆంగ్లో - మైసూర్ యుద్ధం (1790-92)

గవర్నర్ జనరల్‌గా కారన్ వాలీస్ ఉన్నప్పుడు ఈ యుద్ధం జరిగింది.

▌అన్ని యుద్ధాల్లోనూ మైసూర్ సైన్యం బ్రిటిష్ వారికి దీటుగా నిలబడటం ఆంగ్లేయులకు నచ్చలేదు. ఈ సమయంలోనే అమెరికా ఆంగ్లేయుల చేజారిపోయింది. భారత్‌లోనైనా సామ్రాజ్యాన్ని బలపరుచుకోవాలని బ్రిటిష్ వారు బలంగా కోరుకున్నారు. దీనికి దక్షిణ భారతంలో అడ్డంకిగా మారిన టిప్పు సుల్తాన్‌ను తప్పించాలని భావించారు.

▌ట్రావెన్‌కోర్ సంస్థానం కొచ్చిన్ రాజ్యంలోని జలకొట్టాల్, క్రాంగనోర్‌లను డచ్ వారి నుంచి కొనుగోలు చేసింది. మైసూర్ రాజ్య సామంతులైన కొచ్చిన్ రాజ్యం వారు చేసిన ఈ పనిని టిప్పు అంగీకరించలేకపోయాడు. దీంతో ట్రావెన్‌కోర్‌పై దండెత్తడానికి సమాయత్తమయ్యాడు. దీన్నే అదనుగా భావించిన బ్రిటిష్ వారు ట్రావెన్‌కోర్ బ్రిటిష్ వారి రక్షణలో ఉందని చెబుతూ టిప్పు సుల్తాన్‌పై యుద్ధం ప్రకటించారు. దీన్నే మూడో ఆంగ్లో-మైసూర్ యుద్ధంగా పేర్కొంటారు.

▌టిప్పుసుల్తాన్, గవర్నర్ జనరల్ కారన్ వాలీస్ మధ్య ఈ యుద్ధం మొదలవగా నిజాం, మరాఠా పీష్వాలు వారి అవసరాల కోసం ఆంగ్లేయులతో జతకట్టారు.

▌ఫలితంగా టిప్పుసుల్తాన్ యుద్ధంలో ఓడిపోయి అవమానకరమైన శ్రీరంగపట్నం సంధిని చేసుకున్నాడు. ▌ఈ సంధి ప్రకారం ఆంగ్లేయులకు రూ.3 కోట్ల నష్టపరిహారంతో పాటు సగం రాజ్యాన్ని ఇచ్చాడు. నష్టపరిహారం చెల్లించేంత వరకు ఆంగ్లేయులు టిప్పుసుల్తాన్ ఇద్దరు కుమారులను వారివద్దే బందీలుగా ఉంచుకున్నారు. ▌ఈ సంధి కారణంగా బ్రిటిష్ వారు బారామహల్, దిండిగల్, మలబార్ ప్రాంతాలను పొందారు.

▌ఆంగ్లేయులకు సహాయం చేసినందుకుగానూ మైసూర్ రాజ్యంలోని కొన్ని భూభాగాలను నిజాం, మరాఠాలు పొందారు.

నాలుగో ఆంగ్లో - మైసూర్ యుద్ధం (1799)

బెంగాల్ గవర్నర్‌గా లార్డ్ వెల్లస్లీ ఉన్న కాలంలో ఈ యుద్ధం జరిగింది. యుద్ధ ఫలితాల కారణంగా తాను కోల్పోయిన ప్రాంతాలను తిరిగి సాధించాలని టిప్పుసుల్తాన్ ప్రతీకార వాంఛతో రగిలిపోయాడు. ఆంగ్లేయులకు శత్రువులైన ఆఫ్ఘనిస్థాన్ పాలకుడు జమాన్ షాను, ఫ్రాన్స్ పాలకుడు నెపోలియన్‌ను భారతదేశంపై దండెత్తమని ఆహ్వానించాడు. ఫ్రెంచ్ విప్లవ సంస్థ జాకోబియన్ క్లబ్‌లో సభ్యత్వం తీసుకున్నాడు. ఈ సంస్థ శాఖను శ్రీరంగపట్నంలో ఏర్పాటు చేయించాడు.

❖ రాబోయే ప్రమాదాన్ని పసిగట్టిన వెల్లస్లీ టిప్పును అంతమొందించాలని నిర్ణయించాడు. హైదరాబాద్ నిజాం, మరాఠాలతో కలిసి టిప్పుపై యుద్ధం ప్రకటించడంతో నాలుగో ఆంగ్లో-మైసూర్ యుద్ధం ప్రారంభమైంది.

❖ వెల్లస్లీ సోదరుడు ఆర్థర్ వెల్లస్లీ అధ్యక్షతన సైన్యం మైసూర్‌ను ముట్టడించింది. వీరికి తోడుగా బొంబాయి, మద్రాసు సైన్యం జత కలిసింది. యుద్ధంలో టిప్పు సుల్తాన్ ఓడిపోయాడు. శత్రువుతో వీరోచితంగా పోరాడుతూనే షేర్-ఎ-మైసూర్‌గా సుప్రసిద్ధుడైన టిప్పు సుల్తాన్ 1799 మే 4న మరణించాడు.

❖ మైసూర్ రాజ్యాన్ని ఆక్రమించుకున్న ఆంగ్లేయులు మైసూర్, చుట్టుపక్కల ప్రాంతాలతో కలిపి చిన్న మైసూర్ రాజ్యాన్ని సృష్టించి వడయార్‌లకు ఇచ్చారు. మిగిలిన ప్రాంతాలు బ్రిటిష్ సామ్రాజ్యంలో విలీనం చేసుకున్నారు.

❖ క్రీ.శ.1761లో మైసూర్‌లో ప్రారంభమైన ముస్లిం పాలన 1799లో అంతమైంది. ఆంగ్లేయులు వడయార్ పాలనను తిరిగి పునరుద్ధరించారు. ❖ 1799లో వడయార్ వారసుడు కృష్ణరాజ-III కి మైసూర్ రాజ్యాన్ని కట్టబెట్టి, సైన్యసహకార పద్ధతికి ఒప్పించారు. 1831లో విలియం బెంటింక్ మైసూర్‌ను స్వాధీనం చేసుకోగా, 1881లో లార్డ్ రిప్పన్ మైసూర్‌ను తిరిగి వడయార్‌లకు కట్టబెట్టాడు. ఆ తర్వాత వీరి పాలన 1947 వరకు కొనసాగింది.

టిప్పుసుల్తాన్ (1782 - 99)



ఇతడు హైదర్‌అలీ కుమారుడు, తండ్రిని మించిన తనయుడు. వడయార్ పాలనను పూర్తిగా తిరస్కరించి సుల్తాన్ అనే బిరుదు పొందాడు.

పరిపాలనా సంస్కరణలు: నూతన క్యాలెండర్, తూనికలు, కొలతలను ప్రవేశపెట్టాడు.

☛ మొహర్ అనే బంగారు నాణేలను ప్రవేశపెట్టాడు.

☛ జాగీర్ వ్యవస్థను రద్దుచేసి పరిశ్రమలను ప్రోత్సహించాడు. మంగళూరు రేవు నుంచి గంధపు చెక్క, సుగంధ ద్రవ్యాలను వివిధ దేశాలకు ఎగుమతి చేయించాడు. వ్యాపారాభివృద్ధి కోసం ఫ్రాన్స్, టర్కీ, ఇరాన్, చైనా, రష్యా లాంటి దేశాలకు దౌత్య బృందాలను పంపాడు. ఫ్రెంచ్‌వారి సహకారంతో సైన్యాన్ని ఆధునికీకరించాడు.

☛ హైదర్‌అలీ నిరక్షరాస్యుడు కాగా టిప్పుసుల్తాన్ అరబిక్, పర్షియన్, ఉర్దూ, కన్నడ భాషల్లో గొప్ప పండితుడు.

☛ తండ్రి లౌకిక విధానాలను కొనసాగించాడు. హైదర్‌అలీ శివ-పార్వతి బొమ్మలతో నాణేలను ముద్రించాడు.

☛ 1789లో జరిగిన ఫ్రెంచి విప్లవానికి తన నైతిక మద్దతునిచ్చాడు. విప్లవ విజయానికి చిహ్నంగా రాజధాని శ్రీరంగపట్టణంలో ఒక చెట్టును నాటి దానికి 'స్వేచ్ఛా వృక్షం' (Tree of Liberty) అని పేరు పెట్టాడు.

☛ ఆంగ్లేయులు భారతదేశంలో జయించిన రాజ్యాల్లో అత్యంత క్లిష్టమైన రాజ్యం మైసూర్ రాజ్యం. హైదర్‌అలీ, టిప్పుసుల్తాన్ నుంచి భయంకర ప్రతిఘటనను ఎదుర్కొన్నారు.

హైదర్‌అలీ (1761 - 82)

ఇతడు 1721లో బుదికోట్‌లోని ఒక పేద ముస్లిం కుటుంబంలో జన్మించాడు. వడయార్ రాజుల సైన్యంలో సాధారణ సైనికుడిగా చేరి, దిండిగల్‌కు ఫౌజ్‌దార్‌గా నియమితుడయ్యాడు. ఫ్రెంచ్‌వారి సహకారంతో దిండిగల్‌లో ఆయుధ కర్మాగారాన్ని స్థాపించాడు. 1761లో వడయార్‌లకు వ్యతిరేకంగా తిరుగుబాటు చేసి వారి నుంచి అధికారం హస్తగతం చేసుకున్నాడు. నిరంతర యుద్ధాలు చేసి కర్ణాటక, కేరళ, ఆంధ్రప్రదేశ్‌లోని అనేక ప్రాంతాలను జయించాడు.



రచయిత
డాక్టర్ ఎం. రవి కుమార్
విషయ నిపుణులు

Word of the Day 859

Timorous

Telugu meaning: భయపడిన, సిగ్గుపడిన

English meaning: The word timorous (టిమొరస్) is an adjective that describes someone who is shy, fearful, or lacking confidence.

Synonyms: Fearful, Shy; ***Antonyms:*** Bold, Confident

Usage: 1. The timorous child hesitated before stepping onto the stage for her first performance.

2. His timorous approach to decision-making often caused delays in important projects.

కరెంట్ అఫైర్స్



యునెస్కో ఇన్‌టాంజిబుల్ కల్చరల్ హెరిటేజ్ జాబితాలో దీపావళి పండగను చేర్చారు. దిల్లీలోని ఎర్రకోట వద్ద నిర్వహించిన సమావేశంలో యునెస్కో 2025, డిసెంబరు 10న ఈ నిర్ణయం తీసుకుంది. దీంతో భారత్‌కు చెందిన 15 అంశాలు యునెస్కో వారసత్వ గుర్తింపు పొందినట్లయ్యింది. వీటిలో కుంభమేళా, కోల్‌కతా దుర్గా పూజ, గుజరాత్‌లోని గర్బా నృత్యం, యోగా, వేద పఠన సంప్రదాయం, రామాయణ గాథను ప్రదర్శించే రామ్‌లీల సంప్రదాయ ప్రదర్శనలున్నాయి.



హైడ్రోజన్‌తో నడిచే తొలి స్వదేశీ పడవను ఓడరేవులు, నౌకాయానం, జల రవాణా శాఖ మంత్రి సర్బానంద సోనోవాల్ వారణాసిలోని నమో ఘాట్‌లో 2025, డిసెంబరు 11న నిర్వహించిన కార్యక్రమంలో ఆవిష్కరించారు. అంతర్గత జల రవాణాలో ఇది కీలక ముందడుగు. దీని ప్రారంభంతో హైడ్రోజన్ శక్తితో పడవలు, ఓడలు నడుపుతున్న చైనా, నార్వే, నెదర్లాండ్స్, జపాన్ దేశాల సరసన భారత్ నిలిచింది.



ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26)లో భారత జీడీపీ వృద్ధి 7.2 శాతంగా నమోదు కావొచ్చని ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ (ఏడీబీ) అంచనా వేసింది. గతంలో అంచనా వేసిన 6.5 శాతాన్ని గణనీయంగా పెంచింది. ద్రవ్యోల్బణ అంచనాను కూడా 3.1% నుంచి 2.6 శాతానికి ఏడీబీ సవరించింది.



జూనియర్ హాకీ ప్రపంచకప్‌లో భారత జట్టు కాంస్యం నెగ్గింది. 2025, డిసెంబరు 10న చెన్నైలో జరిగిన మ్యాచ్‌లో అర్జెంటీనాను 4-2తో ఓడించి మూడో స్థానం సాధించింది. సెమీస్‌లో భారత్‌ను ఓడించిన డిఫెండింగ్ ఛాంపియన్ జర్మనీ ఫైనల్లో విజయం సాధించింది. ఆ జట్టు రికార్డు స్థాయిలో ఎనిమిదోసారి ప్రపంచకప్‌ను సొంతం చేసుకుంది.

మరిన్ని కరెంట్ అఫైర్స్ కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

స్టడీ జోన్

రాజ్యాంగబద్ధ - శాసనబద్ధ /చట్టబద్ధ సంస్థలు

మనది ప్రజాస్వామ్య దేశం. ఇక్కడ పార్లమెంటరీ తరహా ప్రభుత్వ విధానం అమల్లో ఉంది. చట్టపరంగా విధులను నిర్వర్తించే వివిధ సంస్థల ద్వారా పాలన జరుగుతుంది. వాటిలో రాజ్యాంగ, శాసనబద్ధ సంస్థలు ముఖ్యమైనవి. రాజ్యాంగ సంస్థలు దేశంలోని ప్రజాస్వామ్య పనితీరును నిర్ధారిస్తుండగా.. చట్టబద్ధమైన సంస్థలు నియంత్రణ, పర్యవేక్షణను అందిస్తాయి. ఇవి పౌరులకు ప్రభావవంతమైన పాలనను అందించడంలో, చట్టపరమైన రక్షణ కల్పించడంలో దోహదం చేస్తాయి. ప్రజల హక్కులు, ప్రయోజనాలను కాపాడతాయి. ఈ రెండూ ప్రభుత్వ పనితీరుకు కీలకమైనవి. అయితే వీటి ఏర్పాటు, అధికారాలు, బాధ్యతల్లో అనేక వ్యత్యాసాలుంటాయి. పోటీపరీక్షల నేపథ్యంలో వీటి గురించిన ముఖ్య విషయాలను తెలుసుకుందాం..!

చట్టబద్ధమైన సంస్థ

పార్లమెంట్ లేదా రాష్ట్ర శాసనసభలో ఆమోదించిన ఒక నిర్దిష్ట చట్టం ద్వారా సృష్టించిన సంస్థను 'చట్టబద్ధ సంస్థ' అంటారు. దేశ, రాష్ట్ర స్థాయిలో పరిపాలన వ్యవస్థను సమర్థవంతంగా నిర్వహించేందుకు, వివిధ వ్యవస్థల పనితీరును సమన్వయం చేసి, పర్యవేక్షించేందుకు వీటిని ఏర్పాటు చేస్తారు.

▌దీని అధికారాలు, విధులను నేరుగా రాజ్యాంగం నుంచి కాకుండా, దాని ఏర్పాటుకు కారణమైన చట్టం నుంచి తీసుకుంటారు.

▌ఇలాంటి సంస్థల అధికారం పూర్తిగా ఈ చట్టంపైనే ఆధారపడి ఉంటుంది. అంటే వాటి నిర్మాణం, పాత్ర, ఉనికిని చట్టానికి సవరణల ద్వారా మార్చొచ్చు లేదా రద్దు చేయొచ్చు.

▌సాధారణంగా ఇవి రాజ్యాంగబద్ధ సంస్థల కంటే పరిమితమైన, ప్రత్యేకమైన అధికారాలను కలిగి ఉంటాయి.




▌అధికారాన్ని కల్పించే చట్టాన్ని బట్టి ఇది కొంతవరకు ప్రభుత్వ నియంత్రణకు లోబడి ఉండొచ్చు.

రాజ్యాంగబద్ధ సంస్థల ఏర్పాటు, ఉదాహరణలు, గతంలో అడిగిన ప్రశ్నల కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

జనరల్ స్టడీస్ - ఇండియన్ జాగ్రఫీ

మేఘాలు



ద్రవీకరణం చెందిన నీటిఆవిరి ప్రతిరూపాన్ని మేఘం అంటారు. భూమిపై నుంచి కొంత ఎత్తులో మేఘాలు కనిపిస్తూ ఉంటాయి. ఇవి వాతావరణంలోని ట్రోపో ఆవరణంలో ఏర్పడతాయి. మేఘాలు దుమ్ము, నీటిఆవిరి మిశ్రమం. భూమిపై వర్షాలు కురవడానికి ఇవే కారణం. మేఘాలు ఏర్పడే విధానం, వాటి వర్గీకరణ మొదలైన అంశాలపై పోటీపరీక్షార్థికి అవగాహన ఉండాలి.

ఏర్పడే విధానం

వాతావరణంలో అనేక రకాల దుమ్ము (ధూళి) కణాలు ఉంటాయి. ఇవి మన కంటికి సరిగ్గా కనపడకుండా వాతావరణంలో యథేచ్ఛగా తిరుగుతూ ఉంటాయి. అదేవిధంగా వాతావరణంలోని నీటిఆవిరి బిందువుల రూపంలో సంచరిస్తూ ఉంటుంది.

▌ఇలా తిరిగే బిందువుకు పొరపాటున ఎప్పుడైనా ఒక దుమ్ముకణం తటస్థపడితే, దాన్ని ఆధారంగా చేసుకుని బిందువు చుట్టూ సూక్ష్మాతి సూక్ష్మమైన అనేక బిందువులు చేరి మేఘంగా మారుతుంది.

మేఘాల వర్గీకరణ

మేఘాలు ఆకారం ఆధారంగా మూడు రకాలు.

1. క్యుములస్ పోగు
2. సిర్రస్ జడ ముంగురు
3. స్ట్రాటస్ పొర

నొక్టిల్యూసెంట్ మేఘాలు

వాతావరణ పొరల్లోని మధ్య ఆవరణంలో మాత్రమే ఇవి కనిపిస్తాయి. అంతేకాదు ఇవి రాత్రిపూట కూడా కనిపిస్తాయి.

మేఘాలపై పరిశోధనలు, ఊర్ధ్వ/ ఉన్నత మేఘాలు, మధ్యస్థ మేఘాలు, దిగువ మేఘాలు మొదలైన అంశాలతోపాటు మాదిరి ప్రశ్నలతో సహా పూర్తి సమాచారం ఈ-బుక్ రూపంలో 'ఈనాడు ఈప్రతిభ' వెబ్‌సైట్‌లో 'జనరల్ స్టడీస్ ఈ-బుక్స్' కోర్సులో అందుబాటులో ఉంది. మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

నోటిఫికేషన్స్

ఎన్‌డీఏ అండ్ ఎన్ఏ-2026 ఎగ్జామినేషన్-I నోటిఫికేషన్

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) నేషనల్ డిఫెన్స్ అకాడమీ అండ్ నేవల్ అకాడమీ ఎగ్జామినేషన్ (1) 2026 (ఎన్‌డీఏ అండ్ ఎన్ఏ) నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆర్మీ, నేవీ, ఎయిర్ ఫోర్స్ విభాగాల్లో ప్రవేశానికి సంబంధించిన పోస్టులను యూపీఎస్సీ ఈ నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేయనుంది. మొత్తం పోస్టుల సంఖ్య 394. దరఖాస్తు ఫీజు రూ.100. అర్హులైన అభ్యర్థులు 2025 డిసెంబరు 30లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

మల్టీ టాస్కింగ్ స్టాఫ్ పోస్టులు

దిల్లీ సబార్డినేట్ సర్వీసెస్ సెలెక్షన్ బోర్డు (డీఎస్ఎస్ఎస్‌బీ) వివిధ విభాగాలలో మల్టీ టాస్కింగ్ స్టాఫ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. మొత్తం పోస్టుల సంఖ్య 714. దరఖాస్తు ఫీజు రూ.100. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసేందుకు చివరి తేదీ 15 జనవరి 2026.

దరఖాస్తు చేశారా..?

కింది ఉద్యోగాలకు నేడే (డిసెంబరు 13) చివరి తేదీ

▌ఎఫ్‌డీడీఐ హైదరాబాద్‌లో జూనియర్ ఫ్యాకల్టీ ఉద్యోగాలు. డిగ్రీ/ పీజీ ఉత్తీర్ణతతో పాటు ఉద్యోగానుభవం ఉన్నవారు అర్హులు.

▌ఐబీఎఫ్‌లో ఫ్యాకల్టీ మెంబర్ పోస్టులు. గ్రాడ్యుయేట్, సీఏ/ సీఎంఏ/ సీఏఐబీ/ సీఎఫ్ఏ, పీజీ, పీహెచ్‌డీ ఉత్తీర్ణతతో పాటు ఉద్యోగానుభవం ఉన్నవారు అర్హులు.

▌ఐబీఎఫ్‌లో జూనియర్ ఎగ్జిక్యూటివ్ పోస్టులు. డిగ్రీ, డిప్లొమా, ఎంకామ్, ఎంఏ, ఎంబీఏ, సీఏ, సీఎంఏ, సీఎస్, సీఎఫ్ఏలో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉన్నవారు అర్హులు.

పూర్తి వివరాలు, మరిన్ని నోటిఫికేషన్ల కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

Probability

1. A bag contains 4 red, 5 green, and 3 yellow balls. Two balls are drawn at random. What is the probability that both balls drawn are not yellow?
A) $\frac{6}{11}$ B) $\frac{5}{11}$ C) $\frac{14}{33}$ D) $\frac{7}{22}$

2. When three coins are tossed simultaneously, what is the probability that all three coins show tails?
A) $\frac{1}{4}$ B) $\frac{1}{6}$ C) $\frac{1}{8}$ D) $\frac{3}{8}$

3. Three bags contain the following balls:
- Bag A: 4 white and 1 black
- Bag B: 3 white and 2 black
- Bag C: 2 white and 3 black

One ball is drawn at random from each bag. What is the probability that exactly 2 white balls and 1 black ball are drawn?
A) $\frac{29}{125}$ B) $\frac{31}{125}$ C) $\frac{27}{125}$ D) $\frac{58}{125}$

4. Three cards are drawn one after another with replacement from a standard deck of 52 playing cards.
What is the probability that:
- the first card is a Queen,
- the second card is a red card, and
- the third card is an odd-numbered card (3, 5, 7, 9)?

A) $\frac{1}{64}$ B) $\frac{3}{52}$ C) $\frac{2}{169}$ D) $\frac{1}{52}$

5. A bag contains cards numbered 41 to 118. If one card is drawn at random, what is the probability that the number on the card is a multiple of 6?
A) $\frac{5}{11}$ B) $\frac{7}{12}$ C) $\frac{1}{6}$ D) $\frac{6}{39}$

6. If 9 students stand randomly around a circular path, what is the probability that two particular students (say A and B) are standing together (adjacent)?
A) $\frac{1}{9}$ B) $\frac{1}{4}$ C) $\frac{1}{3}$ D) $\frac{2}{9}$

7. Two dice are rolled together. What is the probability that the sum of the numbers obtained is 9?
A) $\frac{1}{12}$ B) $\frac{1}{9}$ C) $\frac{1}{8}$ D) $\frac{1}{6}$

8. A bag contains balls numbered from 1 to 32. One ball is drawn at random. What is the probability that the number on the ball drawn is divisible by 4 or 6?
A) $\frac{11}{32}$ B) $\frac{8}{32}$ C) $\frac{10}{32}$ D) $\frac{12}{32}$

9. Arjun speaks the truth in $\frac{3}{4}$ of the cases, while Meera lies in $\frac{2}{5}$ of the cases.
What percentage of cases will Arjun and Meera contradict each other when stating the same fact?
A) 34% B) 40% C) 45% D) 48%

Railway Exams

Mathematics

10. A card is drawn at random from a well-shuffled deck of 52 playing cards. What is the probability of getting a King or a Heart?
A) $\frac{4}{13}$ B) $\frac{5}{13}$ C) $\frac{2}{13}$ D) $\frac{1}{13}$

11. An urn contains 12 red balls and 8 blue balls. Two balls are drawn one after the other without replacement. What is the probability that both balls drawn are red?
A) $\frac{33}{95}$ B) $\frac{22}{95}$ C) $\frac{66}{190}$ D) $\frac{11}{38}$

12. All red Aces and red Jacks are removed from a standard deck of 52 playing cards. One card is drawn at random from the remaining cards. What is the probability that the drawn card is a club?
A) $\frac{1}{4}$ B) $\frac{13}{48}$ C) $\frac{2}{5}$ D) $\frac{3}{10}$

13. A problem is given to three students A, B, and C. Their respective probabilities of solving it are $\frac{1}{5}$, $\frac{1}{4}$ and $\frac{1}{3}$. What is the probability that the problem will be solved?
A) $\frac{2}{3}$ B) $\frac{3}{5}$ C) $\frac{7}{12}$ D) $\frac{53}{60}$

14. Bag X contains 3 white and 5 black balls. Bag Y contains 4 white and 6 black balls. One ball is drawn from each bag. What is the probability that both drawn balls are black?
A) $\frac{1}{4}$ B) $\frac{1}{3}$ C) $\frac{3}{8}$ D) $\frac{1}{6}$

15. If the odds in favour of an event A are 5 : 3, and the odds against another independent event B are 6 : 5, what is the probability that at least one of the events A or B will occur?
A) $\frac{35}{44}$ B) $\frac{38}{55}$ C) $\frac{29}{44}$ D) $\frac{51}{55}$


16. The probability that a striker scores a goal on a single attempt is 0.6. What is the minimum number of attempts he must take so that the probability of scoring at least one goal is more than 0.95?
A) 2 B) 3
C) 4 D) 5

Scan the QR code for Key

These model questions were prepared by subject experts

కరెంట్ అఫైర్స్

మాదిరి ప్రశ్నలు



◆ 2025 అక్టోబరు 14 నుంచి 16 వరకు ఐక్యరాజ్య సమితి దళాల సహకార దేశాల (యూఎన్‌టీసీసీ) చీఫ్స్ కాన్‌క్లేవ్‌ను ఎక్కడ నిర్వహించారు?
జ: న్యూదిల్లీ

◆ వరల్డ్ స్టాండర్డ్స్ డే (ప్రపంచ ప్రమాణాల దినోత్సవాన్ని ఏటా ఏ రోజున నిర్వహిస్తారు? (ఇంటర్నేషనల్ ఎలక్ట్రో టెక్నికల్ కమిషన్ (ఐఈసీ,) ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ ఫర్ స్టాండర్డైజేషన్ (ఐఎస్ఓ), ఇంటర్నేషనల్ టెలికమ్యూనికేషన్ యూనియన్ (ఐటీయూ)ల నేతృత్వంలో జరిపే ఈ దినోత్సవాన్ని 2025లో 'ఎ షేర్డ్ విజన్ ఫర్ ఎ బెటర్ వరల్డ్' అనే థీమ్‌తో నిర్వహించారు.)
జ: అక్టోబరు 14

◆ 2025 అక్టోబరు 13 నాటికి పీఎం గతి శక్తి కార్యక్రమం ఎన్నేళ్లు పూర్తి చేసుకుంది? (భారతదేశ మౌలిక సదుపాయాల వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకురావడానికి 44 కేంద్ర మంత్రిత్వ శాఖలు, 36 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలను అనుసంధానిస్తూ దేశంలోనే మొదటి ఇంటిగ్రేటెడ్ మల్టీ మోడల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్లానింగ్ ఫ్రేమ్ వర్క్‌ను పీఎం ప్రారంభించారు.)
జ: నాలుగేళ్లు

మరింత సమాచారం

◆ 2025 ఆర్థిక శాస్త్ర నోబెల్ బహుమతిని ఎవరు గెలుచుకున్నారు?
జ: జోయెల్ మోకిర్, పీటర్ హోవిట్ (అమెరికా) ఫిలిప్ అఘియాన్ (యూకే)

స్థిరంగా పెరిగితే.. రెట్టింపు అయితే!

ప్రతి రోజూ ముప్పై నిమిషాలు చదివితే మొత్తం ప్రిపరేషన్ సమయం రెండో రోజుకి అరవై, మూడో రోజుకి తొంభై నిమిషాలు అవుతుంది. అదే నిర్ణీత మొత్తంపై చక్రవడ్డీ అయితే కొన్ని రెట్లు పెరుగుతుంటుంది. మొదటిది స్థిరంగా సంకలన రూపంలో సాగితే, రెండోది గుణకార నమూనాలో వృద్ధి చెందుతుంది. నిర్దిష్ట నియమం లేదా నమూనాను అనుసరించే సంఖ్యల సమూహాన్ని సంఖ్యాశ్రేణి అంటారు. అందులో సంఖ్యల మధ్య ఉన్న సంబంధాన్ని సూచించే నియమాలను శ్రేణి అనువర్తనాలుగా పేర్కొంటారు. పోటీ పరీక్షల్లో వీటిపై ప్రశ్నలు అడుగుతున్నారు. శ్రేణిలో నమూనాను గుర్తించి తదుపరి సంఖ్యను లేదా తప్పిపోయిన సంఖ్యను అభ్యర్థులు కనిపెట్టాల్సి ఉంటుంది. దీనిపై పట్టు పెంచుకోవాలంటే ప్రాథమిక గణిత భావనలను, ముఖ్య సంఖ్యా రూపాలను నేర్చుకోవాలి. నమూనాలను గ్రహించడం ప్రాక్టీస్ చేయాలి.



జనరల్ స్టడీస్
రీజనింగ్

శ్రేణి అనువర్తనాలు

సంఖ్యాశ్రేణికి సంబంధించిన అనువర్తనాల్లో 'సంఖ్యా శ్రేఢి' అనేది ఒక ముఖ్యమైన అనువర్తనం. సాధారణంగా నిర్దిష్టమైన నియమాలను పాటించే సంఖ్యల సమూహాన్ని 'శ్రేఢి' అంటారు. ఇది ప్రధానంగా రెండు రకాలు. అవి అంకశ్రేఢి, గుణశ్రేఢి. ఏ రెండు వరుస సంఖ్యల మధ్య భేదం అయినా సమానంగా ఉంటే అది అంకశ్రేఢి, ఏ రెండు వరుస సంఖ్యల నిష్పత్తి అయినా సమానంగా ఉంటే అవి గుణశ్రేఢిలో ఉన్నాయని అంటారు.

అంకశ్రేఢి: శ్రేఢి మొదటి పదం మినహా మిగతా పదాలకు దాని ముందున్న పదానికి ఒక స్థిరసంఖ్యను కలపగా శ్రేఢి నిర్మాణం జరుగుతుంది.



అంకశ్రేఢి సాధారణ రూపం:

a, a + d, a + 2d, ...

★ అంకశ్రేఢిలో nవ పదం = t_n


= a + (n – 1)d

★ అంకశ్రేఢిలో చివరి నుంచి nవ పదం = l – (n – 1)d

★ అంకశ్రేఢిలో n పదాల మొత్తం =

$$S_n = \frac{n}{2}(2a + (n-1)d$$

గుణశ్రేఢి: శ్రేఢిలో ఏ రెండు వరుస పదాల మధ్య నిష్పత్తి అయినా సమానంగా ఉండాలి.



గుణశ్రేఢి సాధారణ రూపం:

a, ar, ar^2, ar^3 ....

★ గుణశ్రేఢిలో nవ పదం = ar^{n-1}

★ గుణశ్రేఢిలో n పదాల మొత్తం = $\frac{a(r^n - 1)}{r - 1}(r > 1)$

$= \frac{a(r^n - 1)}{r - 1}(r < 1)$

★ గుణశ్రేఢిలో అనంత పదాల మొత్తం = $\frac{a}{1 - r}$

మాదిరి ప్రశ్నలు

1 8, 12, 16, 20, ... శ్రేణిలో 16 వ సంఖ్య?

1) 64 2) 68 3) 74 4) 66

వివరణ: 8, 12, 16, 20, ...

పై శ్రేణిలో ఏ రెండు వరుస పదాల మధ్య భేదం అయినా సమానం కాబట్టి

$t_n = a + (n-1)d$

a = 8, n = 16, d = 12 – 8 = 4

$= 8 + (16 - 1)(4) \Rightarrow 8 + 15 \times 4 \Rightarrow 68$

∴ ఈ శ్రేణిలో 16 వ సంఖ్య = 68 **జ: 2**

2 –10, –6, –2, 2, ... అనే శ్రేణిలో 12 వ, 13 వ సంఖ్యల మొత్తం ఎంత?

1) 82 2) 74 3) 80 4) 72

వివరణ: –10, –6, –2, 2, ...

a = –10, n = 12,

d = –6 – (–10)

= –6 + 10 = 4

$t_n = a + (n-1)d \Rightarrow -10 + (12 - 1)(4)$

$= -10 + 11 \times 4 \Rightarrow -10 + 44 = 34$

12వ సంఖ్య = 34

⇒ 13వ సంఖ్య = 34 + 4 = 38

∴ మొత్తం = 34 + 38 = 72 **జ: 4**

3 21, 18, 15, ... శ్రేణిలో ఎన్నో సంఖ్య –81 అవుతుంది?

1) 43 2) 32 3) 35 4) 37

వివరణ: 21, 18, 15, ...

a = 21, t_n = –81, d = 18 – 21 = –3, n = ?

$t_n = a + (n-1)d \Rightarrow -81 = 21 + (n-1)(-3)$

$-3n + 3 = -81 - 21 \Rightarrow -3n = -102 - 3$

–3n = –105

$n = \frac{105}{3} = 35$

∴ శ్రేణిలో 35 వ పదం –81 అవుతుంది. **జ: 3**

4 3 చే నిశ్శేషంగా భాగించబడే రెండంకెల సంఖ్యలు ఎన్ని ఉన్నాయి?

1) 30 2) 10 3) 20 4) 40

వివరణ: రెండంకెల సంఖ్యలు

10, 11, 12, 13, ... 99

3 చే భాగించబడే రెండంకెలు:

12, 15, 18, ... 99 ఇవి అంకశ్రేఢిలో ఉన్నాయి.

a = 12, d = 15 – 12 = 3, t_n = 99

$t_n = a + (n-1)d \Rightarrow 12 + (n-1)(3) = 99$

$3n - 3 = 99 - 12 \Rightarrow 3n - 3 = 87$

3n = 90, n = 30

3 చే నిశ్శేషంగా భాగించబడే రెండంకెల సంఖ్యలు = 30 **జ: 1**

5 2, 7, 12, ... అనే శ్రేఢిలో మొదటి 16 సంఖ్యల మొత్తం ఎంత?

1) 732 2) 625 3) 632 4) 723

వివరణ: 2, 7, 12, ...



a = 2, n = 16, d = 7 – 2 = 5

$S_n = \frac{n}{2}[2a + (n-1)d]$

$= \frac{16}{2}[2 \times 2 + (16 - 1)5]$

$= 8[4 + 15 \times 5] \Rightarrow 8[4 + 75]$

$= 8 \times 79 = 632$ **జ: 3**

6 3, 6, 12, 24, ... అనే శ్రేణిలో 7వ సంఖ్య ఏది?

1) 206 2) 186 3) 196 4) 192

వివరణ: 3, 6, 12, 24, ... అనే శ్రేఢి G.Pలో ఉంది.

$a = 3, n = 7, r = \frac{6}{3} = 2$

$t_n = ar^{n-1} \Rightarrow 3.2^{7-1}$

$\Rightarrow 3 \times 2^6 = 3 \times 64 \Rightarrow 192$ **జ: 4**



రచయిత: గోలి ప్రశాంత్ రెడ్డి

జూనియర్ ఇంటర్ జంతుశాస్త్రం

జీవ ప్రపంచంలో వైవిధ్యం

ఫైనల్ పరీక్షలు 2026
ముఖ్యమైన ప్రశ్నలు - జవాబులు

అధ్యాయం-I జీవ ప్రపంచం — 2 మార్కులు

1. ICZN ను విపులీకరించండి?
జ: అంతర్జాతీయ జంతు నామీకరణ నియమావళి (International Code of Zoological Nomenclature (ICZN)
2. జీవ వైవిధ్యం అంటే ఏమిటి?
జ: జీవుల ఆకారం, రంగు, ఆవాసం, శరీరధర్మ, బాహ్య స్వరూప లక్షణాల్లో అత్యంత వైవిధ్యం కలిగి ఉండటాన్ని జీవ వైవిధ్యం అంటారు.
3. జీవుల వర్గీకరణకు అనుసరించాల్సిన ప్రాథమిక ప్రక్రియలు?
జ: లక్షణీకరణ(characterisation), గుర్తింపు, వర్గీకరణ, నామీకరణ ప్రక్రియలు వర్గీకరణ శాస్త్రంలోని ప్రాథమిక అంశాలు.
4. 'సిస్టమాటిక్స్' ను నిర్వచించండి. లిన్నేయస్ ప్రచురించిన తన గ్రంథం పేరు?
జ: వివిధ రకాల జీవులు, వాటి వైవిధ్యాలు, సంబంధ బాంధవ్యాల అధ్యయనాన్నే సిస్టమాటిక్స్ (stematics) అంటారు. ఈ పదం లాటిన్‌లో ఒక పద్ధతితో కూడిన జీవన అమరిక అని అర్థం. లిన్నేయస్ తన ప్రచురణ గ్రంథానికి పెట్టిన పేరు సిస్టమా నేచురే.
5. 'ద్వినామ నామీకరణం' అంటే ఏమిటి? రెండు ఉదాహరణలను పేర్కొనండి.
జ: కరోలస్ లిన్నేయస్ ద్వినామ నామీకరణ విధానాన్ని ప్రవేశపెట్టాడు. ఈ పద్ధతినే ప్రపంచవ్యాప్తంగా జీవశాస్త్రవేత్తలు అనుసరిస్తున్నారు. ద్వినామ నామీకరణ పద్ధతిలో ప్రతి పేరుకూ రెండు పదాలుంటాయి. మొదటిది ప్రజాతి నామం (generic name), రెండోది జాతి నామం (species name). ఈ విధంగా రెండు పదాలతో కూడిన పేరు పెట్టే పద్ధతిని ద్వినామ నామీకరణం (Binomial nomenclature) అంటారు

బహుళైచ్ఛిక ప్రశ్నలు (1 మార్కు)

1. వర్గీకరణ శాస్త్రంలో మొదటి చర్య
1) గుర్తింపు 2) నామీకరణ 3) వర్గీకరణ 4) లక్షణీకరణ
జ: (4)
2. ద్వినామ నామీకరణలో రెండో పదం దేనిని సూచిస్తుంది?
1) ప్రజాతి 2) కుటుంబం 3) జాతి 4) ఉపజాతి
జ: (3)
3. సరిగా పేర్కొన్న మానవుడి శాస్త్రీయ నామం?
1) Homo Sapiens 2) Homo sapiens
3) homo sapiens 4) homo Sapiens జ: (2)
4. వర్గీకరణ సోపాన క్రమంలో 'కుటుంబం' ఈ రెండింటి మధ్య ఉంటుంది?
1) తరగతి, రాజ్యం 2) క్రమం, తరగతి
3) ప్రజాతి, క్రమం
4) ప్రజాతి, తరగతి
జ: (3)

మరికొన్ని ప్రశ్నలు-జవాబులు

రచయిత: రవిచరణ్ కంటి

ఆరుకోట్ల మందికి అక్షరాస్యత అందించే పథకం!

మానవ మూలధనం (విద్య, ఆరోగ్యం, శిక్షణ, పరిశుభ్రత)




ఏ దేశానికైనా అక్కడి ప్రజలే అసలైన సంపద. జనం విద్యావంతులై, తగిన నైపుణ్యాలతో ఉంటే విలువైన వనరులుగా మారి దేశ ప్రగతికి తోడ్పడతారు. అందుకే విద్య, ఆరోగ్యం, జ్ఞానం, నైపుణ్యాలు, అనుభవం, సామర్థ్యాల సమ్మేళనమైన మానవ మూలధనంపై నేటి ప్రభుత్వాలు ప్రధానంగా దృష్టి సారిస్తున్నాయి. దేశంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ దిశగానే ప్రణాళికలను రూపొందించి అమలు చేస్తున్నాయి. ప్రజలను సుశిక్షితులుగా, ఆర్థిక విలువ ఉన్న వనరులుగా మార్చడానికి చేస్తున్న ప్రయత్నాలపై పోటీ పరీక్షార్థులకు స్థూల అవగాహన ఉండాలి. స్వాతంత్ర్యానంతరం నుంచి ఇప్పటి వరకు ప్రజల ఉత్పాదకత స్థాయిని పెంచే విధంగా తీసుకొచ్చిన విద్యావిధానాలు, జరిగిన విధానపరమైన మార్పులు, అమలు చేస్తున్న పథకాలు, ప్రవేశపెట్టిన చట్టాలు, వాటి లక్ష్యాలు, సంబంధిత రాజ్యాంగ నిబంధనలు తదితరాలను తెలుసుకోవాలి.

1. స్వాతంత్ర్యానంతరం భారతదేశంలో మొదటి విద్యా సంస్కరణల కమిటీకి అధ్యక్షత వహించినవారు?
1) కొఠారి
2) రాధాకృష్ణన్
3) మెకాలే
4) ప్రొఫెసర్ యశ్‌పాల్



2. విద్యను ఉమ్మడి జాబితాలోకి తీసుకొచ్చిన రాజ్యాంగ సవరణ ఏది?
1) 121వ సవరణ 2) 42వ సవరణ
3) 61వ సవరణ 4) 66వ సవరణ
3. రాజ్యాంగంలోని ఏ అధికరణ 6–14 సంవత్సరాల్లోపు పిల్లలను బడికి పంపాల్సిన బాధ్యత తల్లిదండ్రులదని పేర్కొంటుంది?
1) అధికరణ 41 2) అధికరణ 45
3) అధికరణ 51(ఎ) 4) అధికరణ 350(డి)
4. భారతదేశ విద్యావిధానానికి మాగ్నాకార్టా లాంటిదిగా ఏ విద్యా కమిటీని పేర్కొంటారు?
1) హంటర్ కమిషన్ 2) శాట్లర్ కమిషన్
3) గోశాలే కమిషన్ 4) చార్లెస్ ఉడ్ కమిషన్
5. భారతదేశంలో ప్రస్తుతం ఉన్న 10 + 2 + 3 విద్యావిధానాన్ని ఎవరు సిఫార్సు చేశారు?
1) డి.ఎస్.కొఠారి కమిషన్
2) రాధాకృష్ణన్ కమిటీ
3) మొదలియార్ కమిషన్
4) ఎవరూ కాదు



6. విద్యా రంగంలో మార్పులు తీసుకురావడానికి విద్యా సవాళ్లు – విధాన దృక్పథం పేరుతో జాతీయ విద్యావిధానాన్ని (ఎన్ఈపీ) ఏ సంవత్సరంలో ప్రకటించారు?
1) 1948 2) 1978 3) 1992 4) 1986
7. "అభ్యసనం భారయుతంగా ఉండకూడదు" శీర్షికతో ఏ విద్యా సంస్కరణల కమిటీ నివేదికను సమర్పించింది?
1) చటోపాధ్యాయ కమిటీ
2) ఆచార్య రామమూర్తి కమిషన్
3) యశ్‌పాల్ కమిటీ 4) జనార్దన్‌రెడ్డి కమిటీ
8. 2020 జాతీయ విద్యావిధానం కమిటీ అధ్యక్షులు?
1) డాక్టర్ కె.కస్తూరిరంగన్
2) టీఎస్ఆర్ సుబ్రమణియన్
3) డాక్టర్ అమర్త్యసేన్ 4) ఎవరూకాదు
9. భారత్‌ను ప్రపంచ జ్ఞాన సూపర్ పవర్‌గా మార్చాలనే ప్రధాన లక్ష్యంతో రూపొందించిన విద్యావిధానం?
1) 1986 2) 2020 3) 1968 4) 1990
10. పీఎం స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా అనే కేంద్ర ప్రాయోజిత పథకాన్ని ఏ సంవత్సరంలో ప్రారంభించారు?
1) 2019 2) 2022 3) 2025 4) 2018
11. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ బడ్జెట్‌లో విద్యకు ఎంత శాతం కేటాయించాలని నూతన విద్యావిధానం– 2020 సూచిస్తోంది?
1) 3% 2) 4% 3) 5% 4) 6%
12. అత్యున్నత విద్య, పరిశోధనా సౌకర్యాల సృష్టే లక్ష్యంగా 'ప్రపంచస్థాయి సంస్థ పథకం'ను ఏ సంవత్సరంలో ప్రారంభించారు?
1) 2020 2) 2017 3) 2021 4) 2019
13. భారతదేశం ప్రపంచస్థాయి విద్యా విస్తరణను ప్రతిబింబించేలా ఐఐటీ క్యాంపస్‌ల స్థాపనకు ఇటీవల ఏ దేశంతో అవగాహనా ఒప్పందం (ఎంఓయూ) కుదుర్చుకుంది?
1) మలేసియా 2) హాంకాంగ్
3) అబుదాబి 4) దక్షిణాఫ్రికా
14. గుజరాత్ ఇంటర్నేషనల్ ఫైనాన్స్ టెక్-సిటీ (గిఫ్ట్ సిటీ) అనేది ఏ లక్ష్యంతో ఏర్పాటుచేసిన కార్యక్రమం?
1) డిజిటల్ విద్య అందించడం
2) అంతర్జాతీయ విద్య అందించడం
3) అంతరిక్ష పరిశోధన 4) పైవేవీ కావు
15. దేశంలో విద్యాహక్కు చట్టం ఏ సంవత్సరం నుంచి అమల్లోకి వచ్చింది?
1) 2009, ఆగస్టు 4 2) 2010, ఏప్రిల్ 1
3) 2008, ఆగస్టు 10 4) 2011, ఏప్రిల్ 14
16. నూతన జాతీయ ఆరోగ్య విధానం ఏ సంవత్సరంలో ప్రకటించారు?
1) 2020 2) 2017 3) 2013 4) 2015
17. భారతదేశంలో 90% పూర్తి రోగనిరోధక కవరేజీ అందించడానికి ఏర్పాటైన మిషన్ ఇంద్రధనుష్ ఎప్పుడు ప్రారంభించారు?
1) 2014, డిసెంబరు 25
2) 2016, డిసెంబరు 1
3) 2017, ఆగస్టు 4
4) 2015, నవంబరు 14



18. ఆయుష్మాన్ భారత్ – ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన కింద అర్హత కలిగిన కుటుంబాలకు ఎంత ఆరోగ్య కవరేజీ అందిస్తారు?
1) రూ.2 లక్షలు 2) రూ.3 లక్షలు
3) రూ.5 లక్షలు 4) రూ.15 లక్షలు
19. బీపీఎల్ కుటుంబాలకు ఆరోగ్య బీమా అందించే రాష్ట్రీయ స్వాస్థ్య బీమా యోజన (ఆర్ఎస్‌బీవై) పథకాన్ని ఏ సంవత్సరంలో ప్రారంభించారు?
1) 2008, ఏప్రిల్ 1 2) 2007, అక్టోబరు 1
3) 2009, ఆగస్టు 15 4) 2014, జనవరి 1
20. శాంపిల్ రిజిస్ట్రేషన్ సిస్టం నివేదిక–2023 ప్రకారం భారతదేశంలో శిశుమరణాల రేటు ప్రతి 1000 మందికి ఎంత ఉంది?
1) 25 2) 37 3) 41 4) 45

ఇండియన్ ఎకానమీ

21. ప్రసూతి మరణాలు (ఎంఎంఆర్) తగ్గించడానికి రూపొందించిన ప్రధానమంత్రి సురక్షిత్ మాతృత్వ అభియాన్ (పీఎంఎస్ఎంఏ) ఏ సంవత్సరంలో ప్రవేశపెట్టారు?
1) 2019 2) 2016 3) 2020 4) 2024
22. ప్రపంచ ఆరోగ్య సంస్థ 2021 డేటా ప్రకారం భారత్‌లో జనన సమయంలో జీవితకాలం ఎంత?
1) 70.6 సంవత్సరాలు
2) 65.6 సంవత్సరాలు
3) 72.1 సంవత్సరాలు
4) 67.3 సంవత్సరాలు
23. 2025 నాటికి దేశంలో మహిళల సంతానోత్పత్తి రేటు (టీఎఫ్ఆర్) ఎంతకు తగ్గింది?
1) 2.2 2) 1.9 3) 1.5 4) 2.6
24. ఎస్ఆర్ఎస్ నివేదిక – 2023 ప్రకారం భారతదేశంలో అత్యధిక, అత్యల్ప జనన రేటు ఉన్న రాష్ట్రాలను వరుసగా గుర్తించండి.
1) యూపీ, త్రిపుర
2) బిహార్, నికోబార్ దీవులు
3) బిహార్, నాగాలాండ్ 4) యూపీ, చండీగఢ్
25. 2025, జులై నాటికి జల్ జీవన్ మిషన్ ద్వారా సురక్షిత తాగునీరు ఎంత శాతం గ్రామీణ ప్రాంతాలకు విస్తరించింది?
1) 70% 2) 90% 3) 60% 4) 80%
26. భారతదేశంలో జాతీయ తాగునీటి మిషన్‌ను ఏ సంవత్సరంలో ప్రారంభించారు?
1) 1992 2) 1986 3) 1999 4) 2000
27. సుస్థిరాభివృద్ధి లక్ష్యాల్లో (ఎస్‌డీజీ) 6వ లక్ష్యం కింది అంశాన్ని తెలియజేస్తుంది.
1) స్వచ్ఛమైన నీరు, పారిశుద్ధ్యం
2) నాణ్యమైన విద్య
3) లింగ సమానత్వం 4) ఆకలి తీర్చడం
28. 'బేటీ బచావో, బేటీ పఢావో' పథకాన్ని ఎప్పుడు ప్రారంభించారు?
1) 2016, జనవరి 22 2) 2017, జనవరి 22
3) 2015, జనవరి 22 4) 2014, అక్టోబరు 2
29. 2024లో ప్రపంచ నైపుణ్య పోటీలో భారతదేశం ఎన్నో స్థానంలో ఉంది?
1) 39వ 2) 13వ 3) 16వ 4) 20వ
30. ఎయిమ్స్ ఇటీవల ప్రారంభించిన 'పయోధి' కార్యక్రమం దేనికి సంబంధించింది?



1) పుట్టిన పిల్లలకు టీకాలు వేసే కార్యక్రమం
2) తల్లిపాల బ్యాంకింగ్, చనుబాలు ఇవ్వడంపై అవగాహన
3) తల్లి పాల ఫార్ములా పంపిణీ
4) శిశువులకు కృత్రిమ పాలు ఇవ్వడం
31. విద్యాహక్కు చట్టం– 2009 ప్రకారం ఏ వయసు పిల్లలకు విద్యాహక్కుకు హామీ ఇచ్చారు?
1) 5 - 10 సంవత్సరాలు
2) 6 - 14 సంవత్సరాలు
3) 5 - 15 సంవత్సరాలు
4) 4 - 14 సంవత్సరాలు
32. 2024–25 ఆర్థిక సర్వే ప్రకారం ఉన్నత విద్యలో నమోదు రేటు ఎంత శాతానికి పెరిగింది?
1) 28.4% 2) 26.5%
3) 31.5% 4) 28.9%
33. 2024–25 ఆర్థిక సర్వే ప్రకారం ఇంటర్నెట్ సౌకర్యం ఉన్న పాఠశాలలు మొత్తం ఎంత శాతం?
1) 53.9% 2) 46.8%
3) 39.9% 4) 51.6%
34. నేషనల్ ఇనిషియేటివ్ ఫర్ రీడింగ్ విత్ అండర్‌స్టాండింగ్ అండ్ న్యూమరసీ (నిపుణ్ – భారత్) ప్రధాన లక్ష్యం?
1) 2026-27 నాటికి ప్రతి బిడ్డ 3వ తరగతి చివరిలో ఎఫ్ఎల్ఎన్ (ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ) సాధించడం.
2) 2026-27 నాటికి ప్రతి బిడ్డ 6వ తరగతిలో ఎఫ్ఎల్ఎన్ సాధించడం.
3) 2026-27 నాటికి ఉన్నత విద్యలో ఎఫ్ఎల్ఎన్ సాధించడం.
4) పైవేవీ కావు
35. 6 కోట్ల మందికి డిజిటల్ అక్షరాస్యత అందించడానికి ప్రధానమంత్రి గ్రామీణ డిజిటల్ సాక్షరతా అభియాన్‌ను ఏ సంవత్సరంలో ప్రారంభించారు?
1) 2019 2) 2020 3) 2017 4) 2018
36. 2024–25 సంవత్సరానికి జాతీయాదాయానికి డిజిటల్ ఆర్థిక వ్యవస్థ ఎంత శాతం అందిస్తుందని అంచనా?
1) 11.74% 2) 13.42%
3) 14.7% 4) 10.87%
37. ఇటీవల ప్రారంభించిన 'పీఎం–దక్ష్' ప్రధాన ఉద్దేశం?
1) అణగారిన యువతకు వేతన ఉపాధి పొందేలా శిక్షణ ఇవ్వడం
2) అణగారిన యువతకు ఉపకార వేతనాలు మంజూరు
3) యువతకు డిజిటల్ అక్షరాస్యత అందించడం
4) పైవేవీ కావు
38. కిందివాటిలో యువత అభివృద్ధి కార్యక్రమాలపై పనిచేసే సంస్థను గుర్తించండి.
1) నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ మిషన్
2) నెహ్రూ యువకేంద్ర సంఘటన్
3) స్కిల్ ఇంపాక్ట్ బాండ్
4) పీఎం విశ్వకర్మ పథకం
39. విద్యాహక్కు చట్టానికి రాజ్యాంగంలో ఏ అధికరణ హామీగా నిలిచింది?
1) 14వ అధికరణ 2) 19 (1) అధికరణ
3) 21ఎ అధికరణ 4) 24వ అధికరణ
40. జాతీయ ఆరోగ్య మిషన్ ఏ సంవత్సరంలో ప్రారంభించారు?
1) 2005 2) 2011
3) 2013 4) 2017

సమాధానాలు

1-2, 2-2, 3-3, 4-4, 5-1, 6-4, 7-3, 8-1, 9-2, 10-2, 11-4, 12-2, 13-3, 14-2, 15-2, 16-2, 17-1, 18-3, 19-2, 20-1, 21-2, 22-4, 23-2, 24-2, 25-4, 26-2, 27-1, 28-3, 29-2, 30-2, 31-2, 32-2, 33-1, 34-1, 35-3, 36-2, 37-1, 38-2, 39-3, 40-3.

ఎస్‌ఈసీ సంయుక్త కార్యదర్శి సాయిప్రసాద్‌పై విచారణకు ఆదేశం

ఈనాడు, అమరావతి: రాష్ట్ర ఎన్నికల కమిషనర్ (ఎస్‌ఈసీ) కార్యాలయం సంయుక్త కార్యదర్శి సాయిప్రసాద్‌పై వచ్చిన ఫిర్యాదుపై విచారించి తదుపరి చర్యల కోసం నివేదిక పంపాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యదర్శిని ఆదేశిస్తూ రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి ఉత్తర్వులిచ్చారు. గత వైకాపా ప్రభుత్వంలో సాయిప్రసాద్ ఆ పార్టీకి అనుకూలంగా వ్యవహరించారని, కార్యాలయానికి సంబంధించిన సమాచారం లీక్ చేశారని, ఆయనపై చర్యలు తీసుకోవాలని సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ కార్యదర్శి ఈ ఏడాది నవంబరు 7న ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారు.

భక్తులకు మరిన్ని సౌకర్యాలు పెంచండి

● ఈవోలకు కమిషనర్ ఆదేశం

ఈనాడు, అమరావతి: ఆలయాల్లో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా మరిన్ని సౌకర్యాలు పెంచాలని, దర్శనాల్లో జాప్యం లేకుండా తగిన చర్యలు చేపట్టాలని దేవాదాయశాఖ కమిషనర్ రామచంద్రమోహన్ ఆదేశించారు. ఇటీవల కొన్ని ఆలయాల్లో భక్తుల సంతృప్తస్థాయి తక్కువగా రావడంతో.. ఏడు ప్రధాన ఆలయాలు, 15 ముఖ్య ఆలయాల ఈవోలతో కమిషనర్ శుక్రవారం కమిషనరేట్‌లో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈవోలు తరచూ భక్తుల వద్దకు వెళ్లి ఏర్పాట్లు, తదితరాలపై అభిప్రాయాలు తీసుకోవాలని, ఎక్కడైనా లోపాలుంటే వాటిని సరిచేసుకోవాలని తెలిపారు. ఆన్‌లైన్‌లో దర్శనం బుక్ చేసుకున్నవారికి ప్రత్యేక లైన్ ఉండేలా చేస్తే, ఎక్కువ మంది ఆన్‌లైన్ బుకింగ్స్ చేసుకుంటారని తెలిపారు. మనమిత్ర వాట్సాప్ యాప్‌లో దర్శనం బుక్‌చేసుకొని వచ్చిన వారికి, ఆలయ ప్రాంగణంలో టిక్కెట్ ప్రింట్‌తీసి ఇచ్చేలా ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేయాలని సూచించారు. వాలంటీర్ల సేవలు వినియోగించుకోవాలని, వారి అభిప్రాయాలను కూడా ఈవోలు తీసుకోవాలని ఆదేశించారు.

పౌరసరఫరాల సంస్థకు నలుగురు డైరెక్టర్లు

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్ పౌరసరఫరాల సంస్థ డైరెక్టర్లుగా నలుగురిని నియమిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రసాదుల శ్రీనివాస్ (గాజువాక), ఎన్.ఆగస్టియన్ బాబు(ప్రత్తిపాడు), సుబ్బారాయుడు యాదవ్ (కడప), మలిశెట్టి వెంకటేశ్వర్లు (కావలి), ఎనిమిరెడ్డి మాలకొండయ్య (కాకినాడ నగరం) సభ్యులుగా నియమితులయ్యారు. బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి రెండేళ్లు పదవిలో ఉంటారు.

ఉద్యాన విశ్వవిద్యాలయ తాత్కాలిక వీసీగా ధనుంజయరావు


ఈనాడు, అమరావతి: వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయ తాత్కాలిక ఉపకులపతిగా కె.ధనుంజయరావును ప్రభుత్వం నియమించింది. ప్రస్తుతం ఆయన అక్కడే ఇండస్ట్రియల్, అంతర్జాతీయ కార్యక్రమాల డైరెక్టర్‌గా పని చేస్తున్నారు. శాశ్వత ఉపకులపతి నియామకం వరకు ఆయన పదవిలో కొనసాగుతారని వ్యవసాయశాఖ ఎక్స్ అఫీషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్ శుక్రవారం విడుదల చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

భారత్‌లోనే అసమానతలు ఎక్కువ

- విద్య, వైద్యం, వాతావరణంపై పెట్టుబడులు పెంచాలి
- అత్యంత ధనికులపై సంపద పన్ను విధించాలి
- అసమానతల సూచిక నివేదికలో వెల్లడి

ఈనాడు, హైదరాబాద్: దేశంలో ఆర్థిక, సామాజిక అసమానతలు తీవ్రరూపం దాల్చుతున్నాయని, తక్కువ సగటు ఆదాయంతో ప్రపంచంలోనే అత్యధిక అసమానతలున్న దేశంగా భారత్ నిలిచిందని ప్రపంచ అసమానతల సూచిక నివేదిక వెల్లడించింది. గత పదేళ్లలో అసమానతలు అధిగమించడంలో ఎలాంటి ప్రగతి లేదని, కార్మిక బలగంలో మహిళల ప్రాధాన్యం పెరగలేదని పేర్కొంది. దేశంలో టాప్ 10% మంది చేతుల్లో దాదాపు 40.01% సంపద ఉందని తెలిపింది. జాతీయ ఆదాయంలో 58% వీరి వద్ద ఉందని, అట్టడుగు నుంచి 50% మంది వద్ద 15 శాతమే ఉందని వివరించింది. పరిపాలన, విధానాల వైఫల్యాలతో అసమానతలు పెరుగుతున్నాయి. 0.001% మంది మల్టీ మిలియనీర్లు ప్రపంచంలోని 50% మంది కన్నా మూడింతలు అధిక సంపద కలిగి ఉన్నారు. వారు 1995లో 4% ఉంటే.. ఇప్పుడు 6 శాతానికి పెరిగారు.

ఇవీ సూచనలు...: ●అసమానతలు తగ్గించేందుకు రాజకీయ సంకల్పం అవసరం. సంపద తిరిగి పంపిణీ చేయడం, పారదర్శక పన్నులు, విద్య వైద్యం, ఆరోగ్యంపై సామాజిక పెట్టుబడులు పెంచడం ద్వారా తగ్గించవచ్చు. ధనికులపై సంపద పన్నులతో విద్య, ఆరోగ్యం, వాతావరణంపై పెట్టుబడులు పెంచవచ్చు. ●ఉచిత, నాణ్యత కలిగిన విద్య, అందరికీ వైద్యం, చిన్నారుల సంరక్షణ, పోషకాహార పథకాలు అమలు. ●నగదు బదిలీ, పింఛన్లు, నిరుద్యోగ భృతి, బీద కుటుంబాలకు సహాయంతో వనరులను పైనుంచి కిందిస్థాయికి బదిలీ చేయాలి. ●అభివృద్ధి చెందిన దేశాలు చౌకగా, వేగంగా రుణాలు తీసుకుంటే.. అభివృద్ధి చెందుతున్న దేశాలకు అధిక వడ్డీలతో కూడిన అప్పులు, అడ్డంకులు ఎదురవుతున్నాయి. దీన్ని అధిగమించేందుకు కేంద్రీకృత క్రెడిట్, డెబిట్ వ్యవస్థ, మిగులు నిల్వలపై పన్నుల్లో మార్పులు చేయాలి" అని నివేదికలో పేర్కొంది.




చెడు కొవ్వులకు దూరంగా ఉండండి

చెడు కొవ్వులు: పిజ్జా, ఫ్రెంచ్ ఫ్రైస్, ఐస్‌క్రీం, చిప్స్, కేకు, కుకీలు, డోనట్లు, ఫ్రైడ్ చికెన్, శుద్ధి చేసిన మాంసం. వీటితో ఆరోగ్యానికి చేటు.
ఆరోగ్యకర కొవ్వులు: అవకాడో పండు, పప్పు గింజలు, సాల్మన్ చేప, ఆలివ్ నూనె, చియా గింజలు, గుడ్లు, అవిసె గింజలు, డార్క్ చాకొలేట్. వీటిని తీసుకుంటే ఆరోగ్యానికి మేలు.
– మైల్స్, హెల్త్ కోచ్


తమిళనాడు మర పడవలతో ఏపీ మత్స్యకారులకు నష్టం

- పెద్ద పడవల కొనుగోలుకు ప్రత్యేక ఆర్థిక సాయం చేయండి
- లోక్‌సభలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి



ఈనాడు, దిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లోని సముద్ర జలాల్లోకి తమిళనాడు, పుదుచ్చేరికి చెందిన మరపడవలు దూసుకొచ్చి లక్షల రూపాయల విలువచేసే వలలను ధ్వంసం చేసి ఇక్కడున్న చేపలను పట్టుకుపోతున్నందున నెల్లూరు జిల్లాలోని మత్స్యకారులకు తీవ్ర నష్టం వాటిల్లుతోందని స్థానిక ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి పేర్కొన్నారు. అందువల్ల ఇక్కడి మత్స్యకారులు సముద్రం మధ్యలోకి వెళ్లి సురక్షితంగా చేపలవేట కొనసాగించేందుకు అనువైన పెద్ద పడవల కొనుగోలుకు ప్రత్యేక ఆర్థికసాయం చేయాలని కేంద్రాన్ని కోరారు. ఆయన శుక్రవారం లోక్‌సభ జీరో అవర్‌లో ఈ అంశంపై మాట్లాడారు. పుదుచ్చేరి, తమిళనాడు మరపడవల చొరబాటుతో ఆంధ్రప్రదేశ్ సముద్ర జలాల్లో తరచూ గొడవలు జరగడంతో పాటు, స్థానికులకు ఆర్థిక నష్టం వాటిల్లుతోందన్నారు. అందువల్ల ఇక్కడి వారు చేపలవేట కోసం సముద్రం మధ్యలోకి వెళ్లాలనుకుంటున్నట్లు చెప్పారు. అలాంటి పడవ ఒక్కోటి రూ.1.20 కోట్ల మేర ఉంటోందని పేర్కొన్నారు. ఇందులో ఎస్సీ, ఎస్టీలకు రూ.72లక్షలు, ఓబీసీలకు రూ.48లక్షల దాకా సబ్సిడీ ఇస్తున్నా మిగిలిన మొత్తం భరించడం వారికి తలకు మించిన భారం అవుతోందన్నారు. అందువల్ల ఆంధ్రప్రదేశ్ మత్స్యకారులకు ఈ పడవల కొనుగోలుకు ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీ ఇవ్వాలని కోరారు. ఒక రాష్ట్రం మత్స్యకారులు మరో రాష్ట్రంలోకి చొరబడకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తిచేశారు.

ఉత్తరాంధ్రలో సీఏపీఎఫ్ శిక్షణ కేంద్రాలు ఏర్పాటుచేయాలి: అప్పలనాయుడు



ఉత్తరాంధ్రలోని శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల నుంచి వేలమంది కేంద్ర సాయుధ పోలీసు బలగాల్లో (సీఏపీఎఫ్) విధులు నిర్వర్తిస్తున్న నేపథ్యంలో ఈ ప్రాంతంలో శిక్షణ కేంద్రాలు ఏర్పాటుచేయాలని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు కేంద్రాన్ని కోరారు. ఆయన గురువారం లోక్‌సభ జీరో అవర్‌లో ఈ అంశంపై మాట్లాడారు. "బీఎస్ఎఫ్, సీఆర్‌పీఎఫ్, సీఐఎస్ఎఫ్, ఐటీబీపీ, ఎస్ఎస్‌బీ, అస్సాం రైఫిల్స్ లాంటి కేంద్ర సాయుధ పోలీసు బలగాల్లో చేరడానికి ఈ ప్రాంత యువత ఎంతో ఉత్సాహంతో ఉంది. శ్రీకాకుళం జిల్లాలోనే లక్ష కుటుంబాల్లోని వారు సీఏపీఎఫ్‌లో పనిచేస్తున్నట్లు అంచనా. అందువల్ల ఇక్కడి యువతను ప్రోత్సహించి, శిక్షణ ఇవ్వడానికి సీఏపీఎఫ్ శిక్షణ కేంద్రాలు, డివిజనల్ లేదా సెక్టోరియల్ కార్యాలయాలు ఏర్పాటుచేయాలి" అని ఎంపీ కలిశెట్టి కోరారు.

అంబేడ్కర్ సార్వత్రిక వర్సిటీ అనుమతులకు కృషి చేస్తా: ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు

ఈనాడు, అమరావతి: ఏలూరులో ఏర్పాటు చేయనున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక వర్సిటీకి విశ్వవిద్యాలయ నిధుల సంఘం(యూజీసీ) నుంచి అన్ని అనుమతులు సకాలంలో వచ్చేలా కృషిచేస్తానని తెదేపా ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు హామీ ఇచ్చారు. అనుమతులను త్వరితగతిన ఇచ్చేలా చూడాలని యూజీసీకి లేఖ రాస్తానని ఆయన తెలిపారు. సార్వత్రిక విశ్వవిద్యాలయ అనుమతుల కోసం వర్సిటీ ఓఎస్డీ డాక్టర్ వెలగా జోషి న్యూదిల్లీలో శుక్రవారం ఎంపీని కలిశారు. వర్సిటీ అనుమతులకు సంబంధించిన వివరాలను ఎంపీకి వివరించారు.

ఆర్యవైశ్యులకు 'కూటమి' ప్రాధాన్యం కల్పించింది

● మంత్రి టీజీ భరత్

ఈనాడు, అమరావతి: పెనుగొండ పేరును వాసవీ పెనుగొండగా మారుస్తూ నిర్ణయం తీసుకున్నందుకు ఆర్యవైశ్యుల తరఫున సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు మంత్రి టీజీ భరత్ పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ఆర్యవైశ్యులకు అనేక విధాలుగా మేలు చేసిందన్నారు. 'ఆర్యవైశ్యుల ఆరాధ్యదైవం కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ రోజును ప్రభుత్వం అధికారికంగా నిర్వహించింది. మంత్రి మండలిలో నాకు అవకాశం కల్పించారు. ప్రభుత్వానికి ఆర్యవైశ్యులు అండగా ఉంటారు' అని మంత్రి ప్రకటనలో పేర్కొన్నారు.

చింతలపూడి ఎత్తిపోతలను పూర్తి చేయండి

● సీఎంకు దేవినేని ఉమా వినతి

ఈనాడు, అమరావతి : చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని త్వరితగతిన పూర్తి చేసి మెట్ట రైతుల సమస్యలు తీర్చాలని సీఎం చంద్రబాబును మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు కోరారు. ఈ మేరకు చంద్రబాబుకు వినతిపత్రం అందజేశారు. ఈ పథకం పూర్తి చేస్తే ఉమ్మడి కృష్ణా, ఉభయ గోదావరి జిల్లాల్లోని 4.80 లక్షల ఎకరాలకు సాగు, 35 మండలాలకు తాగునీరు అందుతుందని సీఎంకు వివరించారు. సానుకూలంగా స్పందించిన చంద్రబాబు.. అన్ని అడ్డంకులు అధిగమించి పథకాన్ని పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.

ఇన్ సర్వీస్ వైద్యులకు డీఎన్‌బీ సీట్ల కేటాయింపు

ఈనాడు, అమరావతి: సర్వీసులో ఉన్న వైద్యుల కోసం (ఇన్ సర్వీస్) 2025-26 సంవత్సరానికి సంబంధించి డీఎన్‌బీ (డిప్లొమేట్ ఆఫ్ నేషనల్ బోర్డు) సీట్లు కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మూడేళ్ల కాలపరిమితితో కూడిన పోస్ట్ ఎంబీబీఎస్ డీఎన్‌బీ కోర్సుకు సంబంధించి విజయనగరంలోని వైద్య కళాశాలకు ఆర్థోపెడిక్, నంద్యాల వైద్య కళాశాలకు ఎమర్జెన్సీ మెడిసిన్, అనకాపల్లిలో ఓబీజీ విభాగాల్లో ఒక్కో సీటు కేటాయించింది. పోస్టు ఎంబీబీఎస్ రెండేళ్ల డీఎన్‌బీ కోర్సుకు సంబంధించి రాష్ట్రంలోని 18 బోధనా సుపత్రుల్లో అనస్థీషియా-6, ఓబీజీ-5, పిడియాట్రిక్స్-3, ఈఎన్‌టీ-2, ఆర్థోపెడిక్-5, ఫ్యామిలీ మెడిసిన్-5, రేడియాలజీ-5 సీట్లు చొప్పున మొత్తం 27 సీట్లు కేటాయించింది. ఈ మేరకు వైద్యారోగ్య శాఖ కార్యదర్శి సౌరభ్ గౌర్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

మెడికల్ కౌన్సిల్ ఎన్నికల నిర్వహణకు ఆర్వో నియామకం

● ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ ఎన్నికల నిర్వహణకు సెకండరీ హెల్త్ డైరెక్టర్‌ను రిటర్నింగ్ అధికారిగా రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఏపీ హైకోర్టు గత నెల 11న ఇచ్చిన ఆదేశాలకు అనుగుణంగా త్వరగా ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయాలని సౌరభ్‌గౌర్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఉమీద్ పోర్టల్‌లో రెండో సర్వే వక్ఫ్ ఆస్తుల నమోదుకు ఆరు నెలల గడువు

ఈనాడు, అమరావతి: ఉమీద్ పోర్టల్‌లో రెండో సర్వే వక్ఫ్ ఆస్తుల నమోదుకు వక్ఫ్ ట్రైబ్యునల్ ఆరు నెలల గడువు కల్పించిందని వక్ఫ్ బోర్డు ఛైర్మన్ అబ్దుల్ అజీజ్ తెలిపారు. ఇప్పటికే మొదటి సర్వే ఆస్తుల్ని 100 శాతం నమోదు చేశామని పేర్కొన్నారు. తెలంగాణ నుంచి వక్ఫ్ ఆస్తులకు సంబంధించిన పాత రికార్డులు కూడా రాబోతున్నాయని, వాటిని కూడా నిర్దేశిత గడువులోగా పోర్టల్‌లో నమోదు చేస్తామని శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. రాష్ట్రంలోని ప్రతి వక్ఫ్ ఆస్తిని చట్టపరంగా పారదర్శకంగా రక్షించడంలో ఎలాంటి రాజీలేదని స్పష్టం చేశారు.

రాష్ట్ర పాఠశాల ప్రమాణాల అథారిటీ ఏర్పాటు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో పాఠశాలల నాణ్యత మదింపు, హామీ ఫ్రేమ్‌వర్క్ అమలు కోసం సెకండరీ ఎడ్యుకేషన్ బోర్డును రాష్ట్ర పాఠశాల ప్రమాణాల అథారిటీ (ఎస్ఎస్ఎస్ఏ)గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలలకు అనుమతులు ఇవ్వడం, వాటి నాణ్యతపైన ఈ అథారిటీ దృష్టిసారిస్తుంది. ఆయా పాఠశాలల్లోని ప్రమాణాల ఆధారంగా ప్రగతి, జాగృతి, అభిలాష అనే గ్రేడ్‌లను ఇస్తుంది. రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాల విద్యా వ్యవస్థలో పారదర్శకత, జవాబుదారీతనం, నాణ్యత హామీని పెంపొందించడం, మాధ్యమిక పాఠశాలల్లో కనీస వృత్తిపరమైన నాణ్యతా ప్రమాణాలను పాటించేలా చూడటానికి ఎస్ఎస్ఎస్ఏను నియమించింది. ఇందులో పాఠశాల విద్య కార్యదర్శి ఛైర్మన్‌గా. డైరెక్టర్ వైస్‌ఛైర్మన్‌గా, ఇంటర్మీడియట్ విద్యామండలి కార్యదర్శి, సమగ్ర శిక్షా ప్రాజెక్టు డైరెక్టర్, ఎస్‌సీఈఆర్టీ డైరెక్టర్ సభ్యులుగా ఉంటారు. ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ మెంబర్-కన్వీనర్‌గా వ్యవహరిస్తారు.

ఏపీ పర్యాటక విధానాలు భేష్

- కేంద్ర పర్యాటక మంత్రిత్వశాఖ అదనపు కార్యదర్శి సుమన్ బిల్లా

ఈనాడు, అమరావతి: దేశంలోని ఉత్తమ పర్యాటక పాలసీల్లో ఏపీ విధానం ఒకటని కేంద్ర పర్యాటక మంత్రిత్వశాఖ అదనపు కార్యదర్శి సుమన్ బిల్లా అన్నారు. పర్యాటక రంగం అభివృద్ధికి ఏపీ ప్రభుత్వం ఎంతో అనుకూలంగా ఉందని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమాలు బాగున్నాయని అభిప్రాయపడ్డారు. ఏపీ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో విజయవాడలో శుక్రవారం ప్రారంభమైన బిజినెస్ ఎక్స్‌పోలో భాగంగా నిర్వహించిన సదస్సులో సుమన్ బిల్లా పంపిన వీడియో సందేశాన్ని నిర్వాహకులు ప్రదర్శించారు. పార్లమెంట్ సమావేశాల కారణంగా రాలేకపోతున్నందున, ఈ సందేశం పంపుతున్నట్లు ఆయన వివరించారు. ఏపీ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ పర్యాటక విభాగం కమిటీ సలహాదారు కె.లక్ష్మీనారాయణ అధ్యక్షతన నిర్వహించిన ఈ సదస్సులో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జనరల్ మేనేజర్ (అమరావతి) శైలేష్‌కుమార్ మాట్లాడుతూ.. పర్యాటక ప్రాజెక్టుల ఏర్పాటుకు రుణలిచ్చేందుకు ఎస్‌బీఐ సిద్ధంగా ఉందన్నారు. పర్యాటక రంగం అభివృద్ధికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు బాగున్నాయని రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ పూర్వ మేనేజింగ్ డైరెక్టర్ పీవీఎన్ రావు అన్నారు. పర్యాటక పాలసీ ప్రత్యేకతలు, ప్రోత్సాహకాలు, అనుమతులు తదితర అంశాలపై రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ కార్యనిర్వాహక సంచాలకులు పద్మావతి మాట్లాడారు. ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ పూర్వ అధ్యక్షుడు ముత్తవరపు మురళీకృష్ణ, ప్రస్తుత అధ్యక్షులు పి.భాస్కరరావు, ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ పర్యాటక విభాగం ఛైర్మన్ ఆర్వీ స్వామి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ సంస్థలు పర్యాటక రంగంలో ఉత్తమ విధానాలపై పలు ప్రదర్శనలు ఇచ్చాయి.

రాజధాని అమరావతిపై వైకాపా దుష్ప్రచారం

● సామాజిక సంక్షేమ మండలి ఛైర్మన్ పోతుల బాలకోటయ్య

ఈనాడు, అమరావతి: ప్రజా రాజధాని అమరావతిపై వైకాపా చేస్తున్న దుష్ప్రచారం.. రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల అభివృద్ధిపై చేస్తున్న దాడేనని సామాజిక సంక్షేమ మండలి ఛైర్మన్ పోతుల బాలకోటయ్య పేర్కొన్నారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. "రాజధానిగా అమరావతిని గుర్తిస్తూ.. పార్లమెంట్‌లో బిల్లు పెట్టాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని కోరింది. 2014లో రాష్ట్ర విభజన తేదీకి సంబంధించిన సందేహంపై కేంద్రం రాష్ట్ర ప్రభుత్వాన్ని వివరణ అడిగింది. దీనిపై సాక్షి మీడియా 'అమరావతి బిల్లును తిప్పిపంపిన కేంద్రం' అంటూ తప్పుడు ప్రచారం చేస్తోంది. దీన్ని రాష్ట్ర ప్రజలు తిప్పికొట్టాలి" అని కోరారు.

ప్రధానికి చిత్తశుద్ధి ఉంటే రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలి

● రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షురాలు షర్మిల

ఈనాడు, అమరావతి: రాష్ట్ర ప్రజలపై ప్రధాని మోదీకి చిత్తశుద్ధి ఉంటే రాష్ట్రానికి వెంటనే ప్రత్యేక హోదా ఇవ్వాలని కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల డిమాండ్ చేశారు. విభజన హామీలు అమలు చేయడంతోపాటు దిల్లీకి మించిన రాజధానిగా అమరావతిని అభివృద్ధి చేసేందుకు నిధులు ఇవ్వాలని శుక్రవారం ఒక ప్రకటనలో ఆమె పేర్కొన్నారు. 'రాష్ట్రంలో కూటమి ప్రభుత్వానిది అసమర్థ పాలన. ఆర్భాటాలు, హంగామా తప్ప ఆచరణలో హామీల అమలు శూన్యం. ఇందుకు విరుద్ధంగా రాష్ట్రంలో కూటమి పాలన భేష్ అని ప్రధాని మోదీ అనడం విడ్డూరం' అని షర్మిల విమర్శించారు.

ప్రభాకర్‌రావుకు 5 ఐక్లౌడ్ ఖాతాలు



- మరో 5 జీమెయిల్ ఎకౌంట్‌లు
- ఫోన్ ట్యాపింగ్ కేసులో గుర్తించిన సిట్
- సిట్ ఎదుట లొంగుబాటు.. 19 వరకు కస్టడీలోనే

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలో ఫోన్ అక్రమ ట్యాపింగ్ కేసులో ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) విచారణ మరోసారి ఊపందుకొంది. ఈసారి స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్(ఎస్ఐబీ) మాజీ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్(సీవోవో) ప్రభాకర్‌రావు వినియోగించిన ఐక్లౌడ్, జీమెయిల్ ఖాతాలే కేంద్రంగా సిట్ విచారణ సాగనున్నట్లు తెలుస్తోంది. ఆయా ఖాతాల్లోని సమాచారాన్ని విశ్లేషించడంపైనే సిట్ ప్రస్తుతం దృష్టి సారించడం ప్రాధాన్యం సంతరించుకొంది. విశ్వసనీయ సమాచారం మేరకు.. ప్రభాకర్‌రావు 5 ఐక్లౌడ్ ఖాతాలను, మరో 5 జీమెయిల్ ఖాతాలను వినియోగించినట్లు గతంలో సిట్ గుర్తించింది. వాటిల్లోని సమాచారాన్ని విశ్లేషించడంలో భాగంగా జీమెయిల్ ఖాతాల్లో నాలుగింటి పాస్‌వర్డ్‌లను.. ఐక్లౌడ్ ఖాతాల్లో రెండింటి పాస్‌వర్డ్‌లను అప్పట్లో ప్రభాకర్‌రావు నుంచి సేకరించింది. దీంతో ఎఫ్ఎస్ఎల్‌లో వాటి సమాచారాన్ని రిట్రీవ్ చేయడంతోపాటు గూగుల్, యాపిల్ కంపెనీల నుంచీ సమాచారాన్ని సేకరించడంలో నిమగ్నమైంది. మరోవైపు ఒక జీమెయిల్ ఖాతా ప్రస్తుతం ఉపయోగించడం లేదని గుర్తించింది. అలాగే మరో ఐక్లౌడ్ ఖాతాను ప్రభాకర్‌రావు అమెరికాలో ఉన్న డివైజ్‌తో లాగిన్ అయ్యారు. ఆ డివైజ్ ప్రస్తుతం అక్కడే ఉండటంతో ఆ ఖాతాలోని సమాచారాన్ని విశ్లేషించే ప్రక్రియ ముందుకు సాగలేదు. ఈనేపథ్యంలో ప్రస్తుతం సేకరించిన పాస్‌వర్డ్‌ల ఆధారంగా ప్రభాకర్‌రావు వినియోగించిన డివైజ్‌లను విశ్లేషించే పనిలో సిట్ నిమగ్నమైంది. ఈ సమాచారంపై స్పష్టత వస్తే ఫోన్ అక్రమ ట్యాపింగ్ కేసు దర్యాప్తును ముందుకు తీసుకెళ్లే కీలక ఆధారాలు లభిస్తాయని భావిస్తోంది.

పాస్‌వర్డ్‌ల కోసం నాడు పది ఆప్షన్లు..!

సిట్ విచారణలో తన సెల్‌ఫోన్, ల్యాప్‌టాప్‌ల్లాంటి డివైజ్‌ల పాస్‌వర్డ్‌లు తనకు గుర్తు లేవని ప్రభాకర్‌రావు చెప్పడంతో సుపరిచితమైన పది ఆప్షన్లను ఎంచుకొని పాస్‌వర్డ్‌లను గుర్తించాలని అప్పట్లో సుప్రీంకోర్టు ఆయనకు స్పష్టం చేసింది. ఆ ప్రయత్నంలోనే ప్రభాకర్‌రావు కొన్ని పాస్‌వర్డ్‌లను చెప్పడంతో ఆయా డివైజ్‌లను తెరిచి ఎఫ్ఎస్ఎల్‌లో డేటాను రిట్రీవ్ చేయడంపై సిట్ దృష్టి సారించింది. వాటిల్లోని డేటాను తొలగించినట్లు ఎఫ్ఎస్ఎల్ విశ్లేషణలో తేలింది. అదే విషయమై నాడు సిట్ ప్రశ్నిస్తే డివైజ్‌ల్లోని తన వ్యక్తిగత సమాచారాన్ని మాత్రమే తొలగించానని ప్రభాకర్‌రావు వెల్లడించినట్లు సమాచారం. ఈనేపథ్యంలో ఆయన వాంగ్మూలంలో వాస్తవమెంత అని తెలుసుకునేందుకు జీమెయిల్, ఐక్లౌడ్ ఖాతాలను లోతుగా విశ్లేషించడంపై సిట్ ప్రస్తుతం దృష్టి సారించినట్లు తెలుస్తోంది.

◆ సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో ప్రభాకర్‌రావు శుక్రవారం ఉదయం సిట్ ఎదుట లొంగిపోయారు. ఆయన్ని కస్టోడియల్ ఇంటరాగేషన్(విచారణ) చేసేందుకు సిట్‌కు సుప్రీంకోర్టు అనుమతించిన నేపథ్యంలో ఉదయం పదకొండు గంటల సమయంలో ఆయన జూబ్లీహిల్స్‌లోని సిట్ కార్యాలయానికి చేరుకున్నారు. హైదరాబాద్ పోలీస్ జాయింట్ కమిషనర్ తఫ్సీర్‌ఇక్బాల్.. దర్యాప్తు అధికారి వెంకటగిరి విచారించారు. ప్రభాకర్‌రావు వినియోగించిన జీమెయిల్, ఐక్లౌడ్ ఖాతాల సమాచారం గురించి పలు ప్రశ్నలు అడిగినట్లు తెలిసింది. సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో ప్రభాకర్‌రావును ఈనెల 19 వరకు పోలీస్ కస్టడీలోనే ఉంచి విచారించనున్నారు. సిట్ కార్యాలయంలో అందుకు అవసరమైన ఏర్పాట్లు చేశారు.



యుద్ధ ట్యాంకుల ట్రయల్ రన్

యుద్ధభూమికి సత్వరం సైన్యాన్ని తరలించేందుకు తయారు చేసిన బీఎంపీ-2 యుద్ధ ట్యాంకు ఇది. తెలంగాణలోని సంగారెడ్డి జిల్లా ఎద్దుమైలారం ఆయుధ కర్మాగారంలో తయారు చేశారు. 10 సీట్ల సామర్థ్యం, 14 టన్నులు బరువుండే ఇది గంటకు నేలపై 60 కి.మీ. నీటిపై 7 కి.మీ. వేగంతో వెళ్తుంది. 30 ఎం.ఎం. మెయిన్ గన్, ఆధునిక రైఫిల్స్ ఇందులో అమర్చారు. రాత్రుళ్లు వినియోగించుకొనేలా, శత్రు సైన్యం కాల్పులు జరిపినా ప్రాణనష్టానికి తావులేని విధంగా తయారుచేశారు. శుక్రవారం పరీక్షించారు. త్వరలో సైన్యానికి అప్పగించనున్నట్లు సీజీఎం ఎస్.ఎస్.ప్రసాద్ తెలిపారు.
–న్యూస్‌టుడే, కొండాపూర్

11 నెలల్లో రెండు వేల మంది!

- రికార్డు స్థాయిలో మావోయిస్టుల లొంగుబాట్లు
- సమీపిస్తున్న కేంద్రం విధించిన గడువు



ఈనాడు, హైదరాబాద్: కేంద్ర హోంమంత్రిత్వ శాఖ విధించిన గడువు సమీపిస్తుండటంతో మావోయిస్టుల లొంగుబాట్ల పరంపర కొనసాగుతోంది. ఉద్యమం మొదలైన నుంచి ఈ ఏడాదే అత్యధిక మంది మావోయిస్టులు సరెండర్ అయ్యారు. అరెస్టులు, ఎన్‌కౌంటర్లలో మరణించిన వారిని కలుపుకొంటే ఈ సంఖ్య 3,400కి చేరింది. ఐదేళ్లుగా ఉద్యమం సంక్లిష్ట దశలో ఉన్నప్పటికీ ఈ ఏడాది తగిలిన ఎదురుదెబ్బలు మావోయిస్టుల ఉనికినే ప్రశ్నార్థకంగా మార్చాయి. వచ్చే ఏడాది మార్చి 31లోపు మావోయిస్టుల ఉనికి లేకుండా చేస్తామని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా పదేపదే ప్రకటిస్తున్న విషయం తెలిసిందే. దీనికి అనుగుణంగానే దండకారణ్యంలో దాదాపు 50 వేల మందితో గాలింపును ముమ్మరం చేశారు. నలువైపులా బలగాలు చుట్టుముడుతుండటంతో అగ్రనేతలు సహా చాలామంది మావోయిస్టులు లొంగుబాట పట్టారు. ఈ ఏడాది నవంబరు వరకు తీసుకుంటే దేశవ్యాప్తంగా 2,167 మంది లొంగిపోయారు. మావోయిస్టు చరిత్రలో ఇంత పెద్దఎత్తున సరెండర్ అవడం ఎన్నడూ లేదు. 2021లో అత్యధికంగా 1,153 మంది జనజీవన స్రవంతిలో కలవగా ఈ ఏడాది అంతకు రెట్టింపు సంఖ్యలో సరెండర్ కావడం గమనార్హం. ఇదే సమయంలో భద్రతా బలగాల కాల్పుల్లోనూ అత్యధికంగా ఈ ఏడాదే 335 మంది చనిపోయారు. ఉద్యమం ఉచ్ఛస్థితిలో ఉన్న 2005-2010 మధ్యకాలంలో దండకారణ్యంలో మూడు గెరిల్లా బెటాలియన్లతో సహా అజ్ఞాతంలో ఉన్న వారి సంఖ్య 15 వేల వరకు ఉండేదని అంచనా. గడిచిన ఆరేళ్లలో 6,035 మంది అరెస్టు కాగా 5,131 మంది లొంగిపోయారు. 961 మంది బలగాల కాల్పుల్లో మరణించారు. ఈ పరిణామాలన్నింటి నేపథ్యంలో ప్రస్తుతం అజ్ఞాతంలో ఉన్న వారి సంఖ్య రెండు, మూడు వందలకు మించి ఉండదని అంచనా వేస్తున్నారు. కేంద్రం విధించిన గడువు మూడు నెలలే ఉండటం, ఇప్పుడున్న పరిస్థితుల్లో తుపాకీ పట్టుకొని యుద్ధం చేయలేమని, పోరాటం మరో రూపంలో కొనసాగించడానికి జనజీవన స్రవంతిలో కలవాలని అగ్రనేతలు పిలుపునిస్తుండటంతో మిగిలిన వారు సైతం అజ్ఞాతం వీడే అవకాశం ఉందని అంతా భావిస్తున్నారు.

గత ఆరేళ్లలో మావోయిస్టుల పరిస్థితి ఇదీ..

ఏడాది	మృతులు	అరెస్టులు	లొంగుబాట్లు
2020	103	1110	475
2021	126	1153	736
2022	57	816	496
2023	50	924	376
2024	290	1090	881
2025	335	942	2,167

అఖండ-2కు తొలగిన అడ్డంకులు

- 15వరకు టికెట్ ధరల పెంపును కొనసాగించవచ్చు
- సింగిల్ జడ్జి ఉత్తర్వులను నిలిపివేసిన తెలంగాణ హైకోర్టు



ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలో టికెట్ ధరల పెంపు వ్యవహారంలో అఖండ-2 సినిమాకు అడ్డంకులు తొలగాయి. టికెట్ ధరలను పెంచుతూ ప్రభుత్వం జారీ చేసిన మెమోను నిలిపివేస్తూ సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులను ఈ నెల 15వరకు సస్పెండ్ చేస్తూ హైకోర్టు డివిజన్ బెంచ్ ఆదేశాలు జారీ చేసింది. ఈ నెల 10న జారీ చేసిన మెమో ప్రకారం ప్రభుత్వం టికెట్ ధరలను పెంచుకోవడానికి అనుమతించింది. ఆ నిర్ణయాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌లను విచారించిన సింగిల్ జడ్జి.. మెమో అమలును నిలిపివేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. ఆ ఉత్తర్వులను సవాల్ చేస్తూ నిర్మాణ సంస్థ 14 రీల్స్ ఎంటర్‌టైన్‌మెంట్ అత్యవసరంగా శుక్రవారం మధ్యాహ్నం అప్పీలు దాఖలు చేసింది. దీనిపై జస్టిస్ మౌసమీ భట్టాచార్య, జస్టిస్ గాడి ప్రవీణ్‌కుమార్‌లతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. నిర్మాత తరఫు న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ..ఒకవేళ సింగిల్ జడ్జి వద్ద పిటిషనర్ కేసు గెలిచినట్లయితే.. పెంచిన ధర తాలూకు సొమ్మును తిరిగి చెల్లిస్తామన్నారు. ఇరుపక్షాల వాదనలను విన్న ధర్మాసనం సింగిల్ జడ్జి ఉత్తర్వులను ఈ నెల 15వరకు నిలిపివేస్తూ అప్పీలుపై విచారణను ముగించింది. టికెట్ ధరల పెంపునకు అనుమతించే అధికారం, ఇతరత్రా అంశాలను సింగిల్ జడ్జి వద్దనే తేల్చుకోవాలని పేర్కొంది.

వినోదం యుద్ధప్రాంతంగా తయారైంది

విచారణలో న్యాయమూర్తి వ్యాఖ్య

టికెట్ ధరలు పెంచుతూ జారీ అయిన మెమో అమలును సింగిల్ జడ్జి నిలిపివేసినప్పటికీ బుక్ మై షో.. పెంచిన ధరల ప్రకారమే టికెట్లను విక్రయించిందంటూ హైకోర్టులో కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలైంది. దీనికి సంబంధించిన ఆధారాలను పిటిషనర్ చూపడంతో.. విచారించిన జస్టిస్ ఎన్.వి.శ్రవణ్‌కుమార్ ఆ పిటిషన్‌కు సంబంధించి బుక్ మై షో, రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేశారు. 'వినోదం కాస్త యుద్ధప్రాంతంగా తయారైందని' ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. టికెట్ ధరలను జీవో 120 ప్రకారమే వసూలు చేయాలనే డివిజన్ బెంచ్ ఉత్తర్వులకు అందరూ కట్టుబడి ఉండాలని ఆదేశించారు. ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి హోదాలో టికెట్ ధరల పెంపుపై మెమో జారీ చేసిన సీనియర్ అధికారికి.. వాటి గురించి తెలియకపోవడంపై ఆశ్చర్యం వ్యక్తంచేశారు.

జన్మభూమి ఎక్స్‌ప్రెస్ ప్రయాణ వేళల మార్పు

ఈనాడు, హైదరాబాద్: విశాఖపట్నం-లింగంపల్లి మధ్య నడిచే జన్మభూమి సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (12805/12806) రైళ్ల ప్రయాణ వేళల్ని ద.మ.రైల్వే మార్చింది. కొత్త వేళలు ఫిబ్రవరి 15 నుంచి అమల్లోకి వస్తాయని జోన్ సీపీఆర్వో ఏ.శ్రీధర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. విశాఖపట్నం-లింగంపల్లి (12806) రైలు విశాఖపట్నంలో ఉదయం 6.20కి బయల్దేరి, లింగంపల్లికి రాత్రి 7.15కి చేరుకుంటుంది. లింగంపల్లి-విశాఖపట్నం(12805) రైలు ఉదయం 6.55కి లింగంపల్లి నుంచి బయల్దేరి, విశాఖపట్నంకు రాత్రి 7.50కి చేరుకుంటుంది.

ప్రత్యేక వీక్లీ రైళ్ల పొడిగింపు...: వివిధ స్టేషన్ల మధ్య ఇప్పటికే నడుస్తున్న వీక్లీ రైళ్లను సంక్రాంతి రద్దీ నేపథ్యంలో మరికొన్ని వారాలు పొడిగిస్తున్నట్లు ద.మ.రైల్వే తెలిపింది. సికింద్రాబాద్-అనకాపల్లి (నం.07041) రైలు జనవరి 4, 11, 18 తేదీల్లో ప్రయాణికులకు అందుబాటులో ఉంటుంది. అనకాపల్లి-సికింద్రాబాద్(నం.07042) రైలు జనవరి 5, 12, 19న, హైదరాబాద్-గోరఖ్‌పుర్(నం.07075) రైలు జనవరి 9, 16, 23 తేదీల్లో, గోరఖ్‌పుర్-హైదరాబాద్(07076) రైలు జనవరి 11 18, 25 తేదీల్లో బయల్దేరుతుందని తెలిపింది.